# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయుల కరదీపిక

## 9వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడసాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారంనడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్సుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. “అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను” అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలిసిపనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమౌతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగౌతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువలపతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జెక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్యాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర విద్యాప్రణాళిక

పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణతీరుతెన్నులను గురించి “ఉపాధ్యాయులకు సూచనలు” కూడా చేర్చారు. అట్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనవంతు కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

తేది : 30-05-2014

స్థలం : హైదరాబాద్.

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోఽస్యస్యాత్, పరితోషాఽంతరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** తెలుగు పండితులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వి. స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుదూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**డా॥ రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ వొజ్ఝల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.

**డా॥ దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.

**శ్రీ దోరవేటి చెన్నయ్య,** సూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.

**డా॥ గుడిసేన విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.

**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.

**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.

**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,**
ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,** సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య – జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ శితికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఏ.ఎస్., అధికారి, హైదరాబాదు.
**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలీస్, థానే, మహారాష్ట్ర.
**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.
**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.
**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
**శ్రీ ఫాదర్ పల్లిదానం,** సంచాలకులు, పీపుల్స్ ఆక్షన్ ఫర్ రూరల్ అవేకనింగ్ (PARA), రావులపాలెం, తూ.గో.జిల్లా.
**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.
**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో–ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.
**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.
**శ్రీ రవీందర్,** కో–ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.
**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- శ్రీ సరస్వతీ విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.
- శ్రీ సీతారామ సేవాసదన్, మంథని, కరీంనగర్ జిల్లా.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య – జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

తేది : 30–05–2014
స్థలం : హైదరాబాద్.

**సంచాలకులు**
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య – జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 6 నుండి 10 తరగతులకు వారానికి 48 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సబ్జక్టుకు కింది విధంగా భారత్వం ఉంటుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రథమ భాష | – | 6 పీరియళ్ళు | సాంఘికశాస్త్రం | – | 6 పీరియళ్ళు |
| ద్వితీయ భాష | – | 3 పీరియళ్ళు | విలువలవిద్య, జీవననైపుణ్యాలు | – | 2 పీరియళ్ళు |
| తృతీయ భాష | – | 6 పీరియళ్ళు | శారీరక, ఆరోగ్యవిద్య | – | 3 పీరియళ్ళు |
| గణితం | – | 8 పీరియళ్ళు | కళలు, సాంస్కృతికవిద్య | – | 3 పీరియళ్ళు |
| భౌతిక, రసాయన శాస్త్రం | – | 4 పీరియళ్ళు | పని, కంప్యూటర్ విద్య | – | 3 పీరియళ్ళు |
| జీవ శాస్త్రం | – | 4 పీరియళ్ళు | **మొత్తం** | **–** | **48 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య – జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమౌతాయి.
- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.

  •) పాఠం పేరు, •) ప్రధానవిలువ, •) ఉపవిలువ, •) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, •) ఉపోద్ఘాతం, •) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, •) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', •) సూక్తి.
- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.
- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.
- మిగతా సబ్జక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.
- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి

మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తుపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- ♦ పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.
- ♦ పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

A1 – 91%

A2 – 71% – 90%

B1 – 51% – 70%

B2 – 41% – 50%

C – 0 – 40%

- ♦ పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- ♦ బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం – ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్ :**
- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి – ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్ :**
- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం – జట్టుపని'**ని తరగతిలో పిల్లలను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్ :**
- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- ♦ పాఠశాలలో **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- ♦ 'విలువల విద్య – జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనులు చేయించడం, 'ఆచరించండి – అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- ♦ పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- ♦ విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకల్సి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించిది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయులు పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీకు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య – జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# విషయసూచిక


| వ.సం. | ప్రధాన విలువ | నేర్చవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1. | స్వేచ్ఛ | స్వేచ్ఛ గురించి ప్రశ్నించడం - బాధ్యతలు నిర్వర్తించడం | స్వేచ్ఛగా ప్రశ్నిద్దాం! | 1 |
| 2. | సంతృప్తిగా జీవించడం | కోరికలే దుఃఖానికి మూలం | కోరికలే దుఃఖానికి మూలం | 7 |
| 3. | శీల నిర్మాణం | ధైర్యసాహసాలను ప్రదర్శించడం, | ధైర్యంగా ఉందాం! | 14 |
| 4. | జీవననైపుణ్యాలు | లక్ష్యం కలిగిఉండడం - కృషి చేయడం | లక్ష్యాన్ని కలిగిఉందాం! | 22 |
| 5. | బాధ్యతలు నిర్వర్తించడం - కర్తవ్య పాలన | సామాజిక ఆస్తుల పరిరక్షణలో మన బాధ్యతలను గుర్తించడం | సామాజిక ఆస్తులను కాపాడుకుందాం | 30 |
| 6. | పొదుపు ఆవశ్యకత | వస్తువులను వాడి పారేయకుండా మరల మరల వినియోగించడం | వస్తు పొదుపు | 35 |
| 7. | ఆరోగ్య విలువలు | జీవనశైలివల్ల వచ్చే వ్యాధులు | జీవనశైలి/ఆరోగ్య సమస్యలు | 38 |
| 8. | సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం | భారతీయ కుటుంబ విలువలను గౌరవించడం | కుటుంబ విలువలు | 46 |
| 9. | పర్యావరణ పరిరక్షణ | వ్యర్థాల పునర్వినియోగం | వ్యర్థాల పునర్వినియోగం | 51 |
| 10. | శాస్త్రీయ దృక్పథం | శాస్త్రీయమైన వైఖరులను కలిగిఉండడం | దేనినీ గుడ్డిగా నమ్మకు | 58 |
| 11. | న్యాయం | న్యాయపోరాటంలో ప్రగతి సాధించడం | న్యాయపోరాటం | 62 |
| 12. | శాంతి, అహింస, సౌందర్యాత్మక స్పృహ | హింసాత్మక ప్రవృత్తి నష్టాన్ని కలిగిస్తుందని తెలుసుకోవడం | హింసా ప్రవృత్తి | 66 |

| వ.సం. | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 13. | శ్రమవిలువ | శ్రమైక జీవన సౌందర్యం | శ్రమైక జీవన సౌందర్యం | 72 |
| 14. | సేవాభావం | వివిధ రకాల సేవలు చేసేవారిని గుర్తించడం | వివిధ రకాల సేవలు | 78 |
| 15. | సమానత్వం, సోదరభావం స్త్రీల పట్ల గౌరవం | స్త్రీ సాధికారత - విద్య - ఇతర అవకాశాలు | స్త్రీ సాధికారత | 82 |
| 16. | జాతీయ భావన – దేశభకి | దేశం పట్ల తమ కర్తవ్యాన్ని గుర్తించడం | మన కర్తవ్యం | 87 |
| 17. | లౌకికతత్వం–మతసామరస్యం | వివిధ మతాలవారితో సహజీవనం | పరమతసహనం | 92 |
| 18. | ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం | మంచి నాయకులను ఎన్నుకోవడంలో ప్రజల పాత్ర | ఓటు విలువ | 97 |


## అనుబంధాలు


1. శ్లోకాలు 101
2. పద్యాలు 103
3. పాటలు / గేయాలు 108
4. కథలు 123
5. స్ఫూర్తిదాతలు 141

# 1 స్వేచ్ఛగా ప్రశ్నిద్దాం!

**I. ప్రధాన విలువ**

స్వేచ్ఛ

**II. ఉప విలువ**

స్వేచ్ఛ గురించి ప్రశ్నించడం - బాధ్యతలు నిర్వర్తించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- స్వేచ్ఛకు భంగం వాటిల్లినపుడు ప్రశ్నించగల్గుతారు.
- స్వేచ్ఛను కాపాడడంలో బాధ్యత వహిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

మనుషులందరికీ స్వేచ్ఛగా బతికే హక్కు ఉంది. కాని నేటి సమాజంలో స్వేచ్ఛను హరించే ఎన్నో సంఘటనలను మనం చూస్తున్నాం. కొందరికి వాక్‌స్వాతంత్ర్యం లేదు, కొందరికి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు, కొందరికి స్వతంత్రించి పనులు చేయడానికి ఉండదు. ఇలా ఎన్నో రకాలుగా స్వేచ్ఛను కోల్పోతున్నవారి సంఖ్య పెరిగిపోతోంది. ఇది తప్పు. మనిషికున్న స్వేచ్ఛను కాపాడాలి, ఉల్లంఘిస్తే ప్రశ్నించాలి.

## V. విషయం

### సంఘటన - 1

కృపాల్ బాగా చదివే కుర్రవాడు. 10వ తరగతి చదువుతున్నాడు. వాళ్ళ అమ్మ, నాన్నకు కృపాల్ చదువే ముఖ్యం. కాని కృపాల్‌కు ఎంతసేపు చదివినా కాసేపు ఆడుకోవాలని, కాసేపు స్నేహితులతో గడపాలని కోరిక. ఇంట్లో అన్నీ ఆంక్షలే. టి.వి. చూడొద్దు, ఆటలు బంద్, కేవలం చదువే. చదువుతప్ప తల్లిదండ్రులకు కృపాల్‌కు మధ్య వేరొకమాట ఉండదు.

### సంఘటన - 2

వరదాచారి కుటుంబంలో ఆయన కొడుకు, కోడలు, మనవరాలు ఉన్నారు. వీళ్ళు రిటైర్అయ్యాక కొడుకు దగ్గరికి వచ్చారు. టౌను నుండి సిటీకి వచ్చిన వీరికి సిటీ కొత్త అని కొడుకు, కోడలు ఎక్కడికీ వెళ్ళనివ్వరు. ఎంతసేపు ఇంట్లోనే ఉండాలి. పోనీ టి.వి. పెట్టుకొని కాస్త భక్తిపరమైన కార్యక్రమాలు చూద్దామనుకున్నా చూడనివ్వరు. పిల్లలు ఏంచూస్తే ముసలివాళ్ళు అదే చూడాలి. రోజురోజుకి ఆ ఇంట్లో కనీస స్వేచ్ఛ కరువయ్యే పరిస్థితి వచ్చింది ఆ ముసలిదంపతులకి.

### సంఘటన - 3

నాన్నా! పై చదువులు చదవాలనుకుంటున్నా అడిగింది మాలతి. చదువులు చదివి ఎవరిని ఉద్ధరించాలి ఏమక్కరలేదు ఇంట్లో కూర్చో అన్నాడు నాన్న. డబ్బులు ఇబ్బందైతే ఏదోఒక పనిచేసైనా చదువుకుంటా. ప్లీజ్ నాన్నా నన్ను చదువుకోనివ్వు. చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుంది. మన కష్టాలన్నీ తీరుతాయి నాన్నా! అర్థం చేసుకోండి అంది. వాళ్ళ నాన్న వినిపించుకోలేదు.

### సంఘటన - 4

10వ తరగతి రిజల్ట్స్ వచ్చాయి. మీ అబ్బాయిని ఏ కోర్సులో చేరుస్తున్నారండీ అడిగాడు ఓ పెద్దమనిషిని మరొకాయన. ఏ కోర్సు ఏంటి మావాడిని కంప్యూటర్ ఇంజనీరు చేస్తా అన్నాడు. అదేంటినాన్నా! నాకు మెకానికల్ అంటే ఇష్టం. అదే చేరుతాను అన్నాడు భరత్. నీకేం తెలీదురా నువ్వు చిన్నవాడివి. భవిష్యత్తులో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివినవాడికి మంచి ఉద్యోగాలు వస్తాయి. నేను చెప్పినట్లు విను అంతే అన్నాడు. పాపం భరత్ బిక్కమొహం వేశాడు.

### సంఘటన - 5

రాధిక కళ్ళఎదురుగానే జరిగిన సంఘటన. రాధిక స్నేహితురాలు రాణికి పెళ్ళిసంబంధం చూశాడు వాళ్ళ నాన్న! రాణి చాలా అమాయకురాలు. పెద్దవాళ్ళంటే భయం. నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు నాన్నా అని చెప్పాలని ఉన్నా చెప్పలేని పరిస్థితి రాణిది. మౌనంగా రాధిక ముందు ఏడుస్తూ కూర్చుంది. రాధికకు రాణివాళ్ళ నాన్నపైన చాలా కోపం వచ్చింది. అసలు రాణి అభిప్రాయానికి విలువ ఇవ్వకుండా పెళ్ళిచేయడం ఎంత అన్యాయం ఇదే విషయం రాణి వాళ్ళ నాన్నను అడగాలనుకుంది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. కృపాల్‌కు కనీసం ఆడుకునే స్వేచ్ఛ కూడా లేదు. దీనిపై మీరెలా స్పందిస్తారు? ఇలాగే ఉంటే కృపాల్ ఎలా తయారవుతాడు? చర్చించండి.

2. ముసలివాళ్ళు కూడా కొన్ని విషయాలలో స్వేచ్ఛను కోరుకుంటారు. వాళ్ళు ఎక్కడెక్కడ స్వేచ్ఛను కోరుకుంటారో చెప్పండి. అది మనం ఇస్తున్నామా? ఆలోచించండి.
3. బాలబాలికలందరికీ చదువుకునే స్వేచ్ఛ ఉంది. అలా చదువుకోకుండా ఇంట్లో కూర్చోబెట్టడం, పనికి పెట్టడం నేరం. ఇలాంటి సంఘటనలు ఎదురైతే మీరేమి చేస్తారు?
4. భరత్ తనకు నచ్చిన కోర్సులో చేరాలనుకోవడం తప్పా. ఆపాటి స్వేచ్ఛ కూడా భరత్‌కు లేదా? ఇలా పిల్లలు ఇష్టమైనవి చేయడంలో ఎంతమందికి స్వేచ్ఛ ఉంది? మీరు గమనించిన అంశాలు చెప్పండి.
5. రాణి మనసులోని మాటను వ్యక్తం చేయలేదుకదా! అలాగే ఉంటే ఏం జరుగుతుంది? రాణి జీవితం ఎలా ఉంటుందని మీరు భావిస్తున్నారు.
6. మన కళ్ళముందే స్వేచ్ఛ కోల్పోయిన ఎన్నో సంఘటనలు కనబడుతుంటే దాన్ని మనం ప్రశ్నించాలా? ప్రశ్నించడం ద్వారా ఏం జరుగుతుంది? దీనికి ఎవరు బాధ్యత తీసుకోవాలి?
7. ఇష్టంలేని పనిని బలవంతంగా చేస్తే ఏమవుతుంది?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ చుట్టుపక్కల ఎక్కడెక్కడ స్వేచ్ఛకు భంగం వాటిల్లుతోందో గమనించండి. వాటిపై ఎలా ప్రశ్నిస్తారో ప్రశ్నలను తయారుచేయండి. మీ బాధ్యత ఏంటో చర్చించండి.
- స్వేచ్ఛ లేకపోవడం వల్ల ఏం జరుగుతుందో చర్చించండి.

## VII. తెలుసుకోండి

మూడు వేల సంవత్సరాల మన దేశచరిత్రలో ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుండి వచ్చిన విదేశీయులు మనపై దాడి చేసి, మన దేశాన్ని ఆక్రమించుకున్నారు. చివరకు మన మనసులను కూడా జయించారు. అలెగ్జాండరు మొదలుకొని గ్రీకులు, తురుష్కులు, మొగలాయిలు, పోర్చుగీసువారు, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు, డచ్చివారు – ఇలా వీరందరూ వచ్చి మన దేశాన్ని కొల్లగొట్టారు. కానీ మనం ఏ ఇతర దేశం పట్ల ఇలా ప్రవర్తించలేదు. ఎవరి భూమినీ ఆక్రమించలేదు. ఎవరి నాగరికతనూ ధ్వంసం చేయలేదు. మన జీవన విధానాలు, ఆచారాలను ఎవరిపైనా రుద్దలేదు. ఎందుకంటే మనం ఇతరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గౌరవిస్తాం కాబట్టి!

**– డా॥ ఎ.పి.జె. అబ్దుల్‌కలాం**
మాజీ రాష్ట్రపతి, ఇండియా.

పిల్లలూ! అబ్దుల్‌కలాం గారి మాట విన్నారు కదా! ఆ మాటల సారాంశమేమిటో గ్రహించారా? హక్కులకు భంగం కలిగించకుండా, వారి స్వేచ్ఛను గౌరవించడం అనేది బాధ్యతతో కూడిన స్వేచ్ఛ. బాధ్యతను విస్మరించి చేసే పనులు, భావప్రకటనలు స్వేచ్ఛ కానే కాదని గుర్తుంచుకోవాలి.

స్వేచ్ఛ అనేది ఎవరో ఒకరు ఇచ్చేదికాదు. ఎవరి దగ్గరనుండి సాధించుకునేది కాదు. స్వేచ్ఛ అనేది మనకు మన మీద ఉండే నియంత్రణ మరియు బాధ్యత, స్వేచ్ఛాయుత సమాజంలో ప్రతివ్యక్తికి న్యాయపరమైన, భావ పరమైన నియంత్రణ ఉంటుంది.

భారత రాజ్యాంగం ఆర్టికల్-19 ప్రతివ్యక్తికీ కొన్ని స్వేచ్ఛలు నిర్దేశించింది. అవి

ఎ) వాక్‌స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వాతంత్ర్యం

బి) శాంతియుతంగా ఆయుధాలు లేకుండా సమావేశాలు నిర్వహించుకోవడం.

సి) అసోసియేషన్లు లేక సంఘాలు ఏర్పాటు చేసుకోవడం.

డి) భారతదేశ భూభాగమునందు అంతటా స్వేచ్ఛగా సంచరించడం.

ఇ) భారతదేశ భూభాగమునందు ఏ భాగములోనైనా నివసించుట, మరియు స్థిరనివాసం ఏర్పరచుకోవడం.

ఎఫ్) ఏదేని వృత్తిని ఆచరించడం, వాణిజ్య వ్యాపారాలను, వర్తకాలను కొనసాగించడం.

భారత రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ నిజంగా కాపాడబడుతుందా? స్వేచ్ఛను కాపాడడంలో పౌరుల బాధ్యత ఎంత వరకు ఉంది? స్వేచ్ఛ ఉల్లంఘించబడినప్పుడు దానిని ప్రశ్నించాలా? వద్దా? ఎందుకోసం? మొదలైన వాటిని గూర్చి తెలుసుకుందాం.

**ఎ) వాక్ స్వాతంత్ర్యం మరియు భావప్రకటన స్వాతంత్ర్యం :**

ప్రతివ్యక్తికి ప్రతి అంశంపై మాట్లాడే, తన అభిప్రాయాన్ని తెలిపే స్వేచ్ఛ ఉంటుంది. అయితే ఏది పడితే అది మాట్లాడడం, రాయడం కాదు. ఇది కొన్ని పరిమితులకు లోబడి ఉంటుంది. ఇతరుల మనోభావాలను, విశ్వాసాలను అగౌరవ పరిచే విధంగా ఉండకూడదు. ఒకవేళ ఎవరైనా ఆవిధంగా చేసినట్లయితే దానిని ప్రశ్నించవచ్చు. అవసరమైతే న్యాయస్థానాలను, మానవహక్కుల సంఘాలను, పౌరహక్కుల సంఘాలను ఆశ్రయించవచ్చు. నిజానికి ఈ స్వేచ్ఛను చాలామంది దుర్వినియోగ పరుస్తున్నారు. వాక్ స్వాతంత్ర్యం

పేరుతో ఇంకొకరి స్వేచ్ఛను హరిస్తున్నారు. భావప్రకటన పేరుతో తన అభిప్రాయాన్ని అందరి అభిప్రాయంగా వెల్లడి చేస్తున్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, జాతి భేదాలతో ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తున్నారు. స్వేచ్ఛ అనేది నీకు నచ్చినది, నీ ఇష్టం వచ్చినట్లు చేసేది కాదని గ్రహించాలి. మనం ఏ మాట మాట్లాడినా ఎదుటి వ్యక్తుల మనస్సులను గాయపరిచేలా మాట్లాడకూడదు.

బి) శాంతియుతంగా, ఆయుధాలు లేకుండా సమావేశమగుటకు అందరికీ స్వేచ్ఛ ఉంది. ఇతరులను రెచ్చగొట్టే విధంగా ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలిస్తూ సమావేశం నిర్వహించకూడదు. చాలా సమయాల్లో సమావేశాలు శాంతియుతంగానే జరుగుతాయి. కొందరు తమ వ్యక్తిగత స్వార్థంకోసం, స్వలాభం కోసం ఆయుధాలు ధరించి సమావేశమవుతారు. దానివల్ల ప్రజాస్వామ్యానికి చేటు కలగడమే కాకుండా నియంతృత్వ ధోరణులు పెరుగుతుంటాయి. అలాంటప్పుడు పోలీసువారిని ఆశ్రయిస్తుంటారు. అందుకే ప్రజలు అన్ని వర్గాల వారందరూ కలిసి ఒక శాంతి సంఘాన్ని ఏర్పాటు చేసి ఇలాంటి వాటిని నివారించవచ్చు. అది మనందరి బాధ్యత, అని గుర్తించాలి. నిజానికి అదే బాధ్యతతో కూడిన స్వేచ్ఛ అవుతుంది.

సి) రకరకాల వృత్తులవారు, కులాలవారు, ఉద్యోగులు మొ॥లగు వారు సంఘాలను ఏర్పాటుచేసుకొనే స్వేచ్ఛ ఉంది. వాటి ప్రయోజనం ఆ వృత్తికి సంబంధించిన అభివృద్ధి, స్థితిగతులు, అలాగే కులాల అభివృద్ధికి సామాజికసేవకు చేపట్టవలసిన చర్యలు, మొ॥ వాటిని చర్చించి, అవసరమైన పనులు చేపట్టడానికి సంఘాలు అవసరం. అంతేగాని ఆయా సంఘాల పేరుతో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం కాదు. అలా చేసినప్పుడు ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఆ కులానికి, వృత్తికి, మేలు జరుగనప్పుడు సంఘాలు వాటికి అనుగుణంగా పనిచేయనప్పుడు ఆ సంఘాలను బహిష్కరించే స్వేచ్ఛ అందరికి ఉంది. మరొక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. సంఘాల ఏర్పాటు పదవులకోసమో, రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించడానికో అయితే ఆ సంఘాల్లోని వ్యక్తుల స్వేచ్ఛను అడ్డుకున్నట్లే. అందరి అభిప్రాయం ఒకటే అయితే పర్వాలేదు కానీ ఒక్కడి అభిప్రాయమే సంఘం యొక్క అభిప్రాయం కాదు. సంఘాల ఏర్పాటుకు కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. నిబంధనలకు లోబడి అవి పనిచేయాలి.

డి) భారతదేశ భూభాగమునందు స్వేచ్ఛగా సంచరించుట, మరియు ఎక్కడైనా స్థిరనివాసం ఏర్పరచుకొనే స్వేచ్ఛ ఉంది. ఈ దేశ ప్రజలు కాశ్మీరు నుండి కన్యాకుమారి దాకా ఎక్కడైనా స్వేచ్ఛగా తిరుగవచ్చు. అలాగే ఏ ప్రాంతంలో నైనా స్థిరపడవచ్చు. కానీ నేడు కొన్నిచోట్ల ఒక ప్రాంతంవారు ఇంకొక ప్రాంతంలో స్థిరపడినప్పుడు వారిని నిందించడం, వారిపై దాడి చేయడం జరుగుతున్నది. ఇది నిజంగా మానవహక్కుల ఉల్లంఘనే అలాంటి సమయంలో వారితో కలిసి మెలిసి ఉండాలి. ఆ ప్రాంత ప్రయోజనాలకు స్థిరపడ్డవారి సహకారం

తీసుకోవాలి. వారిని గౌరవించాలి. వారి స్వేచ్ఛకు భంగం కలుగకుండా చూడాలి. శాంతి భద్రత దృష్ట్యా కల్లోలిత ప్రాంతాల్లో పౌరులు స్వేచ్ఛగా సంచరించకుండా పర్యటన స్వేచ్ఛను పరిమితం చేయవచ్చు.

ఇ) ఏదైనా వృత్తిని ఆచరించే స్వేచ్ఛ ఉంది. అందుకే మన దేశంలో ఎవరికి ఏది ఇష్టమో ఆ వృత్తిని స్వీకరిస్తున్నారు. ఒక కులవృత్తిని మరొకరు చేయడం కనిపిస్తుంది. అలాగే నచ్చిన వ్యాపారాలను చేసుకోవచ్చు. అయితే ప్రభుత్వ నిబంధనలకు లోబడే చేయాలి. అప్పుడే న్యాయపరమైన నియంత్రణతో వాటిని నిర్వహించాలి. మోసం, చేయడం, చీకటివ్యాపారం, (నల్లమందు అమ్మకం, ప్రభుత్వం నిషేధించిన వ్యాపారాలు మొ॥నవి) కల్తీ చేయడం, నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మడం, మొదలైనవి జరిగినప్పుడు వాటిని ప్రశ్నించాలి. వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. పోలీసుల సహకారం తీసుకొని అక్రమ వ్యాపారస్థులను అరెస్టు చేయించవచ్చు, వారిని నివారించవచ్చు.

ఈ విధంగా స్వేచ్ఛకు ఆటంకం కలిగినప్పుడు ప్రశ్నించి, స్వేచ్ఛను పొందవచ్చును. అలాగే స్వేచ్ఛను కాపాడుటలో బాధ్యతను గుర్తించుకోవాలి. అప్పుడే స్వేచ్ఛ అనేది రక్షణతో ఉంటుంది.

**సూక్తి**

**స్వేచ్ఛ అంటే హక్కులను పొందటమే కాదు – బాధ్యతలనూ సమర్థవంతంగా నిర్వర్తించడం.**

# 2 కోరికలే దుఃఖానికి మూలం

**I. ప్రధాన విలువ**

సంతృప్తిగా జీవించడం

**II. ఉప విలువ**

కోరికలే దుఃఖానికి మూలం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- కోరికలు దుఃఖాన్ని కలిగిస్తాయని తెలుసుకుంటారు.
- అనవసర కోరికల కోసం ప్రయత్నం చేయడం మానుకో గలుగుతారు.

## IV. ఉపోద్ఘాతం

కోరికలు మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తాయి. ఒక కోరిక తీరగానే, మరొక కోరిక మనముందుకు వచ్చి నిలబడుతుంది. కోరికలు తీరడానికి మనం ఎన్నో కష్టాలు పడవలసి వస్తుంది. అందుకే దుఃఖానికి కారణం కోరికలని గౌతమబుద్ధుడు చెప్పాడు. ఎవరైతే కోరికల్ని హద్దుల్లో పెట్టుకుంటారో వారే మహాత్ములౌతారు.

ఇప్పుడు కోరికల వలన బాధలుపడిన సంఘటనను తెలుసుకుందాం.

## V. విషయం

సత్యనారాయణ సహకార సంస్థలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయనకి భార్య, ఇద్దరు పిల్లలు. ఆ ఊర్లో సత్యనారాయణ అంటే తెలీనివాళ్ళు లేరు. ఉద్యోగరీత్యా అందరినీ కలవడం అవసరమైన సహాయం చేయడం వంటివి చేస్తూండడంతో ఆ ఊరివాళ్ళందరూ ఏ పని పడినా మన సత్యనారాయణ ఉన్నాడు కదా! అనుకునేవారు. ఊరివాళ్ళు సత్యనారాయణ అంటే ఎంతో అభిమానంగా ఉండేవారు. ఎంతో గౌరవించేవారు.

పండుగలన్నా, పబ్బాలన్నా సత్యనారాయణ చుట్టుపక్కల వాళ్ళతో కలిసిమెలిసి జరుపుకునేవారు. ఊరి వాళ్ళతో అంతటి మంచి సంబంధాలు ఉండేవి. సత్యనారాయణ కుటుంబంవారు ఏ కొరతా లేకుండా సంతోషంగా గడిపేవారు. ఆ ఊళ్ళోవాళ్ళు సత్యనారాయణ మాటకు ఎంతో విలువ ఇచ్చేవాళ్ళు.

ఇంతలో సత్యనారాయణకి ప్రమోషన్ వచ్చింది. హైదరాబాద్‌కు బదిలీ చేశారు. ప్రమోషన్ వచ్చి పట్నానికి వెళ్తున్న సత్యనారాయణను అందరూ అభినందించారు. సత్యనారాయణ కుటుంబం హైదరాబాద్ చేరుకున్నారు. ఇక అక్కడినుండి మొదలయ్యాయి తిప్పలు. సత్యనారాయణ ఇల్లు అద్దెకోసం వెతకగా వెతకగా ఒక బెడ్‌రూం ఉన్న ఇల్లు 5000/– రూపాయలకు అద్దెకు దొరికింది. అదీ తన ఆఫీసుకు నాలుగు కిలోమీటర్ల దూరంలో పిల్లలను కాన్వెంట్‌లో చేర్చడానికి వెళితే బోలెడు ఫీజులు కట్టమన్నారు. పైగా బస్‌ఫీజులు. ఒక్కసారిగా డబ్బు సర్దలేక ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. ఎలాగో ఇల్లు, పిల్లల ఫీజులు, తన ఆఫీసు అన్నీ సర్దుకున్నాయి. సత్యనారాయణ రోజూ ఆఫీసుకు వెళ్ళివచ్చేవాడు. ఇలా ఒక 6 నెలలు గడిచాయి.

ఇప్పుడే మెల్లమెల్లగా పట్టణ వాతావరణానికి అలవాటు పడసాగారు. సత్యనారాయణ భార్యకు మాత్రం చాలా సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లో ఎన్నో షాపులు, ఎన్నోరకాల ఫాషన్లు ఇవన్నీ ఆమెకు తెగనచ్చేసాయి. హైదరాబాద్ వచ్చాక సత్యనారాయణ భార్య రూపురేఖలే మారిపోయాయి.

బ్యూటీక్లినిక్ వెళ్ళడం, పిల్లలకు ఫేషన్‌గా ఉన్న దుస్తులు కొనడం వంటివి కొత్తగా అలవాటైంది. పాపం సత్యనారాయణ డబ్బు సర్దలేక ఇబ్బంది పడిపోయేవాడు.

సత్యనారాయణకు ఆఫీసులో అందరు పరిచయమయ్యారు. పట్టణంలోని ఆఫీసు సిబ్బందికి తన ఊరిలోని ఆఫీసు సిబ్బందికి ఎంతో వ్యత్యాసం కనిపించింది. ఇక్కడ ఎవరిపనులు వారివే. ఒకరి పనిలో ఇంకొకరు కల్పించుకోరు, సహకరించుకోరు. సత్యనారాయణది బాగా డబ్బువచ్చే సీటని తోటి సిబ్బంది అనేవారు. మొదట్లో అర్థమయ్యేది కాదు. కానీ క్రమేణా ఏపని చేయాలన్నా అదనంగా డబ్బులు ఇవ్వడం అనేది అక్కడ పరిపాటి అని తెలుసుకున్నాడు. సంవత్సరం దాటేసరికి ఏఏ పనులకు ఎంత లంచం ఇస్తారో తెలిసిపోయింది. మొదట్లో లంచం తీసుకోవడానికి తటపటాయిస్తున్న సత్యనారాయణ తోటిసిబ్బంది ఇదంతే ఇక్కడ మామూలే సార్! అనేవారు. అలా మెల్లగా సత్యనారాయణ కూడా లంచానికి అలవాటు పడ్డాడు.

రెండు సంవత్సరాలు గడిచాయి. సత్యనారాయణ కుటుంబ స్వరూపమే మారిపోయింది. పెద్దఇంటిలోకి మారారు. బైక్ కొన్నాడు. ఖర్చులు పెరిగాయి, ఆడంబరాలు పెరిగాయి. ఆదివారాలలో హోటళ్ళకు వెళ్ళే వాళ్ళు,, జల్సాలు చేయడం అనేది పిల్లలకూ అలవాటైంది. సత్యనారాయణ భార్య ఆనందానికి అంతేలేదు. బోలెడు నగలు, చీరలు కొనింది.

5 సంవత్సరాలు గడిచాయి. సత్యనారాయణ జీవితమే మారిపోయింది. సొంత ఇల్లు, కారు అన్నీ అమరినాయి. సత్యనారాయణ ఆదాయం బాగా పెరిగింది. అందరూ విలాస జీవితానికి అలవాటుపడ్డారు. పార్టీలు, తాగడం సాధారణం అయిపోయింది. ఇంట్లో ఎంత డబ్బు తెచ్చినా సరిపోయేది కాదు. ఇరుగు పొరుగు వారితో సంబంధాలు తగ్గాయి. డబ్బే అన్నింటికీ ప్రధానం అయ్యింది.

ఇలా ఉండగా ఒకరోజు అవినీతి నిరోధకశాఖవాళ్ళు సత్యనారాయణ ఇల్లు సోదా చేయడానికి వచ్చారు. నగలు, ఆస్తులపత్రాలు అన్నీ ఆదాయానికి మించి ఉన్నాయని మొత్తం జప్తు చేసారు. సత్యనారాయణను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. ఈ విషయం సత్యనారాయణ సొంతవారైన రాణీనగరం ప్రజలకు తెలిసింది. వాళ్ళందరూ హైదరాబాద్‌కు వచ్చారు. సత్యనారాయణను కలిసారు. ఏంటి సత్యనారాయణ నువ్వు మా సత్యనారాయణవేనా? ఇలా ఎందుకు జరిగింది అని అడిగారు. సత్యనారాయణ సిగ్గుతో చచ్చిపోయాడు. మితిమీరిన ధనవ్యామోహంతో లంచాలు మీద లంచాలు తీసుకుంటూ తను ఎలా దిగజారింది ఆలోచిస్తే చాలా అవమానంగా అనిపించింది. ఒక్కసారి తాను రాణీనగరంలో ఉండగా ఎంత సంతోషంగా గడిపాడు! గుర్తుకు తెచ్చుకున్నాడు, సంపాదన తక్కువైనా ఆరోజులు సంతోషంగా గడిచాయి. ఇక్కడ ఆదాయం పెరిగింది. ఆనందం తగ్గింది. అడుగడుగునా తప్పుచేస్తున్నానన్న భావం ఉన్నా ఇతరుల ప్రోద్భలంతో తాను లంచం వల్ల అవినీతి ఊబిలో ఇరుక్కుపోయాడు, తాను ఎంత విలువ కోల్పోయాడో సత్యనారాయణకు అప్పుడు అర్థం అయింది. తన వాళ్ళని చూడాలంటే అవమానం అనిపించింది. మన సత్యనారాయణే అన్న ఊరివాళ్ళు వాడా లంచాల సత్యనారాయణ అనే స్థితి వచ్చింది. గౌరవం, పరువు పోయింది. అందరూ తనని చూసే చూపు, ఈసడించుకోవడం చూసి, సత్యనారాయణ నిలువునా కుంగిపోయాడు.

కథ విన్నారుకదా! పిల్లలూ! అక్రమంగా సంపాదించిన ధనం కొంతకాలం మనతో ఉండచ్చుగాని అది ఇచ్చే సంతోషం తాత్కాలికం. ఉన్నదాంతో తృప్తిపడక పరుల ధనంకోసం అక్రమమార్గాలు అవలంబిస్తే జీవితం అశాంతికి దారితీసి అవమానాలకు గురిచేస్తుంది. వ్యక్తిగా విలువ పడిపోతుంది. అందరి దృష్టిలో దిగజారిపోతారు. వాడింత సంపాదించాడు, నేనింత సంపాదించాలి ఎలాగైనా ఏ మార్గంలోనైనా సంపాదించి గొప్పవాడినవ్వాలి అని ధనసంపాదనే జీవితం అనుకుంటే పాపమే మూటగట్టుకుంటారు. సంతోషాన్ని కోల్పోతారు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. ఎలాంటి పరిస్థితులు సత్యనారాయణను ఆనందంగా ఉంచాయి?
2. సత్యనారాయణ లంచం తీసుకోవడానికి కారణాలు ఏమైవుంటాయి?
3. కోరికలు ఎక్కువవటం వల్ల సత్యనారాయణ కుటుంబానికి కలిగిన నష్టమేమి?
4. మీరు కోరికలతో బాధపడ్డ సందర్భాలు చెప్పండి.
5. మనం కోరికలు లేకుండా జీవించగలమా?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఎలాంటి కోరికలు లేకుండా ఒక వారం రోజులు గడపండి. మీరు పొందిన అనుభవాలను చెప్పండి.

## VII. తెలుసుకోండి

### సంతృప్తికర జీవితం

మానవుడు ఎంత సంపాదించి అభివృద్ధిచెందినా, ఉన్నత ఉద్యోగాలలో కొనసాగుతూనే ఉన్నా నేడు అసంతృప్తి అనే సమస్య. అతన్ని పట్టి పీడిస్తూనే ఉన్నది. ఎంతటివారిని కదిలించినా వారిలో ఏదో ఒక మూల అశాంతి, అసహనపు ఛాయలు కనిపిస్తూనే ఉన్నాయి. ప్రతివారిలో సంతృప్తి అనేది కొరవడినట్లుగా స్పష్టమౌతున్నది.

లభించినదానితో సంతృప్తిచెందే మనస్తత్వం కలవారికి అన్నీ ఆనందమయమౌతాయి. పాదరక్షలు ఉన్న వ్యక్తి పాదాలకు ముళ్లు, రాళ్లు ఏవిధంగా బాధని కలిగించలేవో అదేవిధంగా సంతృప్తిచెందే మనస్తత్వం కలవాణ్ణి ఎలాంటి దుఃఖాలూ బాధించలేవని వేదవ్యాసమహర్షి శ్రీమద్భాగవతం సప్తమస్కంధంలో –

"సదా సంతుష్ట మనసః సర్వాశ్శివమయా దిశః ।
శర్కరాకంటకాదిభ్యః యథోపానత్పదశ్శివమ్" ॥

అన్న శ్లోకంలో పేర్కొన్నారు. తాను సంపాదించిన ధనంతో తృప్తిచెందని వ్యక్తి, అధిక ధనార్జనపరులను చూసి వారి మాదిరిగా తాను కూడా ఐశ్వర్యవంతుడిని కావాలన్న కోర్కెతో అసంతృప్తికి లోనవుతాడు. అందుకే మనిషి తన శక్తికి మించిన రకరకాల కోరికలకు తన మనసులో స్థానమివ్వకూడదు.

ప్రాణాలను నిలుపుకోవటానికి, జీవితానికి అవసరమైన వాటిని సాధించాల్సిందే. వాటి కోసం తగినవిధంగా ప్రయత్నించాల్సిందే. పదవీ వ్యామోహం, అష్టైశ్వర్యవాంఛ, వివిధ భోగకాంక్షలు మనసులో పుడుతూనే ఉంటాయి. వాటిని అదుపులో పెట్టుకోవాలి. అంతేకాని కోర్కెలను తీర్చుకుంటూపోతే సంతృప్తి లభిస్తుందని భావించరాదు.

సంతృప్తి లేనివారు లోకమంతటా మాటిమాటికి తిరుగుతూ ఉంటారని, ఉన్నదానితో సంతృప్తిచెందే స్వభావం కల వ్యక్తి నిశ్చింతగా జీవితాన్ని కొనసాగించగలుగుతాడని శ్రీమద్భాగవతం దశమస్కంధంలో –

"అసంతుష్టో సకృల్లోకా నాప్నోత్యపి సురేశ్వరః ।
అకించనోపి సంతుష్టః శేతే సర్వాంగవిజ్వరః ।"

అని శ్రీకృష్ణుడు పలికిన పలుకులు అన్ని కాలాలవారికీ, అన్ని దేశాలవారికీ కనువిప్పును కలిగించే పరమసత్యాలు.

అందుకే మన పెద్దలు పరుగెత్తి పాలు తాగడం కన్న నిలబడి నీళ్ళు తాగడమే మంచిదని హితవు చెప్పారు. ఉన్నంతలో సంతృప్తిని పొందే తత్వాన్ని అలవర్చుకోవాలి. క్రమక్రమంగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. ఎదుటివారికి ఎక్కువ ఉన్నదనే, తనకు లేదనే అసంతృప్తి, అశాంతులు మనిషిని నిలువునా కాల్చేస్తాయనీ, ప్రతిక్షణం మనోవేదనను కలిగిస్తాయనీ ఇలాంటి సమస్యలను తొలగించుకునేందుకు సంతృప్తి అనేది దివ్యౌషధంగా పనిచేస్తుందని పెద్దలు చెప్పారు. సంతృప్తి వల్ల దీర్ఘకాలిక ఆరోగ్యం, ఆనందం, మానసిక ప్రశాంతత వంటివి లభిస్తాయి. తోటి మానవులందరి సుఖసంతోషాలను,

ఆయురారోగ్యాలను, క్షేమలాభాలను కాంక్షించడం వల్ల మాటలలో చెప్పలేనంతగా అమేయమైన సంతృప్తి కలుగుతుంది. వీటివల్లనే మనిషి జీవితానికి సార్థకత చేకూరుతుంది.

## కోరిక

కోరికలు అనర్థదాయకాలు, మానవుల కష్టాలకు మూలకారణమని కొందరంటారు. అసలు కోరికే లేకుంటే మానవాళి మనుగడకు అర్థం ఏముంటుంది? గొంతెమ్మ కోరికలు, అలవికాని, అమలుకాని కోరికలతో ప్రమాదముంటుంది కానీ కోరికే లేకుంటే మనిషి నేడు అన్ని రంగాల్లో ఇంతటి ప్రగతి సాధించేవాడా? ఆనాడు ఆదిమానవుడు ఆత్మరక్షణ కోసం ఆయుధాలు తయారుచేసుకొన్నాడు. క్రూరజంతువుల బారినుండి తనను తాను రక్షించుకోవడమెలా అన్న ఆలోచనకు బీజం పడింది... ఆనాటినుండి నేటివరకు అనేకరకాల కోరికల వల్లనే కదా మనం పురోగతి సాధించాం. నాటి రాతియుగం నుంచి నేటి అణుయుగం వరకు మానవ మేధను నడిపిస్తోంది కోరికలే కదా!

అవసరం అన్వేషణకు దారితీస్తుంది. మొదదుకు పదును పెడుతుంది. కార్యసాధనకు శ్రీకారం చుడుతుంది. ఆ దిశగా అడుగులు వేయిస్తుంది. చిత్తశుద్ధితో లక్ష్యసిద్ధి కోసం అహరహం కృషిచేసేలా నడిపిస్తుంది. కొన్ని విజయాలతో ప్రగతి ఆగిపోదు. నిరంతర సాధనతో మానవుడు నిత్య కృషీవలుడిగా మారినప్పుడే నిజమైన ప్రగతి కనులముందు నిలుస్తుంది. దీనికి మూలకారణం కోరికే కదా! ఆశలు, ఆశయాలు ఉండగానే సరిపోదు. సంకల్పసిద్ధి కోసం తగిన కార్యాచరణ ఉంటేనే ఫలితం లభిస్తుంది.

కొత్త దేశాన్ని చుట్టివద్దామని ఓడలో బయలుదేరిన కొలంబస్‌కి కొత్త ఖండమే కనిపించింది. ప్రస్తుతం అదే ప్రపంచాన్ని శాసించే అగ్రరాజ్యంగా వెలుగుతోంది. ఈ విజయం వెనుక దృఢదీక్ష, కఠోర పరిశ్రమ ఉన్నాయికదా! ఇవన్నీ బలమైన కోరికనుంచే పుట్టాయి. నేడు ఆధునిక మానవుడు అనుభవిస్తున్న సౌకర్యాలు ఒకప్పుడు లేవు. వివిధ రంగాల్లో ఎన్నో దశల్లో మేధావుల కృషివల్లనే ఇవన్నీ లభించాయి. ఒక మేధావి మదిలో మొదలైన ఆలోచన ప్రగాఢ కాంక్షగా మారుతుంది. అష్టకష్టాలకోర్చి ప్రయోగాలు చేస్తాడు. పదేపదే విఫలమవుతున్నా విసుగుచెందక చివరికి విజయం సాధిస్తాడు. మానవజాతికి మేలు చేస్తాడు. ఎన్నో వ్యయప్రయాసలకు, శ్రమదమాదులకు ఓర్చిననాడే లక్ష్యం సిద్ధిస్తుంది.

హిమాలయాల్లో కళ్ళు మూసుకుని తదేక ధ్యానంలో మునిగిపోయిన మునులు, ఋషులు కూడా మోక్షసిద్ధి అన్న కోరికతోనే ఆ పని చేస్తున్నారు. ఒక విద్యార్థికి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలన్న కోరిక ఉంటుంది. ఒక కళాకారుడికి తన రంగంలో ఉన్నత స్థితికి ఎదగాలన్న కోరిక ఉంటుంది. ఒక చిన్న సంస్థ లేదా పరిశ్రమ స్థాపించిన వ్యాపారికి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారం విస్తరింపజేయాలన్న కోరిక కలుగుతుంది. కార్యదీక్షకు ఎంతో ఓర్పు, నేర్పు ఉండాలి. అవరోధాలు అధిగమించే శక్తియుక్తులు చూపాల్సి ఉంటుంది. ఎన్నో ఆటుపోట్లు తట్టుకోవాలి. దీనికి సక్రమమైన మార్గాలనే ఎంచుకోవాలి. అక్రమం అనర్థదాయకం! కొన్నిసార్లు అవకాశాలు, అదృష్టం కూడా కలిసి రావాలి. ఈ వైకుంఠపాళిలో నిచ్చెనలెక్కడం కష్టసాధ్యమేకదా!

కోరికలే మనశ్శాంతిని దూరం చేస్తాయి, కష్టాల కొలిమిలోకి నెట్టేస్తాయి అని కొందరు చెబుతుంటారు.

ఇవన్నీ ఆకాశానికి నిచ్చెనలు వేసేవారికే వర్తిస్తాయి. మనిషి తనకున్న పరిధి, పరిమితి, సమర్థత తెలుసుకుని తదనుగుణంగా కృషి చేస్తే తన కల తప్పక సాకారమవుతుంది. మనిషి జీవితంలో ఒక్క చావును జయించడం తప్ప మిగిలినదేదీ అసాధ్యం కాదని షేక్స్పియర్ ఒక నాటకంలో వ్యాఖ్యానించాడు. కోరికలే ప్రగతికి సోపానాలు... విజయానికి బాటలు, నిత్యసాధన, శోధనలకు అవే ప్రేరణలు, ప్రేరకాలు! కోరికే లేకుంటే మానవ జీవిత ప్రయాణం ఆగిపోతుంది. కాలమే స్తంభించిపోతుంది. ప్రపంచమంతా నిత్యకల్యాణం, పచ్చతోరణంగా భాసిల్లాలంటే కోరికలుండాలి!

## బుద్ధిమార్గం

కోరికలే కష్టాలకు కారణం. కాబట్టి అలాంటి కోరికల్ని త్యజించమన్నాడు బుద్ధుడు. కోరికలంటే ఎలాంటి కోరికలు? ప్రపంచమంతా సుఖంగా వర్ధిల్లాలని కోరుకోవడం ఇలాంటి కోరిక కాదు. శాంతి అహింసలు పరిఢవిల్లడమూ కాంక్షించడమూ ఈ కోవలోకి చేరవు. కర్మఫల త్యాగాన్ని మన ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. కోరికలు లేకపోతే సుఖంగా బతకవచ్చని, ప్రజల హృదయాల్లో ముద్రవేసే విధంగా బుద్ధుడు చెప్పగలిగాడు. బుద్ధుడికి స్వర్గకాంక్ష లేదు. రాజ్యకాంక్ష అసలే లేదు. సంసారాన్ని విడిచి వెళ్ళిపోయాడు. ఏ కోరికాలేని మనిషి (బుద్ధుడు) అయ్యాడు. కాబట్టే శత్రువుకు మేలుచేయడం, ద్వేషించేవారిని ప్రేమించడం ఆయనకు సాధ్యపడింది.

ఎంత జ్ఞానం ఉంటే ఇది సాధ్యపడుతుంది? ఆకాశమంత! తాను ఆ స్థాయికి చేరుకోవడమేగాక, సాధన చేస్తే అందరూ ఆ స్థాయిని పొంది 'బుద్ధులు' కావచ్చునని ఆయన బోధించాడు. ఈ సాధనకు మూలసూత్రం 'కోరిక లేకపోవడం'. తాను జీవితంలో ఆచరించి మరీ చెప్పాడు. భిక్షాటనతో బతికాడు. జంతుజాలమంతా మనవంటిదే కాబట్టి జాలితో చూడమన్నాడు. వాటిని రక్షించడం కోసం నిత్యం తహతహలాడాడు. 'మేకపిల్లను బలి ఇస్తే మోక్షం వస్తుందా? అయితే, మనిషిని బలిఇస్తే మరీ మంచిది కదా! కాబట్టి నన్నే బలిఇవ్వండి' అని ఒక జీవిని రక్షించడం కోసం తానే బలిపీఠం ఎక్కాడు. ఇందువల్ల ఆ మహాపురుషుడికి ఒరిగిందేమిటి? తాను అధికారంలోకి రావడానికో, పూజలందుకోవడానికో ఈ పనిచేయలేదు. ఉన్న అధికారాన్ని వదులుకున్నాడు. పూజలపై విశ్వాసంలేదు. 'కరుణ' కోరికలతో సంబంధంలేనిది. దేవుడు, స్వర్గం, ముక్తి... వీటిని గురించి బుద్ధుడు పట్టించుకోలేదు. స్వార్థరహితమైన సజీవ ప్రేమను ప్రపంచ ప్రజలకు ఒక సందేశంగా అందించాడు.

ఈ లోకానికి మహోపకారం గావించిన మహాత్ములెవరూ తమకంటూ ఏమీ కోరుకోలేదు. ఆఖరికి తమ సంతానం సిరిసంపదలతో తులతూగాలనీ వాంఛించలేదు. 'నాకేంటి?' అనే ప్రశ్న కలలో కూడా మొలకెత్తని 'బుద్ధులు' వీళ్ళు. ధర్మానికి బద్ధులు. 'సరే! నీకు ఇది ఇస్తా! మరి నాకేంటి? తిరిగి నాకు ఏమిస్తావు?' అనే ప్రబుద్ధులు నేటి సమాజంలో కనబడుతున్నారు. తమకు లాభం లేకపోతే వీళ్ళు దేవుడికి దండం కూడా మనస్ఫూర్తిగా పెట్టరు. భక్తి వెనుక ఏ కోరికా ఉండకూడదు. అధికమైన కోరికలకు కారణం అజ్ఞానం ఒక శాస్త్రజ్ఞుడు అహర్నిశలూ పరిశోధిస్తున్నాడు. ఒక నూతన గణన యంత్రాన్ని నిర్మించడానికి శ్రమిస్తున్నాడు. అతడి కుమారుడు వచ్చి 'నాన్నా! ఇదేమిటి?' అని ప్రశ్నించాడు 'ఒక అపూర్వ గణనయంత్రాన్ని కనిపెడుతున్నాను!'

అన్నాడు తండ్రి. 'ఇందులో నుంచి చాక్లెట్లు వస్తాయా?' ఆశగా ప్రశ్నించాడు కుమారుడు. 'అలాంటివేమీ రావు! అన్నాడు శాస్త్రజ్ఞుడు. 'అయితే ఇది వట్టి పనికిమాలిన యంత్రం... దీంతో నాకు పనిలేదు!' అంటూ ఆ పుత్రరత్నం నిరాశతో అక్కడినుంచి వెళ్ళిపోయాడు. లోకం మొత్తానికి మేలుచేసే వస్తువు తనకూ మేలు చేస్తుంది గదా అనే ఆలోచన ఆ పసివాడికి కలగలేదు. అతడికి కావలసింది చాక్లెట్. తన కోరిక తీర్చేది ఉంటే చాలు. లోకం మేలుతో అతడికి పనిలేదు. పసివాళ్ళకు అలా అనిపించడం సహజం. కారణం అజ్ఞానం. కానీ, ఉత్తమ విద్యలభ్యసించి, ఉన్నత పీఠాలు అధిరోహించినవారిది అజ్ఞానమా? కాదు అత్యాశ!

కన్నబిడ్డలకు అన్నం పెడతారు. వస్త్రాలిస్తారు. తల్లిదండ్రులకు ఎలాంటి ప్రతిఫలాపేక్షా ఉండదు. ఇలాంటి సేవాదృక్పథమే పాలకులకు ఉండాలి. 'ఇతరుల కోసం చేసే అతిస్వల్పకార్యం కూడా మనలోని మహాశక్తిని మేల్కొలుపు తుంది' అంటాడు వివేకానందుడు. లోకానికి మనం ఇచ్చే ప్రతి వస్తువునూ ప్రతిఫలాపేక్ష రహితంగా సమర్పించడమే సనాతన ధర్మం. ఒక పర్యాయం లోకమాన్య బాలగంగాధర్ తిలక్ బొంబాయిలో ఉపన్యాసం ఇచ్చాడు. ఆయన అపార పరిజ్ఞానానికి సభాధ్యక్షుడు ఆశ్చర్యపోయాడు. 'తిలక్ మహాశయా! మీతో సాటిరాగల ప్రజ్ఞావంతులెవరూ లేరు. మీరు అనవసరంగా స్వాతంత్ర్యపోరాటంలో కాలాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు. విశ్వవేదికలపై మీ అపార పాండిత్యాన్ని ప్రదర్శిస్తే అఖండ ఖ్యాతిని ఆర్జిస్తారు గదా!' అన్నాడు. తిలక్ ఇలా సమాధానమిచ్చాడు – 'అధ్యక్ష మహోదయా! దేశానికి స్వాతంత్ర్యం వస్తే నావంటి ప్రజ్ఞానిధులు వేలమంది ఉద్భవిస్తారు. నాకు పేరు ప్రఖ్యాతులపై కోరికలేదు. భగవంతుడు నాకిచ్చిన శక్తిని దేశసేవకే వినియోగిస్తాను. నాకంటూ ఏమీ అవసరంలేదు!'

ప్రతిఒక్కరూ ఇటువంటి త్యాగమూర్తుల ఆదర్శ జీవితాన్ని స్మరిస్తే 'నాకేంటి' అనే మాట నోట రానేరాదు.

**సూక్తి**

ఎక్కువ కోరికలు ఉండేవాడు పేదవాడుకాని,
తక్కువ ధనమున్నవాడు పేదవాడు కాదు.

**సూక్తి**

కోరికలు తీర్చుకోవడం కాక కోరికలు లేకుండా చేసుకోవడం వలన
మనిషి సుఖపడతాడు.

**సూక్తి**

మనం జీవితంలో సుఖంగా, శాంతంగా ఉండాలంటే మనకు ఇష్టమైనది
దక్కనప్పుడు, దక్కిన దానినే ఇష్టపడాలి. దానితోనే తృప్తిపడాలి.
– ఏకనాథ ఈశ్వరన్

# 3 ధైర్యంగా ఉందాం!

**I. ప్రధాన విలువ**

శీల నిర్మాణం

**II. ఉప విలువ**

ధైర్యసాహసాలను ప్రదర్శించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ధైర్యగుణాన్ని అలవరచుకుంటారు.
- ధైర్యంగా ప్రవర్తిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

'ధైర్యే సాహసే లక్ష్మీ' అని లోకోక్తి. ధైర్యసాహసాలు ప్రదర్శించిన వ్యక్తులకు విజయలక్ష్మి చేకూరుతుంది. ధైర్యంతో వ్యక్తి తాను రక్షణ పొందడమే కాకుండా సామాజిక రక్షణ కూడా గావించాలి. అప్పుడే ధైర్యగుణానికి సార్థకత. కష్టసమయాల్లో కృంగిపోకూడదు. వాటిని ధైర్యంతో ఎదుర్కొనే ప్రయత్నం చేయాలి. ఓటమిని పొందినప్పుడు కూడా అపజయాన్ని ధైర్యంగా స్వీకరించగలగాలి.

## V. విషయం

పనులు చేసేటప్పుడు ఆటంకాలు కలగడం సహజం. ఆటంకాలకు భయపడకుండా వాటిని ధైర్యంతో ఎదుర్కోవాలి. ధైర్యవంతులకు అపజయం అనేది ఉండదు. కొందరు పిల్లలు ధైర్యసాహసాలతో పెద్దలు చేయలేని పనులను కూడా చేసి ఇతరులకు సహాయపడుతుంటారు. ఆదర్శవంతులవుతారు. ధైర్యవంతులుగా, సాహస బాలలుగా గుర్తింపు పొందుతారు. ఇలా ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు రాష్ట్రపతిచే 'సాహసబాలల అవార్డు' కూడా పొందుతారు. ఇలాంటి వారిని గురించి తెలుసుకుందాం!

## సంఘటన-1 : వృద్ధుడికి ప్రాణభిక్ష

ఒకరోజు కృష్ణప్రసాద్ వాళ్ళ అమ్మతో కలిసి రైల్వేగేటు ప్రక్కనుండి వెళ్తున్నాడు. వారి వెనుకనే ఒక ముసలాయన పట్టాలు దాటుకుంటూ మరోవైపునుండి వస్తున్న రైలును చూసుకోలేదు. ప్రక్కనున్న వాళ్ళు అరుస్తున్నా వాళ్ళ అరుపులను పట్టించుకోకుండా వెళ్తున్నాడు. ఈలోగా రైలు దగ్గరికి రానేవచ్చింది. ఒక్క క్షణం ఆలస్యం చేసినా రైలు ముసలాయన పైనుండి పోయేదే. వెంటనే కృష్ణప్రసాద్ రైలు పట్టాలపైకి అడుగేసి అతన్ని గట్టిగా పట్టుకొని వెనక్కిలాగాడు. త్రుటిలో ప్రమాదం నుండి తప్పించి ప్రాణాలు కాపాడాడు.

కృష్ణప్రసాద్ చూపించిన ధైర్యసాహసాలకు వాళ్ళ అమ్మేకాదు అక్కడున్న వారంతా అభినందించారు. రాష్ట్రపతి కూడా అభినందించి 'సాహసబాలల అవార్డు'ను అందజేశారు.

## సంఘటన-2 : చెల్లిని కాపాడిన అక్క

మహిమా తివారీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సాహస బాలిక. ఈమెకు చిన్నప్పటినుండి ఇరుగు పొరుగు వారితో ఎలా కలిసిఉండాలో అమ్మా నాన్న బాగా నేర్పించారు.

ఒకరోజు అమ్మ చేసిన తీపి వంటను ఇరుగుపొరుగుకు ఇచ్చిరావడానికి రెండున్నరేళ్ళ చెల్లిని తీసుకుని మహిమా తివారీ బయలుదేరింది. ఇంతలో ప్రక్కనున్న పొలాల్లోంచి ఒక తోడేలు వచ్చి మహిమా తివారిపై దూకింది. మహిమ ధైర్యంచేసి తన చేతిలోని ప్లేటుతో తోడేలును గట్టిగా కొట్టింది. అరుపులకు దెబ్బలకు తట్టుకోలేక తోడేలు మహిమా తివారిని వదిలిపెట్టి ఆమె చెల్లెలుమీద పడింది. చెల్లెలు క్రింద పడిపోవడంతో తోడేలు ఆమెను పళ్ళమధ్య కరుచుకొని పొలాల్లోకి లాక్కెళ్ళసాగింది. అదిచూసి మహిమా తివారి తోడేలువెంట పరుగెడుతూ ప్లేటుతో దాని తలపై గట్టిగా దెబ్బలు కొట్టసాగింది. దాంతో తోడేలు మహిమా చెల్లిని వదిలిపెట్టి పారిపోయింది.

తోడేలును చూసి భయపడకుండా చెల్లి ప్రాణాలను రక్షించిన మహిమా తివారికి "సాహస బాలిక అవార్డుని"చ్చి రాష్ట్రపతి గౌరవించారు.

## సంఘటన-3 : మహిళను కాపాడిన ధైర్యశాలి

మన రాష్ట్రంలోని అనంతపురం జిల్లా భోగసముద్రం గ్రామానికి చెందిన సాహస బాలుడు బి.సాయికౌశల్.

ఆగష్టు 15, స్వాతంత్ర్య దినోత్సవంరోజు వృద్ధుల ఆశ్రమంలో అమ్మతో కలిసి సాయి కౌశల్ మిఠాయిలు పంచిపెట్టాలనుకున్నాడు. ఇద్దరూ కలిసి ఆశ్రమానికి వెళ్ళారు. మిఠాయిలు పంచి ఇంటికి తిరిగి వస్తున్నారు. వాళ్ళతోపాటు ఆ ఆశ్రమానికి చెందిన మరో ముగ్గురు మహిళలు కూడా వస్తున్నారు.

అందరూ కలిసి తిరిగి వస్తుంటే దారిలో ఒక గడ్డితుప్పచాటు నుండి అడవిపంది ఒకటి ముందుకు ఉరికి వచ్చింది. వారితో వస్తున్న ఒక మహిళపై దాడిచేసింది. అడవిపంది దాడి చేస్తే తప్పించుకోవడం మహాకష్టం. ఆమె గట్టిగా కాపాడమని అరుస్తోంది. అడవిపందిని చూసిన మిగిలిన మహిళలు దూరంగా పారిపోయారు. సాయికౌశల్ మాత్రం భయపడలేదు. వెంటనే పక్కనే ఉన్న రాళ్ళుతీసి పందిని కొట్టడం ప్రారంభించాడు. ఆగకుండా రాళ్ళతో కొట్టేసరికి దానికి గాయాలై మహిళను వదిలిపెట్టి పారిపోయింది. వెంటనే అందరూ కలిసి ఆ మహిళను తీసికెళ్ళి వైద్యం చేయించారు.

బి. సాయికౌశల్ సాహసాన్ని గ్రామస్తులేకాక రాష్ట్రపతి కూడా గుర్తించి "సాహస బాలుడి అవార్డు" నిచ్చి సత్కరించారు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. సంఘటనల గురించి తెలుసుకున్నారుకదా! వీటిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
2. ఇలాంటి సందర్భాలు మీకు ఎదురైతే మీరేం చేస్తారు?
3. ధైర్యంగా ప్రవర్తించడం వల్ల కలిగే లాభాలు ఏమిటి? ఎప్పుడెప్పుడు ధైర్యం కలిగిఉండాలి?
4. మీ ప్రాంతంలో జరిగిన ధైర్యసాహసాల సంఘటనలను తెలిపి ఆ వ్యక్తులను అభినందించండి.

ఉదా : 'బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే పెద్దలకు చెప్పడం.
అన్యాయానికి ఎదురు తిరగడం.
ఇష్టంలేని పని చేయాల్సి వచ్చినప్పుడు ప్రశ్నించడం.
బడిలో సంతృప్తికరంగా లేని అంశాలపై హెడ్‌మాస్టర్ మరియు టీచర్‌లతో మాట్లాడడం, పోస్ట్‌బాక్స్‌లో రాయడం మొ॥నవి

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఇల్లు/బయట/బడిలో మీరు ధైర్యంగా మాట్లాడండి. ధైర్యంగా ప్రవర్తించండి. అప్పుడు మీకు ఎలా అనిపించిందో మీ అనుభవాలు చెప్పండి.

## VII. తెలుసుకోండి

### వీరుడైన విపిన్

అది జులై 18వ తేదీ 1991 సంవత్సరము. విపిన్ తన తల్లిదండ్రులతో కుటుంబసభ్యులతో కలిసి యాత్రకు వెళ్ళాడు. అక్కడ వేతవానదీతీరంలో తిరుగుతుండగా అతని ఆరేండ్ల సోదరి త్రిపురసుందరి వేగంగా ప్రవహిస్తున్న నదిలో జారిపడి కొట్టుకుపోయింది. విపిన్ తల్లిదండ్రులు ముందుకు నడుస్తున్నారు. వెనుక ఏం జరిగిందో వారికి తెలియలేదు. సోదరి నీటిలో కొట్టుకుపోవడం చూసిన విపిన్ వెంటనే ఒక క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా నదిలోకి దూకాడు.

నదివద్ద చుట్టుప్రక్కల ఉన్న జనులు ఈ సంఘటన చూసి కేకలు వేయసాగారు. 'రక్షించండి, రక్షించండి' అని. అప్పుడు విపిన్ తల్లిదండ్రులు వెనక్కి తిరిగి చూశారు. ఇంకేముంది! వారికి స్పృహ తప్పినంతపనయింది. పరుగు పరుగున వెనక్కివచ్చారు. విపిన్ నెమ్మదిగా తన సోదరి త్రిపురను నీటినుండి బయటికి లాక్కొనివచ్చాడు. అక్కడున్న వారంతా అతని సాహసాన్ని మెచ్చుకొన్నారు. 1991 లో సాహసబాలలు అవార్డు అందుకున్నాడు.

### సాహస బాలలు

తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎందరినో కాపాడిన బాలలు వారు. అందుకే సాహస బాలలుగా జాతీయస్థాయి అవార్డులు పొందారు. 2012సం॥లో వీరి సాహసాలతో మొత్తం 31 మంది నిండుప్రాణాలు నిలబడ్డాయి. ఈ సాహసబాలల్లో దుండగుల్ని ఎదిరించిన ధైర్యవంతులు ఉన్నారు. అక్రమాల్ని, అన్యాయాల్ని అడ్డగించిన చిచ్చర పిడుగులు ఉన్నారు. 2012 జాతీయ సాహస బాలల అవార్డులకి ఎంపికైన వారిలో 18 మంది బాలురు, నలుగురు బాలికలు ఉన్నారు. ఒక బాలుడికి మరణానంతరం అవార్డును ప్రకటించారు.

**అక్రమాలను అడ్డుకున్న ధీరులు...**

కళ్ళముందు జరిగే అన్యాయాన్ని సహించలేని పిల్లలు. తమవంతు పోరాటం చేసి సమయస్ఫూర్తి చూపించారు. ఢిల్లీకి చెందిన రేణు (17) చూపించిన సాహసం ఎంతోమంది బాలికల జీవితాల్ని చక్కదిద్దింది. తాను ఉంటున్న బాలల గృహంలో యజమాని, సిబ్బంది చేసే పాశవిక చర్యలను గమనించి చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా శిశుసంక్షేమ కమిటీ దృష్టికి తీసుకువెళ్ళింది. తనిఖీకి వచ్చిన అధికారులముందు ధైర్యంగా సాక్ష్యం చెప్పింది. రేణుని గీతాచోప్రా అవార్డుకి ఎంపికచేశారు. రాజస్థాన్‌కు చెందిన స్వప్నకుమారి మీనా (14) తనకు బాల్యవివాహం తలపెట్టిన తండ్రిపైనే ఫిర్యాదుచేసింది. జిల్లా మేజిస్ట్రేట్‌కు లేఖ రాసి తెగువను, చైతన్యాన్ని ప్రదర్శించింది.

**దుండగులను ఎదిరించి...**

కొందరు బాలలు దుండగులు, హంతకులతో ధైర్యంగా పోరాడిన సాహసవంతులుగా కీర్తిపొందారు. ఛత్తీస్‌గఢ్‌కి చెందిన ఆకాంక్ష గౌతే (16) ముగ్గురు దుండగులను పోలీసులకు పట్టించి 'బాపు గయధాని' అవార్డుకి ఎంపికైంది. తండ్రితో కలిసి ఇంటికి వస్తుండగా రెండు బైకులమీద వచ్చి దాడిచేసిన దుండగులను ఈమె కరాటే విద్యను ప్రదర్శించి మట్టికరిపించింది. వీరిలో ఒకడు పారిపోగా ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు.

మేఘాలయకి చెందిన స్ట్రిప్లీస్‌మెన్ మిలియం (9) ఓ హంతకుడి బారినుంచి తన సోదరిని కాపాడాడు. తల్లిదండ్రుల్ని, పెద్దసోదరిని హత్యచేసిన దుండగుడి బారినుంచి ఇతడు తన చిన్నక్కను రక్షించాడు. చుట్టుపక్కల వారిని నిద్రలేపి హంతకుడు దొరికిపోయేలా చేశాడు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్‌కుమార్ కనౌజియా (12) ధైర్యంగా దొంగల్ని ఎదిరించాడు. ఒక వేడుకకి హాజరై తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు ఉన్నట్టు బయటినుంచే ఇతడు గుర్తించాడు. పవన్ గట్టిగా కేకలుపెట్టడంతోపాటు దొంగల్లో ఒకడిని గదిలోకి తోసేసి తలుపువేశాడు. మిగతావారు రాడ్లతో కొట్టినా ధైర్యాన్ని కోల్పోలేదు. చివరికి దొంగలు దొరికిపోయారు.

## మృత్యువునే పరిహసించిన సాహస బాలిక

ఎవరైనా అపాయంలో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలో ఉంటే - పెద్దవాళ్ళు సైతం 'మనకెందుకులే ఈ తలనొప్పి వ్యవహారం' - అని తప్పించుకుని పోవడం సర్వసాధారణం. అయితే, ఆ బాలిక అలా భావించక, ప్రాణాలకు సైతం తెగించి అయిదుగురిని మృత్యుముఖం నుంచి కాపాడింది. నీటమునిగిన ఐదుగురు చిన్నారులను రక్షించి సాహసానికి ప్రతీకగా ఆ బాలిక నిలిచింది. బీహార్‌లోని కటియార్ జిల్లా మెర్సంద గ్రామంలో కొద్దిరోజుల క్రితం పన్నెండేళ్ళ రోజీ ఆరా ఓ చెరువు వద్ద ఉన్నప్పుడు - ఆకస్మికంగా చిన్నపిల్లల కేకలు వినిపించగా అటు పరుగెత్తింది. అక్కడ కనిపించిన దృశ్యం చూశాక ఆమెకి ఒక్కక్షణం నోటమాట రాలేదు. వెంటనే ఏమాత్రం ఆలోచించకుండా చెరువులోకి దూకేసింది. తనకన్నా వయసులో చిన్నవారైన ఆరుగురు పిల్లలు నీటిలో మునిగిపోతున్నారని గమనించింది.

వారిని ఎలాగైనా రక్షించాలని ఈదుకుంటూ వెళ్ళి తొలుత మహ్మద్ ఫరాన్ (7) ను ఒడ్డున పడేసింది. తర్వాత మెహక్ ఆరా (6), డాలీఖటూన్ (8), మహ్మద్ జెహన్ (9), మహ్మద్ సమీర్ (8) లను రక్షించింది. ఒకచేత్తో మునిగిపోతున్న చిన్నారులను పట్టుకొని, మరోచేత్తో ఈతకొడుతూ ఎలాగో ఐదుగురిని ఒడ్డుకు చేర్చేసరికి రోజీలో శక్తి సన్నగిల్లింది. అయినా, బలాన్నంతా కూడదీసుకుని ఆరో చిన్నారి ఫర్హాన్ (7) ని రక్షించాలని మళ్ళీ నీళ్ళలోకి దూకింది. అప్పటికే నీళ్ళు తాగేసి బరువెక్కిపోయిన ఫర్హానీని మోస్తూ ఒడ్డుకు

చేర్చేసరికి రోజీ స్పృహతప్పి పడిపోయింది. అప్పటికే గుమికూడిన గ్రామస్థులు రోజీతోపాటు పిల్లలందరినీ ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అయితే, ఫర్హాన్ ప్రాణాలు కోల్పోయింది. ఏడో తరగతి చదువుతున్న రోజీ ఐదుగురి జీవితాలకు ప్రాణం పోసింది. అనన్య ధైర్యసాహసాలు చూసిన గ్రామస్థులందరూ ఆమెను అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె మానవత్వం చూపడంలో ఎంతో ఎత్తుకు ఎదిగిందని, ఆమె సాహసానికి ఏమి ఇచ్చినా తక్కువేనని, జీవితాంతం ఆమెకు రుణపడి ఉంటామని బతికి బయటపడ్డ బాలికల తల్లిదండ్రులు అంటున్నారు.

ఇపుడు ఆ గ్రామంలో అందరూ రోజీ సాహసాన్ని వేనోళ్ళ కొనియాడుతున్నారు. గతంలో జిల్లాస్థాయి ఈతపోటీల్లో పాల్గొన్న అనుభవం ఉన్నప్పటికీ తన ప్రాణాలను లెక్కచేయకుండా పిల్లలను రక్షించేలా ఆమె ఎంతో తెగువ చూపింది. కష్టపడి చదివించి రోజీని ఆర్మీలో చేర్పిస్తానని దినసరి కూలీ అయిన ఆమె తండ్రి గర్వంగా చెబుతున్నాడు. రోజీకి సాహస బాలల అవార్డు ఇవ్వాలంటూ జిల్లా అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

## అమర వరప్రసాదం

ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లాలోని దుర్గమారణ్యంలో పొంచియున్న తీవ్రవాదులను తరిమికొట్టి తన అనుచర గణాన్ని వెంటపెట్టుకొని విజయదరహాసంతో తిరిగి వస్తున్న డిప్యూటీ అస్సాల్ట్ కమాండర్‌ను హఠాత్తుగా సాయుధులైన 70 మంది ఉగ్రవాదులు చుట్టుముట్టారు. ఒక్క క్షణంలో కమాండర్ తన బలాలను, శత్రు బలాలను అంచనా వేసుకున్నాడు. మొండిగా పోరాడితే తనతోసహా ఒక్క జవాను కూడా మిగలరని అతనికి అర్థమైపోయింది. వెంటనే అప్రమత్తమయ్యాడు, ముందుగా తన వారిని రక్షించడం నాయకునిగా తక్షణ కర్తవ్యమని భావించాడు. జవానులను హెలికాప్టరులో ఎక్కమని ఆదేశించి, ఒంటరిగా ముష్కరమూకల మీద విరుచుకుపడ్డాడు. వీరాభిమన్యుడిలా ఎక్కడ చూసినా తానై పరాక్రమంతో విజృంభించాడు. జవాన్లు అందరికీ ఉక్కు కవచంలా మారాడు. జవాన్ల మీద దృష్టి సారించడానికి కూడా ఉగ్రవాదులకు అవకాశం ఇవ్వలేదు.

దుండగులకు కమాండర్ ఒక్కడే కనిపిస్తున్నాడు. అతివేగంగా దూసుకుపోతూ దొరికిన వారిని దొరికినట్లుగా మట్టుపెడుతూ, తనను తాను రక్షించుకుంటూ కమాండర్ వీరవిహారం చేస్తున్నాడు. శరీరంలో తూటాలు దిగిపోతున్నా, రక్తం జలా జలా పారుతున్నా ఒక్కొక్క అవయం రాలిపడుతున్నా శక్తి క్షీణించి, కళ్ళు బైర్లు కమ్ముతున్నా, కమాండర్ తన లక్ష్యాన్ని విడిచిపెట్టలేదు. తన ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నా చివరి జవాను కూడా సురక్షితంగా వెళ్లిపోయేవరకు పోరాటం సాగించాలన్న సంకల్పమే అతనికి ఊపిరిపోసింది. లక్ష్యం పూర్తికాగానే తీవ్ర వేదనను కూడా ఆనందంగా అనుభవిస్తూ జై భారత్ జైజై

భారత్ అంటూ వివశుడై నేలకొరిగాడు. అదే అదనుగా భావించి ఒక్కసారిగా మావోయిస్టులు తమ ఆయుధాలకు పనిచెప్పారు. వీర భారత పుత్రుని దేహము తుత్తునియలైంది. వృత్తి నిర్వహణలో భారతమాత సేవలో తరించినందుకు అతని హృదయం ఆనంద తాండవం చేసింది.

ఆ మహావీరుని వీర మరణాన్ని అమరులంతా అంబరవీధిలో బారులు తీరి తిలకించి, పుష్పవృష్టి కురిపించారు. దుర్భరవార్త విన్న భరతధాత్రి కన్నీరు మున్నీరై విలపించింది. భారతప్రభుత్వం అశోకచక్ర అవార్డునిచ్చి కొంత ఋణం తీర్చుకుంది. ఆ సాహస కమాండర్ స్వతంత్ర భారతావనిలో అశోకచక్ర అవార్డును పొందిన ప్రప్రథమ తెలుగువాడు. ఆ అమరవీరుడు కరణం లీలా వెంకట శ్రీనివాస శ్రీహరి నాగ వరప్రసాద్ బాబు.

"వీరులై ఉండండి ధీరులై ఉండండి.
మనిషి మరణించేది ఒక్కసారి మాత్రమే
నా శిష్యులు పిరికిపందలు కాకూడదు"

అనే వివేకానంద సూక్తిని నరనరాల్లో జీర్ణింపచేసుకొని కడదాకా పాటించిన ఏకలవ్య శిష్యుడు వరప్రసాద్.

2013 ఏప్రియల్ 16వ తేదీన అర్ధరాత్రి దాటిన తర్వాత శాంతిభద్రతల రక్షణ కోసం వీరోచితంగా పోరాడిన వరప్రసాద్‌ను భారత ప్రభుత్వం 'అశోకచక్ర' ను ప్రకటించింది. 2014 జనవరి 26వ తేదీన ఆయన తండ్రి వెంకటరమణకు ఆ బిరుదును అందజేసింది. రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డును అందుకున్న తండ్రి పుత్రోత్సాహంతో ఆనందోత్సాహాలకు లోనయ్యాడు. ఆయన కళ్లు చెలమలయ్యాయి. యావత్ భారతదేశం ఆ సన్నివేశాన్ని టి.వి.లో ప్రత్యక్షంగా చూస్తూ ఆ అమరవీరుని సాహసాన్ని వేనోళ్ల కీర్తించి జోహారులర్పించింది.

"శాశ్వతమైన దానికోసం
క్షణికమైన వాటిని త్యజించండి
అనంతమైన ఆనందాన్ని పొందాలంటే
అల్పసుఖాలను వదిలివేయండి."

అనే వివేకానందుని ప్రబోధమే వరప్రసాద్ జీవనగమ్యం అయింది.

## ఇలా చేయండి

### ధైర్యం వారోత్సవాలు : విద్యార్థులలో భయాన్ని తొలగించే ప్రక్రియ

1. ప్రతి పీరియడ్ చివరన పాఠ్యాంశాలలో వారికి ఉండే సందేహాలను అడుగుటకు (సందేహాలు పోగొట్టి ధైర్యాన్ని పెంపొందించటానికి సమయం) 5 ని॥లు కేటాయించి అలా అడిగినవారికి సరియైనసమాధానాలు ఇచ్చి వారు మరికొన్ని అడిగేలా ప్రోత్సహించాలి.

2. అసెంబ్లీలో ప్రతిరోజూ ఒకరిచేత 'వార్తలు' మరొకరిచేత 'నేటి ఆలోచన' (Thought of the Day) మరొకరిచేత 'ప్రార్థన' చెప్పించాలి.

3. బృందాలవారీ చర్చ, సెమినార్‌లో ప్రతి ఒక్కరికి అవకాశం ఇచ్చి అందరూ నిర్భయంగా మాట్లాడేలా చూడాలి.

4. ఎవరైనా తప్పు చేసినపుడు ఆ విషయాన్ని ఉపాధ్యాయులకు లేదా విద్యార్థులందరికీ ధైర్యంగా చెప్పేలా వారిని ప్రోత్సహించాలి. అలా చేసిన వారిని ప్రశంసించాలి. ఉదా॥ ఒక విద్యార్థి తప్పు జరగడాన్ని చూసినపుడు ఆ విద్యార్థి వచ్చి నిర్భయంగా ఉపాధ్యాయుడికి జరిగిన విషయాన్ని నిజాయితీగా చెప్పినపుడు ఆ విద్యార్థిని అసెంబ్లీలో అభినందించడం వల్ల ఇతర విద్యార్థులు కూడా అదేవిధంగా చేస్తారు.

5. అలాగే విద్యార్థి తాను చేసిన తప్పును ధైర్యంగా ఒప్పుకొనే లక్షణం పెంపొందించాలి.

   ఉదా : క్లాస్‌లో ఎవరిదైనా ఒక వస్తువు పోతే తీసినవారు వారంతట వారే తప్పును ఒప్పుకొని ఆ వస్తువును తిరిగి యిచ్చేలా ప్రోత్సహించాలి.

**సూక్తి**

కష్టాలు వచ్చినప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కోవడమే ఉత్తమమైన మార్గం.

# 4 లక్ష్యాన్ని కలిగి ఉందాం

**I. ప్రధాన విలువ**

జీవననైపుణ్యాలు

**II. ఉప విలువ**

లక్ష్యం కలిగిఉండడం - కృషిచేయడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకోగలగాలి.
- లక్ష్యసాధనకు కృషి చేయగలగాలి.
- లక్ష్యాన్ని సాధించగలగాలి.

## IV. ఉపోద్ఘాతం

ప్రతి మనిషికి జీవితంలో లక్ష్యం అనేది చాలా ముఖ్యమైనది. లక్ష్యాన్ని ఏర్పరచుకున్నప్పుడే దానిని సాధించాలన్న పట్టుదల పెరిగి సాధించడానికి కృషిచేస్తారు. లక్ష్యాన్ని సాధించడం వల్ల తనమీద తనకు నమ్మకం, ఆత్మవిశ్వాసం ఏర్పడతాయి. తమ సామర్థ్యాలను తెలుసుకోగలుగుతారు. లక్ష్యం లేని మనిషి జీవితం చుక్కాని లేని నావలాంటిది. ఎటువైపు పోతుందో, వారు ఏమౌతారో తెలియదు. ప్రతిఒక్కరు తమ అభిరుచులను, తమలోని శక్తిసామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి, లక్ష్యసాధనకు కృషిచేయాలి. లక్ష్యసాధనలో ఆటంకాలు ఎదురైనా నిరాశానిస్పృహలకు లోనుకాకుండా నిరంతర కృషితో అనుకున్న లక్ష్యాలను సాధించాలి.

## V. విషయం

### సంఘటన - 1

ఒక యువకుడు భారతదేశం తరపున క్రికెట్ ఆడుతున్నాడు. అతనికి ఓసారి తూర్పు ఆఫ్రికాలో క్రికెట్ ఆడే అవకాశం వచ్చింది. అక్కడ తనకు తెలియకుండానే ఎవరో తెచ్చుకున్న స్వెట్టర్ వేసుకున్నాడు. ప్రోటోకాల్ తెలీదతనికి. ఆ స్వెట్టర్ అధికారికంగా భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించేవారు మాత్రమే వేసుకోవాలి. స్వెట్టర్‌లో అతన్ని చూసిన ఏకనాథ్ సోల్కర్ (జట్టు మేనేజర్) ఈ స్వెట్టర్ వేసుకోవడం అన్నది అంత సులువైన విషయం కాదు అని చెప్పి పంపాడు. కంగారుపడి అతను ఆ స్వెట్టర్‌ను అక్కడే వదిలేసాడు. కానీ ఆ స్వెట్టర్‌ను వేసుకునే హక్కును ఏదో ఒకరోజు సాధించి తీరుతాను అనే లక్ష్యం ఏర్పరచుకున్నాడు. మరింత అంకితభావంతో కష్టపడ్డాడు, సాధించాడు.

బొంబాయిలో భారతజట్టు ఆడే టెస్ట్‌మ్యాచ్‌లో ఏక్‌నాథ్ సోల్కర్ దగ్గరకు వెళ్ళి "ఇప్పుడీ స్వెట్టర్ నేను వేసుకోవచ్చా" అని చమత్కరించాడు. అపుడు అతను భారతకెప్టెన్ ప్రోటోకాల్ ప్రకారం ఆ స్వెట్టర్ అతనే వేసుకోవాలి. అతనే హర్యానా హరికేన్ కపిల్‌దేవ్!

### సంఘటన - 2

అతను అప్పటికే బ్రిటన్ ప్రధాని, యుద్ధకాలంలో విజేతగా నిలిచాడు కాని అనంతరం ఎన్నికల్లో ఓడిపోయాడు. బాధపడలేదు. ఏం చేశాడు? మరో నిర్దిష్టలక్ష్యం ఏర్పరచుకున్నాడు. రచనలు చేయడం ప్రారంభించాడు. మంచి చిత్రకారుడూ అయ్యాడు. ఆయన రాసిన పుస్తకానికి నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఆయనే విన్‌స్టన్ చర్చిల్.

శ్రమించేవారు తాత్కాలిక ఓటములకు, అవమానాలకు తలొగ్గరు.

### సంఘటన - 3

ఫ్లోరెన్స్ చాడ్‌విక్ అనే ఆమె జూలై 4 1952 లో కాటలీనా చానెల్‌ను ఈదుకుంటూ దానిని దాటిన మొట్టమొదటి మహిళగా పేరు సంపాదించుకుంది. ఆమె అంతకుముందే ఇంగ్లీషు చానెల్‌ను ఈది విజయం సాధించింది.

కాటలీనా చానెల్‌ను ఈదిన మొదటిసారి ఆమెకు వాతావరణం అనుకూలించలేదు. దట్టంగా కమ్ముకున్న పొగమంచునూ, ఎముకలు కొరికే చలినీ, సొరచేపలనూ ఆమె అడ్డంకులుగా భావించకుండా వాటితో పోరాడింది. ఆమె ఒడ్డుకు చేరుకోవాలని ప్రయత్నించింది కానీ తన కళ్ళజోడులోంచి చూసిన ప్రతిసారీ ఆమెకు దట్టమైన పొగమంచు తప్ప మరేదీ కనపడలేదు. ఒడ్డు కనిపించకపోయేసరికి, ఆమె తన ప్రయత్నాన్ని విరమించుకుంది.

తను ఒడ్డునుంచి అరమైలు దూరంలో ఉండగా ప్రయత్నం విడిచిపెట్టిందని తెలుసుకున్నప్పుడు చాడ్‌విక్ చాలా విచారించింది. ఆమె ప్రయత్నాన్ని విడిచిపెట్టటానికి కారణం తన లక్ష్యం కళ్ళకి కనిపించకపోవడమే తప్ప ఆమెకి ధైర్యసాహసాలు లేకపోవం వల్ల కాదు. ఇంకే కారణంచేతా ఆమె వెనక్కి తగ్గలేదు. "నేను సాకులు చెప్పి తప్పించుకోవడం లేదు". నాకు ఒడ్డు కనిపించిఉంటే, తప్పక నేను విజయం సాధించేదాన్నే" అన్నదామె.

రెండునెలల తరువాత, ఆమె మళ్ళీ వెళ్ళి కాటలీనా చానెల్‌ను ఈది దాటింది. ఈసారి కూడా వాతావరణం సహకరించలేదు. కానీ ఆమె దృష్టంతా లక్ష్యంమీదే ఉండటంచేత, విజయం సాధించటమేకాక పురుషుల రికార్డును అధిగమించి రెండు గంటల తక్కువ సమయంలో కొత్త రికార్డు సృష్టించింది.

## సంఘటన - 4

అతను జపాన్ లో 'సేక్' అనే ఆల్కహాల్‌ను తయారుచేసే కుటుంబంలో పుట్టాడు. జపాన్‌లో మతపరమైన విందుభోజనాలు జరుగుతున్నప్పుడు ఈ మత్తుపదార్థాన్ని సేవిస్తారు. అతనికి 11 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడే దీని తయారీ బాధ్యతలు అతనిపై పడ్డాయి. "నీవు ఈరోజునుంచే పనిచేయడం ప్రారంభించాలి. నీవు ఈ ఇంటికి పెద్దకొడుకువి పనిచేయక తప్పదు" అని ఆ అబ్బాయికి తల్లిదండ్రులు చెప్పారు. అప్పుడు అతనో నిర్దిష్ట లక్ష్యం పెట్టుకున్నాడు పనిచేయాలని, అయితే 'సేక్' తయారీ పనులు కాదు. జీవితంలో రికార్డ్‌ని బ్రేక్ చేసే పనులు చేయాలని, సక్సెస్‌ను షేక్‌చేసే పనులు చేయాలని చివరకు సాధించాడు. అతనే ప్రఖ్యాత సోనీ కంపెనీ అధినేత అకియొ మోరిటా.

## సంఘటన - 5 : ఎవరెస్టు అంత ఎత్తుకు ఎదిగారు...

తెలుగు బాలలు మాలావత్ పూర్ణ స్వేరోస్..! 13 సంవత్సరాల వయసుగల అమ్మాయి. ఏకంగా ఎవరెస్టు శిఖరాన్నే అధిరోహించింది. నిజామాబాద్ జిల్లాలోని పేద వ్యవసాయ కూలీల కూతురయిన పూర్ణ 9వ తరగతి చదువుతోంది. మాలావత్ పూర్ణతో పాటు సాధనపల్లి ఆనంద్ కూడా ఎవరెస్టు శిఖరాన్ని అదిరోహించి తెలుగుజాతికే గర్వకారణం అయ్యారు. అందులోను పూర్ణ అయితే పదమూడేళ్ల వయసులోనే అంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించి ప్రపంచ రికార్డును సృష్టించారు.

అవకాశాలు వస్తే ఆకాశమే హద్దుగా అద్భుతాలు సాధించగలమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు నిరూపించారు. మారుమూల తండాకు చెందిన విద్యార్థిని మాలావత్ పూర్ణ ఏజెన్సీలోని ఎస్సీ విద్యార్థి సాధనపల్లి ఆనంద్‌కుమార్‌లు ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి సరికొత్త చరిత్ర సృష్టించారు. శిఖరాగ్రంపై జాతీయపతాకాన్ని ఎగురవేసి భారత కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పారు. 13 సంవత్సరాల 11 నెలల వయస్సు గల మాలావత్ పూర్ణ ఎవరెస్ట్‌ను అధిరోహించిన అతి పిన్నవయస్కురాలిగా ప్రపంచ రికార్డును తిరగరాసింది. ప్రభుత్వ విద్యాసంస్థల తరపున తొలిసారిగా ఈ ఘనత సాధించిన ఖ్యాతి కూడా ఆనంద్ కుమార్ (18) పూర్ణలకే దక్కింది.

**భువనగిరి కొండ నుంచి మొదలు :** విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాలలో తీర్చిదిద్దే లక్ష్యంతో గురుకుల విద్యాలయాల సంస్థ, తెన్‌జింగ్ నార్గే అవార్డు గ్రహీత బి. శేఖర్‌బాబుతో పర్వతారోహణలో శిక్షణ ఇప్పించింది. తొలుత నల్గొండ జిల్లా భువనగిరి కొండ వద్ద శిబిరాన్ని నిర్వహించారు. అందులో మెరికల్లాంటి వారిని గుర్తించి వారికి డార్జిలింగ్, లడక్‌లలో శిక్షణ ఇప్పించారు. గత ఏడాది రెండు బృందాలను హిమాలయాలకు పంపగా 13 మంది విద్యార్థినీవిద్యార్థులు మౌంట్ రెనాక్‌ను, మరో 9 మంది పాన్‌గాంగ్‌ను అధిరోహించారు. గురుకుల విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించిన సంస్థ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రపంచంలో ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోధించే లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి పూర్ణ, ఆనంద్‌కుమార్‌లు ముందుకొచ్చారు. శేఖర్‌బాబు ఆధ్వర్యంలో వారికి కఠోర శిక్షణ ఇప్పించారు. ఎవరెస్ట్ అధిరోహణకు అయ్యే రూ.68 లక్షలకు ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికల నిధుల నుంచి ప్రభుత్వం కేటాయించింది.

2014 సం॥ ఏప్రిల్ 10న పూర్ణ, ఆనంద్‌ల యాత్ర మొదలైంది. మంచుపర్వతాలపై దట్టమైన చలిని తట్టుకునేందుకు 20 కిలోల దుస్తులు ఇతర కిట్లను ధరించి మొక్కపోని దీక్షతో వారు ముందుకు సాగారు. సగం దూరం వెళ్లాక వారికి సమీపంలోని నేపాల్ వైపు గల మంచుపర్వతం కూలి 16 మంది మరణించారు. అయినా, విద్యార్థుల ఆత్మవిశ్వాసం చెదరలేదు. 7100 మీటర్ల ఎత్తుకు వెళ్లాక పూర్ణకు ప్యాకేజీ ఆహారం వికటించింది. ఆమెను శేఖర్‌బాబు, ఇతర బృందం అక్కడినుంచి కిందికి తీసుకొచ్చే ప్రయత్నం చేయగా అందుకు ఆమె ససేమిరా అన్నారు. తాను శిఖరాన్ని చేరతానని పట్టుబట్టి బయల్దేరారు. చివరి 148 మీటర్ల దూరాన్ని రెండు గంటల వ్యవధిలోనే పూర్ణ చేరుకోవడం ఇతర పర్వతారోహకులను విస్మయపరిచింది. మొత్తం 29035 అడుగుల ఎత్తైన పర్వతం పైకి వీరు 2014 మే 25 తెల్లవారుజామున విజయవంతంగా చేరుకున్నారు. గతంలో పద్నాలుగేళ్ల నేపాలీ బాలిక పేరిట ఉన్న రికార్డును పూర్ణ తిరగరాసింది. అతిచిన్న వయస్సులో ఎవరెస్ట్ అధిరోహించిన బాలికగా రికార్డు సృష్టించింది. ఎవరెస్ట్ చేరిన వెంటనే విద్యార్థులు జాతీయపతాకాన్ని ఎగురవేశారు. బీ.ఆర్. అంబేద్కర్, దివంగత ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్‌ల చిత్రపటాలను ఆవిష్కరించారు.

ఈ విజయాన్ని గురించి వారితో మాట్లాడినపుడు వారి స్పందనలు :

**మలావత్ పూర్ణ :** ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ పర్వతంపై జాతీయ పతాకంతోపాటు తెలంగాణ జెండాను కూడా ఎగురవేశానని ఎవరెస్ట్ ఎక్కిన అత్యంత పిన్నవయస్కురాలు మలవత్ పూర్ణ తెలిపింది. తెలంగాణ రాష్ట్రానికి చెందని అమ్మాయినంటూ గర్వంగా పరిచయం చేసుకున్న పూర్ణ అవకాశం లభిస్తే, సరైన మద్దతు ఇస్తే అమ్మాయిలు చేయలేనిది ఏమీ లేదని చెప్పింది. ఇప్పుడు తాము ఉత్తర దిశనుంచి ఎవరెస్ట్ ఎక్కామని, మరోసారి అవకాశం వస్తే దక్షిణ దిక్కునుంచి ఎవరెస్ట్ ఎక్కుతానని తెలిపింది. 8848 మీటర్ల ఎత్తైన ఎవరెస్ట్‌పై నిలబడ్డప్పుడు స్వర్గంలో నడుస్తున్నట్లు అనిపించిందని, ఆనందంతో కళ్లనుంచి నీళ్లు కారిపోయాయని చెప్పింది. 'మా నాన్న దేవిదాస్, అమ్మ లక్ష్మి ఇద్దరూ వ్యవసాయ కూలీలు. ఎవరెస్ట్ అధిరోహణ గురించి

చెప్పినప్పుడు బాగా మద్దతు ఇచ్చారు. బేస్ క్యాంపునుంచి ఎవరెస్ట్‌పైకి వెళుతుంటే ఆరు శవాలు కనిపించాయి. చాలా భయం వేసింది' అని 13 సంవత్సరాల పూర్ణ చెప్పింది. తొమ్మిదో తరగతి చదువుతున్న తన ప్రస్తుత లక్ష్యం పదోతరగతి పరీక్షలేనని, ఆతర్వాత ఐపీఎస్ కావాలని, పేదలకు సేవ చేయాలని ఉందని ఆమె తెలిపింది.

**సాధనపల్లి ఆనంద్ :** ఎవరెస్ట్ అధిరోహించిన మొదటి దళితుడు 19 ఏళ్ల ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ... "పేదలకు అవకాశం లభిస్తే ఎంత ఎత్తుకైనా ఎదగగలరని అన్నాడు. ఎవరెస్ట్‌పై కనిపించిన అత్యద్భుతమైన దృశ్యం టీవీల్లోకానీ, కంప్యూటర్లలో కానీ కనిపించదన్నాడు. 'మా నాన్న కొండలరావు సైకిల్ మెకానిక్. ఆ అమ్మ వ్యవసాయ కూలీ. ఎవరెస్ట్ ఎక్కేప్పుడు శవాలు కనిపించాయి. ఇలాగే నాకూ జరిగితే? అన్న ఆలోచన రాగానే గుండె ఝల్లుమంది. దిగేప్పుడు తాడు తగిలి కిందపడ్డాను. అదృష్టం బాగుండి బ్రతికిపోయాను' అని వివరించాడు. ఇంటర్ పరీక్షలపైనే ప్రస్తుతం తన ధ్యాస ఉందని చెప్పాడు. తమకు మద్దతిచ్చి, తమలో స్ఫూర్తి నింపిన ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్‌కు, తమలాగే సంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు తమ ఘనతను అంకితమిస్తున్నామని పూర్ణ, ఆనంద్ తెలిపారు.

## VI. (అ) ఆలోచించండి – ప్రతిస్పందించండి

1. మొదటి సంఘటనలో కపిల్‌దేవ్‌కి నిర్దిష్ట గమ్యం లేకుంటే ఏమయ్యుండేది? ఆ సంఘటనను అవమానంగా స్వీకరించి ఏకనాథ్ సోల్కర్‌ని తిట్టిఉంటే ఏమయ్యుండేది?
2. రెండవ, మూడవ సంఘటనలలో తమ లక్ష్యం నెరవేరలేదని వారు ఏం చేశారు? అలా చేయకపోతే ఏమయి ఉండేది?
3. పూర్ణ, ఆనంద్‌లు ఎవరెస్ట్‌ను ఎక్కగలగడానికి గల కారణాలేమి?
4. పై సంఘటనల ద్వారా మీరు గ్రహించిన విషయాన్ని చెప్పండి?
5. ప్రతి మనిషికీ లక్ష్యం ఉండాలా? ఎందుకు?
6. ఏర్పరచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ఏమిచేయాలి?

## (ఆ) ఆచరించండి – అనుభవాలను చెప్పండి

- మీ జీవిత లక్ష్యం ఏమిటి? దానిని ఎంచుకోవడానికి గల కారణమేమి? దానిని ఏవిధంగా సాధించాలను కుంటున్నారు? దానిని సాధించడానికి మీరు చేసే ప్రయత్నాలేమిటి?

## నాలో నేను చేసుకొనే మార్పు

1. ప్రతిరోజు పడుకునేముందు నేను నా అభివృద్ధికై చేసిన మంచిపనులు మరియు ఆటంకం కలిగించే చెడు పనులను స్మృతివర్ధిని చేసుకుని నాలోని లోపాలను సవరించుకుని గొప్ప వ్యక్తిగా ఎదుగుతాను.
2. ప్రతిరోజు స్మృతివర్ధిని చేస్తాను. డైరీ వ్రాస్తాను.
3. దూరదృష్టితో, సృజనాత్మకంగా ఆలోచిస్తాను.
4. ఎల్లప్పుడు అనుకూలమైన ఆలోచనలు చేస్తాను.
5. నా కోరికలు ఎప్పుడూ లక్ష్యానికి తోడ్పడే విధంగా వుంటాయి.
6. నిజాయితీగా, నిర్దిష్టంగా, స్పష్టంగా, సరళంగా సభ్యతగా మాట్లాడుతాను.
7. నా లక్ష్యసాధనకు తోడ్పడే పనులు చేస్తాను.
8. ఏరోజు పనులు ఆరోజే పూర్తిచేస్తాను.
9. మంచి నడవడిక, నీతి, నిజాయితీ, ప్రేమ, శాంతి అలవాటు చేసుకుంటాను.
10. నా మనసులో తప్పు ఒప్పులను నేను ప్రశ్నించుకుని మంచి ప్రవృత్తులను పెంచుకుంటాను.
11. ఏమిటి? ఎందుకు? ఎప్పుడు? ఎక్కడ? ఎవరు? ఎలా అనే ప్రశ్నించే తత్వాన్ని పెంచుకుంటాను.
12. నేను 'గొప్పవాడనవుతాను' అనే ఆత్మవిశ్వాసాన్ని ధైర్యాన్ని పెంచుకుంటాను.

## VII. తెలుసుకోండి

పరిజ్ఞానం అనేది మీ గమ్యాన్ని చేరుకోవడానికి సహాయం చేస్తుంది. మీకు మీ గమ్యం ఏమిటని తెలిసినపుడే దానిని చేరుకోవడం సాధ్యం అవుతుంది.

మీరు కర్నూలు బస్టాండుకు వెళ్ళారు. హైద్రాబాదు వెళ్ళాలి. 1వ నెంబరు ప్లాట్‌ఫాం దగ్గరకు వచ్చారు. బస్సులు వస్తున్నాయి. పోతున్నాయి. ఖాళీగా లేవు. విసుగ్గా ఉంది. ఆప్రక్కనే 3వ నెంబరు ప్లాట్‌ఫాం మీద అనంతపురం పోయే బస్సుంది. అంతా ఖాళీనే. సౌకర్యంగా ఉంటుందని అనంతపురం బస్సెక్కి కూర్చుంటావా? ఇరుకైపోయినా సరే హైద్రాబాదు బస్సే ఎక్కుతావా? నీ లక్ష్యం హైద్రాబాద్ చేరటం అయితే, ఎంత ఇబ్బంది అయినా హైద్రాబాద్ బస్సే ఎక్కుతావు.

బస్సు ప్రయాణం లాంటి చిన్నపనిలో కూడా లక్ష్యం పెట్టుకునే పని చేస్తున్నావుకదా! అదొక్కటే కాదు. మనం చేసే అతి చిన్నపనికి కూడా లక్ష్యాలుంటాయి చూడండి.

| | | |
|---|---|---|
| పళ్ళెంలో అన్నం ఎందుకు పెట్టుకున్నావు (పని) | – | తినటానికి (లక్ష్యం) |
| ఎందుకు తింటున్నావు? (పని) | – | ఆకలి తీరటానికి (లక్ష్యం) |
| అడుక్కునే మనిషికి రూపాయెందుకు ఇచ్చావు? (పని) | – | పుణ్యం వస్తుందని (లక్ష్యం) |

అలవాటుగా చేసే వాటిలో కూడా లక్ష్యాలుంటాయి. లక్ష్యం నెరవేరుతున్నంతసేపు, "ఒక లక్ష్యం అక్కడుందని" గుర్తించము. తేడా వచ్చినప్పుడు అనగా లక్ష్యం చేరకపోతే, అప్పుడు లక్ష్యం తప్పిందని గుర్తొస్తుంది.

పళ్ళు తోమేటప్పుడుగానీ, బట్టలు వేసుకునేప్పుడుగానీ యిలానే ఉంటుంది. ఇంతింత చిన్నపనులక్కూడా లక్ష్యాలుంటే, **మన జీవితం అంతటికీ లక్ష్యం ఉండక్కర్లేదా?**

నాకు ఏ లక్ష్యాలు లేవంటూ అంటూంటారు కొంతమంది. ఒక్కరోజులోనే కొన్ని వందల లక్ష్యాలుగల మనిషి, తన జీవితానికి లక్ష్యం లేదనటం సరయింది కాదు.

జీవితంలో ఏలక్ష్యం పెట్టుకోవాలనేది తన యిష్టాయిష్టాలనుబట్టీ, తను ఉన్న పరిస్థితుల్నిబట్టీ, తనకున్న వివేకాన్నిబట్టి నిర్ణయం చేసుకోవాలి.

ప్రతివారి జీవితంలో ఒక స్థిరలక్ష్యం ఉండాలి. స్పష్టమైన లక్ష్యమన్నది బ్రహ్మాండమైన ప్రేరకశక్తిగా పనిచేస్తుంది కాబట్టి ఏర్పరచుకునే లక్ష్యం ఉన్నతమైనదిగా, ఉన్నత ఆశయాలను కలిగిఉండాలి.

విజయం సాధించేందుకు కావలసిన శక్తిసామర్థ్యాలు మనదగ్గర ఉన్నప్పటికీ సరైన లక్ష్యం లేకపోతే సమయం, శక్తి, ధనం అన్నీ వృథా అయిపోతాయి. కనుక లక్ష్యసాధనకు ఖచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. లక్ష్యాన్ని చేరేందుకు గల అవకాశాలను అంచనావేయాలి.

లక్ష్యం ఏర్పరచుకుంటే సరిపోదు. దాన్ని చేరుకునేందుకు మార్గాన్ని స్పష్టం చేసుకోవాలి. లక్ష్యాన్ని చేర్చే స్పష్టమైన మార్గం లేకపోతే, మార్గనిర్దేశనం లేకపోతే మనం ఏదీ సాధించలేం.

**లక్ష్యసాధనకు తోడ్పడే అంశాలు :**

1. **బలమైన కోరిక :** లక్ష్యం చేరదల్చుకున్న వారికి, ఆ లక్ష్యానికి సంబంధించిన పని బలమైన కోరికతో మొదలవ్వాలి.
2. **ఏకాగ్రత :** మన దృష్టిఅంతా ఆ పనిమీదే కేంద్రీకృతం కావాలి.
3. **పట్టుదల :** పట్టుదలగలవాడు శ్రమను లెక్కచేయడు! శ్రమించేవాడు ఎన్ని ఆటంకాలున్నా పురోగమించగలడు" కావున లక్ష్యసాధనకు పట్టుదల చాలా అవసరం.
4. **ఓర్పు :** ఎన్ని ఆటంకాలెదురైనా లక్ష్యాన్ని వీడక శ్రమించడానికి ఓర్పు అవసరం.
5. **నిరంతర కృషి :** అనుకున్న లక్ష్యాన్ని సాధించేవరకు నిరంతరం శ్రమించాలి. కష్టే ఫలి అన్నారు పెద్దలు. కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుంది.

లక్ష్యం సాధించడానికి మీలోని ఆయుధాలు :

1. మీ తెలివితేటలు
2. మీ కష్టపడే గుణం
3. మీ పాజిటివ్ దృక్పథం

4. మీలోని మంచితనం
5. మీలోని క్రియేటివిటీ ఏదైనా కావచ్చు.

మీరు ఏం అనుకుంటే అదే అవుతారు. బంతిని ఎంత బలంగా గోడకు కొడితే అంతే బలంగా వెనక్కివస్తుంది. మీరూ జీవితంలో ఏం కావాలనుకుంటున్నారో ఎంత బలంగా అనుకుంటే అంత బలంగా ఎదుగుతారు. అంత ఉన్నతస్థితికి ఎదుగుతారు. అంత సక్సెస్ సాధిస్తారు. అంతా మీరు అనుకోవడంలోనే ఉంది. మీరు నిర్దిష్ట లక్ష్యం ఏర్పరచుకోవడంలోనే ఉంది.

అబ్దుల్ కలాంగారు ఇలా అన్నారు. యువతా కలలు కనండి. కలలను సాకారం చేసుకోండి. ఏదో ఒక పని చేసుకుంటూ బతకడంలో తప్పులేదు, గౌరవభంగము కాదు. కాని మనిషిజన్మ ఎత్తినందుకు పుట్టలోని చెదల్లాకాకుండా ఏదోఒక ఉన్నతస్థితికి చేరుకునేందుకు కృషి చేయడం ఉత్తమం. అందరిలా కాకుండా ఉన్నన్నినాళ్ళు ఒక ప్రత్యేకతతో బ్రతకాలి. అందుకే మీరు ఒక్కసారి మీ మనసులో ఇలా అనుకోండి.

- నా లక్ష్యం ఏమిటి?
- నా లక్ష్యసాధనకు ఎదురయ్యే అవరోధాలు ఏమిటి?
- నేను ఏం చేస్తున్నాను?
- నాకు ముఖ్యమైన లక్ష్యం ఉందా?
- ఉంటే అదేంటి?

మన ఉన్నతి... ప్రగతి మనం నిర్దిష్ట గమ్యాన్ని (లక్ష్యాన్ని) ఏర్పరచుకోవడంలో ఉంది. అందుకు వేసుకొనే పటిష్ఠమైన మార్గంలో ఉంది. ఆ లక్ష్యాన్ని చేరుకోగలమన్న ఆత్మవిశ్వాసంలో ఉంది. అయితే ఆ మార్గం స్పష్టం కావాలంటే మనం ఎంచుకున్న ఈ లక్ష్యంపైన సాధ్యాసాధ్యాలపైనా స్పష్టమైన అవగాహన కావాలి - అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి.

**సూక్తి**

జీవితంలో ఒక లక్ష్యం కలిగిఉండడమే గొప్ప సంపదతో సమానం - కార్లైల్

**సూక్తి**

జీవితంలో ఒక లక్ష్యాన్ని కలిగిఉండు.
దాని సాధనకు శాయశక్తులా ప్రయత్నించు.
- స్వామి వివేకానంద

# 5 సామాజిక ఆస్తులను కాపాడుకుందాం

**I. ప్రధాన విలువ**

బాధ్యతలు నిర్వర్తించడం – కర్తవ్య పాలన

**II. ఉప విలువ**

సామాజిక ఆస్తుల పరిరక్షణలో మన బాధ్యతలను గుర్తించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- సామాజిక ఆస్తులను పరిరక్షించాలనే భావనను కల్గియుండడం.
- సామాజిక ఆస్తులను కాపాడడంలో తమవంతు బాధ్యత వహించగలగడం.

**IV. ఉపోద్ఘాతం**

సమాజంలోని ఎన్నో సంస్థలు మానవుల అవసరాలు తీర్చడానికి ఉపయోగపడతాయి. ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థలను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం, బాధ్యత కూడా. అయితే ఈమధ్యకాలంలో ప్రజోపయోగ సంస్థలకు – వస్తువులకు నష్టం వాటిల్లుతోంది. వీటిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది కాబట్టి వీటిని అరికట్టాల్సిన ఆవశ్యకత గురించి, మన బాధ్యత గురించి కర్తవ్యం గురించి తెలుసుకుందాం.

## V. విషయం

### సంఘటన - 1

అది రంగాపురం గ్రామం. ఆ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉన్నది. ఇక్కడ 7వ తరగతిదాకా ఉంది. పక్కా భవనం ఉంది. గ్రామంలోని బాలబాలికలు ఈ పాఠశాలలోనే చదువుకుంటున్నారు. పాఠశాల సమయం అయిపోగానే పిల్లలు, ఉపాధ్యాయులు వెళ్ళిపోతారు. వారు వెళ్ళిపోగానే బడి పేకాట రాయుళ్ళ నిలయమవుతుంది. రాత్రి పశువులను కూడా పాఠశాల ఆవరణలోనే కట్టివేస్తుంటారు. మరికొంతమంది పాఠశాల ఆవరణనే బహిర్భూమిగా కూడా వాడుకుంటున్నారు. ఉదయానికి పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా మారి చిందర వందరగా ఉంటుంది. ఈ విషయం గురించి ఆ గ్రామంలో పట్టించుకున్న నాథుడే లేదు.

### సంఘటన - 2

ఈమధ్యకాలంలో ఒక రాజకీయపార్టీ బందుకు పిలుపిచ్చింది. తమవారికి అన్యాయం జరిగిందని ఆపార్టీ కార్యకర్తలు ప్రభుత్వానికి చెందిన ఆర్.టి.సి. బస్సులపై విధ్వంసానికి దిగారు. ఆర్.టి.సి.బస్సుల అద్దాలు పగులగొట్టడం, బస్సులకు నిప్పంటించడం వంటి చర్యలు చేపట్టారు. దాంతో రాష్ట్రంలోని బస్సులన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

### సంఘటన - 3 : మీరు ఎప్పుడైనా గమనించారా?

కొందరు బస్సుల్లో, రైళ్ళలో ప్రయాణం చేస్తున్నప్పుడు సీట్ల పక్కనున్న కిటికీలకు అసభ్యకరమైన పదాలు రాయడం, బొమ్మలు గీయడం, సీట్లపైన, సీట్లవెనకాల కూడా రాయడం, సీట్లను చించడం లాంటివి చేస్తుంటారు. సీట్లపక్కనున్న కిటికీలకు రాసిఉన్న వాక్యాలను, నినాదాలను (పొగత్రాగరాదు, స్త్రీలను గౌరవించాలి.... లాంటివి) బ్లేడ్‌తో తుడపడం వంటివి చేస్తారు.

ఇవే కాకుండా బస్సులో, రైళ్ళలో వచ్చే తినుబండారాలు కొనుక్కొని తిని వాటి తొక్కలను మనం కూర్చునే సీట్ల కిందనే పడేస్తారు. మంచినీటి పాకెట్స్, టీ గ్లాసులు (ప్లాస్టిక్), పండ్లతొక్కలు, చిత్తుకాగితాలు, బస్సు టికెట్స్ అక్కడే వేస్తారు. ఇంకా పొగతాగి బస్సులో ఉన్నవారికి ఇబ్బంది కల్గించడం. తంబాకు తిని ఉమ్మడం వంటివి చూస్తుంటాం. బస్సు, రైళ్ళు ఎవరి ఆస్తులు? ఎవరివి ఎవరు నాశనం చేస్తున్నారు? ఆలోచించండి.

ఏదైనా ఒక వస్తువును, భవనాన్ని లేక వాహనాలను ధ్వంసం చేస్తున్నప్పుడు ఆ వస్తువు/ఆస్తి ఎందరి శ్రమతో తయారయింది అని, ఎంత శ్రద్ధతో, ఎన్ని వనరులను ఉపయోగించి ఆ వస్తువులను తయారుచేసి ఉంటారు – ఆలోచించండి. విధ్వంసం చేయగలం కాని ఆ వస్తువును తయారుచేయగలమా? ఆలోచించండి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. సామాజిక ఆస్తులు అంటే ఏమిటి? అవి ఎవరివి?
2. పై సంఘటనలు విన్నారు కదా! ఇలాంటి సంఘటనల పట్ల మీరు ఎలా స్పందిస్తారు?
3. బంద్ జరిగితే ఎవరెవరు నష్టపోతారు? మనం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటాము?
4. సమాజంలోని వ్యక్తులందరికీ సంబంధించిన ఆస్తులు ఏవేవి? వాటిని మనం ఎందుకు కాపాడుకోవాలి?
5. "సామాజిక ఆస్తులను ధ్వంసం చేయడమంటే మన ఆస్తులను మనమే ధ్వంసం చేసుకున్నట్లు" - చర్చించండి.
6. బాధ్యతగల పౌరుడు ఏమి చెయ్యాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీచుట్టుప్రక్కల సమాజంలో ప్రజలందరికీ సంబంధించిన ఆస్తులు ఏమేమి ఉన్నాయో గుర్తించండి. అవి ఎలా ఉన్నాయో తెలపండి.
- సామాజిక ఆస్తుల పరిరక్షణ కోసం ఒక ర్యాలీ నిర్వహించండి. ర్యాలీలో పాల్గొనడానికి సామాజిక ఆస్తుల పరిరక్షణ గురించిన నినాదాలు (Slogans) తయారుచేయండి.

## VII. తెలుసుకోండి

### ప్రభుత్వ ఆస్తులు కాపాడుట మనందరి బాధ్యత

ప్రభుత్వ ఆస్తులను విధ్వంసం చేయడం ఆక్రమించుకోవడం అక్కడక్కడ జరుగుతుండడం టీవీల్లో, పత్రికల్లో చూస్తుంటాం, వింటుంటాం. ప్రజలకోసం ఉపయోగపడడానికున్న ప్రభుత్వ భూములను భూబకాసురులు ఆక్రమిస్తున్నారు. అక్రమంగా వాటిని తమ ఆధీనంలో ఉంచుకొని తమ స్వలాభాల కోసం వినియోగించుకుంటున్నారు. అట్లే ప్రజల అవసరాల నిమిత్తం నిర్మించిన చెరువులను, భవనాలను కూడా ఆక్రమించడమూ వాటిని పట్టించుకోకపోవడమూ మరమ్మత్తులు చేపట్టకపోవడమూ వంటివి జరుగుతున్నాయి. ఇవన్నీ కూడా ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులే. వీటివల్ల ప్రజలకు మేలు జరగాల్సిఉంది.

మనది ప్రజాస్వామ్య దేశం. ప్రజలే పాలకులు. కాబట్టి ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రజల ఆస్తులే. ప్రజల కృషి, ప్రజల ధనము వలననే ప్రభుత్వ ఆస్తులు ఏర్పడతాయి.

ప్రభుత్వ ఆస్తులు నీవేరా
భద్రత చేయుట భావ్యమురా!
కోపతాపముల వేళల నీవు

ఆస్తుల ధ్వంసము చేయకురా!
ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయకురా!

మన బడి, మన గ్రంథాలయం, రైల్వేలు, బస్సులు మొ॥వి ప్రభుత్వ ఆస్తులు. కొంతమంది స్వప్రయోజనాలకై ధర్నాలు, సమ్మెలు చేసినప్పుడు ప్రభుత్వ ఆస్తులు నాశనము చేయబడుతున్నాయి. ఇవి జరిగినపుడు ప్రాణహాని, ప్రజలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతాయి. తద్వారా సమాజానికి ఎంతో నష్టం చేకూరుతుంది. ధ్వంసమైన ఆస్తులను మరల బాగుచేసుకోవాలంటే ఎంతో శ్రమపడవలసి ఉంటుంది. అందుకోసం ప్రజలు ఎక్కువ పన్నులు కట్టాలి.

ప్రభుత్వ ఆస్తులన్నీ, ప్రజల ఆస్తులే. అంటే మన ఆస్తులు. ఇవి తాము నిర్మించుకున్నవే. వీటిని జాగ్రత్తగా మనమందరం కాపాడుకోవాలి. దేశ శ్రేయస్సుకై పాటుపడాలి. ప్రభుత్వ ఆస్తుల రక్షణ అనేది జాతీయ భావన. కాబట్టి వాటిని మనం రక్షిస్తే, మన జాతికి మనం ఎంతో సేవ చేసిన వారం కాగలం. కాబట్టి వీటి రక్షణ మనవంతు బాధ్యతగ గుర్తించాలి.

చారిత్రక ప్రదేశాలు, దర్శనీయ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలి. వాటి గోడలపై రాతలు, పేర్లు చెక్కడం వంటివి చేయకూడదు.

ప్రార్థనా మందిరాలు, లైబ్రరీలు, హాస్పిటల్స్‌లో నిశ్శబ్దాన్ని పాటించాలి. బహిరంగ ప్రదేశాలలో పొగత్రాగరాదు. మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించరాదు.

పబ్లిక్ పార్కులలో చెట్ల కొమ్మలు విరవటం, పూలు కోయటం, మొక్కలు పీకి తీసుకొనిపోవటం, ఉత్తమ పౌరుల లక్షణంకాదు. జంతుప్రదర్శనాశాలలో జంతువులను హింసించకూడదు.

లైబ్రరీ పుస్తకాలలో పేజీలను చించుకోవడం, కటింగ్స్‌చేసి దాచుకోవడం, స్వంతానికి అట్టిపెట్టుకోవడం చేయకూడదు. అర్థరాత్రి లౌడ్‌స్పీకర్లను, టపాకాయలను పేల్చడం వంటివి చేయకూడదు.

వనరులను వృథాచేయకుండా పొదుపుగా వాడుకోవాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి. సామాజిక పరిశుభ్రతను అమలుపరచాలి. బహిరంగ ప్రదేశాలలో, పబ్లిక్ ప్లేస్‌లలో చెత్తాచెదారం వెయ్యకుండా నిర్దేశించిన డస్ట్‌బిన్‌లలోనే వేయాలి. ఇతరులు వేసేలా చూడాలి. మూత్రవిసర్జన బహిరంగ ప్రదేశాలలో కాకుండా సులభ్ కాంప్లెక్స్‌లను వాడుకునేలా ప్రచారం చేయాలి. ఉమ్మితొట్లలోనే ఉమ్మివేయాలి.

నీటి కుళాయిలు, విద్యుత్ పరికరాలను అవసరం లేనప్పుడు వాడకూడదు. ఇంధన పొదుపు నేర్వాలి. కుక్కర్లను వాడటం ద్వారా ఆరోగ్యకరమైన పద్ధతిలో ఆహారాన్ని తక్కువ ఇంధన ఖర్చుతో పొందవచ్చు. నడిచివెళ్ళడం, సైకిల్ వాడటం ద్వారా ఆరోగ్యం, ఇంధనం ఆదా రెండూ సాధ్యపడతాయి.

పైవాటివల్ల ప్రజలకు మేలుజరగాల్సి ఉంది. ప్రజలకు మేలు చేకూర్చే ఆస్తులు - సంస్థలకు నష్టం వాటిల్లకుండా భారతప్రభుత్వం కొన్ని విధులను రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడం, హింసను విడనాడడం అనే విధిని 9వ విధిలోనే చేర్చడం జరిగింది. కనుక మనం ప్రభుత్వం ఆస్తులకు నష్టం కల్గించకూడదు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లడంతో ప్రజలకు సేవలు చేయడం నిలిచిపోతాయి. కనుక వీటిని కాపాడుకోవడం మన బాధ్యత.

## మీకు తెలుసా

మన దేశం భారతదేశం. ప్రపంచంలోని అతిపెద్ద దేశాల్లో మనదేశం ఒకటి. ప్రజాస్వామ్యాన్ని కల్గిఉన్న దేశాల్లో అతిముఖ్యమైనది. ఈదేశంలో ప్రజలందరికోసం మేలు జరిగేలా, పరిపాలన కొనసాగేలా చేయడానికి అతిపెద్ద విస్తృతమైన రాజ్యాంగాన్ని మనదేశం కల్గిఉన్నది. ప్రపంచంలోని అతిగొప్పదైన రాజ్యాంగాలలో మన రాజ్యాంగం కూడా ఒకటి. మన రాజ్యాంగం మనకు కొన్ని ప్రాథమిక హక్కులను కల్పించడంతోపాటు కొన్ని బాధ్యతలను కూడా నిర్దేశించింది. అవి

1. సమానత్వపు హక్కు
2. స్వాతంత్రపు హక్కు
3. పీడనాన్ని నిరోధించే హక్కు
4. మతస్వాతంత్రపు హక్కు
5. సాంస్కృతిక, విద్యాహక్కు
6. ఆస్తి హక్కు
7. రాజ్యాంగ పరిహార హక్కు

వీటితోపాటే మనదేశంలోని పౌరులందరికి కొన్ని ప్రాథమిక విధులను రాజ్యాంగంలో పొందుపరచారు. ఇవి 11 ఉన్నాయి.

1. భారత రాజ్యాంగంపట్ల అవి సూచించిన అర్థాలు, సంస్థలపట్ల, జాతీయపతాకం, జాతీయగీతం పట్ల విధేయతను చూపడం.
2. స్వాతంత్రం కోసం జరిగిన జాతీయోద్యమ ఉదాత్త ఆశయాలను పోషించుకుంటూ అనుసరించడం.
3. భారతదేశ సార్వభౌమత్వం, సమైక్యత, సమగ్రతలను సమర్థించి సంరక్షించుకోవడం.
4. దేశాన్ని రక్షించుకోవడం, అవసరమయినప్పుడు జాతీయసేవలో పాల్గొనడం.
5. మత-భాషా, ప్రాంతీయ, వర్గసంబంధమైన వైవిధ్యాలను అధిగమించి భారత ప్రజలందరిలో సమైక్యతను, ఉమ్మడి సౌభ్రాతృభావాలను పెంపొందించుకోవడం. మహిళలపై విరుద్ధమైన పద్ధతులను పరిత్యజించడం.
6. సుసంపన్నమైన వారసత్వాన్ని, వైవిధ్యంతో కూడుకున్న సంస్కృతిని సంరక్షించుకోవడం.
7. అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతో కూడిన సహజ వాతావరణాన్ని సంరక్షించుకొని పెంపొందించుకోవడం ప్రాణికోటి పట్ల కారుణ్యాన్ని చూపించడం.
8. శాస్త్రీయ వైఖరి, మానవతావాదం, విచారణ, సంస్కరణాదృక్పథాన్ని కలిగిఉండడం.
9. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడం, హింసను విడనాడడం.
10. జాతి ఉన్నతస్థాయిల్లోకి ఎదగడానికి వ్యష్టిపరంగానూ, సామూహికంగానూ కార్యకలాపాల్లో పాల్గొనడం.
11. ఆరు నుంచి పద్నాలుగు ఏళ్ళ వయసు ఉన్న బాలబాలికలకు వారి తల్లిదండ్రులు, సంరక్షకులు తగిన విద్యాసదుపాయాలు కల్పించడం.

పై వాటిలో మనం ఏఏ బాధ్యతలు తీసుకుంటున్నాం - ఆలోచించండి.

**సూక్తి**

నేటి సమాజం రేపటికోసం ఎంతో శ్రమించి
కొంత సంగ్రహించి మరెంతో మిగల్చాలి

# 6 వస్తు పొదుపు

**I. ప్రధాన విలువ**

పొదుపు ఆవశ్యకత

**II. ఉప విలువ**

వస్తువులను వాడి పారేయకుండా మరలా మరలా వినియోగించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- తమ దగ్గర ఉన్న వస్తువులను జాగ్రత్తగా వినియోగించాలని తెలుసుకుంటారు
- అనవసరంగా వస్తువులను వినియోగించరాదని తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మన భారతీయ సంస్కృతిలో వస్తువులను జాగ్రత్తగా ఉపయోగించుకోవడం అన్నది పురాతన కాలం నుంచి వస్తున్నది. ఆకాలంలో వస్తువులను వెండి, రాగి, కంచు, ఇత్తడి మొదలైన లోహాలతో తయారు చేసేవారు. ఒక్కసారి తయారుచేసిన పాత్రలను తరతరాల వరకు ఉపయోగించేవారు. ఇప్పుడు కూడా ఇండ్లలో వెతికితే ఆ కాలంనాటి పాత్రలు కనిపిస్తాయి. అంటే అంత జాగ్రత్తగా వస్తువులను ఉపయోగించుకునేవారు. అవి మన్నికగానూ ఉండేవి. కాని ప్రస్తుతకాలంలో మనకు పాశ్చాత్యుల్లా "Use and through" (వాడు పారేయి) అనే కల్చర్ అలవాటయింది. పెళ్ళిళ్ళలో, ఫంక్షన్లలో ప్లాస్టిక్, లేదా పేపర్‌ప్లేట్లు గ్లాసులు వాడి పారేస్తున్నాము. అలాగే వస్తువినియోగం కూడా ఎక్కువయింది. 'పాత రోత కొత్త వింత' అనే పోకడకు అలవాటుపడి మారుతున్న టెక్నాలజీవల్ల త్వరగా వస్తున్న కొత్త మోడళ్ళ మోజులో పాతవాటిని పారవేసి కాలుష్యాన్ని కూడా అధికం చేస్తున్నాం. ఇలా చేయడం మనకే నష్టం మరియు కష్టం కూడా కనుక మన దగ్గర ఉన్న వస్తువులను జాగ్రత్తగా వాడుకొని వాటి జీవితకాలాన్ని పెంచి కాలుష్యాన్ని అనవసర ఖర్చును తగ్గించడానికి ప్రయత్నించాలి.

## V. విషయం

### సంఘటన

అక్కడ పెళ్ళి రిసెప్షన్ ఫంక్షన్ జరుగుతోంది. వచ్చిన అతిథులందరికీ 'బఫే' ఏర్పాటుచేశారు. వాడి పారేసే పేపర్‌ప్లేట్లలో అన్నం సర్వ్ చేస్తున్నారు. స్వీటుపెట్టడానికి ఒక ప్లాస్టిక్ కప్పు, స్పూను, పెరుగుకు ఒక ప్లాస్టిక్ కప్పు ఉపయోగిస్తున్నారు. మంచినీళ్ళు తాగటానికి కూడా ప్లాస్టిక్ గ్లాసులే ఉన్నాయి. అక్కడివారు ఒకసారి మంచినీళ్ళు తాగటానికి ఉపయోగించిన గ్లాసుని మరోసారి ఉపయోగించటం లేదు. ఫంక్షన్ పూర్తయ్యేసరికి అన్నంప్లేట్లు, కప్పులు, గ్లాసులు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. అవి అన్ని గాలికి చెల్లాచెదురై ఎక్కడ చూసినా అవే కనపడుతున్నాయి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. ప్రతిసారి వస్తువులను వాడి పారేస్తూ ఉంటే ఏం జరుగుతుంది?
2. వస్తువులను జాగ్రత్తగా ఎందుకు వాడుకోవాలి?
3. మన ఇంట్లోని ఏఏ వస్తువులను జాగ్రత్తగా వాడుకోవాలి? ఎలా జాగ్రత్తగా వాడాలి?
4. "మనం వస్తువులను జాగ్రత్తగా వాడటం వల్ల మనదేశానికి మేలుచేసిన వారమవుతాం" ఎలా? విశ్లేషించండి.
5. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేటులు వాడకుండా స్టీలుగ్లాసులు, Fibre Plate లు మరలా మరలా వాడవచ్చుకదా! చర్చించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంట్లోని వస్తువులను, బడిలోని వస్తువులను జాగ్రత్తగా వాడండి? ఏఏ వస్తువులను ఎలా జాగ్రత్తగా వాడారో చెప్పండి.

## VII. తెలుసుకోండి

మనం అవసరం మేరకే వస్తువులను కొనాలి. కొన్న వస్తువులు కలకాలం మన్నేలా జాగ్రత్తగా వినియోగించుకోవాలి. ఒక్కసారి వాడిపారేసే వస్తువుల వల్ల, జాగ్రత్తగా వినియోగించక వస్తువులను పాడుచేసి పారవేయడం వల్ల డబ్బుతోపాటు ఎన్నో వనరులు వృథా అవుతాయి. అలాగే వాతావారణ కాలుష్యం కూడా ఏర్పడుతుంది. ఎలా అంటే వస్తువు తయారు కావడానికి ఎన్నో వనరులు (విద్యుత్, శక్తి, మానవవనరులు) అవసరం అవుతాయి. ఆ వస్తువు తయారయ్యే ప్రక్రియలో ఎంతో కొంత వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది.

కనుక మనం ఒక వస్తువుని జాగ్రత్తగా వాడుకొని దానియొక్క జీవితకాలాన్ని పెంచటం అంటే మనం డబ్బుతోపాటు, దాని ఉత్పత్తికి అవసరమయ్యే వనరులను పొదుపు చేస్తున్నట్లే, కాలుష్యాన్ని నివారిస్తున్నట్లే.

వస్తువులను కొనేటప్పుడు కూడా జాగ్రత్తలు వహించాలి. మొదటిసారి కొన్నప్పుడే నాణ్యమైన వస్తువును కొనడం ద్వారా మళ్ళీ అదే వస్తువును కొనాల్సిన అవసరం రాదు. చౌకగా అందుబాటులో ఉన్నాయని తక్కువరకం వస్తువులు కొనుగోలు చేస్తే ఎక్కువరోజులు మన్నవని గుర్తుంచుకోవాలి.

అలాగే ఏదైనా ఒక వస్తువును కొనేటప్పుడు అది మనకు అవసరమా? ఆ వస్తువు లేకపోయినా దినచర్యకు ఏ ఆటంకం లేదుకదా అని ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. అంతేకాదు ఆ వస్తువు వాడి పడేయడం వల్ల పర్యావరణానికి ఏదైనా హాని కలుగుతుందేమోనని కూడా చూడాలి.

ఎక్కువకాలం ఉపయోగించుకో గలిగే వస్తువులనే కొనాలి. ప్రతిసారి వాడి పారవేసే వస్తువుల వినియోగాన్ని తగ్గించాలి.

కొన్న వస్తువులను జాగ్రత్తగా వినియోగించుకోవాలి. ఆడంబరాలకు పోయి ఎక్కువ వస్తువులను కొని ఉంచుకోకూడదు.

**మన ఇంట్లోని వస్తువులను జాగ్రత్తగా వాడుకునే విధానాలు :**

- మనింట్లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవడం ద్వారా వాటి దుమ్ము, ధూళి వంటివి పోతాయి. వాటి మన్నిక బాగుండడంతోపాటు ఎటువంటి మరమ్మత్తులు చేయించాల్సిన అవసరం రాదు.
- ఈరోజుల్లో ఎంతోమంది పొద్దున లేవగానే కంప్యూటర్ ఆన్ చేస్తుంటారు. అలా ఆన్ చేసిన కంప్యూటర్ చివరికి రాత్రి పడుకునే వరకు ఆన్‌లోనే ఉంటుంది. ఒకవేళ మీరుకూడా ఇదే విధానాన్ని అవలంబించే వారైతే ఈ పద్ధతికి స్వస్తి చెప్పండి. మీకు అవసరమైన సమయంలో మాత్రమే కంప్యూటర్ ఆన్‌చేసి వాడుకున్నట్లయితే కరెంటుబిల్లు తగ్గించడంతోపాటు కంప్యూటర్ జీవితకాలాన్ని కూడా పెంచిన వారవుతారు.
- మనం ఇంట్లో ఏపనిలో ఉన్నా సరే టీవీ అలా నడుస్తూనే ఉంటుంది. వీలైనంతవరకు మనం చూడనప్పుడు దానికి విశ్రాంతినివ్వడం మంచిది.
- వాషింగ్‌మెషీన్‌లో డ్రైయర్‌ని తక్కువగా వాడడం ద్వారా మెషిన్ జీవితకాలం పెరగడంతోపాటు కరెంటు ఖర్చు కూడా బాగా ఆదాఅవుతుంది.
- ఫ్రిజ్ డోర్ అనవసరంగా తెరిచిఉండటం ద్వారా దాని ఉష్ణోగ్రతలో మార్పులు సంభవిస్తాయి. దాని కనుగుణంగా విద్యుత్ భారం అధికమవుతుంది. ఫ్రిజ్ పాడవుతుంది. కనుక పిల్లలు ఫ్రిజ్ డోర్‌ను అనవసరంగా తీయకుండా జాగ్రత్త వహించాలి.
- మనం వాడే వాహనాలను కూడా దుమ్ము, ధూళి తుడిచి నీట్‌గా ఉంచుకోవాలి క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించాలి. దీని ద్వారా వాహన జీవితకాలం పెరగడమే కాకుండా కాలుష్యం కూడా నివారించబడుతుంది.

**సూక్తి**

ఆదాయం మీద అదుపు, అపవ్యయం మీద పొదుపు తప్పనిసరి

# 7 జీవన శైలి / ఆరోగ్య సమస్యలు

**I. ప్రధాన విలువ**

ఆరోగ్య విలువలు

**II. ఉప విలువ**

జీవనశైలి వల్ల వచ్చే వ్యాధులు

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- జీవనశైలి వల్ల వచ్చే వ్యాధుల గురించి తెలుసుకుంటారు.
- జీవనశైలి మార్పుతో వ్యాధులురాకుండా చూసుకుంటారు.
- ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసుకునే కృత్యాలు చేస్తారు.

## IV. ఉపోద్ఘాతం

పోటీతత్వం పెరగుతున్న నేటి ఆధునిక కాలంలో మనిషి జీవనంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం నిద్ర లేచింది మొదలుకొని ఉరకుల పరుగులతో, యాంత్రిక జీవనంతో, ఒత్తిడి, ఆందోళన, అధిక శ్రమలతో పిల్లలు, పెద్దలు అందరూ వ్యాధులబారిన పడుతున్నారు. మానసికంగా, శారీరకంగా అనేక అనారోగ్యాల సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు అధిక ఒత్తిడిని తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. మన జీవనశైలిలో కొద్దిపాటి మార్పుచేసుకొని, ఆహారనియమాలు లాంటివి పాటిస్తూ, ఒత్తిడిని ఆందోళనలను అధిగమించడానికి ఏమేమి చేయాలో తెలుసుకుందాం.

## V. విషయం

మారుతున్న కాలంతో పాటు మనమూ మారాలి. కానీ అనారోగ్యానికి అది కారణం కాకూడదు. అందువల్ల ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే ప్రణాళికాబద్ధంగా అన్ని పనులు ఏ ఒత్తిడి లేకుండా చేసుకోవచ్చు. చాలా మంది కుర్చీలలో కూలబడిపోయి గంటలతరబడి సమయమనేది లేకుండా పనులు చేస్తారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేరు ఇంజనీర్లు సమయపాలన, పని ఒత్తిడితో ఉంటారు. మధ్యమధ్య కాస్త రిలాక్సు అయితే ఎంత బాగుంటుంది. 10 నిమిషాలు కళ్ళుమూసుకొని ప్రశాంతంగా ఉండగలిగితే ఉత్సాహం రెట్టింపు అవుతుంది. అలాగే బడిలో పిల్లలు ఆడుతూ పాడుతూ నేర్చుకోవాలేగానీ నేర్చుకోవడంలో ఒత్తిడి ఉండకూడదు. ర్యాంకుల పేరుతో ఒత్తిడికి లోనవుతున్న పిల్లల్ని చూస్తే వారిలో మధుమేహం, ఊబకాయం లాంటివి కనిపిస్తాయి. వ్యాయామం చేయాలి, ఆటలు ఆడాలి. ఇవి మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. కొంతమంది ఇంటికెళ్ళగానే టి.వి. పెట్టుకొని అదేపనిగా కూర్చొని మధ్యమధ్యలో తింటూ గంటలతరబడి చూస్తారు. ఈ అలవాటు పెద్దలకు కూడా ఉంది. దానివల్ల శరీరానికి ఎటువంటి కదలికలేక కొవ్వు పేరుకొనే ప్రమాదం ఉంది. యువకుల్లో నడుంనొప్పి, బి.పి., అల్సర్లు లాంటివి ముదురుతున్నాయి. మరికొంతమంది ఒత్తిడిని తట్టుకోవడానికి వ్యసనాలకు బానిసలవుతారు. పాఠశాల విద్యార్థులు స్టడీఅవర్ల పేరుతో గంటలతరబడి బెంచీలకే పరిమితం అయిపోతున్నారు. ఆవిధంగా పిల్లలు కనీసం 10 గంటలపాటు కూర్చోవడం వల్ల వెన్నునొప్పి, కండరాలు బలహీనపడడం జరుగుతుంది. ఇదంతా జీవనశైలితో వచ్చే సమస్య. వీటిని కొద్దిపాటి మార్పులతో వ్యాధుల బారిన పడకుండా చేసుకోవచ్చు.

### సంఘటన - 1

వనజ, రామారావు ఇద్దరూ భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. వనజ రామారావులు ఉద్యోగులు. ప్రొద్దునే లేవడం, గిన్నెలు కడుక్కోవడం, వంటచేసుకోవడం, అలాగే పిల్లలకు హోంవర్కులో సహకరించడం పిల్లలను సిద్ధంచేసి బడిదగ్గర దించి, వారిద్దరు ఆఫీసుకి వెళ్ళడం. ఇదంతా నిత్య కురుక్షేత్రంగా ఉంటుంది. ఎప్పుడో రాత్రికి ఇంటికి చేరుకుంటారు. పిల్లలు తల్లిదండ్రుల కోసం ఎదురుచూస్తుంటారు. వారికి ఆకలి వేస్తుంటుంది. తల్లిదండ్రులు వచ్చినతరువాత మళ్ళీ ఇంటిపని హడావిడిగా వంట, భోజనాలు చేయడం, పిల్లలు చదువుకోవడం, తండ్రి టి.వి.చూడడం ఆలస్యంగా నిద్రపోవడం ఇవన్నీ నిత్యకృత్యాలే. పిల్లలు ఆటల్లేక హోంవర్కులు, ప్రాజెక్టు పనులు, ఇంటర్నెట్‌లు మొదలైనవి లోకంగా బ్రతుకుతున్నారు. పెద్దవాళ్ళు సరేసరి. ఒకనాడు స్కూల్లో జరిగిన మెడికల్ చెకప్‌లో భాగంగా పిల్లలిద్దరికీ మధుమేహం, కిడ్నీలో రాళ్ళున్నాయని తేలింది. పిల్లలు లావుగా అవుతున్నారు. వారికి ఊబకాయం కూడా వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు చెప్పారు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై సంఘటనలో పిల్లలకు జబ్బులు కలగడానికి కారణాలు ఏమిటి?
2. పిల్లల్లో ఒత్తిడి, ఆందోళనలు ఎందుకు కలుగుతున్నాయి?
3. మన జీవన విధానంలో వచ్చిన మార్పులు ఏమిటి? వాటివల్ల ఎటువంటి ఇబ్బందులు వస్తున్నాయి?
4. ఈ యాంత్రిక జీవన విధానంలో మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఏమేమి చేయాలి?
5. ఒత్తిడిని దూరం చేయాలంటే మనమేమి చేయవచ్చు?
6. జీవనశైలిలో మార్పులు అంటే ఏమి చేయాలి?
7. ఆంధ్రప్రదేశ్ దేశంలోకెల్లా, మధుమేహంలో మొదటిస్థానంలో ఎందుకు ఉన్నది?
8. గతవారంలో మీరు ఎన్నిగంటలు ఆటలకు, నడవటానికి, వ్యాయామానికి కేటాయించారు? ఎన్నిగంటలు కూర్చున్నారు?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.
- ధ్యానం చేయండి.
- మీరోజు వారి పనులను ప్రణాళికాబద్ధంగా చేయండి.

పైవన్నీ చేసిన తరువాత మీకు కలిగిన అనుభవాలు చెప్పండి.

## VII. తెలుసుకోండి

కాలం మారుతున్నకొద్దీ జనజీవనంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. పిల్లల చదువులు, ఉద్యోగాలు, ప్రయాణాలు, పెళ్ళిళ్ళు, పండుగలు, వేడుకలు ఇలా అన్నింటిలో వేగం పెరిగింది. దానితోబాటు ఒత్తిడి, ఆందోళనలు పెరిగిపోయాయి. సునిశితంగా గమనిస్తే ప్రతివ్యక్తి ఏదోఒక వ్యాధిపీడితుడే. రోజురోజుకి అధికమవుతున్న గుండెజబ్బులు, బి.పి., షుగర్, అల్సర్లు, చర్మవ్యాధులు, అధికబరువు, నడుంనొప్పులు, మానసిక అశాంతి, రిపోర్టులు నార్మల్‌గా ఉన్నా తగ్గని నీరసాలు. అతిచిన్నవయసులోనే రోగాల బారిన

పడడం, నిత్యం డాక్టర్లచుట్టూ తిరిగినా, నయం కాకపోవడం, జరుగుతుంది. అందరూ తమ అవసరాలకు మించి ధనం సంపాదించడానికి, అనేక వ్యసనాలకు బానిసలైపోయారు. పిల్లల్లో, యువతరంలో చదువులపోటీ, పెద్దలలో సంపాదనపోటీ పోటీ, పోటీ,.. పోటీప్రపంచం అయిపోయింది.

వీటివల్ల సమయానికి తినకపోవడం, నిద్రపోకపోవడం, సరైన ఆహారాన్ని తీసుకోకపోవడం, ఇవన్నీ జరిగి, అసహనం, చిరాకు, కోపం లాంటివి కలిగి అనేక రోగాలకు కారణమవుతుంది.

- ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోకుండా, మధ్య మధ్యలో లేచి తిరగాలి.
- పౌష్టికాహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి.
- జోక్సు వింటుండాలి. మధ్యలో కాస్త రిలాక్సు అవ్వాలి.
- బడిలో బొమ్మలు గీయడం, పరుగెత్తే ఆటలు ఆడాలి. ఆడపిల్లలు తాడాట, రింగులు మొదలైనవి ఆడాలి. ఇంకా చాలా ఆటలు ఆడవచ్చు.
- చదువే కాకుండా ఇతర విషయాలను చర్చించాలి.
- తోటపని చేయాలి.
- ఇంటికి వచ్చిన తరువాత వెంటనే హోంవర్కు అని కాకుండా, పిల్లలు తప్పని సరిగా ఒక గంట బయట స్నేహితులతో ఆడుకొని రావాలి మరియు పెద్దలతో కాసేపు మాట్లాడాలి.
- కాలుష్యాలకు దూరంగా ఉండాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో, చెట్లు ఎక్కువగా ఉన్న రోడ్లపై నడక సాగించాలి.
- అన్నింటికంటే కాసేపు కళ్ళు మూసుకొని ధ్యానం చేయడం ఉత్తమం.

## జీవనశైలి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు

మెరుగైన పారిశుధ్యం, టీకాలు, యాంటీబయాటిక్స్, వైద్యపరమైన అప్రమత్తతను పాటించడం ద్వారా, పెక్కు సంక్రమణ వ్యాధులు ప్రాణాంతకం కాకుండా ఆధునిక విజ్ఞానం నివారించగలిగింది. అంటే గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి జీవనశైలి వల్ల కలిగే వ్యాధులే ఇప్పుడు మరణానికి ప్రాథమిక కారణాలుగా మారాయన్నమాట. మరణానికి దారితీసే కారణం ఏదైనా, ప్రతి ఒక్కరికీ మరణం తప్పదు. అయితే, జీవనశైలి వల్ల కలిగే వ్యాధులు అకాల మరణాలకు దారితీస్తున్నాయి. ఇటీవలికాలంలో, గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి జీవనశైలి వల్ల కలిగే వ్యాధుల కారణంగా చాలామంది చిన్నవయస్సులోనే మరణిస్తున్నారు.

భారతదేశం విషయంలో చూస్తే, ఈ పరిస్థితి ఎంతో ఆందోళనను రేకెత్తిస్తున్నది. ఇలాంటి వ్యాధుల తీరు ఎప్పటికప్పుడు మారిపోతున్నది. సమీప భవిష్యత్తులో అత్యధికంగా జీవనశైలి సంబంధిత వ్యాధులు సోకే దేశంగా భారతదేశాన్ని ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ) గుర్తించింది. ఇటీవలికాలంలో, జీవనశైలి సంబంధిత వ్యాధులు రావడం అతి సాధారణంగా మారిపోవడమేకాదు, చిన్న వయసువారు కూడా వీటికి గురవుతున్నారు.

ఈ కారణంగా, ముప్పుకు లోనయ్యే జనాభా సగటు వయసు 40+ నుంచి 30+ కి, ఇంకా ఆ దిగువకు కూడా దిగజారుతున్నది. ఇప్పటికే, ప్రపంచ మధుమేహపు రోగుల రాజధాని అన్న అప్రతిష్టను మూటగట్టుకున్న భారతదేశం ఇప్పుడు, జీవనశైలి సంబంధిత వ్యాధుల రాజధాని అనే చెడుపేరును కూడా తలకెత్తుకోనున్నది. భారతదేశంలో అధిక రక్తపోటు, స్థూలకాయం, గుండెజబ్బులు సోకడం, ముఖ్యంగా పట్టణ యువతకు సోకడం, ఆందోళనకరమైన రీతిలో పెరుగుతున్నట్టు అఖిల భారత వైద్యశాస్త్రాల సంస్థ (ఎయిమ్స్), మాక్స్ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం వెల్లడించింది. కాలు కదపకుండా (కూర్చొని) చేసే ఉద్యోగాలు, కొవ్వుపదార్థాలతో కూడిన ఆహారం, మద్యపానమే ఈ స్థూలకాయం, మధుమేహం, రక్తపోటు వ్యాధులు సోకడానికి ప్రధాన కారణాలని వైద్యులు పేర్కొంటున్నారు.

చాలామంది 25-30 ఏళ్ళకే అధిక రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నారు. వీటిని నిర్లక్ష్యం చేయడం వల్ల దీర్ఘకాలంలో మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది. మారుతున్న జీవనశైలి, ఒత్తిడే ఈ తరహా సమస్యలకు కారణమవుతున్నాయి.

నగరంలో కాలుష్యమూ కిడ్నీలకు పొగపెడుతోంది. వాయుకాలుష్యం కారణంగా పీల్చే గాలిలో, తాగే నీటిలో పాదరసం, సీసం, అర్సెనిక్ శాతాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మూత్రపిండాల నాళాల్లో ఇవి పేరుకుపోయి వాటిని దెబ్బతీస్తున్నాయి.

### ఒత్తిడితో పిల్లలకు జబ్బులు

ఒత్తిడి ఆరోగ్యానికి హాని కలిగిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇది పెద్దల్లోనే కాదు, పిల్లలపైనా గణనీయమైన ప్రభావం చూపుతుంది. చిన్నప్పుడు ఒత్తిడితో బాధపడే పిల్లలకు పెద్దయ్యాక ఊబకాయం, ఇతరత్రా సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అయితే దీని ప్రభావం మరింత ఎక్కువగానూ ఊహిస్తున్నదానికన్నా ఇంకా ముందుగానే కనబడుతున్నట్టూ తాజాగా బయట పడింది. వేధింపులకు, హింసకు గురికావటం... తల్లిదండ్రులు విడిపోవటం... ఆర్థిక సమస్యల వంటి అనుభవాలను ఎదుర్కొన్న పిల్లలు గ్రహణలోపం, మానసిక, శారీరక సమస్యల వంటి ఏదో

ఒక ఇబ్బందితో బాధపడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. మరికొందరిలో ఈ మూడు సమస్యలు కలిసి ఉండటమూ గమనార్హం. ఇవన్నీ దీర్ఘకాల ఒత్తిడి ప్రభావంతో తలెత్తుతున్నవేనని ఫ్లోరిడా విశ్వవిద్యాలయ పరిశోధకులు చెబుతున్నారు. ఈ దీర్ఘకాల ఒత్తిడి మనసుకూ శరీరానికీ హాని కలిగిస్తుందని ఇది నాడీసంబంధ హార్మోన్ల వ్యవస్థలోనూ, రోగనిరోధక వ్యవస్థలోనూ మార్పులు తీసుకొస్తుందని వివరిస్తున్నారు. దీంతో జబ్బుల బారిన పడే ముప్పు పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు. నిజానికి ఒత్తిడి అనేది జీవితంలో ఒక భాగం. ఎవరైనా దీన్ని ఎదుర్కోవాల్సిందే. ఇది కొత్త విషయాలు నేర్చుకోవటానికి, ఇబ్బందులను అధిగమించటానికి పిల్లలకు తోడ్పడుతుంది కూడా. కానీ ఒత్తిడి తీవ్రమైతే, దీన్ని ఎదుర్కొనే సామర్థ్యం లోపిస్తే మాత్రం దుష్ప్రభావాలకు దారితీస్తుంది. దీర్ఘకాల ఒత్తిడి మూలంగా బాల్యంలో మెదడు అభివృద్ధి అస్తవ్యస్తమవుతుంది. నాడీ, రోగనిరోధక వ్యవస్థలు మందగిస్తాయి. అంతేనా? పెద్దయ్యాక మద్యపానానికి అలవాటుపడటం, కుంగుబాటు, తిండి సమస్యలు, గుండెజబ్బు, క్యాన్సర్ వంటి సమస్యలకూ దారితీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. అందువల్ల పిల్లలకు ఒత్తిడికి గురవుతున్నట్టు గమనిస్తే వెంటనే జాగ్రత్త పడటం మంచిదని సూచిస్తున్నారు.

### వ్యాయామమే ఔషధం!

శరీర సామర్థ్యాన్ని పెంచుతుంది. ఆకృతిని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గటానికి తోడ్పడుతుంది. గుండె బలోపేతం కావటానికీ... జీవనకాలం పెరగటానికీ దోహదం చేస్తుంది. ఆత్మవిశ్వాసం పెంపొందింపజేయటానికి కూడా ఉపయోగపడుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నెన్నో... రోజుకి కనీసం 30 నిమిషాల సేపు వ్యాయామం చేసినా చాలు. జబ్బుల బారినపడకుండానూ చూసుకోవచ్చు. నిజానికి శరీర సామర్థ్యం లోపిస్తే చిన్న చిన్న సమస్యలైనా పెద్దవిగా మారతాయి. వ్యాయామం ద్వారా ఇలాంటి వాటిని దూరం చేసుకోవచ్చు. అందుకే ప్రస్తుతం వ్యాయామాన్ని కూడా చికిత్సలో భాగంగా చూస్తున్నారు. కొన్ని జబ్బులు తగ్గటంలో వ్యాయామం ఎలా తోడ్పడుతుందో చూద్దాం.

- **ఆందోళన :** దీర్ఘకాలం ఆందోళనతో సతమతమయ్యేవారికి కుంగుబాటు వంటి మానసిక సమస్యల ముప్పు ఎక్కువే. వ్యాయామంతో వీటి బానిపడకుండా చూసుకోవచ్చు. ఎందుకంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారికి ఆందోళన ముప్పు 25% తక్కువగా ఉంటున్నట్టు పరిశోధనలు పేర్కొంటున్నాయి. వ్యాయామం మూలంగా మనసును ఉత్సాహపరిచే ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ముఖ్యంగా ధ్యానం వంటి శ్వాస సంబంధ పద్ధతులు బాగా ఉపయోగపడతాయి. మిగతా వ్యాయామాలూ పనికొస్తాయి. వీటిని ఎక్కువగా చేస్తే ఫలితమూ అధికంగా ఉంటుంది.

- **జ్ఞాపకశక్తి క్షీణత :** వ్యాయామం మూలంగా మెదడుకు రక్తసరఫరా మెరుగవుతుంది. అలాగే జ్ఞాపకశక్తిని నియంత్రించే భాగాలూ వృద్ధిచెందుతాయి. వ్యాయామంచేసేవారు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకోవడం, ఒకేసారి వివిధ లక్ష్యాలను ఛేదించడం, ప్రణాళికా రచన వంటి పరీక్షల్లో చురుకుగా ఉంటున్నట్టు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకే తరహాకన్నా కొత్తరకం వ్యాయామాలు చేస్తే... కొత్త నైపుణ్యాలను నేర్చుకునేలా మెదడు తర్ఫీదు పొందుతుంది కూడా. కాబట్టి డాన్స్, ఆటలు, పెరట్లో మొక్కలు నాటటం, సైకిల్ మీద కొత్త దారిలో వెళ్ళటం... ఇలా కొత్తకొత్త పద్ధతుల్లో ప్రయోగాలు చేయటం మంచిది.

- **నిద్ర సమస్యలు :** వ్యాయామం వల్ల మెదడుకు రక్తసరఫరా పెరగుతుంది. రక్తంతోపాటు ఇనుము కూడా మెదడుకు అందుతుంది. ఇది నిద్ర బాగా పట్టటానికి తోడ్పడుతుంది. వ్యాయామం చేసేవారు మిగతా వారికన్నా గాఢంగా, నిద్రాభంగం లేకుండా హాయిగా నిద్రపోతున్నట్టు అధ్యయనాల్లో వెల్లడైంది. నిద్రలేమితో బరువు పెరగటం, నిస్సత్తువ, అలసట, గుండెజబ్బు ఒత్తిడిని తట్టుకోలేకపోవటం వంటి సమస్యలు దాడిచేస్తాయి. వ్యాయామం ఇలాంటి వాటి బారినపడకుండా కాపాడుతుంది కూడా. నిద్రపోతున్నప్పుడు శ్వాసకు అడ్డంకి (స్లీప్ అప్నియా) తలెత్తే సమస్యతో బాధపడేవారు మరింత ఎక్కువగా వ్యాయామం చేయటం మంచిది. దీంతో బరువు తగ్గి, సమస్య దూరంకావటానికి అవకాశముంది.

- **ఆస్థమా :** గుండె రక్తనాళాల ఆరోగ్యం బాగుంటే అస్థమా లక్షణాల తీవ్రత తగ్గుతున్నట్టు అధ్యయనాల్లో బయటపడింది. బరువు పెరగటం మూలంగా కొవ్వు కణాలు శరీరంలో వాపును తెచ్చిపెడతాయి. ఇది అస్థమా తీవ్రం కావటానికి దోహదం చేస్తుంది. కాబట్టి వ్యాయామంతో... ముఖ్యంగా గుండెను బలోపేతం చేసే ఏరోబిక్ వ్యాయామాలతో ఆస్థమా లక్షణాలు తగ్గే అవకాశముంది. అయితే ఆరుబయట వ్యాయామం చేసేవారు కాలుష్యం, పుప్పొడి, చల్లటిగాలి వంటి ఆస్థమా ప్రేరకాల బారిన పడకుండా చూసుకోవాలి.

- **వెన్ను, తుంటి, మోకాలు, మెడనొప్పులు :** కండరాల బలహీనత మూలంగానూ నొప్పులు వస్తుంటాయి. ఉదాహరణకు తొడనుంచి సాగే ఇలియోటిబియల్ కండరబంధనం బలహీనమైతే మోకాలు నొప్పి రావచ్చు. చాలాసేపు కంప్యూటర్ ముందు వంగి కూచోవటం వల్ల భుజం, మెడనొప్పి రావొచ్చు. ఆయా కండరాలను బలోపేతం చేసే, సాగదీసే వ్యాయామాలతో ఇలాంటి నొప్పులను దూరంగా ఉంచుకోవచ్చు.

## జీవనశైలి మారాలి

ఆరోగ్యకరమైన జీవనశైలి అంటే మంచి ఆహారం తీసుకోవాలి. రోజూ నీళ్ళు బాగా తాగాలి. కంటినిండా నిద్రపోవాలి. శారీరక వ్యాయామం, నడక, ఆటలు, మొదలగునవి చేయాలి. చెమటలు రావాలి. అప్పుడే ఉల్లాసంగా ఉంటారు. నీరు బాగా తాగకపోవడం, స్మోకింగు, ఆల్కహాలు తీసుకోవడం, చిరుతిళ్ళు, తీపిపదార్థాలు, క్రొవ్వు మరియు నూనెపదార్థాలు శరీర బరువును పెంచుతాయి. బరువుతో, శరీరంలో కొవ్వు, మధుమేహం, బి.పి. మొదలైన అనేక వ్యాధులు వస్తాయి. నీరు బాగా త్రాగితే శరీరంలో ఉన్న మలినాలు అన్నీ పోయి శరీరం నిగనిగలాడుతుంది. యోగా, ప్రాణాయామం వంటి వ్యాయామాలు ఊపిరితిత్తుల పనితీరును ఎంతగానో మెరుగుపరుస్తాయి. ఒత్తిడివల్ల కొలెస్ట్రాల్ ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. ఇది ముఖచర్మాన్ని దెబ్బతీస్తుంది. ముఖంలోని రక్తనాళాలు బలహీనపడి ఎక్కువ వయసున్నవారిలా కనబడతారు. కోపంవల్ల ముఖంలోని కండరాలు దెబ్బతింటాయి. చర్మం తొందరగా ముడతలుపడుతుంది. నిద్రలేకపోవడంవల్ల కళ్ళక్రింద నల్లటివలయాలు ఏర్పడతాయి. కళ్ళక్రింద చర్మం వదులై సంచులు ఏర్పడతాయి. గంటల తరబడి కూర్చొని పనిచేయడం, శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువ ఆహారం తీసుకోవడం, నడక, వ్యాయామం, ఆటలు ఆడకపోవడం బయటకువెళ్ళి సరదాగా స్నేహితులతో గడపకపోవడం, చెడు అలవాట్లు అనగా పొగత్రాగడం, ఆల్కహాల్ త్రాగడం, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోకపోవడం అనేవి మనం చేజేతులా మన ఆరోగ్యాన్ని పాడుచేసుకొని లేని, రాని రోగాలను తెచ్చుకోవడం. జీవనశైలి మన చేతుల్లో ఉంటుంది. చూస్తూ చూస్తూ ఇంత మంచి వ్యవస్థలున్న మన శరీరాన్ని అపహాస్యం చేసి రోగాలు తెచ్చుకోవద్దు. జీవనశైలిని మార్చుకొని ఆరోగ్యాన్ని పొందండి.

**సూక్తి**

శరీరానికి వ్యాయామం, మనస్సుకు ఉల్లాసం ఈరెండూ అవసరమే.

**సూక్తి**

వృద్ధాప్యంలో సైతం మన శక్తిని కాపాడేవి వ్యాయామం, ఓర్పు అన్నవి రెండే. ఈ రెండింటికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి.

# 8 కుటుంబ విలువలు

**I. ప్రధాన విలువ**

సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవం

**II. ఉప విలువ**

భారతీయ కుటుంబ విలువలను గౌరవించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- భారతీయ కుటుంబ వ్యవస్థ పట్ల అవగాహన కల్గి యుంటారు.
- ఉమ్మడి కుటుంబ వ్యవస్థను బలపరచుకోవడంవల్ల పొందే ప్రయోజనాలను తెలుసుకొని ఆచరించగలుగుతారు.

## IV. ఉపోద్ఘాతం

భారతీయ సంస్కృతికి మూలం కుటుంబవ్యవస్థ. ఆ కుటుంబ విలువ, ఆ కుటుంబంలోని వ్యక్తులు, వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. కానీ ప్రస్తుతం కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నమవుతున్నది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. వ్యక్తులలో స్వార్థం చోటుచేసుకొని 'మనము' అనే స్థాయినుండి నేను, నాది, నాకుటుంబం అనే నినాదంతో కన్న తల్లిదండ్రులను సైతం వదలి ఒంటరి జీవితాలకు అలవాటు పడుచున్నారు. బంధుత్వాలు, బాంధవ్యాలు మరచి డబ్బే ప్రధానంగా భావిస్తూ కుటుంబవ్యవస్థను కూలదోస్తున్నారు. జన్మనిచ్చినవారినీ వంశానికి మూలంగా నిలచిన పురుషులనీ స్మరణీయులుగా స్మరించడమే మనిషితనం. పుట్టుకకు, పెరుగుదలకు మూలకారకులైన తాతముత్తాతలు, సంబంధీకుల్ని పేరుపేరుగా తలచుకోవడంలో జీవితకాలానికి సరిపడేంత ఆనందముంది. జీవనసంస్కారవారసత్వమే ఎప్పుడైనా ఎవ్వరికైనా గర్వకారణం. సొంతఊళ్ళో అన్న, అక్క, తమ్ముడు, చెల్లి, బాబాయ్, మావయ్య, తాతయ్య, బామ్మల వంటి బంధుత్వ పిలుపులూ జనజీవనభాగ్యాలే. ఆయా సత్సంప్రదాయ పరంపరలే తదుపరి తరాలకు ఆదర్శప్రాయాలు. ఇంతటి ప్రాశస్త్యమున్న ఈ కుటుంబవ్యవస్థను గురించి తెలుసుకుందాం.

## V. విషయం

వృక్షానికి కొమ్మలు, ఆకులు, పూలు, పండ్లు, విత్తనాలు అంటూ వాటి వంశాన్ని వృద్ధిచేసుకుంటూ ఉంటాయి. అదేమాదిరి మన పూర్వీకుల కుటుంబాలన్నీ ఒకచోట ఉండి తమ సంతతిని ప్రేమానురాగాలతో చూసుకునేవారు బాంధవ్యాలతో కలసి మెలసి ఉండేవారు. విత్తనం నుండి పండ్లవరకు వారికి తెలిసినంత సమాచారంవరకు చరిత్ర అందించిన వారున్నారు. పూర్వీకుల వంశవృక్షాన్ని నేటివరకూ పుస్తకరూపంలో అందించిన వారున్నారు.

కుటుంబవ్యవస్థ బలంగా ఉన్న మన పూర్వీకులు ఆయురారోగ్యాలతో బలిష్ఠంగా, సుఖంగా జీవించేవారు. ఆహార వ్యవహారాలలోనూ క్రమశిక్షణతో ఉండేవారు. మనుష్యులు నీతినిజాయితీపరులుగా, సత్యవాక్య పరిపాలకులుగా ఉన్నట్లు తెలుస్తున్నది. భక్తిపరులుగా, భాగవతప్రియులుగా భగవంతుణ్ణి నమ్ముకొని నడిచేవారని, మన దేవాలయాలను చూస్తుంటే తెలుస్తోంది - అందువల్ల వారి కాలంలో వృక్షసంపద, పంటలు సమృద్ధిగా ఉంటుండేవి. కరువుకాటకాలు లేకుండా సకాలంలో వర్షాలు కురిసి ఋతువులవారీగా పంటలు పండి అందరూ సంతోషంగా జీవించేవారు. ఇప్పుడున్నట్లు అకాలవర్షాలు, పంటనష్టాలు ఉండేవికావు.

భారతీయ సంస్కృతికి మూలం కుటుంబవ్యవస్థ. కుటుంబ విలువ, ఆ కుటుంబంలోని వ్యక్తులు, వారి వ్యక్తిత్వంమీద ఆధారపడి ఉంటుంది. కాని ప్రస్తుతం కుటుంబంకంటే, వ్యక్తుల వ్యక్తిత్వం కంటే డబ్బే ప్రధానంగా నడుస్తున్నది. అది పట్టణాలకు, పల్లెలకు వారధిగా నిల్చింది. ఇంధనంగా నడుపుతున్నది.

పల్లెవారికి పట్టణాల్లోని భవంతులు, బడాబాబులు కనిపిస్తున్నారు. పల్లెల్లోని ప్రజలు పట్టణప్రాంతాలకు వలస వస్తున్నారు. పంటపొలాలు బీడువారి ప్లాట్లుగా రూపాంతరం చెంది వ్యాపారానికి నిలయంగా మారుతున్నాయి. చెట్లు విరిగి, చేలు ఎండిపోయి, బక్కచిక్కిన రైతులు, వ్యాపారుల, విద్యా, వైద్య, కార్పొరేటువారి చేతుల్లో దగాపడ్తున్నారు. వృక్షాలన్నీ మరుగుజ్జులై పక్షులన్నీ ఎగిరిపోతున్నట్లుగా కుటుంబాలన్నీ ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా ప్రేమానురాగాలు పల్చబడ్డాయి. పగలు పెరిగాయి. తల్లీలేదు, తండ్రీలేదూ, తమ్ముడులేదూ, అవ్వలేదూ, బువ్వాలేదూ, ఒకరినొకరు డబ్బుకోసం బంధుత్వాలు మరచి హత్యలుచేసుకుంటూ, డబ్బే ప్రధానంగా బతుకుతున్నారు. ఇక వంశమంటూ ఎక్కడ నిలబడుతుంది.

తల ఎత్తకుండా తల తిప్పకుండా టీవీలకు అతుక్కుపోయి సీరియస్‌గా సీరియల్స్ చూస్తూ వచ్చినవాడు, మనవాడా? పరాయివాడా? అన్నది గుర్తించకుండా తెల్లమొహం వేస్తూ వచ్చినవారినే ప్రశ్నిస్తున్నారు. ఉపన్యాసాల వరకు, పత్రికల ప్రకటనల వరకు మనవారు, మన ఊరివారని చెప్పుకుంటున్నారు. కలిసినపుడు మాట్లాడేది పెదవులతోనే. ఆ పిలుపు అంతవరకే.

ఒకప్పుడు ఉమ్మడికుటుంబాలు వటవృక్షాలుగా పెరుగుతుండేవి. కలిసిఉంటే కలదు సుఖమన్న రోజులు పోయాయి. కలిసిఉంటే కలహాల కాపురాలుగా మారిపోయి, కోర్టువరకో, లేక కాటివరకో పోతున్నాయి.

కుటుంబంలో ఉన్న పిల్లలకు అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ-తాతయ్యల ఆప్యాయత, బోసినవ్వులు కరువయ్యాయి. ముక్కుపచ్చలారని మూడేండ్ల వయస్సుకే బడిబాట పడ్తున్నారు. వారికవి బంధిఖానాలుగా మారుతున్నాయి. చదువు గుదిబండయింది.

కుటుంబ విచ్ఛిన్నాలతో కులవృత్తులు కుంటుపడ్డాయి. కల్తీకార్ఖానాలు తయారై నిర్వాహకులు శ్రీమంతులవుతున్నారు. వంశవృక్షాలు కనుమరుగవుతున్నాయి. శ్రీమంతుల వృక్షాలకు బీజాలు పడుతున్నాయి. 'ఋషి మూలం జగత్' నుండి "ధనం మూలం జగత్" అన్నట్లు వంశవృక్షాలు పెరుగుతున్నాయి.

విచ్ఛిన్నమవుతున్న ఈ కుటుంబవ్యవస్థను స్వార్థంవీడి బలపరచండి. కుటుంబవ్యవస్థను బలపరచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించి వాటిని ఆచరించండి.

**కొన్ని మంచి ఉదాహరణలు :**

- తల్లిదండ్రులు ఉన్నంతవరకు వారే కుటుంబపెద్దలు. వారి మార్గదర్శనంలోనే జీవనం.
- అన్నమాటే శిరోధార్యం. ఆయన ఆధ్వర్యంలోనే కుటుంబ పాలన.
- చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న సోదరులు, ఉన్న భూములను, ఆస్థులను వ్యవసాయం చేసుకుంటున్న సోదరులకే ఇచ్చివేయడం. పైగా వారి సంతానానికి పట్టణాలలో చదువుచెప్పించడం, ఖర్చులు భరించడం.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. భారతీయ సంస్కృతికి మూలం కుటుంబవ్యవస్థ అన్నారుకదా! ఇలా అనడం సమంజసమేనా? ఎందుకు?
2. ప్రస్తుతం మన కుటుంబవ్యవస్థలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటున్నాయి?
3. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులవల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలు చెప్పండి?
4. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడానికి లేదా కుటుంబ విలువలు దిగజారడానికి కారణాలు తెల్పండి.
5. కుటుంబ వ్యవస్థలో విలువలు బలపడాలంటే మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- భారతీయ సంస్కృతిలో కుటుంబ విలువలు పెంపొందించడంలో మన కర్తవ్యాన్ని తెలియజేయండి.
- మీ గ్రామంలో ఎన్ని ఉమ్మడి కుటుంబాలున్నాయో గుర్తించండి. ఏమైనా రెండు కుటుంబాల వ్యక్తులతో ఉమ్మడి కుటుంబంలోగల ప్రయోజనాలను, ఇబ్బందులను చర్చించండి. వారి అభిప్రాయాలను తెలియజేయండి.

## తెలుసుకోండి

కొండంత ప్రేమను పిల్లలందరికీ పంచేంత పిచ్చిగుండెలెవరివంటే – సందేహమెందుకూ... అవి అమ్మవీ నాన్నవీ. పొత్తిళ్ళలో పసినవ్వు పువ్వు పూయడానికి ఎంత యాతనైనా పంటిబిగువున భరిస్తుంది తల్లి. పేగు పంచిన ఆ మాతృదేవతే పసికందు బుగ్గగిల్లి, ఉగ్గుపాలు పోసి, ఊయలలూపి, జోలపాడి, బజ్జోపెడుతుంది. ముద్దుబిడ్డ చిట్టి పొట్టి మాటలకు మురుస్తూ, బుడిబుడి నడకల తప్పటడుగులు మైమరుస్తూ ఎప్పటికప్పుడే ఉప్పొంగిపోతుంటాడు తండ్రి. అమ్మా, నాన్నా, అన్నా, అక్కా చెల్లీ, తమ్ముడూ వంటి పిలుపులతో వెల్లివిరిసే ఇల్లే అన్ని బంధాలూ బాధ్యతలూ నిండిన పొదరిల్లు. అక్కడ దంపతులన్న రెండు తాళ్ళనూ ఒకటిగా కలిపి ఉంచే ముడినే సంతానమనుకుంటే, ఆ అనుబంధానికో బాధ్యతనిచ్చి సుఖసంతోషాలందించేది కుటుంబం.

ఏ సంసారములోనైనా ప్రతివ్యక్తి ఉన్నతీ పక్కవ్యక్తితో ముడిపడి ఉంటుంది. పిన్నలు, పెద్దలు ఒకరితో ఒకరు అంత గౌరవాదరాలతో మెలగడమన్నది కవి శ్రీనాథుడు దర్శించినట్లు "సకల ఐశ్వర్య సమృద్ధి". ముచ్చటైన ముక్కులు, వచ్చీరాని రెక్కలున్న పిచ్చుకల కనువిందూ ఉంటుందా ఇంట. అవే చిరుప్రాణులు చిన్నపాటి గూళ్ళలో చేరి కిచకిచ ఆటలాడటమూ వీనులవిందుగా కనిపిస్తుందక్కడ. పిల్లాపాపల కేరింతలలా కొనసాగిపోతుంటే, అటే చూస్తూ ముచ్చట పడిపోతుంటారు. తాతలు, అవ్వలు తిరుపతి వేంకటకవులన్నట్లు వారిని 'సంతతియందు వత్సలత సర్వమున్ మురిపింపజేయు'.

కాలం ఆగుతుందా, రూపురేఖలు మారకుండా ఉంటాయా? తల్లిదండ్రుల తలలు ముగ్గుబుట్టలవుతాయి. ముఖాలు ముడతలు పడతాయి. కంటిచూపు సన్నగిల్లుతుంది.చేతులు పట్టు సడలుతుంటే, కాళ్ళకు వణుకులొస్తుంటే... ఆ స్థితిని చూస్తుంటే సంతానానికి గుర్తొచ్చేవి – చిరుగాలికి గలగలలాడే ఎండుటాకులు, ఎప్పుడు ఏ క్షణాన రాలుతాయో అన్నట్లుండే పండుటాకులు. జన్మకారకులను ఇలవేల్పుగా భావించి, ఆ వృద్ధుల ఆశీర్వాద ఫలాలకు చేతులు చాచాల్సిన విధి పిన్నలది. శ్రవణుడిలా మాతాపితరుల్ని కావడిలో కూర్చోబెట్టుకుని భుజాలమీద మోస్తూ కోరినచోటుకల్లా తిప్పనక్కర్లేదు. 'మీరే కల్పవృక్షాలు' అంటూ గణపతిలా ప్రదక్షిణలు, మరికొందరిలా సాష్టాంగప్రణామాలు, మణిమాణిక్యాలతో అభిషేకాలు నవరత్నఖచిత సింహాసనాలపైన ఉంచి సత్కారాది మహాకార్యక్రమాలు చేయనక్కర్లేదు పెద్దలకు. అసలీ లోకంలో ఏ ప్రతిఫలాపేక్షా ఉండని ప్రాణులు అమ్మానాన్నలే. వారి చూపుల్లో, మాటల్లో, రాతల్లో, చేతల్లో అన్నింటిల్లోనూ ప్రతిఫలించేది సంతానమంతా బావుండాలన్న ఒక్కగానొక్క కోరికే. పితృవాత్సల్యానికి ప్రతీకగా నిలచిన దశరథుడిదీ నిరంతర రామనామస్మరణే. యాగరక్షణకు రాముణ్ణి తనవెంట పంపమన్న ముని విశ్వామిత్రుడ్ని – ముఖం వెలవెలబోగా, ఊపిరి ఆగినట్లుగా చూశాడా చక్రవర్తి! 'పదహారేళ్ల పసివాడు లేకుండా ఇక్కడ నా

ప్రాణాలుండవు. నన్ను తీసుకుపోండి. వాడి బదులుగా నేనే సకల సైన్యంతో వచ్చి యజ్ఞపరిరక్షణ చేస్తా' అని అర్థించిందా తండ్రి హృదయం. అటుతరువాతి ఘటనల పరంపరలో, తనవల్లనే దూరమై అడవులపాలైన కొడుకు కోసమే గుండెలవిసేలా విలపించి పరమపదించాడాయన.

మంచి గంధంలా గుబాళించే మానవతే కొడుకుకైనా, కూతురికైనా అలంకారం. 'కూనలమ్మ' పదకర్త హితవు పలికినట్లు 'జపతపంబులకన్నా చదువుసాములకన్నా మానవ గుణమేమిన్న'. కసుర్లు, విసుర్లతో అనుదినం ప్రత్యక్ష నరకాన్ని చూపించి 'ఇక చాలు ఈ బతుకు' అనుకునేంత దుర్గతిని కన్నవారికి కల్పించకుంటే అదే పదివేలు. మేధావి గోథే దర్శించినట్లు ప్రవర్తన ఓ అద్దం. ఏ మనిషి ప్రతిబింబమైనా అందులోనే'. తనయులు పెరిగి పెద్దయి పెళ్ళిళ్ళయి మనువలూ, మనువరాళ్ళనూ అందించినా, ఆ ఇంట్లోవాళ్ళంతా తాతలకూ, అవ్వలకూ పసివాళ్ళే! అందరినీ కంటిరెప్పలా చూసుకోవాలనుకునేది, ఎవరైనా ఒక్కక్షణం కనిపించకున్నా ఒళ్ళంతా కళ్ళుచేసుకుని వెదకులాట సాగించేది వృద్ధులే. వైజ్ఞానిక పురోభివృద్ధితో, లోకమంతా బహుచిన్నదిగా కంటిముందే కనిపిస్తోంది. ఇంటా బైటా మనిషి మనసు అంతకంతకూ కుంచించుకుపోతుండటమే నేటి వైచిత్రి. మన సంస్కృతికి మూలస్తంభాలైన ఇల్లు, కుటుంబం కొందరు కుమారులు, కుమార్తెల మూలాన కదలబారుతున్న వైనం పరమదుర్భరం. 'తల్లిదండ్రులతోడ తగవుతాడుట కీడు' అనికదా వేమన వేదం. ఎవరికి వారుగా గిరిగీసుకుని, ఆ పరిధిలోకి కన్నవారినైనా రానివ్వని స్వార్థబుద్ధుల బెడద ఇప్పుడు చైనా సమాజాన్నీ నిలువునా పట్టి పీడిస్తోంది. సాదర స్పర్శలకు, మనఃపూర్వక పరామర్శలకు అక్కడా కరవుకాలం దాపురించడంతో ముసలితనం సమీప ప్రాంతాలకు వలసపోతోంది. ఆ వృద్ధజీవులకు బాసటగా చైనా ప్రభుత్వం ఇటీవల చేసిన చట్టం బిడ్డలు తల్లిదండ్రుల దగ్గరికి ఖచ్చితంగా ఏడాదికి రెండుసార్లు వెళ్ళి తీరాల్సిందే నంటోంది. ఒకరికొకు అండగా ఉండటాన్ని ఇష్టపడే చైనాలో ఇప్పటి స్థితి ఇది. అక్కడైనా ఇక్కడైనా మార్పుతోనేకదా మనిషికి ఉన్నతి!

**సూక్తి**

**'మనం', 'మనది' అనే ఐక్యతా బీజం మొలకెత్తితే జగమంతా కుటుంబమే!**

# 9 వ్యర్థాల పునర్వినియోగం

**I. ప్రధాన విలువ**

పర్యావరణ పరిరక్షణ

**II. ఉప విలువ**

వ్యర్థాల పునర్వినియోగం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- చెత్తాచెదారం వల్ల జరుగు కాలుష్యంపై అవగాహన పొందగలుగుతారు.
- "ఉపయోగించు-విసిరేయ్" పద్ధతిని కొంతవరకు తగ్గించుకోగలుగుతారు.

## IV. ఉపోద్ఘాతం

మనం వస్తువులను అవసరం తీరిన తర్వాత పారవేస్తున్నాము. ఆ చెత్తంతా కాలుష్యాన్ని కలిగిస్తుంది. అంతేకాకుండా కొత్త వస్తువులు తయారుచేయడానికి ముఖ్య ఖనిజం తరిగిపోతుంది. పెరుగుతున్న జనాభాకు, భవిష్యత్తు అవసరాలకు ఖనిజసంపద ఎలా సరిపోతుంది. అందువల్ల నిరుపయోగమైన వస్తువులను పునర్వినియోగించగలిగితే కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. ఖనిజసంపద తరుగుదలను నిలకడగా ఉంచవచ్చు. వ్యర్థాల పునర్వినియోగం గురించి తెలుసుకుందాం.

## V. విషయం

ప్రస్తుత జీవనశైలి ఆకర్షణీయంగా మారడానికి ఇరవయ్యో శతాబ్దిలో సంభవించిన పారిశ్రామిక ప్రగతే కారణమని అమెరికాలోని ఓ పర్యావరణ అధ్యయన సంస్థ పేర్కొంది. ఓసారి ఉపయోగించిన వస్తువులో ఏ కారణంచేతనైనా ఇబ్బంది తలెత్తితే, దాని బాగు చేయడానికి అయ్యే వ్యయంకన్నా కొత్త వస్తువుల తాలూకు ధర తక్కువగా ఉండడంతో ఒకసారి వాడిన వస్తువులవైపు తిరిగి చూడరాదని భావం బలంగా వ్యాపించింది. ముఖ్యంగా నిత్యావసర వస్తువుల్ని తక్కువ ఖర్చుతో ఉత్పత్తిచేసే పరిశ్రమలు పోటీపడి ధరల్ని తగ్గించడంతో “ఉపయోగించు విసిరిపారేయ్” పద్ధతి అభివృద్ధిచెందిన దేశాలలో బలపడింది.

పారిశుధ్య ప్రక్రియల్ని నిర్లక్ష్యం చేయడం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలు అసంఖ్యాకం. ఆరేళ్లకిందట గుజరాత్‌లోని తీరనగరమైన సూరత్ పారిశుధ్యలోపంవల్ల చెత్తాచెదారం విపరీతంగా పేరుకుపోవడంవల్ల ప్లేగువ్యాధి గుప్పెట్లో గడగడలాడిన వైనం అందరికీ తెలిసిందే. అలాంటి నగరాన్ని కమీషనర్ హోదాలో ఓ కొలిక్కి తీసుకువచ్చిన తెలుగుబిడ్డ ఎస్.ఆర్.రావు సేవల్ని దేశం ముక్తకంఠంతో ప్రశంసించింది కూడా.

మనదేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబాయి, చెన్నై, కలకత్తా నగరాలు సైతం “ఉపయోగించి విసిరేయ్” సంస్కృతీ ప్రభావం వల్ల చెత్తాచెదారం సమస్యను ఎదుర్కొంటున్నాయని నాగపూర్‌కు చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ ఓ నివేదికలో పేర్కొంది. ప్రధాన నగరాల్లోని నగరపాలక సంస్థలు తమ బడ్జెట్ 5 నుంచి 30 శాతం వరకు చెత్తాచెదారం తొలగింపునకే వెచ్చిస్తున్నా, అది నగరంలో కొద్ది ప్రాంతాలకే పరిమితమవుతోందని ఈ సంస్థ వెల్లడించింది.

దేశంలోని వివిధ నగరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించడం, తరలించడం, పాతిపెట్టడం అనే అంశాల మీద సాంకేతికపరమైన చర్చలు నిర్వహిస్తున్నారు. చెన్నైలో నిర్వహించిన సమావేశానికి అమెరికాలోని మసామాసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన రాజీవ్ చాతార్ అనే బయోకెమికల్ ఇంజనీర్ ఇంట్లో పోగైన వ్యర్థ పదార్థాలను వీధిలో పారబోసే విధానానికి స్వస్తిచెప్పి పెరట్లో లోతైన గుంతలో పూడ్చిపెట్టడం మంచిదని సూచించారు. అలా చెయ్యడంవల్ల సేంద్రియ పదార్థాన్ని సూక్ష్మజీవులు తినివేస్తాయని, వ్యర్థపదార్థాల పరిమాణాన్ని గణనీయంగా తగ్గిస్తాయని పేర్కొన్నారు.

మనరాష్ట్ర రాజధానిలోనూ, ఇతర పట్టణాల్లోనూ చెత్తాచెదారం సృష్టిస్తున్న సమస్యల గురించి వార్తలు వెలువడని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. జనావాసాలచుట్టూ చెత్తకుప్పల్ని పెంచి, స్థానికుల్ని ముప్పుతిప్పలకు గురిచేస్తున్న నగరపాలక సంస్థలమీద ఫిర్యాదులూ, సాక్ష్యాధారాలు అనేకం వున్నాయి. తెలంగాణలో అధికసంఖ్యలో మున్సిపాలిటీలున్న జిల్లాగా పేరుపొందిన రంగారెడ్డిజిల్లాలో 200 మురికివాడలు వున్నాయి. రోజూ సగటున

731 మెట్రిక్‌టన్నుల చెత్త పోగవుతోందని గణాంకాలు చెప్తున్నాయి. లక్షల ఖర్చుతో నిర్మించిన గార్బేజ్‌హౌస్‌లు నిరుపయోగంగా మిగిలిపోవడం విమర్శలకు గురవుతోంది. ఇటీవల చెత్తను ఉపయోగించి విద్యుత్తును రూపొందించే పరిశ్రమలు రూపొందడం పరిస్థితిని కొంతమేరకు సరళతరం చేశాయనాలి.

వ్యర్థపదార్థాల్ని మొత్తంగా పారబొయ్యాల్సిన అవసరంలేదని రీసైక్లింగ్ ద్వారా వాటిని ఉపయోగించేందుకు వీలుగా రూపొందించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. చెత్తాచెదారాన్ని అరికట్టడం కోసం "3–ఆర్" సూత్రాన్ని అమెరికాలోని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. రెడ్యూస్, రీయుజ్, రీసైక్లింగ్ అనే మూడు పదాలలోని మొదటి అక్షరమైన "ఆర్" ను ఈ సూత్రానికి పేరుపెట్టడం కోసం స్వీకరించారు – ఈ చెత్తను ఉత్పత్తిచేసే అనవసరమైన వస్తువినియోగాన్ని తగ్గించడం ఉపయోగించి పారవేసే పద్ధతికి స్వస్తిచెప్పి కొన్నాళ్ళపాటు ఆ వస్తువులను వాడడం, వ్యర్థపదార్థాల్ని నిర్మూలించిన తర్వాత దాంతో మరో వస్తువును కొత్తగా ఉత్పత్తి చెయ్యడం ఈ "3–ఆర్" సూత్రంలోని ప్రధానాంశాలు. అమెరికాలో స్వచ్ఛంద సంస్థలు, బడిపిల్లలు వారాంతపు సెలవు దినాల్లో చెత్తాచెదారం పేరుకుపోయిన గుట్టలకు వెళ్ళి వాటిలో రీసైక్లింగ్ చెయ్యడానికి అనువైన వాటిని సేకరించడం, వాటిని గాజు, ప్లాస్టిక్ వ్యర్థపదార్థాల్ని రంగులవారీగా విభజించి ఏరుతారు. ఇలా చేసేటప్పుడు ఆరోగ్య పరిరక్షణకు మాస్కులు వాడుతున్నారు.

"హీనంగా చూడకు" దేన్నీ అనే మహాకవి మాటలు కవితా వస్తువులకే కాదు, వ్యర్థపదార్థాలకూ వర్తిస్తాయి. మనదేశంలోని గృహావసరాలకు వినియోగిస్తున్న 1.5 కోట్ల లీటర్ల జలాలు, మురికికాలువల్లోనూ, నదుల్లోనూ కలుస్తున్నాయని, వాటిని ఎక్కడికక్కడ మడుగులుగా ఏర్పర్చటం ద్వారా జలచరాల్ని పెంచి, ఆహార అవసరాల్ని తీర్చవచ్చునని పశ్చిమబెంగాల్‌లోఏని బ్యారక్‌పూర్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మణిరంజన్ శర్మ పేర్కొన్నారు. దీనికి ఉదాహరణగా పశ్చిమబెంగాల్‌లో రహారా అనే గ్రామంలో జరిగిన ఆదర్శదాయక పథకాల గురించి వివరించారు. చెత్తాచెదారాన్ని యుద్ధంలో సైతం వినియోగించవచ్చునని అమెరికాలోని స్పెక్ట్రో డైనమిక్ సిస్టమ్ సంస్థ నిరూపించింది. బొగ్గునుంచి విద్యుశ్చక్తిని రూపొందించిన తర్వాత వెలువబడే వ్యర్థపదార్థంతో యుద్ధరంగంలో బూడిద మేఘాల్ని సృష్టించి శత్రువు కళ్ళుగప్పే సాధనాన్ని రూపొందించింది.

ప్రకృతిలో ప్రతి వస్తువుకూ ప్రయోజనం ఉంది. అయితే మనిషి తన అవసరాల్ని అనవసరంగా పెంచుకొని వాటి దుర్వినియోగపరచడం వల్ల వ్యర్థపదార్థాల సమస్య తలెత్తుతోంది – చెత్తాచెదారం గురించి వినడానికి, చర్చించడానికి ఏముందిలే అనిపించినా దానివెనుక బోలెడంత కథా వృథా వున్నాయి. తవ్వుతున్న కొద్దీ అవి మరింతగా ఉత్పన్నమవుతూనే ఉంటాయి. పరిష్కారంకోసం ప్రయత్నించకపోతే పర్యావరణానికి విఘాతం తప్పదని అర్థం చేసుకోవాలి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. వ్యర్థాల పునర్వినియోగం అంటే ఏమిటి?
2. "ఉపయోగించు, విసిరేయ్" పద్ధతి పోవాలంటే ఏం చేయాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీరు మీ కుటుంబసభ్యులు ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ సంచులు ఉపయోగించకుండా ఉండండి, మీ అనుభవాలు చెప్పండి.

## తెలుసుకోండి

### ప్రగతికి పూచిన విషాదం ఈ కాలుష్యం

మోసపోయి, జీవితంలో ఓడిపోయిన తెలుగు సినిమా కథానాయకి ఒకచోటికి వెడుతుంది - ఎక్కడికో తెలుసా? పాతాళం అంచుకి! సినిమా దర్శకుడు కెమెరాను లోయను క్లోజప్‌లో చూపి కథానాయకి పడిపోతుందనే మనకు ఆందోళన కల్గిస్తాడు. కథానాయకి పాతాళం అంచున వున్న పరిస్థితి సరిగ్గా మనకు సరిపోతుంది. మనలను కాపాడ్డానికి కథానాయకుడు రాడు. ఎందుకంటే యిది సినిమా కాదు. పర్యావరణం మీద ప్రసారం అయ్యే కార్యక్రమానికి "లివింగ్ ఆన్ ది ఎడ్జ్" అని పేరు. స్పందించే ప్రతి హృదయం వినాశన మవుతున్న ప్రకృతికి తల్లడిల్లుతుంది!

ముప్పు మునుముందుకు ముంచుకు వస్తోంది. మనం రాబందులకే రాబందులం ఎందుకంటే మనం వాడే డి.డి.టి., హెచ్.సి.హెచ్. వంటి రసాయనాలే రాబందులను కడతేర్చడానికి తోడ్పడుతున్నాయని - వాటి శరీరాల్లో లభ్యమయిన రసాయనాల ఆనవాళ్ళు విశదపరుస్తున్నాయి.

కుళ్లిన మృత కళేబరాలనూ, దుర్గంధభూయిష్టమైన కళేబరాలను తిని మనకు పారిశుద్ధ్యాన్ని పెంచే ఎందుకంటే ముప్పు వస్తే!? భరత్‌పూర్‌లోని నేషనల్ పార్కులో ఈ ధోరణి కనబడింది. ఇపుడు ఢిల్లీలో అన్ని తాజావార్తలు చెబుతున్నాయి. ఢిల్లీలోని చెత్తాచెదారాన్ని, చనిపోయిన జంతుకళేబరాలను పారవేసే ఘాజీపూర్ ప్రాంతంలో రాబందులు బారులు తీరి వుండేవి. అయితే గత రెండేళ్ళుగా ఒకటి కూడా కనబడటం లేదు. టన్నులకొద్ది కళేబరాలను స్వాహా చేసే ఈ రాబందులు లేకపోతే ఏమవుతుంది? లావోస్, కాంబోడియా, వియత్నాం, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో రాబందులు లేక మృత జంతు శరీరాలు కుళ్ళి కొత్తరోగాలకు రహదారులు వేస్తున్నాయి. ఇప్పుడు ఈ పరిస్థితి ఢిల్లీకి దాపురించింది. తర్వాత అది రేపు మన వూరికి రావచ్చు. ఢిల్లీలోని నగర కాలుష్యాన్ని భరించలేక రాబందులు సురక్షిత ప్రాంతాలకి తరలివెడుతున్నాయని

ప్రపంచ జంతు సంరక్షణానిధికి చెందిన శాస్త్రవేత్తలు అంటున్నారు. రాబందుల నుంచి విమానాలకు ప్రమాదాలు వస్తాయని విమానయానశాఖ గైకొన్న చర్యలు కూడా రాబందులు అదృశ్యం కావడానికి తోడ్పడ్డాయని చెబుతున్నారు. ఇది పూర్తిగా నిర్ధారణ కావాలి. ఏది కారణం అయినా రాబందులు కనుమరుగు కావడం అన్నది వాస్తవం! దానికి మూలం కాలుష్యం! చూశారా - మనం ఎంత దారుణంగా, నిస్సహాయంగా పాతాళం అంచున నిలుచుని ఉన్నామో! పొంచి వున్న పెను ప్రమాదాలకు ఇది ఒక ఉదాహరణే! ఇంకా యిటువంటి పోకడలు ఎన్నో! మరి. ఆ కారణాలను విశ్లేషించవద్దా?

ఇంతవరకు ప్రగతి అంటే రోడ్లు, పొగగొట్టాలు, కరెంటుతీగలు అని పొరపాటుపడ్డాం. ఈ ఆధునిక ప్రపంచాన్ని రూపుదిద్దిన పనిముట్లే ప్రకృతి సంపదను హరింపచేయడమే కాదు. మారిన పర్యావరణం రోగక్రిములకు ఆశ్రయ దాత అయ్యింది. వ్యవసాయం, నగరీకరణ కారణంగా మన పర్యావరణతుల్యత దెబ్బతిని, దోమల లాంటి రోగవ్యాప్తికి పాటుపడే ఏజెంట్లు పుష్కలంగా పెరిగాయి. హైవేలు, వ్యవసాయ కాలువలు, పారిశ్రామిక వాడలలో మలేరియా విపరీతంగా పెరుగుతోంది!

అంటే ఏమిటి? ఏదయితే ప్రగతి అని భావించామో ఆ ప్రగతి కొమ్మచివర కాలుష్యం విచ్చుకుని, మన అస్థిత్వాన్నే దెబ్బతీస్తోంది. ఏదయితే అభివృద్ధి అని భావించామో అదే అభివృద్ధి నాభిలో అనారోగ్యంగా పుచ్చిపోతుంది! అందుకే నేడు అభివృద్ధి అనేదానికి సామాజిక ఆరోగ్యమే కొలబద్ద అని అంటున్నారు. నాలుగోవంతు రోగాలకు పర్యావరణ కాలుష్యం కారణం అని పరిశోధన చెబుతోంది.

మనం అజాగ్రత్తతో, అవివేకంతో చేస్తున్న ప్రకృతి వినాశకర చర్యల మూల్యం ఎంతో తెలుసా? 1992 లో ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం 33,950 కోట్ల రూపాయలు. అంటే యింత మొత్తం చెల్లిస్తే కానీ మనం చేస్తున్న ప్రకృతి వినాశనం బ్యాలెన్స్ కాదు. ఇది ఏటా పెరిగే పరిస్థితే కానీ, తగ్గే అవకాశం లేదు. చూశారా - ప్రకృతి ప్రసాదించిన సహజవనరులను మూర్ఖంగా వాడటం వల్ల కలిగే అనర్థాల పర్యవసానం? మరి పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అవసరం కాదా? విచ్ఛిన్నమయిన పర్యావరణం, పేదరికం కలిసి, రోగాల సంఖ్యను, రోగుల సంఖ్యను పెంచుతున్నాయి. సామాజిక ఆరోగ్యం, పర్యావరణం పెరిగితే రోగాలు తగ్గుముఖం పడతాయని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. సరైన గాలి, వెలుతురు, సరైన శానిటేషన్ వ్యవస్థ లేకపోవడంతో ఎన్నో రోగాలు విపత్తులా మారాయి. కేవలం సరయిన నీరు, పారిశుద్ధ్య వ్యవస్థ లేని కారణంగా 60-80 శాతందాకా కొన్ని రోగాలు వస్తున్నాయి. మీకు ఆశ్చర్యం కలుగవచ్చు. దేశంలోని 4000 పట్టణాలలో కేవలం 200 పట్టణాల్లో మాత్రమే పారిశుద్ధ్య వ్యవస్థ సక్రమంగా పనిచేస్తోంది.

అలాగే చెత్తాచెదారం మరో ముఖ్య సమస్య. ఆస్పత్రులలో తయారయ్యే మలినాలు, చెదారం తీసివేయడానికి సరయిన పద్ధతి లేదు. ఆస్పత్రులలో తయారయ్యే మలినాలు పేరుకుపోవడం మరో సమస్య. దీన్ని నిరోధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

### అవగాహన పెంచడమే అసలు ఉద్దేశం

ప్రకృతి రమణీయత, సౌందర్యం గురించి అప్పుడప్పుడు మనం ప్రస్తావించినా - కాలుష్యం ఎలా మీసాలు మెలివేస్తుందో అవిచ్ఛిన్నంగా మనం చూస్తూనే ఉన్నాం. అయితే పాలిథీన్ సంచులైనా, శీతల

పానీయాలైనా, కాస్మొటిక్స్ అయినా, జండర్ బెండర్స్ అయినా – యింత స్థాయిలో మనల్ని కబళిస్తున్నాయని చెప్పడం ఎందుకోసం? భయపెట్టడమా? బెదరగొట్టడమా? ఎందుకు? అసలు లక్ష్యం ఏమిటి? వంటి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. సెన్సేషన్ దిశగా కాక, అవగాహన కల్గించే రీతిలో ఈ వాదన నడుస్తోందని పలుసార్లు వివరించినా ఎంతోమందికి సందేహాలు కలుగుతూనే వున్నాయి. అవును... అలా అనుకొనే అవకాశం వుంది. ఈ విషయం గురించి కొద్దిగా అవలోకిద్దాం.

ఈ శతాబ్దంలో పదార్థికమైన పరిశోధనలు మునుపెన్నడూ జరగనంత రీతిలో వేగంగా జరగడం అందరికీ తెలుసు. అవసరాన్నిబట్టీ, ఆవిష్కర్త సృజననను బట్టీ ఆ పరిశోధనల అనువర్తనంగూడా మొదలైంది. పదార్థాన్ని శక్తిగా మార్చవచ్చని ప్రతిపాదించినపుడు అణ్వాయుధాల వినాశనం గురించి ఆ శాస్త్రవేత్తలకు తట్టివుండదు. అలాగే నక్షత్రాల అంతర్గత నిర్మాణాన్ని వివరించిన సైన్స్ యుద్ధ సామాగ్రికి పదునుపెడుతుందని ఎవరూ ఊహించలేదు. అయినా వాస్తవంగా జరిగింది కల్పన కన్న విచిత్రమైంది. అంత స్థాయిలో పరిశోధనల అద్భుతాలు మెరుపుల్లా ఈ శతాబ్దంలో ఆవిష్కరించబడ్డాయి. దానితో అప్లయిడ్ టెక్నాలజీ పెరిగిపోవడం, ఆరోగ్యసేవలు మెరుగై ఆయుష్షు, తర్వాత జనాభా పెరగడం జరిగింది. దానితో ఏం జరిగింది?

క్రిమిసంహారిణులు, రసాయన ఎరువులు వంటి వాటిని విపరీతంగా వాడటం వల్ల కొబ్బరి బోండాలలో కూడా కాలుష్యం కుర్చీ వేసుకొంది. పైపెచ్చు వినిమయ ధోరణి విపరీతంగా రావడంతో ప్రతిదాని వాడకం పెరిగింది. ఈ విషయంలో మన దృష్టి మారితే తప్పా లాభం లేదు. ఉదాహరణకు పాలిథీన్ బ్యాగులు నిషేధించారని, కాగితం బ్యాగులు పూర్తి ప్రత్యామ్నాయం కాదు. కాగితం కవర్ల వాడకం పెరిగినా – అవికూడా ప్రకృతి వనరుల నుండే తయారవుతాయని మరువకూడదు. వాటికి కూడా పరిమితి వుందని కూడా గుర్తించాలి. అందువల్ల చాలా జాగ్రత్తగా మనం నడుచుకోవాల్సి వుంటుంది.

ఉదాహరణకు ప్లాస్టిక్స్ విషయమే తీసుకోండి అన్ని ప్లాస్టిక్స్ ప్రమాదకరమా? అసలు ప్లాస్టిక్స్‌తో ముడిపడి తయారుకాని ఆధునిక వస్తువు ఏదైనా వుందా? ఇక్కడ గమనించాల్సింది ఏమంటే దాదాపు 60 శాతం ప్లాస్టిక్స్ ప్రమాదంకాదు. వీటిని 'థర్మోసెట్ ప్లాస్టిక్స్' అంటారు. వీటిని రీసైకిల్ చేయడానికి వీలుపడదు. రేడియో, టీవీసెట్లు, కార్లు, గొట్టాలు, ఫర్నీచర్, పెట్టెలు, బకెట్లు, నీళ్ళట్యాంకులు, సూట్‌కేసులు, తలుపులు, కిటికీలు... మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. వీటి వాడకం మంచిదే... అంటే ఆ మేరకు కలప వాడబడకుండా, చెట్లు రక్షింపబడుతున్నాయి. అయితే పాలీయిథిలిన్, పాలీ ప్రొపలిన్, పాలీ స్టిరీన్, పాలీ వినైల్ క్లోరైడ్ – ప్లాస్టిక్స్ సాధారణంగా రీసైకిల్ చేయబడతాయి. కొన్ని ప్లాస్టిక్స్‌కు రసాయనికంగా ఎక్కువ స్థిరత్వం లేకపోవడంతో అవి వేడిచేయబడినా, తక్కువ పీడనానికి గురిఅయినా – ప్రమాదకర రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. అలా విడుదలయ్యేది కార్బన్ మోనాక్సైడ్. అలాగే పాలీ స్టిరీన్, పాలీవినైల్ క్లోరైడ్ ప్లాస్టిక్స్‌ను వేడిచేస్తే క్లోరిన్ వాయువును విడుదల చేస్తాయి. అంతేకాక యిటువంటి ప్లాస్టిక్స్ రీసైకిల్ చేసినపుడు క్రిమిసంహారక మందులు మొదలైన వాటిని శోషించుకుంటాయి.

ఇలా ప్రతిదాన్నీ ఏదో ఒకటి భయపెడుతోంది. జుత్తుకు షాంపు వేసుకోకూడదు. మొహానికి క్రీమ్ రాసుకోకూడదు. పెదాలకు లిప్‌స్టిక్ వేసుకోకూడదు, నోట్లో కూల్‌డ్రింక్ పోసుకోకూడదు... యిలా చిట్టా నడిచినపుడు అసహనం కాదా? ఇంతవరకు బద్ధకం పెంచుకుని, సౌఖ్యాన్ని మరిగి - యిపుడు వాడకం ఆపడం అంటే కుదురుతుందా? సమస్యను చర్చించినపుడు ప్రత్యామ్నాయం చూపకుండా భయపెట్టడం తగునా? అవును... మీ సందేహం అర్థవంతమే!

భౌతికశాస్త్రంలో డాక్టరేటు చేసి పర్యావరణరంగంలో అమోఘ కృషిచేస్తున్న శ్రీమతి వందనా శివ వంటి శాస్త్రవేత్త - కాలుష్యపు బెడదకు టెక్నాలజీయే కారణమని, టెక్నాలజీని వ్యతిరేకించే ఆలోచనా ధోరణి వచ్చిందని అంటున్నారు. డాక్టర్ పి.వి. ఇందిరేశన్ వంటివారు ఆమెను 'టెర్మినేటర్ ఆఫ్ టెక్నాలజీ' గా వ్యాఖ్యానిస్తున్నారు. వందనాశివ వంటి శాస్త్రవేత్త బేజారయిపోతే యిక మీరు భీతి చెందడంలో ఆశ్చర్యంలేదు. అవునా? అయితే ప్రత్యామ్నాయం అంత త్వరగా కనబడుతుందా? మనం పి.సి. సర్కార్‌లాగానో, రాజకీయవేత్తలాగానో మాయలు చేయలేం. అందువల్ల పరిష్కారాలు అంత సులువుగా కనబడవు. సమస్య మనలను పొడుస్తుంది కనుక సులభంగా గుర్తిస్తాం. కానీ అదే స్థాయిలో పరిష్కారం వుండదుగదా! అది ఏ పెద్ద శాస్త్రవేత్తో చూపాల్సి వుంటుంది. సమస్య జటిలమయినప్పుడు, పరిష్కారం దరిలో లేనప్పుడు మెదడు గింగిరాలు తిరగడం సహజమే! అయితే టెక్నాలజీని దూషిస్తే ఎలా? టెక్నాలజీని అలా వాడింది మనమేగదా! అదేదో కామధేనువు అనే భ్రమలో టెక్నాలజీని వాడితే ప్రమాదాలు కూడా పాతాళం స్థాయిలో వుంటాయి.

అవగాహన పెంచడమే ప్రస్తుత ఉద్దేశం. ఎందుకంటే పర్యావరణానికి సంబంధించి మన పరిస్థితి అక్కడే వుంది. ఎంత ఘాటుగా చెప్పినా ఫలితం లేదని ధూమపానం వంటి అలవాట్లు మనకు చెబుతున్నాయి. అందువల్ల ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతోంది. ఉదాహరణకు ప్లాస్టిక్ సంచుల వాడకం పర్యావరణానికి విఘాతం కల్గిస్తుందని దానిని నివారించడానికి ప్లాస్టిక్ సంచుల వినిమయం సాధ్యమైనంతమేర తగ్గించాలనే అభిప్రాయాన్ని ఎక్కువమంది గుర్తించి దానిని అమలుపరుస్తున్నారు. పర్యావరణ సమస్యలను ఇట్టే మాయం చేసే మంత్రదండం మనవద్ద సిద్ధంగా లేదు. అందువల్ల సమస్యను ఆకళింపుచేసుకొని, పర్యావరణానికి సాధ్యమైనంత తక్కువ విఘాతం కలిగించే పద్ధతుల్ని మనం అలవరచుకొందాం.

**సూక్తి**

ప్రకృతిని నువ్వు కాపాడితే ప్రకృతే నిన్ను కాపాడుతుంది.

# 10 దేనినీ గుడ్డిగా నమ్మకు

**I. ప్రధాన విలువ**

శాస్త్రీయ దృక్పథం

**II. ఉప విలువ**

శాస్త్రీయమైన వైఖరులు కలిగి ఉండడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- దేనినీ గుడ్డిగా నమ్మకుండా, ప్రతిదానికి కారణం ఉంటుందని తెలుసుకుంటారు. సమస్యను అధిగమించడానికి వివిధ కోణాలలో ఆలోచిస్తారు.

**IV. ఉపోద్ఘాతం**

శాస్త్రీయ దృక్పథం ప్రతి ఒక్కరి సొత్తు కావాలి. చిన్ననాటినుండి అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. శాస్త్రీయంగా ఆలోచించడం, పరిశీలించడం, ప్రశ్నించి శాస్త్రీయ పద్ధతుల ద్వారా విషయములను గ్రహించడం. తెలుసుకున్న విషయాల గురించి నిర్ధారణకు రావడం. ప్రతి విషయం వెనుక ఉన్న 'కారణం-ఫలితం' అవగాహన కోసం ప్రయత్నించడం అనేవి శాస్త్రీయ వైఖరులు. అలాంటి ఒక సమస్యకు ఎలాంటి ఫలితం పొందాలో తెలుసుకోండి.

## V. విషయం

గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న సైన్సు ఉపాధ్యాయుడు – ఆ గ్రామంలో 'సైన్సుపట్ల అవగాహన' అనే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశాడు. తను దయ్యం, భూతం, ఆత్మ ఇవన్నీ మన కల్పనలని అక్కడి ప్రజలకు వివరిస్తున్నాడు. అంతలోనే ఒకతను లేచి మీరు చెప్పేదంతా అబద్ధమంటూ కొన్ని ప్రశ్నలు లేవదీశాడు. వారిద్దరిమధ్య జరిగిన సంభాషణను ఒకసారి పరిశీలించండి.

"మీకు గాలి కనిపిస్తుందా"? అని అతను అడగగానే "లేదు" అని సైన్సు ఉపాధ్యాయుడు సమాధాన మిచ్చాడు." మీకు గాలి కనిపించనట్లే దేవుడు, దయ్యము, భూతము, ఆత్మ కనిపించిందని చెప్పాడు. వెంటనే ఆ ఉపాధ్యాయుడు "రెండు వేర్వేరు అంశాల్ని పోల్చినపుడు నీకు అనుకూలంగా ఎందుకు పోల్చుకుంటున్నావు? నేను ఓ ప్రశ్నవేస్తాను, నీకు పక్కనున్న గొర్రె కనిపించిందా?" అని అడిగాడు. సైన్సు ఉపాధ్యాయుడు అతను 'కనిపించింది' అని సమాధానం చెప్పాడు. "మరి భూతం, దయ్యం, ఆత్మ ఎందుకు కనిపించవు?" అని ఉపాధ్యాయుడు మళ్ళీ అతన్ని ప్రశ్నించాడు. అపుడు అతను ప్రపంచంలో కనిపించే వాటిని, కనిపించని వాటితో పోల్చడం బుద్ధి తక్కువ అవుతుంది. కనిపించని వాటికి, కనిపించని వాటితోనే పోల్చాలి. అందుకే గాలిని కనిపించని ఆత్మ, భూతం, దయ్యం విషయాలతో పోలుస్తున్నాను. కాబట్టి మీరు గాలిలాగా ఆత్మాది విషయాలున్నాయని ఒప్పుకోండి" అన్నాడు. ఇదంతా ఓపికగా విన్న ఉపాధ్యాయుడు "కనిపించని వస్తువుల్ని కనిపించని వాటిలో పోల్చుకున్నంతవరకు ఓకే! మరి గాలికి బరువుంది, బెలూన్లో ఊదితే అది కొంత ఘనపరిమాణం అవుతుంది. దానిని చల్లబరిస్తే ద్రవం అవుతుంది. ఇంకా గాలిని చల్లబరిస్తే మనం పట్టుకోగలిగినంత గట్టిగా ఉండే ఘనరూపం కూడా వస్తుంది. మరి నువ్వంటున్న ఆత్మ బరువెంత? దానిని బెలూన్లో ఊదితే సాగుతుందా? గాజుసీసాలో పెట్టి చల్లబరిస్తే ఆత్మ ద్రవరూపంలోకి వస్తుందా? దానిని ఇంకా చల్లబరిస్తే ఘనరూపంలోకి మల్లించగలమా? అని అతనికి వివరించాడు. ఇదంతా విన్న మూఢనమ్మకంతో ఉన్న అతను మరింత గట్టిగా మాట్లాడుతూ 'గాలిలాగే కనిపించినంత వరకే ఆత్మ సంబంధ విషయాల్ని పోల్చాలిగానీ, గాలికున్న అన్ని లక్షణాలతో నువ్వు ఆత్మ విషయాల్ని పోల్చకూడదు. అలా పోల్చడం నీ అవివేకం, మూర్ఖత్వం, మిడిమిడి జ్ఞానంతో నీకళ్ళు మూసుకుపోయాయి అని వ్యంగ్యంగా అన్నాడు. ఐనా ఓపికతో ఉపాధ్యాయుడు 'మీమాటే ఒప్పుకుంటాను. మరి గాలి కనిపించకపోయినా అది ఉన్నట్లు చాలారకాలుగా, ప్రభావాలద్వారా గుర్తించగలను. మరి ఆత్మ, దయ్యం, భూతం వంటివి ఉన్నట్లు ఏయే ప్రభావాల ద్వారా తెలుసుకోగలరో చెప్పగలరా?" అని అడిగాడు.

మూఢనమ్మకంతో కళ్ళుమూసుకుపోయిన అతను ఆలోచనలో పడ్డాడు, వెంటనే తేరుకొని "నువ్వు సినిమాలు చూడటంలేదా? దయ్యాలు టి.వి.లను ఆన్‌చేస్తాయి, పడబోతున్న బంతిని పడకుండా గాల్లోనే నిలుపుతాయి. చచ్చిన శరీరంలోంచి గాలి బయటికివచ్చి ఆత్మల రూపంలో మరో శరీరంలోకి వెళతాయి. వాటిని మంత్రతంత్రాలతో వశం చేసుకోవచ్చును" అని ఏదో గొప్ప విషయం చెబుతున్నట్లు అన్నాడు.

ఆయన మూర్ఖవాదనలు విన్న ఉపాధ్యాయుడు 'టివిలను ఆన్ చేయాలంటే అందుకు కొంత బలము, టార్క్ అవసరం. ద్రవ్యరాశి కలవాటికే టార్క్ ఉంటుంది. బంతుల్ని కిందపడకుండా ఉండాలంటే గురుత్వాకర్షణ శక్తి అవసరం. అది ఉండాలంటే కూడా వస్తువులకు బరువు అవసరం. నీవు భూతాలకు, దెయ్యాలకు

ఆపాదించిన కార్యకలాపాలన్నీ జీవులు మాత్రమే చేయగలవు. డి.ఎన్.ఎ. కేవలం జీవకణంలో మాత్రమే ఉండగలదనీ, జీవకణాలు ఉన్నవాటినే ప్రాణులు అంటారని విజ్ఞానశాస్త్రంలో అంటారు. దీనికి తిరుగులేని సాక్ష్యాలు, ఋజువులు ఉన్నాయి. కాబట్టి జీవకణాలు లేకుండా జీవులు చేసే కార్యక్రమాలు జరుగవు కాబట్టి దయ్యాలు, భూతాలు ఉండటానికి వీలేలేదని" తేల్చిచెప్పేసరికి, అదివిన్న మూఢవిశ్వాసంతో ఉన్న అతను నోటినుండి మాటరాక అక్కడినుండి వెళ్ళిపోయాడు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. గ్రామంలోని ప్రజలకు సైన్స్ ఉపాధ్యాయుడు 'సైన్స్ పట్ల అవగాహన' కలిగించడాన్ని మీరు సమర్థిస్తారా? ఎందుకు?
2. ఇప్పటికీ మనలో చాలామంది కొన్ని విషయాలలో మూఢనమ్మకంతో ఉంటారుకదా? వీరు అలా ఉండటానికి కారణమేమై ఉంటుంది?
3. ప్రశ్నించడం ద్వారా కారణాలను తెలుసుకోవచ్చని నేర్చుకున్నారుకదా! మీరుకూడా ప్రశ్నలద్వారా ఏదైనా సమస్యకు - ఫలితం తెలుసుకున్న సందర్భాన్ని తెల్పండి.
4. మీ ఇంట్లో ప్రాంతంలో ఇలాంటి నమ్మకంతో ఎవరెవరు ఉన్నారు? ఏ విషయంలో ఉన్నారు? వాటికి కారణాలను ఎలా అన్వేషిస్తారు?
5. ఏఏ మూఢనమ్మకాలను సైన్సుపరంగా కొట్టిపారేయవచ్చు. చర్చించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- కింది క్రమంలో ఆకుని పరిశీలించి, మీరు ఏమి గమనించారో ఒక క్రమంలో రాయండి.

ఆకు రూపం, సైజు, రంగు గమనించండి. దాని బొమ్మగీసి రంగులు నింపండి.

↓

ఆకు అంచులు పరిశీలించండి. సున్నితంగా ఉన్నాయా? గరుగ్గా ఉన్నాయా? ఎగుడుదిగుడుగా ఉన్నాయా? క్రమపద్ధతిలో ఉన్నాయా? రాయండి.

↓

ఆకు మృదుత్వాన్ని ఆస్వాదించండి, వాసన చూడండి. ఎలా ఉన్నది చెప్పండి.

↓

ఆకు ఉపరితలాన్ని పరిశీలించండి, దానిపై గీతలున్నాయా? బొడిపెలున్నాయా? చూసినదాన్ని బొమ్మలో గీయండి.

↓

ఆకును భూతద్దంతో/మైక్రోస్కోప్‌లో గమనించండి. మీరు ఇంతకుముందు చూడకపోయినదేదయిన గమనించగల్గుతున్నారా? దాన్ని బొమ్మ రూపంలో పేర్కొనండి.

## తెలుసుకోండి

శాస్త్రీయ దృక్పథం అంటే ప్రతి విషయాన్ని తర్కించి, వాదించి, ఆచారాల ద్వారా తెలుసుకోవడం. ప్రయోగాలు చేసి ఉన్న విషయాలు తెలుసుకోవడం. దేనిని గుడ్డిగా నమ్మకపోవడం.

మనలో శాస్త్రీయ దృక్పథం ప్రశ్నించడం ద్వారానే వస్తుందనేది నిర్వివాదాంశం. మన మెదడును జాగృతం చేసేకొద్దీ అది మరింత ప్రభావితం అవుతూ ఉంటుంది. తెలియని విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి మనిషిని ప్రగతిపథం వైపు నడిపిస్తుంది. మన చుట్టూవున్న విషయాలు పట్టించుకోకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్టు జీవితాన్ని సాగిస్తే విజయం చేరువలోకి రాదు. ఒక నిర్ణీతమైన పద్ధతిలో కాకుండా తార్కికంగా ఆలోచించి జవాబుని రాబట్టే విధానం మనిషి జీవితంలో కూడా చాలా తోడ్పడుతుంది.

మూఢనమ్మకాలను చీల్చిచెండాడే ఆయుధం “ప్రశ్నించడం”. మనం నమ్మినదే వేదమని గుడ్డిగా ఆచరించడంకన్నా నాణానికి అటువైపు ఏముందో చూడాలి అన్న అభిలాష తర్కానికి మొదటిమెట్టు. ఎప్పుడయితే మనకి జీవితంలో ఈరకమైన ఉత్సుకత మొదలయిందో అప్పుడు జీవితపు గాడినుంచి కాస్త బయటకి వచ్చి పరిశీలించే అవకాశం లభిస్తుంది.

అగ్నేయ మూలలో నుయ్యివుంటే మనిషికి అరిష్టం జరుగుతుందంటారు. అలా మనిషికి అరిష్టం జరగడమే దేవుడి ఉద్దేశ్యమయితే అతడు ఆగ్నేయంమూలనీ, నీటిని సృష్టించివుండడుకదా!

ఒకరు న్యూమరాలజీలో ప్రవేశంవున్నవాడు, మనం మన పేరులోని అక్షరాలు వ్రాసిస్తే, అందులోని ఏ అక్షరం మారిస్తే మనకి లాభం కలుగుతుందో చెప్తూవుంటాడు. చాలామంది పేరులో అక్షరం మార్చుకోవడం ద్వారా కష్టాలని పారద్రోలి సుఖాల అందలం సులభంగా ఎక్కేద్దామని తాపత్రయపడుతూ ఉంటారు.

వీటన్నింటికి కారణాలు అన్వేషిస్తే ఫలితాలు తప్పకుండా కనిపిస్తాయి. అప్పుడే ఏది నమ్మాలో, ఏది నమ్మవద్దో తెలుస్తుంది...

**సూక్తి**

**తార్కికంగా ఆలోచించు - వాస్తవాన్ని గ్రహించు**

# 11 న్యాయపోరాటం

**I. ప్రధాన విలువ**

న్యాయం

**II. ఉప విలువ**

న్యాయపోరాటంలో ప్రగతి సాధించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- అన్యాయం జరిగినప్పుడు అవసరమైన న్యాయ సలహాల గురించి తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మన హక్కులు న్యాయబద్ధమైనపుడు అవి సాధించుకోవడానికి న్యాయపోరాటం చేయాలి. వాటిని సాధించుకోవాలి. ఎటువంటి ఒడిదుడుకులు ఎదురైనా ధైర్యంగా చట్టపరంగా ముందుకు సాగినపుడు అనుకున్నవి సాధించగలం. అన్యాయాలను ఎదిరించడానికి న్యాయపోరాటానికి మించిన ఆయుధం మరొకటి లేదు. అన్యాయాన్ని ఎదిరించడానికి వయసుతో సంబంధంలేదు. ధైర్యం, దృఢసంకల్పం ఉంటే చాలు. ఇవన్నీ ఉన్న ఒక అమ్మాయి చేసిన న్యాయపోరాటం గురించి తెలుసుకుందాం.

## V. విషయం

### మార్గదర్శి మలాలా

మలాలా పదిహేనేళ్ళ బాలిక. ప్రపంచంలో శాంతిస్థాపన కోసం అత్యంత ధైర్య సాహసాలతో ముందడుగు వేసేవారికి ఏటా ప్రధానం చేసే ప్రతిష్ఠాత్మక బహుమతైన అంతర్జాతీయ శాంతి బహుమతి (2012) ని మలాలాకు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇంగ్లాండుకు చెందిన టిప్పెరీ శాంతి సంఘం. ఇంతకూ ఎవరీ మలాలా? అతి చిన్నవయసులో ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఏంటి? అని తెలుసుకోవాలని ఉందా! అయితే ఇది చదవండి.

మలాలాది పాకిస్థాన్‌లోని వాయువ్య సరిహద్దు రాష్ట్రం స్వాత్‌లోయలోని మిలగోరా పట్టణం, తండ్రి జియావుద్దీన్ యూషఫ్‌జాయ్ కవి, విద్యావేత్త విద్యాసంస్థల స్థాపకుడు. బాలురతోపాటు బాలికలు చదువుకోవాలన్నది ఆయన ఆకాంక్ష. తండ్రి స్ఫూర్తితో మలాలా బాలురతోబాటు బాలికలు చదువుకోవడం హక్కని వాదించింది. అంతేకాకుండా మలాలా ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో ఓ బాలికల విద్యాసంస్థను స్థాపించింది. పెషావర్ ప్రెస్‌క్లబ్‌లో ప్రసంగిస్తూ విద్యాభ్యాసం మా జన్మహక్కు అంటూ ఎలుగెత్తి చాటింది.

తాలిబన్లు ఛాందస భావాలతో స్వాత్‌లోయను హస్తగతం చేసుకోవాలని ప్రయత్నం జరుగుతున్న రోజులవి. స్వాత్‌లోయలో బాలికలు చదవకూడదని పాఠశాలలకు వెళ్ళకూడదని నిషేదం విధించారు. బాలికల విద్యను అడ్డుకుంటున్న తాలిబన్ల వైనంపై మలాలా పన్నెండో ఏటనే 'బిబిసి'కి మారుపేరుతో లేఖ రాసింది. దానిని 'బిబిసీ' ఉర్దూ బ్లాగ్‌లో ఉంచారు. అనంతరం స్వయంగా తన పేరుతో లేఖలు రాయడం ప్రారంభించింది. దీంతో ఆమె ఇంటర్వ్యూలు, వ్యాసాలు పత్రికలలో, టెలివిజన్లలో వచ్చాయి.

మలాలా అభ్యుదయ భావాలు, ఆదర్శాలు, విద్య పట్ల అనురక్తి, బాలికల విద్యను ప్రోత్సహించడం తదితర చర్యలు తాలిబన్ తీవ్రవాదులకు ఆగ్రహం కలిగించాయి. తమకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందని, పాశ్చాత్య సంస్కృతిని ప్రోత్సహిస్తోందన్న కోపంతో ఉత్తర వజీరిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న తెహ్రీన్-వి-తాలిబన్ ఆమెను కడతేర్చాలని కుట్ర పన్నింది. పాఠశాలను పేల్చివేసింది. ఇంటిపై దాడిచేసింది. గత ఏడాది అక్టోబర్ 9న బస్‌లో మలాలాపై తుపాకిగుళ్ళతో తీవ్రవాదులు దాడిచేశారు. మలాలా మూడునెలలపాటు మృత్యువుతో పోరాడింది. ఎట్టకేలకు వైద్యుల ప్రయత్నాలు ఫలించి స్వస్థత చేకూరింది.

అత్యున్నత ఆశయ సాధన దిశలో ఎదురైన అడ్డంకులన్నింటినీ అధిగమించి ధైర్యంగా ముందుకు సాగింది మలాలా. ఆఖరికి తన జీవితాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితి ఎదురైనా వెరవలేదు. నిన్న మొన్నటిదాకా బాలికల విద్యాహక్కు కార్యకర్తగా స్వాత్ జిల్లాకే పరిచయమైన ఆమె ఇప్పుడు మొత్తం ప్రపంచానికే మార్గదర్శి అయింది.

బాలికల విద్యాహక్కు కోసం విశేష కృషి చేసిన మలాలాకు ఇప్పటికి పలు పురస్కారాలు లభించాయి. పాకిస్తాన్ నుండి 2011 డిసెంబరు 19న జాతీయ యువజన అవార్డును అందుకున్న ఘనత మలాలాదే. బాలల హక్కుల కార్యకర్తగా ఆమె సాధించిన విజయాలు తెలిసాక ఇతర దేశాల్లో పలువురు స్ఫూర్తిపొందారు. ఆమె గౌరవార్థం నవంబరు 10 ని 'మలాలాడే' గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. చదువు కోసం పోరాడిన ఆమె ప్రపంచంలోని బాలికల విద్యాహక్కుకు ప్రతినిధిగా మారిందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి బాన్ కి మూన్ ప్రశంసించారు. ప్రఖ్యాత టైమ్స్ మ్యాగజైన్, పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2012 గా స్థానమిచ్చి గౌరవించింది. ప్రజలకు ఇచ్చే అత్యున్నత సాహస పురస్కారం సితారే షుజాతె ను పాక్ ప్రభుత్వం మలాలాకు అందించింది.

### VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. మలాలా ఎవరు? ఎందుకోసం న్యాయపోరాటం జరిపింది? ఆమె పోరాటం జరపకపోయివుంటే ఏమి జరిగి ఉండేది?
2. మలాలా నుండి మీరు ఏమి గ్రహించారు? మీ అనుభూతి తెలపండి? ఒకవేళ అలాంటి న్యాయపోరాటమే మీరు చేయాల్సివస్తే మీరు ఎలా సిద్ధమవుతారు?
3. మన హక్కులు మనం సాధించుకోవడానికి ధైర్యంగా ముందుకు అడుగేయాలని మలాలా నుండి తెలుసుకున్నారుకదా! మీరు ధైర్యంగా చేయగలిగేవి ఏవి?

### (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మలాలా మీకు ఎలా స్ఫూర్తిని కలిగించిందో మీ మాటలతో మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.

### తెలుసుకోండి

రాజ్యాంగం న్యాయానికి సంబంధించి మనకు కల్పించిన అవకాశాల గురించి తెలుసుకుందాం.

భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని గణతంత్ర సోషలిస్టు, లౌకి, ప్రజాస్వామ్య ప్రజలుగా నిర్మాణం చేసి, పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం లభించాలని మాకు మేముగా ఈ రాజ్యాంగాన్ని ఆమోదించి, సమర్పించుకుంటున్నాం.

(భారత రాజ్యాంగం)

భారతదేశంలో నివసిస్తున్న మన అందరికీ సమాన న్యాయాన్ని పొందే హక్కు ఉంది. ఒకవేళ మనకు అన్యాయం జరిగింది అనుకుంటే న్యాయపోరాటం చేయవచ్చు. అందుకు కోర్టులు కూడా బాసటగా నిలుస్తాయి.

జాతీయ జీవనంలోని సంస్థలన్నింటిలోనూ, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అమలుజరిగేలా సామాజిక వ్యవస్థని రూపొందించి పరిరక్షించి తద్వారా ప్రజలందరి సంక్షేమానికి రాజ్యం (దేశం) పాటుపడుతుంది.

(భారత రాజ్యాంగం నిబంధన-38)

ఆర్థిక లేదా ఇతర వైకల్యాల కారణంగా వ్యక్తికి న్యాయం పొందేందుకు, సమాన అవకాశాలు కల్పించడానికి మరీముఖ్యంగా ఉచిత న్యాయం పొందడానికి అవసరమైన శాసనాలు లేదా పథకాల్ని న్యాయవ్యవస్థా నిర్మాణం ప్రోత్సహించడానికి అనుగుణంగా రాజ్యం చర్యలు తీసుకుంటుంది.

(భారత రాజ్యాంగం నిబంధన-39ఎ)

పైన పేర్కొనబడినట్లు మన హక్కులకు భంగం వాటిల్లినట్లయితే అంటే శారీరక హింస, మానసిక హింస, కొట్లాడుట, SC, ST అట్రాసిటి మొ॥ మానవహక్కుల ఉల్లంఘన జరిగితే పోలీస్ కేసు వేయవచ్చు. ఈ విషయం మన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 మరియు 21 తెలుపుతున్నాయి. ఒకవేళ అక్కడ ఏమీ జరగకపోతే జిల్లాస్థాయి లేదా రాష్ట్రస్థాయి హైకోర్టులో కేసు వేయవచ్చు. అయితే ఆర్థిక స్థోమత లేనివారు "న్యాయ సేవాసమితి" ని సంప్రదించాలి. వీరు మన తరపున ఉచితంగా కేసును వాదిస్తారు. ఇది తాలూకా, జిల్లా స్థాయిలో కూడా అందుబాటులో ఉంటుంది.

**సూక్తి**

**అన్యాయాన్ని సహించకు - న్యాయాన్ని అతిక్రమించకు**

# 12 హింసా ప్రవృత్తి

**I. ప్రధాన విలువ**

శాంతి, అహింస,
సౌందర్యాత్మక స్పృహ

**II. ఉప విలువ**

హింసాత్మక ప్రవృత్తి నష్టాన్ని కలిగిస్తుందని తెలుసుకోవడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- హింస అన్ని అనర్థాలకు మూలం. హింసించడం అనే ఆలోచన నష్టాలను, కష్టాలను కలిగించడమే కాకుండా నేరం కూడా అవుతుందని తెలుసుకోవడం.

**IV. ఉపోద్ఘాతం**

ఆవేశానికి లోనుకావడం, ఇతరులను ఏడిపించడం ద్వారా ఆనందాన్ని పొందడం, విచక్షణను కోల్పోయి, మంచిని మరిచిపోయి, ఇతరులపై దాడిచేయడం వంటి హింసాత్మక ఆలోచనలు వలన అనేక నష్టాలు కలుగుతాయి. జీవితంలో ఆనందాలు కోల్పోతారు. ఇవి తెలుసుకోవడం జీవితాన్ని సరైన మార్గాన నడిపించుకోవడం మన చేతిలో ఉందని తెలుసుకోవాలి. హింసాప్రవృత్తితో మనుషులు చేసే పనులవల్ల ఎలాంటి వాతావరణం నెలకొంటుందో ఈ వార్తలు వినండి.

## V. విషయం

### వార్త-1 : ఎందుకిలా?

రాణి పేపర్ చదువుతోంది. పేపర్‌లో రెండు వార్తలు రాణి మనసును కలిచివేశాయి. అందులో ఒకటి.

మళ్ళీ పడగవిప్పిన ర్యాగింగ్ భూతం.

ర్యాగింగ్ భూతం మళ్ళీ పడగ విప్పింది. ఫ్రెషర్ డే రోజే ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఆధిపత్య పోరు మొదలైంది. తాము చెప్పినట్లు గుంజీలు తీసి, కుక్కలా అరవలేదని, ఎదురుతిరిగారని ఇద్దరు విద్యార్థులను సీనియర్లు తీవ్రంగా కొట్టారు. పేట్ బషీర్‌బాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే లోడామిస్త్రీ నగర్‌కు చెందిన సంతోష్ (19), అబ్దుల్ (19) ఓ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. గురువారం ప్రెషర్స్‌డే సందర్భంగా సీనియర్స్ జూనియర్స్ ఒకేచోట కలిసి ఉదయం సందడి చేశారు. ఈ క్రమంలో అల్వాల్, బొల్లారం ప్రాంతాలకు చెందిన నలుగురు విద్యార్థులు సంతోష్, అబ్దుల్‌లను గుంజీలు తీయమని కుక్కలా అరవమని ర్యాగింగ్ చేయసాగారు. వీరు అందుకు ఒప్పుకోలేదు. దీంతో సీనియర్స్ ఫ్రెషర్స్ డే పార్టీ పూర్తయ్యేవరకు వీరిని వెకిలి చేష్టలతో వేధిస్తూనే ఉన్నారు. సాయంత్రం ఇంటికి వెళ్తుండగా ఇద్దరినీ రెండు బైక్‌లపై బలవంతంగా తీసుకెళ్ళి సంతోష్, అబ్దుల్లాను ముక్కుపైన, కడుపులో విపరీతంగా కొట్టి వెళ్ళిపోయారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు పోలీసులు సీనియర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇది చదివిన రాణికి మారుతున్న మనుషుల స్వభావాలపై అసహ్యం వేసింది. ప్రేమను పంచడం, శాంతికి ప్రతిరూపమైన మన దేశంలో ఇతరులను పీడించుకునే రాక్షసానందానికి ఎందుకు మనుషులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మనుషుల మధ్యలో బంధాలు ఏమౌతాయి, దేశం ప్రగతి ఎలా సాధిస్తుందని ఆలోచిస్తూ కూర్చుంది.

### సంఘటన-1

అరుణ్ రోడ్డుమీద నడుస్తూ దారిలో కనిపించిన ఒక కుక్కను రాయితో కొట్టాడు. అది బాధతో అరుస్తూ పరుగెత్తుతుంటే అరుణ్ నవ్వుతున్నాడు. అక్కడే ఉన్న ఒక తాత చూసి ఊరికినే దానిని హింసించడం తప్పని చెప్పాడు. అయినా అరుణ్ వినిపించుకోలేదు. ఈసారి నాలుగైదు కుక్కలు నిల్చునిఉండగా మళ్ళీ రాయితో వాటిని కొట్టాడు. అవి అతనిపై దాడిచేసి గాయపరిచాయి. దానితో అరుణ్ బొడ్డుచుట్టూ ఇంజక్షన్లు చేయించుకోవాల్సి వచ్చింది.

### సంఘటన-2

రాజేష్‌కు నత్తి ఉంది. గోపి ప్రతిరోజు రాజేష్‌ను పేరుతో కాకుండా “నత్తోడా” అని పిలిచి గేలిచేసేవాడు. పాపం రాజేష్ మనస్సులో బాధపడేవాడు. ఎవరితో తన బాధను చెప్పుకునేవాడు కాదు. ఇది అలుసుగా తీసుకొని మరికొంతమంది విద్యార్థులు కూడా అలాగే ఏడిపించేవారు. రోజు వాళ్ళుపెట్టే మానసిక హింసను తట్టుకోలేక రాజేష్ బడికి రావడం మానేసాడు. విషయం తెలుసుకున్న అతని తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుని దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళారు. దానితో ప్రధానోపాధ్యాయుడు గోపీని, మిగతా విద్యార్థులను పిలిచి మందలించారు. ఒకరిని హింసించి ఆనందించడం సరైనది కాదని ఇకపై అలా చేస్తే ఊరుకోనని హెచ్చరించాడు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. రాణి చదివిన వార్తలలాంటివి మీరెప్పుడైనా చదివారా-విన్నారా-రాణి చదివిన వార్తల పట్ల మీ అభిప్రాయం ఏంటి ?
2. ఇతరులను హింసించి ఆనందపడడం అనేది రాక్షసత్వం అవుతుంది. దీన్ని సమర్థిస్తూ మీరు కొన్ని ఉదాహరణలు చెప్పండి.
3. మనుషులలో మానవత్వం, శాంతి, సహనం పెరగాలంటే మనం ఏం చేయాలి - ఎలా ప్రవర్తించాలి?
4. రెండు వార్తలు విన్నారుకదా! ఇవి విన్నప్పుడు మీకెలా అనిపించింది.
5. "మనుషులలో రాక్షసులు కూడా ఉన్నారు" దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?
6. మనుషులలో మానవత్వం, శాంతి, సహనం ఉంటే సమాజం ఎలాఉంటుందో చెప్పండి.
7. బంద్‌లు, సమ్మెలు వంటి వాటివల్ల ప్రజల ఆస్తులకు ఒక్కొక్కసారి నష్టం కలుగుతుంటాయి. అంటే బస్‌లు తగలబెట్టడం, షాపులు మూసివేయడం లేదా ధ్వంసం చేయడం జరగడంవల్ల ఎవరు నష్టపోతారు. అలాంటి సమయంలో ప్రజల పరిస్థితి ఎలాఉంటుంది?
8. హింసకు దారితీసే ప్రవర్తనలు ఏంటి? వాటిని అధిగమించడానికి ఏమి చేయాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

అ) కింది అంశాలను పూరించండి.

- నాపేరు :
- నా స్నేహితుల పేర్లు :
- నాలో ఉన్న మంచి గుణాలు :
- నా స్నేహితులలో ఉన్న మంచిగుణాలు :
- నాలో ఉన్న బలహీనతలు :
- నా బలహీనతలను/లోపాలను ఎలా సరిచేసుకుంటానంటే :
- నాలో నాకు నచ్చే గుణం :
- ఇతరులలో ఉన్న మంచి గుణాలు నాలో లేనివి :
- నా ఉద్దేశంలో మంచిగా (ప్రేమగా) ఉండడం అంటే :
- మనుషుల మధ్య మంచి సంబంధాలు ఉండాలంటే నేను సూచించేవి :

ఆ) గొడవలు నష్టాన్ని కలుగజేస్తాయి. శాంతి, సహనం, ప్రేమ ఇవి మంచిని పెంచి అభివృద్ధిని సాధిస్తాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని శాంతి నినాదాలను జట్లలో తయారుచేయండి.

ఇ) జట్లలో కూర్చుని కింది వాటి గురించి చర్చించి రాయండి. జాబితా తయారుచేయండి.

| శాంతికి దారితీసే పరిస్థితులు | అశాంతికి దారితీసే పరిస్థితులు |
|---|---|
| | |

### తెలుసుకుందాం

## మేలు చేయడం పుణ్యం... పీడించడం పాపం!

**నీవు భుజింపుమా కడుపు నిండ, క్షుధార్తుల కింత పెట్టుమా!**
**నీవు సుఖింపుమా, పరుల నీవలెనే మననీయుమా, మరే**
**త్రోవల కడ్డురాకు, పెడత్రోవల కాలిడబోకు మిద్దియే**
**జీవితమన్న, పంకిలము సేయకు స్వామి వర ప్రసాదమున్!**

మనిషి జీవితం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. జీవులలోకెల్లా ఉత్కృష్టమైంది మానవజన్మ అంటారు. మననిలా మనుషుల్లా పుట్టించినందుకు ఆ సృష్టికర్తకు కృతజ్ఞులమై ఉండి ఆయన కృషిని సార్థకం చేయాలి. అంటే ఏం చేయాలి? పెద్దగా ఏదేదో చేసేయాలేమో అని బెంబేలుపడిపోనవసరం లేదు. ఇంగ్లీషులో 'లివ్ లెట్ లివ్' అనే మాటుంది. అంటే, బతుకు బతకనివ్వు. ఇక్కడ కూడా, 'నువ్వు తిను. ఇతరుల్ని తిననియ్, నీలాగే సుఖపడనీయ్, ఎవరికీ అడ్డుపడకు, చెడుపోకడలు పోకు...' అనే జీవిత కర్తవ్యాన్ని అందంగా చెప్పాడు తన రుబాయిల్లో పారశీక కవి ఉమర్ ఖయ్యామ్. దాన్ని భావానుకృతి రూపంలో 'అమర్ ఖయామ్' గా తెలుగించారు కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి. అలతి అలతి పదాలతో పద్యాన్ని పరువులెత్తించే మంత్రదండమేదో శాస్త్రి వద్ద ఉండిఉంటుంది. బుద్ధుడి చరిత్ర రాసినా, పుష్ప విలాపం వినిపించినా, కుంతి కథ చెప్పినా... ఆయనది అదే ఒరవడి. ఆయన పద్యాల్లో అక్షర రమ్యతే కాకుండా అరటిపండు ఒలిచిపెట్టినట్టు భావం కూడా ఇట్టే అర్థమైపోతుంది. మచ్చుకు ఈ పద్యమే చూస్తే, ప్రతిపదార్థం విడదీసి భావం చెప్పనవసరం లేదు. దేవుడిచ్చిన వరప్రసాదాన్ని బురదమయం చేయొద్దంటున్నాడు. అలా చేయొద్దంటే, ఏం చేయాలో క్లుప్తంగా చెబుతున్నాడు. ఇటువంటి వ్యక్తీకరణలు మన పురాణేతిహాసాల్లో తరచూ కనిపిస్తాయి. ధర్మాలలోకెల్లా ఉత్తమోత్తమమైన ధర్మమేది? అన్న ప్రశ్నకు మహాభారతంలో ఓ చక్కని పద్యరూపంలో సమాధానముంది. '...ఇతరులు మనకు ఏం చేయగూడదని కోరుకుంటామో, అవేవీ మనం

ఇతరులకు చేయకూడదు' అనే అద్భుతమైన సందేశాన్ని 'ఒరులేయవి యొనరించిన...' అనే చిన్న పద్యంలో చెబుతాడు తిక్కన. వ్యాసుడు ఒక సందర్భంలో ఇదే మాట అత్యంత సంక్షిప్తంగా చెబుతాడు. "శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రన్థకోటిభిః..." కోటి గ్రంథాలకు సమానమైన భావాన్ని అర్థశ్లోకంలో చెబుతానంటాడు. అదేమంటే, "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం". ఇతరులకు మేలు చేయడం పుణ్యం. ఇతరులను పీడించడం పాపం. చూశారా, సూక్ష్మంలో మోక్షం అంటే ఇదే!

### అహింస

సృష్టిలోని జంతువులు ఆకలైనప్పుడు ఆహారంకోసం ఇతర జంతువుల్ని చంపుతాయి. ఒక్క జంతువు మాత్రం వినోదం కోసం భయం, పగ, ద్వేషంతో చంపుతుంది. ఆ జంతువు పేరే మానవుడు' అన్న మార్క్ ట్వైన్ మాటలు అక్షరసత్యాలు. కరుణ, ప్రేమ, వాత్సల్యం, ఔదార్యం, స్నేహం, తృప్తి కొరవడినప్పుడు మనిషిలో హింసాగుణం పెరిగిపోతుంటుంది. ఒక దేశం సుఖం, సుభిక్షం, శాంతీ సౌభాగ్యాలతో వర్ధిల్లాలంటే ఆ జాతి అహింసామార్గంలో జీవన ప్రస్థానం కొనసాగించాలి.

ఆలోచనలో, హక్కులో, ఆచరణలో సత్యనిష్ఠ కలిగిన వ్యక్తి అహింసాయుధాన్ని ప్రయోగించడంలో కడు సమర్థుడవుతాడు. అహింస అనే పరమధర్మాన్ని ప్రస్తావించినప్పుడు గౌతమబుద్ధుడు, బాపూజీ వంటి మహనీయులే స్ఫురణకు వస్తారు. అహింసా కరదీపికతో మానవుడిలోని అజ్ఞాన తిమిరాన్ని దూరం చేసి మోక్షప్రాప్తికి దారిని సుగమం చేసినది బుద్ధుడైతే, బానిససంకెళ్ళను ఛేదించి ఒక పెద్ద దేశానికి స్వాతంత్ర్యసిద్ధిని కలగజేసి మహోజ్జ్వల భవిష్యత్తును ప్రసాదించిన మహానుభావుడు మహాత్మా గాంధీ.

హింస రెండురకాలు. శారీరక హింస, మానసిక హింస. కోరికలు, ఆశలు, మోహాలు, వ్యామోహాలు తీరనప్పుడు ప్రతీకార భావనలతో ఇతరుల్ని హింసించటం - శారీరక హింస. పంచభూతాత్మకమైన ప్రకృతిలో ప్రతి ప్రాణికీ జీవించే హక్కుందన్న ఇంగితజ్ఞానాన్ని మరచి బలవంతుడు బలహీనుణ్ణి శారీరకంగా గాయపరచే దుర్మార్గాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఇక మానసిక హింస - శారీరక హింసకన్నా మరీ ప్రమాదకరమైంది. మాటలతో, దూషణలతో, పరుష పదజాలంతో ఇతరులను హింసించే సంస్కార విహీనులది మానసిక హింస. ఎటువంటి అవాంఛనీయ వ్యామోహమైనా ఎంతటి ప్రజ్ఞాశాలినైనా మానసిక హింసకు పురిగొల్పుతుంది. శరీరానికి తగిలిన గాయం కొద్దిరోజులకు మానిపోతుందేమోకాని, మనసుకు తగిలిన గాయం ఎంతకీ మానదు. అందుకే ఆదిశంకరులంటారు - 'నీలోను నాలోను ఒకే చైతన్యముంది. ఇక నాపై నీకు కోపమెందుకు? కనుక ఎవరినైనా హింసించాలనుకునే ప్రవృత్తిని మానుకో!' మర్యాద పూర్వక సంభాషణం పరుల మనసుకు క్షోభ కలిగించదు. మధురవచనాన్ని మించిన వశీకరణ మంత్రమే లేదంటాడు గోస్వామి తులసీదాసు!

నడమంత్రపు సిరి, పదవి, అధికారం, నాయకత్వం... ఇవి సంప్రాప్తించినప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ప్రేమతో, అభిమానంతో పలకరించి, సంస్కారం చిలకరించి ఇతరుల హృదయాలను దోచుకోవాలి. శ్రీరాముడు, హనుమ, భరతుడు, విదురుడు, అనసూయ, వశిష్ఠుడు, అగస్త్యుడు వంటి మహనీయులు

అహింసాగుణానికి ఆదర్శప్రాయులై నిలిచారు. విశ్వామిత్రుడు, దుర్వాసుడు, రావణుడు, దుర్యోధనుడు, శిశుపాలుడు వంటివారెందరో హింసాప్రవృత్తికి దాసులై ఆదరణ కోల్పోయారు.

భూతదయ అనే ఒక సిద్ధాంతాన్ని అక్షరాలా పాటించిన మనిషిలోకి హింసాభావం ఎన్నటికీ ప్రవేశించదు. హింసను త్యజించినవాడు పరమహంసైపోతాడు. 'సత్యం పలకాలి, అప్రియమైన సత్యం పలకరాదు' అన్న భారత వచనం సర్వదా ఆచరణీయం. ఏ పరుష వచనంతో మన మనసుకు బాధ, వ్యధ కలుగుతాయో అలాంటి పరుష వచనాన్ని మనమెన్నడూ పలకకూడదు.

ఓ రాజు పులిని వేటాడుతూ తపస్సు చేసుకుంటున్న ఓ మునివద్దకు వచ్చాడు. ఆ పులి, ముని వెనక్కి వెళ్ళి దాక్కుంది. ముని రాజును వారించి 'పులిని వదిలేస్తే నీకు ఒక మహిమాన్వితమైన రాయినిస్తాను. దానితో ఏ రాతినైనా తాకితే వెంటనే అది బంగారమైపోతుంది. అష్టైశ్వర్యాలతో నీ రాజ్యం సుభిక్షంగా ఉంటుంది' అన్నాడు. రాజు ఆనందాశ్చర్యాల్లో మునిగిపోయి 'ఇంత విలువైన రాతిని మీవద్దే ఉంచుకుని బంగారం సృష్టించవచ్చు కదా!' అని ప్రశ్నించాడు. 'ఒక ప్రాణిని కాపాడటంకన్నా ఈ రాయి విలువైంది కాదు. అహింసను మించిన సంపద లోకంలో మరేదీ లేదు నాయనా!' అన్నాడు ముని. రాజు పశ్చాత్తాపం చెంది పులిని, రాతినీ వదిలి వెళ్ళిపోయాడు. నాటినుంచీ మాంసాహారాన్ని తన రాజ్యంలో నిషేధించి, అహింసాత్మకమైన పరిపాలన చేశాడు రాజు.

మనం కోరుకునే ముందు ప్రేమను, అహింసను, సత్యాన్నీ, ఉపకారాన్ని మనమే పరులకు పంచిపెట్టాలి. అహింస, శాంతి స్థాపనకే వాసుదేవుడు కురుపాండవ సమరం చేయించాడు. సర్వప్రాణులను తనలా చూసుకొమ్మన్నాడు. పరుల సుఖదుఃఖాలను తన సుఖదుఃఖాలుగా భావించమన్నాడు. హింసవల్ల సాధించే విజయం తాత్కాలికం. అహింసవల్ల సాధించే శాంతి శాశ్వతం. 'నిరంతరం సంతోష మనస్కులం కావాలంటే అహింసాపథం ఒక్కటే శరణ్యం' అని పతంజలి ప్రవచనం. అదే మనిషిని అజాతశత్రువుని చేస్తుంది. అవనికి సంజీవనిగా ఉపకరిస్తుంది!

**సూక్తి**

జంతువులకన్నా మనం మేధావులం, సమర్థులం. కనుకనే వాటి క్షేమానికి మనం కర్తలం

– అనీబిసెంట్

# 13 శ్రమైక జీవన సౌందర్యం

**I. ప్రధాన విలువ**

శ్రమ విలువ

**II. ఉప విలువ**

శ్రమైక జీవనసౌందర్యం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- శ్రమలోని ఆనందాన్ని గుర్తించి గౌరవించగలుగుతారు.
- శ్రమకు విలువ ఇవ్వడం మరియు పనిపట్ల బాధ్యతతో వ్యవహరించ గలుగుతారు.

## IV. ఉపోద్ఘాతం

శ్రమ అంటే కష్టం. కష్టపడి మనం పనిచేస్తే దేనినైనా సాధించవచ్చు. శ్రమ శారీరకంగా ఉంటుంది. మానసికంగా ఉంటుంది. శారీరక శ్రమవలన శరీరానికి అలసట కలుగుతుంది. తద్వారా ఆహారంపై ఆసక్తి పెరగుతుంది. మంచి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందగలం. శరీరం ఉత్తేజకరంగా ఉంటుంది. శారీరక శ్రమద్వారా, శారీరక మానసిక శక్తులు కలగడమే కాకుండా సంఘంలో గౌరవం కూడా చేకూరుతుంది. మనం కాయకష్టం చేసేవారిని చూస్తుంటాం. వారు వేకువఝామునుండి సాయంత్రం వరకు శ్రమపడుతూనే ఉంటారు. ఏదోఒక పనిచేస్తూనే ఉంటారు. ఇక మానసిక శ్రమ అంటే మనసును కష్టపెట్టడం. అంటే మనసుతో ఆలోచించడం, చదవడం మొదలైనవి. వీటిద్వారా మనలో లోకజ్ఞానం, ఆలోచనాశక్తి పెరుగుతాయి. ఐతే శ్రమనిష్ఠ అంటే మనం చేసే పనిపట్ల శ్రద్ధను కనబదరచటం. ఇది నేను చెయ్యాలి, ఈపని నాదే అనే భావనతో ఆ పనిని చెయ్యగలగాలి. దాన్నే అంకితభావం అంటారు. మనం చేసే పని గొప్పదైనా, అల్పమైనదైనా ఇలాంటి అంకితభావంతో చేసినపుడు దానిని సమర్థవంతంగా మనం నిర్వహించ గల్గుతాం. అంతేకాని, ఆ పనిని చులకనభావంతో 'ఏదో చెయ్యాలి కాబట్టి చేస్తున్నా' అనుకుంటే అది శ్రమనిష్ఠ అనిపించుకోదు సరికదా, ఆ పనిని చక్కగా పూర్తిచెయ్యలేము. కాబట్టి మనం చేసే పనికి సార్థకత, సమాజంలో గుర్తింపు లభిస్తాయి. ఈ విషయాన్ని గ్రహించి మనం పనిలో అంకితభావాన్ని ప్రదర్శించగలగాలి. పనిలోని మాధుర్యాన్ని శ్రమ విలువను తెలియజేయు ఈ పాట వినండి.

## V. విషయం

### శ్రమవిలువ గీతం

టప టప టప టపటపటప చెమటబొట్లు తాళాలై పడుతూంటే ॥2 సార్లు॥
కరిగి కండరాలు నరాలే స్వరాలు కదుతుంటూ, పాట పనితోపాటే పుట్టింది
పనీ పాటతోటే జతకట్టింది. ॥పాట॥ ॥టపటప॥

ఆదిమ కాలమునందు ఆనదీ తీరాలందు ॥2 సార్లు॥
గూడును నిర్మించి జనులు గుంపుకూడి గడుపునపుడు
ఆకలిమంటల బాటలో ఆకలి తీరే వేటలో అలమట చిందే ఊపిరి
హా... హా... హా... అలమట చిందే ఊపిరి అలసటయే మొదటి పాట ॥టపటప॥

ఆగడాల ఆగడల దినగండపు ఏలుబడిలో... ॥2॥
మెడలువంచి దొరలమేనా పదిలంగా మోయువేళా
పద పద పద బిరబిరబిర నడునడునడు పదపదపద
పద పద పదమంటూ ఆ పాదమస్తకం శ్రమిస్తు...
ఓహూహోం... ఓహూహోం... హోం ఓహూహోం... హోం... ॥టపటప॥

కరణమింట పెళ్ళిపని తలాఇంత పంచుకుని
పల్లె ఆడవాళ్ళు వడ్లదంపుళ్ళకు దిగిపోతే
ఊపిరితిత్తుల వత్తిడి ఉష్... ఉష్... ఉష్...
ఊపిరితిత్తుల వత్తిడి ఒత్తిన ఉస్సు ఉస్సు గొని
సువ్వి సువ్వి సువ్వన్నలారా అహ... మాయన్నలారా... ॥సువ్వి॥
సువ్వి పాటగా మారి ఉవ్వెత్తున లేచెనచట ॥టపటప॥
కదలి తల్లి కడుపులోన కదతేర్చే బుదగలవలే ॥2॥
మృత్యువు అనునోటా ప్రతినిత్యమైన జీవితాలు
గాలీవాన తొణుకులలోనా, ధూళీశోలీ హైలెస్సో... హైలెస్సో... హైలెస్సో... హైలెస్సో...

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. మీరు విన్న పాటలో ఎవరెవరి శ్రమ గురించి తెలియజేశారు?
2. మనకు తెలిసి ఇల్లుకట్టడంలో, బట్టలు వేసుకోవడంలో, చెప్పులు ధరించడంలో, పుస్తకం తయారీలో ఎవరెవరి శ్రమ దాగుందో చెప్పండి.
3. ఇంకా మన చుట్టూ ఎవరెవరు శ్రమ చేసేవారున్నారో చెప్పండి.

4. శ్రమజేసే అందరు వ్యక్తులు సమానమే అన్నారుగదా! అంటే మీకేమి అర్థమైందో చెప్పండి.

5. శ్రమను గుర్తించి గౌరవించకుంటే జరిగే పరిణామాలు చెప్పండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంట్లో, చుట్టుపక్కల ఎవరెవరు శ్రమిస్తూ మనకు సహకరిస్తున్నారో గుర్తించండి. వారి శ్రమను గుర్తిస్తూ వారికి అభినందనలు తెల్పండి.

### తెలుసుకోండి

శ్రమ అంటే కష్టపడి పనిచేయడం. పనిచేయడం వలన మనసుకు ఉల్లాసం కల్గించడమేకాదు శరీరానికి మంచి ఆరోగ్యం కూడా లభిస్తుంది. ఇంట్లోగానీ, సమాజంలోగానీ ప్రతిఒక్కరి శ్రమద్వారా మాత్రమే అందరూ ఆనందంగా జీవించగల్గుతున్నారు. పనినే దైవంగా భావిస్తూ పనిచేస్తున్నవారిని గౌరవించడం మన ధర్మం. చిన్నపనా పెద్దపనా అనే భావన వీడి అందరికీ సమాన గౌరవం అందించడం మన కర్తవ్యం.

ఎవరి పని వాళ్ళు చేసుకోవడం ఏదో తప్పయినట్లుగా, తక్కువరకం పనులు చేయరాదన్నట్లుగా కొందరు భావిస్తారు. కాని అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ తన పనులను అవి ఎంత అల్పమైనవైనా తానే చేసుకునే వాడు.

ఒకనాడు అబ్రహం లింకన్ బూట్లు పాలిష్ చేసుకుంటున్నాడు. అప్పుడే వచ్చిన వ్యక్తి ఒకరు ఆయనను చూసి "మీ బూట్లు మీరే పాలిష్ చేసుకుంటున్నారే" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు. "మీరైతే మీ బూట్లు పాలిష్ చేసుకోరా! అని ఎదురు ప్రశ్న వేశాడు లింకన్. అంటే మీరు మరొకరివి పాలిష్ చేస్తారా అనే అంతరార్థంతో లింకన్ మాట్లాడాడు. దీనినిబట్టి ఎవరిపని వారు చేసుకోవడం ఆ పనిని గౌరవించనట్లే అవుతుంది. ఎంతటి హోదా ఉన్నా తన పనిని తాను చేసుకొని లింకన్ పనిపట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నాడు.

చాలా సంవత్సరాల కిందటి సంగతి వినండి.

బెంగాలులో ఒక చిన్న రైల్వేస్టేషన్‌లో రైలు ఆగింది. ఒక విద్యావంతుడైన యువకుడు సూటుకేసుతోసహా రైలు దిగి చుట్టూ కలియజూసి 'కూలీ, కూలీ' అని కేకవేశాడు. చిన్నస్టేషన్‌లో కూలీలు ఎవరుంటారు? ఛీ! ఛీ! "ఇక్కడ కూలివాడే దొరకడు" అంటూ విసుక్కున్నాడు.

ఈ మాటలు రైలు దిగి వస్తున్న ఒక పెద్దమనిషి విన్నాడు. "బాబూ! ఈ పెట్టెను నేను తీసుకొని వస్తాను" అని ఎదురుగా నిలబడ్డాడు. ఆ యువకుడు తన పెట్టెను వృద్ధుని భుజంమీద కెక్కించి తాను ముందు నడుస్తున్నాడు. వెనుక పెట్టెతోసహా ముసలివాడు వస్తున్నాడు.

ఇరువురూ స్టేషన్ దాటి ఊళ్ళోకి వెళ్ళారు. యువకుడు ఇంటికి వెళ్ళి తలుపులు కొట్టాడు. లోపలినుంచి తండ్రి వచ్చి తలుపు తీశాడు. పెట్టె మోసుకొస్తున్న వ్యక్తిని చూసి "అయ్యో! అయ్యో! ఈశ్వర చంద్ర విద్యాసాగరులా? మీరు తెచ్చారేమిటి?" అంటూ నిర్ఘాంతపోయాడు.

వెంటవచ్చిన యువకుడు తన తప్పు గ్రహించి సిగ్గుపడి క్షమాపణ వేడుకున్నాడు. తమ పనులు తాము చేసుకోడానికి ఎవరూ నామోషి పడకూడదని విద్యాసాగర్ తరచూ చెపుతూవుండేవాడు.

పనిమీద గౌరవం ఉండాలి. ఈ కథ వినండి.

చాలామంది తాము చేసే పని ఎంత ప్రధానమైనదైనా దానిమీద అయిష్టంగా, నిర్లక్ష్యంగా ఉంటారు. తమది కాని పనిమీద కొండంత ఆసక్తి చూపుతారు. ఇదొక విచిత్రమైన గుణం.

మున్సిపల్ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా ఉన్న వ్యక్తి తన పనిమీద లక్ష్యం ఉంచడు. నేను గనుక మున్సిపల్ కమీషనరైతే ఊరు ఇలా ఉండనిస్తానా? అంటాడు.

పదోతరగతి చదివే విద్యార్థి తన తరగతిలో ప్రథమశ్రేణి మార్కులు తెచ్చుకుందామనుకోడు. ఈ ఏడు ఏదోవిధంగా నెట్టేస్తాను. ఇకముందు తరగతిలో అన్నీ ఫస్టుమార్కులేనని కోతలు కోస్తుంటాడు.

ఎం.ఏ. ప్రథమశ్రేణిలో పాసై లెక్చరర్‌గా పనిచేసే వ్యక్తి ఉత్తమ అధ్యాపకుడుగా పేరొందాలనుకోడు. తన క్లాస్‌మేట్ ఐ.ఏ.ఎస్. ప్యాసై కలెక్టరైనాడు. తాను కలెక్టరు కాలేకపోతినే అని చింతిస్తూ ఉంటాడు.

చేసేపనిమీద అనాసక్తి, చెయ్యని పనిమీద ఆసక్తి! ఇదీ జీవితంలో విజయాన్ని చేకూర్చదు. అందరూ అన్ని పనులూ చేయలేరు, చేయనవసరమూ అనిపించేటంత సుందరంగా చేయడంలోనే ఘనత ఉన్నది. అప్పుడే పనిలో మాధుర్యం మనకు తెలుస్తుంది.

నీవు ప్రేమించిన పని నీకు లభ్యంకాకపోతే లభించిన పనిని ప్రేమించు. చేసే పనిమీద ఇష్టంలేనిచో ఆ పనిని బాగుగా చెయ్యలేము. ఇష్టమున్నచో ఆ పనిమీద శ్రద్ధ కలుగుతుంది. అప్పుడు దానిని నైపుణ్యంగా చేస్తాము. బడిలో చదువుకున్నా, వ్యాయామం చేసినా, ఉద్యోగం, వ్యాపారం ఏదిచేసినా, సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నా, ఏపని చేస్తున్నా దానిపై ప్రేమ కలిగి చెయ్యాలి. అంకితభావం ఉండాలి. అప్పుడుమాత్రమే దానిని విజయవంతంగా చెయ్యగలుగుతాం.

మనం ఏమి సాధించాలన్నా శ్రమ చెయ్యాలి. కేవలం కోరిక ఉంటే చాలదు. అనుకున్నంత మాత్రాన పని జరిగిపోదు. కృషి, శ్రమ, పట్టుదల ఉంటేనే దేనినైనా సాధించగలుగుతాం. కాబట్టి ఆ మూడింటిని కూడగట్టుకొని మనకు అప్పగించబడిన పనిని సమర్థవంతంగా పూర్తిచెయ్యాలి. భర్తృహరి లోకంలో మూడురకాలైన వ్యక్తులను గురించి చెప్పారు. అల్పులు పనిచేస్తే అలసిపోతాం. కష్టాలువస్తాయని పనిని అసలు ప్రారంభించరు. మధ్యములు పనిని ప్రారంభించి కష్టాలు ఎదురైతే భయపడి మధ్యలో ఆపేస్తారు. ఉత్తములైతే తాము ప్రారంభించిన పనిలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని ప్రారంభించిన పనినిన పట్టుదలతో

విజయవంతంగా పూర్తిచేస్తారు. అంటే ఉత్తములు పనిని అంకితభావంతో చేస్తారనేగదా! అందుకే వారు విజయాన్ని పొందుతారు. కాబట్టి మనంకూడా పనిపట్ల శ్రద్ధను, అంకితభావాన్ని పెంపొందించుకోవాలి. శ్రమను గుర్తించి గౌరవించాలి. ఎవరైతే పనిపట్ల బాధ్యతతో వ్యవహరిస్తారో వారిని ఎప్పుడూ గౌరవిస్తారు, మెచ్చుకుంటారు. అభినందిస్తారు. అలా పనిలోని మాధుర్యాన్ని గుర్తించి ప్రతిఒక్కరూ పని సంస్కృతిని అలవరచుకొని ఆనందమయ జీవనం గడపాలి. చిన్నప్పటినుండి పూటగడవక శ్రమపడి జీవితంలో గెలుపును సొంతంచేసుకున్న రాములమ్మ కథ వినండి.

ఉదయభానుడి లేలేత కిరణాలు మీదపడడంతో రాములమ్మ చిరుగుల దుప్పటిని ప్రక్కకులాగి దిగ్గున లేచి కూర్చుంది. వయసు పైబడిన అవ్వ రోజూ కేకలువేసి లేపుతుంది చిన్నరాములమ్మను. ఆరోజు అవ్వ లేవలేదు. నా అన్నవాళ్ళు ఎవ్వరూ లేని రాములమ్మకు ఉన్న ఆ ఒక్క ఆధారంకూడా పోయింది. అవ్వ చనిపోయింది.

తను రోజూ పనిచేసే దుకాణం యజమాని 'సేఠ్' దగ్గరకు వెళ్ళింది రాములమ్మ. బిక్కుబిక్కుమంటూ ఉన్న విషయం చెప్పింది. ఆయనా, ఆయన భార్య రాములమ్మను ఓదార్చారు. మిగిలిన తతంగమంతా పూర్తిచేశారు. తరువాతిరోజునుండి రాములమ్మ దినచర్య మారిపోయింది. ఉదయం సేఠ్ భార్యకు ఇంటిపనులలో సాయం చేయడం, తరువాత సేఠ్ దగ్గర అంగట్లో సరుకులు అందించడం - ఇలా పని బరువుగా సాగింది.

కొద్దిరోజుల తర్వాత రాములమ్మ అంగడి దగ్గరకు వెళ్ళింది. అప్పుడే సేఠ్, సేఠ్‌భార్య ప్రయాణమయ్యారు. రాములమ్మ కోసం ఎదురుచూస్తున్నారు. రాములమ్మ రాగానే 10 రూపాయలు చేతిలోపెట్టి "మేము తిరుపతికి బయలుదేరుతున్నాము. తిరిగి వచ్చేందుకు మూడురోజులు పడుతుంది. అంతవరకు ఈ సరుకులు తీసుకుని వాడుకో" అనిచెప్పి బయలుదేరి వెళ్ళారు.

ఆ మూడురోజులూ ఏంచేయాలో అర్థంకాలేదు రాములమ్మకి. ఉదయమే లేచింది. తమ వీధిలో పశువులు వేసిన పేడనంతా సేకరించింది. తరువాత వంట చేసుకొని తిన్నది. సాయంకాలంకూడా పొద్దుపోలేదు. మళ్ళీ వీధంతా తిరిగింది. పేడనంతా పోగుచేసి తన గుడిసెముందు వేసింది. ఇలా రోజూ ఉదయం, సాయంత్రం మెల్లగా ఇది ఒక అలవాటుగా మారిపోయింది. ఇప్పుడు రోజు ఉదయం, సాయంత్రం ఈ పని ముగించుకొని, తరువాతే సేఠ్ దగ్గరకు పనికి వెళ్ళేది.

ఇలా సంవత్సరం పొడవునా పోగుచేసిన పేడ దాదాపు 20 బండ్లు అయ్యింది. ఇంతలో శరత్కాలం వచ్చింది. చేలకి ఎరువులు తోలడం మొదలుపెట్టారు రైతులు. రైతులందరికన్నూ రాములమ్మ గుడిసెముందు ఉన్న పేడదిబ్బ మీదే! రైతులు ఆ ఎరువును కొనాలనుకున్నారు. ఈ విషయం సేఠ్‌కు తెలిసింది. సేఠ్ ఒక రైతుతో మాట్లాడి, బండి ఎరువుకు 200/- రూపాయల చొప్పున మొత్తం నాలుగువేల రూపాయలు రాములమ్మ చేతిలో పెట్టాడు.

ఒక్కసారిగా చేతిలోకి వచ్చిన నాలుగువేల రూపాయల్ని చూసి రాములమ్మకి నోటమాట రాలేదు. ఆ డబ్బులు బ్యాంకులో దాచుకుంది.

ఇప్పుడు రాములమ్మ తన ఖాళీసమయాన్నంతా పేడను ప్రోగుచేయడం కోసమే వెచ్చించింది. పిల్లల సాయంతో రాములమ్మ చాలా పేడ పోగుచేసింది. మరుసటి సంవత్సరం రాములమ్మ ఎరువుకు మునుపటికంటే మూడింతలు లాభం వచ్చింది. ఈ డబ్బు మొత్తం ఆమె బ్యాంకు ఎకౌంటులో జమైంది. ఇలా ఆమె పేరిట బ్యాంకులో మొత్తం లక్షరూపాయలవరకూ సొమ్ము జమైంది.

అయితే ఒక సంవత్సరం తీర్థయాత్రలకు బయలుదేరిన సేఠ్ దంపతులు ఆకస్మికంగా రోడ్డుప్రమాదంలో మరణించారు. ఉన్న అంగడిని, ఇల్లును బంధువులు లాక్కొనిపోయారు. రాములమ్మ ధైర్యం కూడగట్టుకొని తను దాచుకొన్న సొమ్ముతో సొంతంగా చిల్లర దుకాణం ఒకటి మొదలుపెట్టింది. సేఠ్ దగ్గర నేర్చుకున్న వ్యాపార మెళకువలతో వ్యాపారాన్ని కూడా చక్కగా నడిపింది. రానురాను రాములమ్మ అంగడిలో వచ్చే ఆదాయం కూడా బాగా పెరిగింది. జీవనానికి లోటులేదు. కష్టంయొక్క విలువను, అందులోని ఆనందాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్నది. ఇప్పుడు రాములమ్మ ఊళ్ళో అందరికంటే ధనవంతురాలు. కానీ పేదరికంలో కష్టాన్ని మాత్రం ఏరోజూ మరిచిపోలేదు. రాములమ్మ నీడలో చాలామంది పేదపిల్లలు, ముసలి వాళ్ళు ఆశ్రయం పొందుతున్నారు. శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది రాములమ్మ.

## శ్రమించుటలో ఆనందమున్నది

శ్రమించటం కేవలం అవసరంకోసమే కాదు. అందులో ఆనందంకూడ ఉంటుంది. శ్రామికులందరూ ఒకవిధమైన సహకారపద్ధతిలో పనిచేయటం వలన సమిష్టిగా ప్రయోజనాన్ని పొందగల్గుతున్నారు. కర్షకుడు హలముపట్టి, భూతలముదున్ని, ధాన్యరాసులు పండిస్తాడు. కార్మికుడు నడుమువంచి కర్మాగారములందు పనిచేసి, సాధన సంపత్తి సృష్టిస్తాడు. వడ్రంగి తలుపులు చేస్తాడు, కమ్మరి బందులు చేస్తాడు. సాలెవాడు బట్టలునేస్తాడు. తాపీవాడు ఇండ్లు కడతాడు. ఈవిధముగా శ్రమను పంచుకోవటం జరుగుచున్నది.

**సూక్తి**

విశ్రాంతి అనే తియ్యదనం శ్రమ అనే చేదునుండి లభిస్తుంది.

**సూక్తి**

శ్రమ నీ ఆయుధమైతే, విజయం నీ బానిస అవుతుంది.

– గాంధీజీ

# 14 వివిధ రకాల సేవలు

**I. ప్రధాన విలువ**

సేవాభావం

**II. ఉప విలువ**

వివిధ రకాల సేవలు చేసేవారిని గుర్తించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- సమాజానికి సేవ చేసేవారిని గుర్తిస్తారు.
- సమాజానికి మేలు చేసే గుణాన్ని అలవర్చుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

ప్రతిరోజు మనం ఎన్నో చూస్తుంటాం. వాటిలో కొన్నింటిని పట్టించుకోం. మరికొన్నింటిని గురించి ఆలోచించం. కానీ కొద్దిగా దృష్టిపెడితే కొన్ని విషయాలలో ఆశ్చర్యం వేస్తుంది. మర్రి విత్తనాన్ని చూశారా? ఎంత చిన్నగా ఉంటుంది. కాని దానిలోనుంచే పెద్ద మర్రిచెట్టు వస్తుంది. అంత చిన్నగింజలో ఇంత గొప్ప శక్తి ఉందన్నమాట. ఇలాగే మన మధ్యనే ఉన్న వాళ్ళలో కూడా ఏదో కొంత గొప్పతనముంటుంది. సామాన్యులుగా కనిపించేవాళ్ళలో కూడా అసామాన్యమైన ప్రతిభ దాగిఉంటుంది. వారు ఎన్నోరకాలుగా మనకు ఏదోఒక మార్గంలో వస్తువులు, సేవలరూపంలో మనకు సహాయం అందిస్తున్నారు. అలాంటివారిని గుర్తించాలి, గౌరవించాలి. అలాంటి వారి కృషి, త్యాగాన్ని గురించి మనం తెలుసుకుందాం!

## V. విషయం

### గోదారి తీరాన సేవాలయం

మానవసేవే మాధవసేవ - అని నమ్మిన కారుణ్యానందస్వామీజీ పవిత్ర గోదావరి తీరాన తన జీవితాన్ని అనాథల సేవకు అంకితమిచ్చారు. ఏడు దశాబ్దాల కిందట పిల్లలకు అనాధాశ్రమం, వృద్ధులకు వృద్ధాశ్రమం ప్రారంభించారు. వీటి ద్వారా ఎంతోమంది పిల్లలు తమ బంగారు భవితకు బాటలు వేసుకున్నారు. వృద్ధులు చింతలేని జీవిత చరమాంకాన్ని గడుపుతున్నారు.

### చదువుకోసం సేవలు

కారుణ్యానందస్వామీ చిత్తూరుజిల్లానుంచి రాజమండ్రికి వచ్చారు. అక్కడ జీవకారుణ్య సంఘం పేరుతో ఓ సంస్థను ప్రారంభించి అనాథలకు ఆశ్రమం కల్పించారు. 10-15 సంవత్సరాల వయస్సుండే అబ్బాయిలను చేర్చుకుని వారిని చదివించేవారు. ఉన్నతవిద్య చదువకోవాలంటే దూరపు బంధువులూ, దాతల సాయం తీసుకొని బయటకువెళ్ళి చదవొచ్చు. లేదంటే ఏదైనా ఉపాధిమార్గం చూసుకోవాలి. ఆ వయస్సునుంచి వారికాళ్ళమీద వారు నిలబడటానికి అలవాటుపడేలా చేసేవారు. ఇక్కడ చదువుకొని వెళ్ళి పోలీసు, విద్య, బ్యాంకింగ్... ఇలా అనేక రంగాల్లో స్థిరపడిన విద్యార్థులున్నారు. వీరిలో చాలామంది ఏడాదిలో ఒక్కసారైనా వచ్చి తమవంతు ఆర్థికసాయం చేస్తారు.

### వృద్ధుల సేవలు

ఈ కారుణ్యానంద స్వామీనే రాజమండ్రి లా చెరువు రోడ్డులో వృద్ధులకు ప్రత్యేక ఆశ్రమం నిర్మించారు. దీనికీ జీవకారుణ్య వృద్ధాశ్రమం అనిపేరు. ఈ ఆశ్రమంలో అనాథలైన వృద్ధులూ, కుష్టురోగులు ఆశ్రయం పొందుతుంటారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్నవారంతా పిల్లలులేనివారు, ఉన్నా... ఇంటిలో నిర్లక్ష్యానికి గురైనవారు. ప్రస్తుతం వృద్ధాశ్రమంలో 110 మంది ఆశ్రయం పొందుతున్నారు. వృద్ధుల సంరక్షణకు, అలాగే కుష్టురోగులకు సమయానికి అవసరమైన మందులు ఇస్తూ చికిత్సచేసేందుకు వాలంటీర్లను, వైద్యులను అందుబాటులోనే ఉంచాడు. ఇలా ప్రతి సంవత్సరం ఎంతోమంది వృద్ధులు ఆశ్రయం పొంది వీరంతా ఒక కుటుంబంలా ఉంటారు. ఈ సంఘం తరపున చేస్తున్న సేవల్లో మరో ముఖ్యమైనది అనాథ శవసంస్కారం. రాజమండ్రి నగరంతోపాటు పరిసరప్రాంతాల్లో అనాథలూ, వృద్ధులూ మరణించినట్లు సమాచారం అందిస్తే చాలు... సంఘం తరపున కొంతమంది వెళ్ళి మరణించిన వ్యక్తి పార్థివ శరీరాన్ని హరేకృష్ణ హరేరామ సంకీర్తన ఆలపిస్తూ స్మశానానికి తీసుకువెళ్ళి అంత్యక్రియలు జరిపించి వస్తారు.

ఈ సేవలన్నీ చూడడానికి చిన్నవిగా అనిపించినా ఆరోగ్యకర సమాజానికి అవసరమైనవే. కాబట్టి వివిధ రకాల సేవలు చేసేవారిని గుర్తించి మనం కూడా సమాజానికి సేవ చేసే గుణాన్ని అలవర్చుకోవాలి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై సంఘటనల గురించి విన్నారుకదా! మీరు ఎక్కడైనా ఎప్పుడైనా ఇలాంటివారిని చూశారా? చూస్తే మీకేమనిపిస్తోంది?
2. సేవలు చేసేవారిని కలిసినప్పుడు మీరెలా ప్రతిస్పందిస్తారు?
3. ఈ సేవలద్వారా సమాజానికి ఎలాంటి ఉపయోగముంది?
4. మీరు ఎలాంటి సేవలు చేయాలనుకుంటున్నారు?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ గ్రామంలో వివిధ రకాల వృత్తుల, వస్తువుల సేవలు చేసేవారిని గుర్తించి, వారికి కావల్సిన సహాయం ఎలా అందిస్తావు. ఒక కరపత్రం చేయండి.

### తెలుసుకుందాం

మానవులు సంప్రదాయబద్ధంగా కొన్ని కట్టుబాట్లతో, ఆచార వ్యవహారాలతో ఏర్పాటుచేసుకున్న దానిని సమాజం అంటారు. సమాజాన్ని సక్రమమార్గంలో ఉంచుకోవడం మన బాధ్యత. మన సమాజం విలువలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. పూర్వకాలం నుండి ఈ సమాజంలో ప్రతివారు ఒక బాధ్యతను చేపట్టి సమాజ పటిష్టతకు ప్రయత్నించినవారే. ఇవే కులవృత్తులు సమాజంలోనున్న వివిధ వర్గములు వారి వృత్తిని ఆచరించుకుంటూ సమాజాభివృద్ధికి, తద్వారా ఆర్థికంగా జీవనోపాధికి ప్రయత్నించేవారు. అలాంటి వృత్తికారును సమాజం గౌరవభావంతో చూసేది. ఆ వృత్తిని ఆచరించడం వారు కూడా చిన్నతనంగా భావించేవారు కాదు. కానీ నేడు విదేశీ వ్యామోహం పెరిగి ఇలాంటి మన సమాజం దెబ్బతింటోంది. దీనివలన సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయి. దానిని మనం గ్రహించి సక్రమ సమాజ నిర్మాణానికి చైతన్యాన్ని పొందాలి.

ఈ సమాజం ద్వారా మనం జీవిస్తున్నాం. పరస్పర సహాయ సహకారములు లేకుంటే మనిషి మనుగడే లేదు. ఉదాహరణకు వ్యక్తి ఆహారంకోసం వృక్షాలమీద రైతులమీద ఆధారపడాలి. బట్టలకోసం మగ్గాలు నేసేవారిపైన దర్జీపైన, చాకలిపైన ఆధారపడుతున్నాం. ఇల్లుకట్టుకోవాలంటే కూలీలు, ఇసుక, సిమెంటు, ఇనుము ఉత్పత్తిచేసే కర్మాగారాలపై ఆధారపడాలి. ప్రయాణానికి బస్సులపై, రైళ్ళపై, ఆటోలపై అవి నడిపే వారిపై ఆధారపడాలి. ఇలా వ్యక్తి ఎవరిమీద ఆధారపడకుండా బ్రతకలేరు. కాబట్టి ఈ విషయాన్ని మనం గ్రహించాలి.

ఈ సమాజంనుండి విడిపోతే మనం దేనికి కొరగాం.మనకు ఎన్నోవిధాలుగా సహకరిస్తున్న ఈ సమాజం నాది - దీని బాగుకోసం నేను ప్రయత్నిస్తాను అని ప్రతిఒక్కరు అనుకోగలగాలి. సమాజంలో

వివిధ రకాల వృత్తులు, ప్రవృత్తులు, నిరక్షరాస్యులు మొదలైనవారు ఎందరో నేటి సమాజంలో ఉన్నారు. వారి కష్టాలను తోటి వ్యక్తులు ప్రయత్నించాలి. గ్రామాల్లోను, అడవులలోను, కొండకోనల్లోను, పూరిపాకల్లోను నివసిస్తున్న దీనులు, దుఃఖితులు కూడా ఈ సమాజంలోనివారే అలాంటివారిని మనం ఆదుకోవాలి.

మన ఇంట్లో అమ్మ నాన్నలకు ఇంటిపనుల్లో, బయటిపనుల్లో సహాయపడడం కూడా సేవనే. ముసలివారిని, వికలాంగులను, అంధులను కూడా రోడ్డు దాటించడం కూడా సేవనే.

సమాజంలోని ప్రజలకు, సమాజానికి, ఎన్నోరకాలుగా ఇతోధికంగా సేవలు చేస్తున్న అనేక స్వచ్ఛందసంస్థలు ఉన్నాయి. సంస్థలుగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా రకరకాల సేవలు చేసేవారున్నారు. వారి సేవను గుర్తించి, అభినందించాలి. అంతేకాదు వారి బాటలో నడిచి మనకు చేతనైనంత సేవ చేయాలి.

కరువు కాటకాలు, ప్రకృతివైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు, మతకలహాలు జరిగినప్పుడు కొంతమంది వ్యక్తిగతంగా, కొంతమంది ఒక జట్టుగా కలిసి, ఇతరులకు సేవ చేస్తుంటారు. వివిధరకాల పేర్లతో కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా తమ సహకారం అందిస్తాయి.

నేషనల్ గ్రీన్‌కోర్ సంస్థ, వనసంరక్షణ-వన్యప్రాణి సంరక్షణ సంస్థ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, బ్లూక్రాస్ మొదలైన సంస్థలు ప్రకృతిని కాపాడడంలో, జంతువులను సంరక్షించడంలో వివిధ కార్యక్రమాలు చేపడుతుంటారు.

వందేమాతరం ఫౌండేషన్ లాంటి కొన్ని సంస్థలు పేదవిద్యార్థులకు కావలసిన పుస్తకాలను సేకరించి ఇవ్వడం ప్రతిభావంతులైన విద్యార్థులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం చేస్తున్నారు.

ఈవిధంగా చూస్తే వైద్య, విద్య, న్యాయపరంగా ఎన్నో సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయం.

సంస్థగానే కాకుండా మనం వ్యక్తిగతంగా ఎంతోకొంత సేవ చేస్తుంటాం. వారధిని నిర్మించడానికి ఉడుత సహాయపడినట్లుగా మనం చేసిన సేవ చిన్నదైనా ఎంతోకొంత ఇతరులకు మేలు కలిగించేదిగా ఉంటే చాలు.

**సూక్తి**

శ్రమ చేయందే విజయం రాదు.
శ్రమకంటే ముందే విజయం వచ్చేది ఒక డిక్షనరీలో మాత్రమే.

**సూక్తి**

మానవ సేవే మాధవ సేవ

# 15 స్త్రీ సాధికారత

**I. ప్రధాన విలువ**

సమానత్వం - సోదరభావం - స్త్రీల పట్ల గౌరవం

**II. ఉప విలువ**

స్త్రీ సాధికారత - విద్య - ఇతర అవకాశాలు

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- స్త్రీలు కూడా పురుషులతో సమానంగా ఏపనినైనా చేయగలరు అని తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

మనది పురుషాధిక్య సమాజం. ఈ సమాజంలో స్త్రీలు వివక్షతకు గురవుతున్నారు. స్త్రీ వివక్ష అనేది పూర్వకాలం నుంచి వస్తున్నదే ఈ పనులు ఆడవారే చేయాలి. ఈ పనులు మగవారే చేయాలి. అనేక వివక్షతలను చిన్నప్పటినుంచే తల్లిదండ్రులు పిల్లల విషయంలో అమలుపరచడం మనం చూస్తూఉంటాం. పిల్లలకు కొనే బొమ్మల విషయంలోకూడా ఈ భేదం కనిపిస్తుంది. పురుషుడు సంపాదించాలి - స్త్రీలు పిల్లల్ని కనిపెంచాలి. అందరికీ సేవచేయాలి అనే అభిప్రాయం మారుతూ వస్తోంది. ఇప్పుడు స్త్రీలు కూడా ఉద్యోగం చేస్తున్నారు. ఆర్థిక స్వావలంబన కలిగిఉంటున్నారు. కానీ ఉద్యోగం చేసినాసరే ఇంటిపనులు, పిల్లల పనులు సేవలు ఆడవారే చేయాలనడం ఎంతవరకూ సమంజసం? ఇంత చేసినా స్త్రీలు పురుషులకు సమానం కారని పురుషులతో సమానంగా చేయలేరని సమాజం భావిస్తోంది. కానీ ప్రస్తుత కాలంలో ఈ రంగం, ఆ రంగం అనే తేడా లేకుండా ఏ రంగంలోనూనా మహిళలు విజయాన్ని సాధిస్తూ తమ సాధికారతను తెలియజేస్తున్నారు. మీరు గమనిస్తూనే ఉంటారు విద్యారంగంలో కూడా ఎక్కువ ఉత్తీర్ణతా శాతం మహిళలదే. దేనిలోనైనా మహిళలు పురుషులకు ఏవిధంగానూ తీసిపోరు.

## V. విషయం

### సంఘటన-1

ప్రశాంతి ఒక గృహిణి. కంప్యూటర్ సైన్స్‌లో పి.జి. డిగ్రీ చేసింది. తన పిల్లలను తన చేతులతో పెంచి పెద్దచేయాలని వారిని వృద్ధిలోకి తేవాలని ఉద్యోగాన్ని కూడా కాదనుకుంది. చిన్నప్పటినుంచి పిల్లలకు మంచి మంచి కథలు చెబుతూ విలువలను పాటించే మంచి క్రమశిక్షణ కలిగిన పిల్లలుగా తయారుచేసింది. వారికి హోమ్‌వర్క్ చేయడంలో సహకరిస్తుంది. పాఠశాలకు వెళ్ళి ప్రిన్సిపల్‌తో మాట్లాడి పిల్లల సమస్యలను పరిష్కరిస్తుంది. ఇంటి ఆర్థికమంత్రి కూడా ఆమే ఏపనికి ఎంత ఖర్చవుతుందో లెక్కించి కొంత పొదుపు కూడా చేస్తుంది. ఈమె ఆలనా పాలనలో ఆమె పిల్లలు మంచి సంస్కారవంతులైన పౌరులుగా తయారయ్యారు.

### సంఘటన-2

సరళ 10వ తరగతి చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు మంచి సంబంధం వచ్చిందని ఆమెకు వివాహం నిశ్చయించారు. ఈ విషయం తెలిసిన సరళ 18 సంవత్సరాలు నిండకుండా అమ్మాయికి వివాహం చేయడం నేరమని. అంతేకాకుండా తనకు పెళ్ళి ఇష్టంలేదని తాను మంచిగా చదివి, ఉద్యోగం తెచ్చుకుని తన కాళ్ళమీద తాను నిలబడగలిగినపుడే వివాహం చేసుకుంటానని అంతవరకు ఈ ప్రస్తావన తేవద్దని తన నిర్ణయాన్ని తెలియజేసింది.

### సంఘటన-3

పద్మ, నరేష్‌లు భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగుల, వారికి ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేదు. ఒకసారి పద్మ వాళ్ళ నాన్నగారికి జబ్బుచేసింది. ఆపరేషన్ చేస్తే మంచిదని చెప్పారు డాక్టర్లు. పద్మ అన్న ఒక ప్రైవేటు కంపెనీలో ఆఫీసర్ కానీ ఆయన ఆపరేషన్‌కు ఎక్కువ ఖర్చు అవుతుందని ఆపరేషన్ చేయించాలా వద్దా అని ఆలోచనలో ఉన్నాడు. ఇంతలో పద్మ వాళ్ళ నాన్నను హాస్పిటల్‌లో చేర్చి ఆపరేషన్ చేయించింది. ఖర్చులన్నీ తానే భరించింది. భర్తనుండి కూడా ధనసహాయం తీసుకోలేదు.

### సంఘటన-4

స్వర్ణ డిగ్రీ పూర్తిచేసింది. ఆమెకు ఐ.పి.ఎస్. ఆఫీసర్ కావాలనే కోరిక. కానీ ఆమె తల్లిదండ్రులు ఆడపిల్లవుకదా! రాత్రిపగలు అనే తేడాలేకుండా పనిచేసే ఉద్యోగం, రిస్క్‌తో కూడిన జీవితం అని వద్దన్నారు. కానీ ఆమె వారిని ఒప్పించి కృషి, పట్టుదలతో ఐ.పి.ఎస్. పరీక్షలో, ట్రైనింగ్‌లో మగవారికన్నా ముందు నిలిచింది.

**సంఘటన-5**

భారతీయ సంతతికి చెందిన వ్యోమగామి సునితా విలియమ్స్. ఈమె తండ్రి డాక్టర్. వీరు మహారాష్ట్రకు చెందినవారైనా యునైటెడ్ స్టేట్స్‌లో స్థిరపడ్డారు. ఈమె చిన్నప్పటినుంచి వ్యోమగామి (అంతరిక్షంలోనికి వెళ్ళేవారు) కావాలని కలలుగంది. దానిని సాకారం చేసుకోవడానికి చాలా కృషిచేసింది. తమ వృత్తిలో చేరిన మొదట్లో హెలికాప్టర్ నడిపేది. తర్వాత యునైటెడ్ స్టేట్స్ నావికాదళ అధికారి అయ్యింది. తర్వాత అంతరిక్షకేంద్రానికి వెళ్ళేవారిలో స్థానాన్ని సంపాదించింది. వ్యోమనౌకలో ప్రయాణించడానికి కావలసిన శిక్షణ తీసుకుంది. అంతరిక్షానికి వెళ్ళింది. అంతరిక్షంలో నడిచింది. అంతేకాకుండా మహిళా అంతరిక్ష ప్రయాణీకులలో ఎక్కువసేపు అంతరిక్షయానం చేసిన మహిళగా (195 రోజులు) ప్రపంచ రికార్డు నెలకొల్పింది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. ఆడవారు చదువుకోవటం వలన కలిగే లాభాలేవి? మొదటి సంఘటన నుండి మీరు ఏమి గ్రహించారు?
2. రెండవ సంఘటనలో సరళ తీసుకున్న నిర్ణయం సరైనదేనా? ఎందుకు?
3. పద్మ తన తండ్రికి ఎవరి సహాయం లేకుండా ఆపరేషన్ ఎలా చేయించగలిగింది?
4. నాలుగవ మరియు ఐదవ సంఘటనల ద్వారా మీరు ఏమి గ్రహించారు?
5. మహిళలకు విద్య అవసరమా? ఎందుకు?
6. "మహిళలు ఏ రంగంలోనైనా అభివృద్ధిని సాధించగలరు" అలా అభివృద్ధి చెందిన మీకు తెలిసిన కొందరు మహిళల గూర్చి చెప్పండి.
7. మహిళలు ప్రవేశించని రంగం ఏదైనాఉందా? పురుషులు చేయగలిగే పనులన్నీ మహిళలు చేయగలుగుతున్నారా? మహిళలు చేయగలిగే పనులన్నీ పురుషులు చేయగలుగుతున్నారా? చర్చించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- వివిధ రంగాలలో అభివృద్ధి సాధించిన మహిళల వివరాలు సేకరించండి. చదవండి. మీ అభిప్రాయాలు తెలపండి.
- మీ ఇంటి చుట్టుపక్కల ఉన్న ఆడవారియొక్క సాధికారతను (వారు ఏపనులను సక్రమంగా నిర్వహిస్తున్నారు) పరిశీలించి తెలపండి.

## తెలుసుకుందాం

### సాధికారత కల్పించేది మహిళా చైతన్యమే

ఒక గొప్ప రాజకీయ దురంధరుడు తన దేశపు జాతీయ వ్యవహారాలను ఏవిధంగా సఫలీకృతుడై తీర్చిదిద్దుతాడో అదేవిధంగా తన ఇంటిని స్వర్గసీమగా మార్చడంలో సఫలీకృతురాలై గృహిణి గర్వాన్ని పొందుతుంది. స్వామి వివేకానందుని ప్రకారం "స్త్రీల పరిస్థితి మెరుగుపడనిదే ప్రపంచంలో సంక్షేమానికి తావు లేదు. ఒక్క రెక్కతో ఏపక్షీ ఎగరలేదు" ఇంటిని చాలా సమర్థవంతంగా నడిపే మహిళ. ఆ ఇంటివరకూ రాణితోపాటు ప్రజ కూడా, భర్త పిల్లలు తమ తమ పనులను సులభంగా చేసుకోగలిగేలా చేసే వ్యక్తి గృహిణి. గృహిణి భర్త, పిల్లలను చీకుచింతలనుండి రక్షించడం చేస్తుంది. వారి భోజన సదుపాయాలను గమనిస్తూ వార బాగోగతులను గురించి పాటుపడుతుంది. గృహిణి ఇంటి ఆర్థికమంత్రి. ఆమె కారణంగానే ఇంటి బడ్జెట్ అదుపులో ఉంటుంది. గృహిణి లలితకళల మంత్రిగా కూడా ఉంటుంది. ఇల్లు అందంగా కళాపూర్వకంగా తీర్చిదిద్దబడి ఉందంటే దానికి కారణం ఆమె. ఆమె కుటుంబ విద్యామంత్రి కూడా. కొడుకు పాఠశాల ప్రవేశానికి కాలేజి చదువులకు ఆమె బాధ్యురాలు. కూతురు తెలివితేటలకూ, అలవాట్లను అలవరచుకోవడానికి కూడా ఆమె బాధ్యత వహిస్తుంది. నేటి సమాజంలో అభివృద్ధి సాధించాలంటే పురుషులతో సమానంగా స్త్రీలు కూడా ఉత్పత్తిలో భాగస్వామ్యంతో పాటు నిర్ణయాధికారాలుండాలి.

స్త్రీ సాధికారత భారతీయ సంప్రదాయానికి ఒక చిహ్నం. దేశ ధైర్యసాహసాలకు ఒక రుజువు. అభివృద్ధికి వెలుగుబాట. ఆకలి, దారిద్ర్యం, పోషకాహార అభద్రత, వీటన్నింటినుంచీ విముక్తినిచ్చి, ఆర్థిక వనరుల నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవటంలో స్త్రీలకు సమాన భాగస్వామ్యాన్ని ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణ నాణ్యతను పెంపొందింపచేయడం స్త్రీ సాధికారతకు దారితీస్తాయి. స్త్రీ హక్కులు, స్త్రీ విద్య ఆర్థికాభివృద్ధిలో వారి భాగస్వామ్యం, సామాజిక రంగాల అభివృద్ధిలో వారి పాత్ర స్త్రీ సాధికారతకు నిదర్శనాలు. అన్ని రంగాలలోను మునుపటికన్నా నేడు స్త్రీలు ఎదుగుదల సాధించినా, కొన్ని హక్కులు సాధించుకున్నా, సమాజంలో ముందుకు దూసుకుపోతున్నా, సాపేక్షంగా చూస్తే స్త్రీలు పక్కకు నెట్టివేయబడుతున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా ఆర్థిక అసమానతలు పెరగడంతో స్త్రీ, పురుషుల మధ్య అంతరాలు పెరిగాయి. సీరియల్స్‌లో మహిళలపట్ల చూపించే పెడధోరణి వల్ల సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు, చులకనభావం పెరిగింది. భూస్వామ్య సమాజం నుండి పెట్టుబడిదారీ సమాజం వరకు స్త్రీ పట్ల వివక్ష, అసమానత, దోపిడీ రూపాల తీవ్రత పెరిగింది. తల్లిగా, గృహిణిగా, కుటుంబ యజమానురాలుగా, బాధ్యతగల ప్రభుత్వాన్ని ఎన్నుకునే పౌరులుగా గురుతరమైన బాధ్యత వహిస్తున్నటువంటి మహిళలో ఆత్మవిశ్వాసం, జీవితాన్ని ఒక నిర్దిష్టమైనటువంటి తీరులో మార్చుకునే స్థైర్యం, మారుతున్నటువంటి సమాజములో పరిసరాలను, అవసరాలను గుర్తెరిగి వాటికి అనువుగా ఎదిగి, పరిస్థితులను చక్కదిద్దుకోవలసినటువంటి సామర్థ్యం, చైతన్యం కేవలం విద్య వల్లనే కలుగుతాయి. సమాజంలో స్త్రీలు, తమకు హక్కులు, రక్షణలు,

సదుపాయాలు కల్పించే కొన్ని చట్టాలున్నప్పటికీ కూడా వాటిని గురించి, తగిన విషయపరిజ్ఞానం లేనందువల్ల, వాటిని వినియోగించుకోలేక పోవటమేగాక అనేక రకాలుగా అణచివేతకు, దోపిడీకి గురవుతున్నారు. స్త్రీల పట్ల చులకన ఉండటంవల్లే స్త్రీలపై అరాచకాలు శారీరక, మానసిక హింసలు పెచ్చుపెరుగుతున్నాయి. స్త్రీలపై జరిగే హింస వారి మానవహక్కుల్ని హరిస్తోంది. అభివృద్ధిని అందుకోవటంలో అందులో పాలుపంచుకోవడంలో స్త్రీలపై హింస ఆటంకంగా పరిణమిస్తోంది. స్త్రీలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసపట్ల ప్రభుత్వం, ప్రజల్లో చైతన్యం కలిగించాలి. స్త్రీలపై హింస, నేరాలు, నిరాటంకంగా జరుగుతూనే ఉన్నాయి. స్త్రీల వేధింపు, బాధలకు వేదనలకు గురవుతూనే ఉన్నారు. బలవంతపు వ్యభిచారం, లైంగిక వేధింపులు, కుటుంబంలో హింస, వరకట్నపు చావులు, హత్యలు, అపహరణలు, బాల్యవివాహాలు, భ్రూణహత్యలు, మానభంగాలు, వెట్టిచాకిరి, లింగవివక్ష, స్త్రీలకు పురుషులతో సమాన వేతనం లభించకపోవడం, ఈవ్‌టీజింగ్, క్రూరత్వం, కస్టోడియల్ హింస, బాలకార్మిక వ్యవస్థలు, సతీసహగమనం మొదలగునవి మహిళల మానవ హక్కుల ఉల్లంఘనలకు మచ్చుతునకలు. స్త్రీలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసపట్ల ప్రభుత్వం, ప్రజల్లో చైతన్యం కలిగించాలి. స్త్రీ తనకు తానుగా ఆలోచించగలిగి, ఆర్థిక స్వాతంత్ర్యం సాధించిననాడు, సామాజికంగా స్త్రీ హెూదా దానంతట అదే పెరుగుతుంది. స్త్రీ స్వాతంత్ర్యంగా ఆలోచించగలగాలంటే ముందుగా స్త్రీలంతా చదువుకోవాలి. స్త్రీలు చదువుకుంటేనే వికాసం పొందగలరు. సమాజంలో పురుషులతో పాటు సమానంగా అవకాశాల్ని పొందగలుగుతారు. స్త్రీలకు సంబంధించిన ప్రభుత్వ వనరులను, సంక్షేమ అభివృద్ధి పథకాలను స్త్రీలు అందిపుచ్చుకోటానికి చదువు శక్తివంతమైన సాధనంగా ఉపకరిస్తుంది. తల్లిగా, గృహిణిగా, కుటుంబ యజమానురాలుగా, బాధ్యత గల ప్రభుత్వాన్ని ఎన్నుకొనే పౌరులుగా గురుతరమైన బాధ్యత వహిస్తున్నట్లు వంటి మహిళలలో ఆత్మవిశ్వాసం, జీవితాన్ని ఒక నిర్దిష్టమైనటువంటి తీరులో మార్చుకునే స్థైర్యం, మారుతున్నటువంటి సమాజములో పరిసరాలను, కేవలం విద్య వల్లనే కలుగుతాయి. మహిళల్లో కనీస విద్య, చైతన్యం, జాగృతి, వికాసం ఉన్నప్పుడే సమాజంలో సరైన సముచిత స్థానాన్ని పొందుతారు. కుటుంబంలో గుర్తింపు, గౌరవం, సమిష్టి నిర్ణయాలు తీసుకునే ఆత్మవిశ్వాసం వారిలో కలుగుతాయి. స్త్రీలపై జరుగుతున్న హింసకు ఎదుర్కొని స్త్రీ అబలకాదు సబల అని నిరూపించాలి. స్త్రీ బాధ స్త్రీకే తెలుస్తుంది. కాబట్టి స్త్రీల పట్ల జరిగే హింసను కలిసికట్టుగా ఎదుర్కోవాలి. స్త్రీ శక్తియుక్తులు వెలికితీసి మెరుగులు పట్టాలి. ప్రతి రంగంలో కూడా స్త్రీలు పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుకుంటూనే ఉన్నారు. స్త్రీలు గౌరవించబడే చోట, స్త్రీలకు సమాన అవకాశాలు ఉన్నచోట, మహిళ సాధికారత సాధించినచోట, ఆ దేశం భవిష్యత్తు ఉన్నతంగా సంపూర్ణ అభివృద్ధిని సాధిస్తుంది.

**సూక్తి**

విజయం ఎవరికీ చుట్టం కాదు. అది సాధించడానికి
కృషి చేసేవారిని తప్పక వరిస్తుంది.

# 16 మన కర్తవ్యం

**I. ప్రధాన విలువ**

జాతీయభావన - దేశభక్తి

**II. ఉప విలువ**

దేశం పట్ల తమ కర్తవ్యాన్ని గుర్తించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- దేశం పట్ల గౌరవాన్ని పెంచుకుంటారు.
- దేశ గౌరవాన్ని కాపాడడంలో దేశపౌరులుగా తమ కర్తవ్యాన్ని గుర్తిస్తారు. బాధ్యత వహిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

దేశం నాకేమి ఇచ్చింది అని అందరూ ఆలోచిస్తారేకాని దేశానికి నేనేం ఇచ్చాను అని ఆలోచించేవారు ఎందరుంటారు? బానిస బతుకునుండి మనదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత మన దేశాభివృద్ధి బాధ్యతలు మనమే చేపట్టాము. నాదేశం, నా దేశ అభివృద్ధిలో నా కర్తవ్యం ఏమిటో ప్రతిఒక్క పౌరుడు గుర్తించి నడుచుకున్నప్పుడే మన దేశప్రగతి ప్రపంచంలో ముందంజలో ఉంటుంది. అందుకోసం ప్రతిఒక్క భారతీయుడు కృషిచేయాలి. బాధ్యతగల పౌరునిగా ప్రవర్తించాలి.

## V. విషయం

### సన్నివేశం-1

వాళ్ళు కాలేజీ చదివే పిల్లలు. దేశంయొక్క, సమాజంయొక్క మంచి చెడ్డలు వారి మనస్సులోకి రావు. యాంత్రికంగా చదువుతున్నారు, డిగ్రీలు పొందుతున్నారు. వ్యక్తిత్వం వికసింపజేసుకోవడానికి గుణాలను పెంపొందించుకోవడానికి వాళ్ళు కృషి చేయరు. వారికి ఏ విషయంపైనా పట్టులేదు, ఆలోచన లేదు. తల్లిదండ్రులు సంపాదించి పెడుతుంటే తింటున్నారు. కాలేజీలకు వెళ్ళి క్లాసుల్లో కాసేపు కూర్చోవడం, క్లాసు ఎగరగొట్టి సినిమాలకు వెళ్ళడం, జల్సాలు చేయడం ఇదే వాళ్ళ దినచర్య.

### సన్నివేశం-2

దేశంలోని కొన్ని ప్రాంతాలలో కరవు విలయతాండవం చేస్తుంది. తినడానికి తిండిలేదు, పైగా రైతుల ఆత్మహత్యలు. ఎవరైనా ఆదుకుంటారేమో అని ఎదురుచూస్తున్న ప్రజలు.

### సన్నివేశం-3

ప్రపంచ మహాసభలు జరుగుతున్నాయి. అన్నిదేశాల ప్రగతిని అక్కడ విశ్లేషిస్తున్నారు. దేశానికి సంబంధించిన గొప్ప విషయాలు చెబుతున్నారు. అలాగే దేశానికి సంబంధించిన దేశ కీర్తిని దెబ్బతీసిన అంశాలను ప్రస్తావించారు. అందులో భారతదేశం అవినీతిలో రెండవస్థానంలో ఉండడం గమనించాల్సిన విషయం.

### సన్నివేశం-4

దేశంలోని వనరులు ప్రజలందరికీ సంబంధించినవి వాటిని కొందరే సొంతం చేసుకోవడం, కొందరు నిర్లక్ష్యంగా పాడుచేయడం. ఇతరులకు ఉపయోగించుకోవడానికి వీలులేకుండా చేయడం. సహజవనరులను నాశనం చేయడం వంటివి చేస్తుంటారు. దీని పరిమాణం ఏమిటి?

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై అంశాలను విన్నారు కదా! నేటి యువత దేశం గురించి ఆలోచిస్తుందా? యువకులు ఇలా ఉండడం వల్ల కలిగే నష్టం ఏమిటి? చర్చించండి.
2. మనదేశంలో నివసిస్తున్న వాళ్ళమంతా ఒక కుటుంబంలాంటివాళ్ళం. ఇతరులకు కష్టాలు కలిగినపుడు మనవంతు సహాయం చేయడం మానవత్వం అనిపించుకుంటుంది. ప్రకృతి వైపరీత్యాలు కలిగినపుడు మనం ఎలాంటి సహాయాన్ని అందించవచ్చో చెప్పండి.
3. అవినీతివల్ల దేశ కీర్తిప్రతిష్ఠలు దిగజారిపోతాయి. వీటిని అరికట్టడంలో మన బాధ్యత ఏంటి?

4. ఎక్కడెక్క మన పరిసరాలను మనమే నాశనం చేసుకోవడం జరుగుతున్నదో చెప్పండి. వాటిపట్ల మన బాధ్యతలు ఏంటి?

5. దేశం అంటే ప్రజలు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే మనం ఎటువంటి పనులు చేయలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మన దేశ సంస్కృతిని ప్రతిబింబించే అంశాలను దృష్టిలో పెట్టుకొని దాన్ని కాపాడుకోవడానికి మీరైతే ఏం చేస్తారు?

## తెలుసుకుందాం

ప్రపంచంలోని అన్ని ప్రాంతాలు ఒకేవిధంగా లేవు. కొన్ని సహజ వనరులను, కొన్ని ఖనిజాలను కలిగిఉన్నాయి. ప్రపంచం వసుదైక కుటుంబంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణి పెంపొంది శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందాలి. 21వ శతాబ్దంలో ప్రపంచం ఒక కుగ్రామంగా భావిస్తున్నాం. అన్ని దేశాల ప్రజలు శాంతి, సౌభాగ్యాలతో జీవించినప్పుడే ప్రపంచం అభివృద్ధి చెందినట్లు. కాని కొన్ని ప్రాంతాలు అత్యంత ఆధునికంగా, కొన్ని పేదరికంలో, కొన్ని ప్రాంతాలు అలజడులతో ఉన్నాయి. ప్రపంచంలో ఏ మూలన ఉన్న వ్యక్తి అయినా శాంతి సౌభ్రాతృత్వం, స్వేచ్ఛా స్వాతంత్ర్యములతో జీవించినినాడు ప్రపంచాభివృద్ధి జరిగినట్లు. మన దేశంలో అనాదికాలం నుండి విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరుకున్నారు. వసుదైక కుటుంబాన్ని ఆశించినారు. జగతిలోని జనులందరు ఏ మూలన ఉన్నా సుఖశాంతులతో క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. ఇది మన పూర్వీకులు మనకందించిన వరం. ఈ భావన ప్రతి ఒక్కరిలో ఉన్ననాడు శాంతి సౌభాగ్యాలతో ఈ జగతి విలసిల్లుతుంది.

**సమాజ అభివృద్ధిలో మనవంతు పాత్ర :**

**నిరక్షరాస్యత నిర్మూలన :**

మన చుట్టూ ఉండేవారంతా చదవడం, రాయడం చేయగలిగేలా చూడాలి. అవసరమైతే నిరక్షరాస్యులకు సాయంత్రంపూట చదవడం, రాయడం నేర్పాలి.

**బాలకార్మికుల నిర్మూలన :**

బడికి వెళ్ళే మనమంతా బడికి రాని పిల్లలను బడికి వచ్చేలా చేయాలి. పనికి వెళ్ళే పిల్లలతో మాట్లాడాలి. పని చేయించుకొనే యజమానులతో మాట్లాడాలి. బాలకార్మికుల తల్లిదండ్రులతో మాట్లాడాలి. పిల్లల్ని బడిలో చేర్చాలి.

**సంఘవిద్రోహ కార్యక్రమాలు :**

బంద్‌లు, ధర్నాలు, రాస్తారోకో వంటి వాటికి దూరంగా ఉండాలి. దేనిగురించైనా నిరసన తెలపాలంటే చేసే పనికి ఆటంకం కలుగకుండా, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా నిరసన వ్యక్తం చేయడం, నల్లబ్యాడ్జీలు ధరించడం వంటివి చేయండి. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం జరుగుతుందటే ఎదుర్కోవాలి. పరిరక్షణకై పాటుపడాలి.

**సామాజిక దురాచారాల నిర్మూలన :**

గ్రామాల్లో ప్రధానంగా బాల్యవివాహాల నిర్మూలనకై పాటుపడాలి. నిజామాబాద్ జిల్లా, రంగారెడ్డి జిల్లా, నల్గొండ జిల్లాల్లో బాల్యం పరిరక్షణ దళాలు ఉన్నాయి. వీరు బాల్యవివాహాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకువెళ్తారు. అలాగే వ్యక్తిగతంగా మనం వరకట్న దురాచారానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉంటామని ప్రతినబూని ప్రవర్తించాలి.

**ఉత్తమమైన విలువలు కలిగి ఉండడం :**

సమయపాలన పాటించడం, స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండడం, నిజాయితీ, ధైర్యం, సత్యం, ప్రేమ కలిగిఉండాలి. నిజాయితీ పెట్టెను నిర్వహించాలి. స్మృతివర్ధిని ఆధారంగా డైరీ రాయలి.

**మానవ సంబంధాలు మెరుగు పడడం :**

మనం ఎప్పుడు ఇతరులను/తోటివారిని పేరుతోనే పిలవాలి. మనకంటే పెద్దవారిని అన్నయ్య/అక్కయ్య అని సంబోధించాలి. పెద్దలపట్ల గౌరవభావం కలిగిఉండడం ఎంత ముఖ్యమో, వారి ఆలోచనలను అమలుపరచడం అంతే ముఖ్యం. ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి. ఎదుటివారితో ఎప్పుడూ చిరునవ్వుతో మర్యాదగా మాట్లాడాలి. స్నేహితుల రోజును జరుపుకోవటం, కలిసి ఆడడం, పాడడం, మిత్రులకు చెందిన కార్యక్రమాలలో, ఫంక్షన్స్‌లో పాల్గొని మనకు చేతనైన సహాయం చేయడం మొదలైనవి చేయాలి. తద్వారా మనమంటే ఎదుటివారికి మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. అలాగే మన గ్రామంలో జరిగే పండుగలు, ఉత్సవాలు, జాతరలు వంటివాటిలో సేవాదళ కార్యకర్తలుగా సేవలు చేయాలి.

**అధ్యయనం, పరిశోధన ధృక్పథం కలిగిఉండడం :**

మనం ఎంత బాగా పుస్తకపఠనం అలవాటు చేసుకుంటే అంత బాగా అభివృద్ధి చెందుతాము. గొప్పవారందరికీ ఉన్న మంచి అలవాట్లలో పుస్తకపఠనం ఒక అలవాటు. మనం తప్పనిసరిగా ప్రతిరోజు వార్తాపత్రికలు చదవడం, మంచి పుస్తకాలు చదవడం, గ్రంథాలయంలోని రిఫరెన్సు పుస్తకాలు, గొప్ప వ్యక్తుల జీవితచరిత్రలు, నీతికథలు, పద్యాల వంటి వాటిని చదవడం అలవాటు చేసుకోవాలి.

అలాగే సైన్సు పాఠాలను చదువుతున్నపుడు, పాఠాలలోని ప్రయోగాలు చేసి చూడడం, తోటివారితో, ఉపాధ్యాయులతో చర్చించడం చేయాలి. అర్థంకాని విషయాలను బట్టీపట్టకుండా, అడిగి తెలుసుకోవాలి. ప్రశ్నించడం నేర్చుకోవాలి.

**అనైక్యత :**

ఐకమత్యమే మహాబలం. కాబట్టి మనమంతా ఐకమత్యంతో ఉండడానికే లీడ్ ఇండియా క్లబ్బులుగా ఏర్పడాలి. పాఠశాలలోనే కాకుండా సమాజంలోని అక్కయ్యలు, అన్నయ్యలను కూడా క్లబ్‌లో సభ్యులుగా చేరమనాలి. వారంలో ఒకరోజు అందరం కలిసి సమాజంలో జరుగుతున్న అంశాలపై చర్చించుకోవాలి. మంచి, చెడులపై మాట్లాడుకోవాలి. మన ఐకమత్యాన్ని చాటేలా సామూహికంగా అందరు పాల్గొనే ఉత్సవాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలలో పాల్గొనాలి.

**పర్యావరణ పరిరక్షణ :**

సామాజిక అభివృద్ధిలో అతి ముఖ్యమైనది పర్యావరణ పరిరక్షణ. చెట్లను నాటడం, వాటిని పెంచడానికి "చెట్లు దత్తత" కార్యక్రమం నిర్వహించడం, సహజవనరులు దుర్వినియోగం కాకుండా చూడడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించే ప్రచారం చేయడం, రసాయనిక పదార్థాల వినియోగంపై అప్రమత్తులను చేయడం, భూకాలుష్యం, జలకాలుష్యం, వాయుకాలుష్యం గురించి మన గ్రామంలోని వారికి తెలియచేయాలి.

అందరూ నీరు తెచ్చుకొనే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. అపరిశుభ్రంగా ఉండే ప్రదేశాలను శుభ్రపరచడానికి మనమే శ్రమదానం చేయాలి. మన పాఠశాలలో కూడా మన తరగతిగది పరిశుభ్రంగా ఉంచడం, తాగునీటి పరిసరాలు పరిశుభ్రంగా, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా మనం కృషిచేయాలి.

**విద్యా, ఆరోగ్య కార్యక్రమాల్లో పాల్గొనడం :**

నిరక్షరాస్యత నిర్మూలన, బాలకార్మిక వ్యతిరేక కార్యక్రమాలతోపాటు మన బడికి వచ్చే పిల్లలలో హాజరుకాని పిల్లల ఇండ్లకు వెళ్ళి వారు బడికి సక్రమంగా హాజరయ్యేలా చేయాలి. అలాగే పల్స్‌పోలియో కార్యక్రమం గురించి గ్రామంలో తెలియజేయాలి. వర్షాకాలంలో వచ్చే డయేరియా, కలరా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తులను చేయాలి. దోమల బెడద నివారణపై చైతన్యపరచాలి.

**సూక్తి**

భారతజాతి పునరుద్ధరణకే కాక మానవజాతి పునర్విద్యాబోధనకు కూడా భారతీయ విజ్ఞానం అవసరం

– సర్వేపల్లి రాధాకృష్ణన్

**సూక్తి**

సనాతన ధర్మమే భారతదేశం యొక్క ఆత్మ. అదే జాతీయత

– శ్రీ అరవిందులు

# 17 పరమత సహనం

**I. ప్రధాన విలువ**

లౌకికతత్వం - మత సామరస్యం

**II. ఉప విలువ**

వివిధ మతాల వారితో సహజీవనం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- మతాలు వేరైనా మన మందరం మానవులం అనే భావనను కలిగి ఉంటారు.

## IV. ఉపోద్ఘాతం

భిన్నమతాల కలయిక భారతదేశం. ఎన్ని మతాలు ఉన్నా మనందరం భారతీయులం. మతం అనేది మనిషిని మంచిమార్గంలో నడిపించేది కాబట్టి మత కారణంగా మరొకరిని ద్వేషించకూడదు. మన మతధర్మాన్ని మనం పాటిస్తూ ఇతర మతస్థులతో కలిసిమెలసి ఉండాలి. అప్పుడే సర్వమానవ సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుంది. మతాలెన్ని ఉన్నా మనందరి అభిమతం ఒక్కటే. అదే మానవత్వం. అన్నిమతాలవారు కలిసి సహజీవనం చేయడమే ఆదర్శ సమాజం.

## V. విషయం

**పాట**

హిందువులారా - క్రైస్తవులారా
మహమ్మదీయ - సోదరులారా
కలపండీ చేయి చేయి
మనమంతా భాయి భాయి

రంగు రంగుల పువ్వులు ఉన్నా
పూలదండలో దారమొక్కటే
శరీర రంగులో తేడాలున్నా
అందరి రక్తం ఎరుపేలే "కలపండీ"

అమ్మా అన్నా అమ్మీ అన్నా
పిలిచే భాషలు వేరే అయినా
ప్రేమగా చూసే అమ్మ మనసులో
కదలాడే అనుబంధమొక్కటే "కలపండీ"

ఖురాన్ బైబిల్ భగవద్గీత
పవిత్ర గ్రంథాలెన్నో ఉన్నా
జీవితసారం మమతని చెప్పే
నీతులు మొత్తం ఒకటేలే "కలపండీ"

(రచన : స్ఫూర్తి, ప్రజానాట్యమండలి సంకలనం, ప్రజాశక్తి - హైదరాబాదు)

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై గేయంలోని సారాంశం ఏమిటి?
2. మీరు ఉంటున్న ఇంటి చుట్టుపక్కల ఏయే ఇతర మతస్థులు ఉన్నారు? వారితో మీరెలా ఉంటున్నారు?
3. సమాజంలోని ఇతర మతస్థులతో ఎందుకు కలిసి ఉండాలి? ఉంటే ఏమవుతుంది? లేకపోతే ఏమవుతుంది?
4. ఇతర మతస్థులతో కలిసి జీవించడం అంటే ఎలాగో వివరించండి.
5. మీ పాఠశాలలో తోటి మతస్థులతో ఎలా కలిసి ఉంటున్నారో చెప్పండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ బడిలో ఇతర మతస్థులైన పిల్లలతో సహజీవనం చేయండి. మీ అనుభవాలను చెప్పండి.
- సమాజంలో అన్ని మతస్థులు కలిసిఉండేలా కృషి చేయండి. దానివల్ల నీకు కలిగిన అనుభూతిని తెల్పండి.

## తెలుసుకుందాం

ఒకే రంగు పూలతో కట్టిన మాలకంటే రంగురంగు పూలతో కట్టిన మాల ఎంతో అందంగా కనిపిస్తుంది. అలాగే ఎన్నో మతాలు, భిన్న సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలతో భారతదేశం సుందరంగా ఉంది. ఈ దేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం. దానికి కారణం వివిధ మతాలను సరిగ్గా అర్థంచేసుకొన్న ఆదర్శమూర్తులు. వారి ప్రవచనాలను విని అనుసరిస్తున్న, ఆచరిస్తున్న మానవతావాదులు.

మనదేశంలో చాలా ప్రాంతాల్లో అనేక మతాలవారు ఉంటున్నారు. ఒకే కాలనీలో, బస్తీలో, సందులో, నగరాల్లో, అపార్టుమెంటులో ఇలా రకరకాల వారుంటున్నారు. వారందరూ అన్నదమ్ములవలె ఇచ్చిపుచ్చుకొని కలిసి మెలసి ఉంటున్నారు. మేమున్నచోట ఆ మతస్థులు ఎందుకనే భావనలు లేకుండా గుడిపక్కన మసీదు, దానిపక్కన చర్చి అన్నట్లు అందరూ వారి మతధర్మాలను ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా పాటిస్తున్నారు. అది ఈ దేశ సంస్కృతిలోని గొప్పదనం. పల్లెలో అయితే ఫాతిమా అక్క అవుతుంది. డేనియల్ మావయ్య అవుతాడు. ఉమ దీది అవుతుంది. ఏ కష్టం వచ్చినా, సుఖం కలిగినా అందరూ పంచుకుంటారు. నాకెందుకులే అనే భావన ఉండేదికాదు.

అయితే మతరక్కసి రేపిన చిచ్చులో కొందరు సమిధలైనారు. అన్నదమ్ముల మధ్య అడ్డుగోడలు నిర్మించారు. ద్వేషం నేర్పుతున్నారు. దానివల్ల అక్కడక్కడ సహజీవనానికి విఘాతం కలుగవచ్చు. కానీ ఎక్కువమంది ఇంకా సోదరభావంతో కలిసి ఉంటున్నారు. అదే భారతధర్మానికి సాక్ష్యం. లౌకికవాదం అన్నిమతాలవారిని కలిపి ఉంచుతుంది. ఆదిశంకరులు మనుష్యులంతా ఒక్కటేనని చాటారు. సర్వేజనా సుఖినోభవంతు అనేమాట అందరికీ వర్తిస్తుంది. సర్వమత సమన్వయ దృక్పథంతో కలిగిఉన్నవాడు అందరికీ స్నేహితుడే. అందరికీ బంధువే. హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ సోదరులు ఒక్క తాటిపై నిలిచి సర్వమత సామరస్య హృదయులుగా మెలగాలి. ఈ దేశం అభివృద్ధి చెందాలి. ప్రపంచానికి ఆదర్శం కావాలి.

### పావురం చెప్పిన పాఠం

కులాలు వేరయినా, మతాలు వేరయినా, జాతులు వేరయినా మనుషులంతా ఒక్కటే. అందరి రక్తం ఎర్రగానే ఉంటుంది. పరమత సహనంకన్నా పరమార్థం లేదని బుద్ధుడు, గాంధీజీ వంటి మహానుభావులు ఏనాడో బోధించారు. మనం ఎక్కడున్నా, ఏ మర్గాన్ని ఎన్నుకున్నా మనుషులుగా జీవించాలి; ఇతర మతాలను గౌరవించాలి; ఇతరులను ప్రేమించాలి" అని అద్భుతమైన పాఠం చెబుతున్నది, ఈ చిట్టిపావురం. చదవండి...

అనగనగా ఒక ఊరి శివాలయంలో చాలా పావురాళ్ళుండేవి. అవన్నీ అక్కడ చాలా సంతోషంగా బ్రతికేవి. అయితే ఒకసారి ఆ గుడికి కుంభాభిషేకం చేసే సమయం దగ్గరయింది. అభిషేకం కోసం ఆలయాన్ని శుభ్రం చేయటం మొదలుపెట్టారు. చాలామంది పనివాళ్ళు వచ్చారు. బూజు దులిపి కట్టెలు, చీపుర్లు పట్టుకొని ఎక్కడెక్కడ ఉన్న బూజు దులపసాగారు; పక్షుల గూళ్ళను తొలగించడం మొదలుపెట్టారు.

పావురాళ్ళకు చాలా కష్టమైంది. వాటి గూళ్ళన్నీ పోయాయి. ఇక అక్కడ ఉండటం ఇష్టం కాలేదు

వాటికి. శివాలయం ఎదురుగానే ఉన్నదొక చర్చి. పావురాళ్ళన్నీ ఇప్పుడు ఆ చర్చిలోకి వెళ్ళి నివాసం ఏర్పరచుకున్నాయి. చర్చిలోని ప్రశాంత వాతావరణం వాటికి చాలా నచ్చింది. అక్కడ వాటిని బెదిరించే వాళ్ళు, గూళ్ళను చెరిపేవాళ్ళు ఎవరూ లేరు. అట్లా అవన్నీ కొంతకాలంపాటు చర్చిలో ప్రశాంతంగా జీవించాయి. అయితే అంతలోనే క్రిస్మస్ పండుగ వచ్చింది. చర్చికి సున్నంకొట్టే పనులు మొదలయ్యాయి. పావురాళ్ళకు మళ్ళీ కష్టకాలం వచ్చింది.

"ఇప్పుడు ఎక్కడ ఉండాలో అర్థం కాలేదు వాటికి. అటూ ఇటూ చూసాయి. దగ్గర్లోనే ఉన్న మసీదు కనబడింది. ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉన్న ఆ మసీదు వాటికి అనువుగా తోచింది. ఇక ఇప్పుడు అవన్నీ వెళ్ళి మసీదును ఆశ్రయించాయి. అట్లా మరికొంతకాలం గడిచింది. అంతలోనే రంజాన్ మసం వచ్చింది. పావురాళ్ళకు మళ్ళీ ఇబ్బందులు మొదలయ్యాయి. మళ్ళీ సందిగ్ధంలో పడ్డాయి. చివరకు మళ్ళీ శివాలయంలోకి వచ్చి చేరుకున్నాయి. మునుపటిలాగే జీవించసాగాయి.

అంతలోనే ఏదో కలవరం మొదలైంది. మనుష్యులు ఒకరినొకరు తుపాకులతో కాల్చుకుంటున్నారు - కత్తులతో నరుక్కుంటున్నారు! పావురాళ్ళు గూళ్ళలో నుండి బయటకు వచ్చి చూశాయి. పిల్లపావురం ఒకటి భయంతో తన తల్లి రెక్కల సందులోకి చేరింది. తల్లిపావురం ఒకటి తన పిల్లలకోసం వెతుక్కొని, వాటినన్నిటినీ ఒక మూలకు తరిమి, తను అడ్డంగా కూర్చున్నది.

"ఈ మనుషులకేమైంది, ఇట్లా ఒకళ్ళనొకళ్ళు కాల్చుకుంటూ నరుక్కుంటున్నారు?" అడిగిందొక చిన్నపావురం.

"ఈ గుడిలో వాళ్ళు, ఆ చర్చిలో వాళ్ళు, మసీదులో వాళ్ళు 'మేం గొప్ప' అంటే 'మేం గొప్ప' అని కొట్టుకుంటున్నారు. నిజంగా ఎవరు గొప్పోమరి!" అన్నది వాళ్ళమ్మ.

"మరి మనం గుడిలోనూ ఉన్నాం, చర్చిలోనూ ఉన్నాం, మసీదులోనూ ఉన్నాంగా? వాళ్ళందరికంటే - మరి, మనమే గొప్ప అన్నమాట!" అన్నది చిన్నపావురం, ఆలోచిస్తున్నట్లు.

"ఔను తల్లీ! మనం అస్సలు కొట్టుకోంగా, అందుకని మనమే గొప్పవాళ్ళం" అన్నది తల్లిపావురం, దాన్ని కూడా తన రెక్కల సందులోకి నెడుతూ.

సూక్తి

మతవాదంకన్నా జాతీయవాదం గొప్పది.

- గాంధీజీ

# 18 ఓటు విలువ

**I. ప్రధాన విలువ**

ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం

**II. ఉప విలువ**

మంచి నాయకులను ఎన్నుకోవటంలో ప్రజల పాత్ర

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ఓటు విలువను గ్రహిస్తారు.
- మంచి నాయకుడిని ఎన్నుకోవడంలో బాధ్యతగా ప్రవర్తిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

మనది ప్రజాస్వామ్య దేశం. మనల్ని పరిపాలించే నాయకులను మనమే ఓటుద్వారా ఎన్నుకొని పదవి కట్టబెడతాం, మనల్ని మంచిగా పరిపాలించమంటాం. సమాజం సజావుగా సాగాలంటే పరిపాలన బాగుండాలి. పరిపాలనా దక్షత కల్గిన నాయకులు ఉండాలి. వాళ్ళు ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలి. నిధులను ఖర్చుపెట్టడంలో పారదర్శకత కనబరచాలి. బాధ్యతగా ప్రతి కార్యక్రమాన్ని చేపట్టాలి. ఇదంతా ప్రజానాయకుల బాధ్యతలైతే అవి జరిగేలా చూసే బాధ్యత ప్రజలది. ప్రజలు నాయకుడిని ఎన్నుకోవడంలో, తమ సమస్యలను తీర్చుకోవడంలో, అవసరమైనచోట ప్రశ్నించడంలో బాధ్యతలు నిర్వర్తించినపుడే ప్రజాస్వామ్యానికి ఒక అర్థం ఉంటుంది. స్పందించే ప్రజలు అంకితభావంతో పనిచేసే నాయకులు ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి జరుగుతుంది.

## V. విషయం

కింది విషయాలు వినండి.

దేశంలోని 4,907 మంది ఎమ్మెల్యేలూ, ఎంపీల్లో 30 శాతం మందికి నేరచరిత్ర ఉంది. అందులో 14 శాతందాకా హత్యలూ, అత్యాచారాలూ వంటి తీవ్ర అభియోగాలు ఉన్న వ్యక్తులు.

10 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన పార్టీ గెలిచాక ఇచ్చింది 17 లక్షలు మాత్రమే.

డబ్బుకు మద్యానికి ఐదేళ్ళ భవిష్యత్తును అమ్ముకుంటే మనిషి బ్రతికినా శవంతో సమానం.

కుల, మతాలకు కాదు... సమర్థతకు విలువిద్దాం. స్వేచ్ఛగా ఓటేద్దాం... సమర్థవంతుల్ని ఎన్నుకుందాం.

ఏ అభ్యర్థి అయినా కులం, మతం, వర్గం పేరిట ఓటు వేయమని అడుగుతున్నారా? ఇది చట్టరీత్యా నేరం. ఫిర్యాదు చేయండి.

– ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్

రోగాన్ని దాచుకుంటే రోగికే ప్రమాదం. అవినీతి నేతలను సమర్థిస్తే సమాజానికే ప్రమాదం. ఓటరుగా గర్వించు... నిజాయితీగా వ్యవహరించు.

ఎన్నికల సమయంలో పట్టుబడుతున్న కోట్ల రూపాయలు, మందుసీసాలు.

– ఎన్నికల అధికారి

## VI. ఆలోచించండి – ప్రతిస్పందించండి

1. ఎమ్మెల్యేలు, ఎంపీలు నేరచరిత్ర కలిగిన వాళ్ళయితే ప్రజాపాలన ఎలాగుంటుందని అనుకుంటున్నారు?
2. ఎన్నికలలో ఇచ్చే హామీలన్నీ నెరవేర్చుతారా? ఇవి ఎంతవరకు నమ్మవచ్చు?
3. డబ్బు, మద్యం, ఖరీదైన వస్తువులు ఎన్నికల సమయంలో ఓటర్లకు వివిధ పార్టీలవాళ్ళు అందజేసి ఓట్లు గుంజుకుంటున్నారు? అలా ఓట్లు అమ్ముకోవడం సరైనదేనా? దీన్ని మీరెలా భావిస్తారో మీ అభిప్రాయం చెప్పండి.

4. కులం, మతం, ప్రాంతం, వారసత్వం పేరిట నాయకులు ఓట్లు అడుగుతుంటారు? దీనిపై మీ అభిప్రాయమేమిటి?
5. ప్రజాసంక్షేమానికి ఖర్చుచేయడానికి నిధుల కొరత అంటారు. ఎన్నికల సమయంలో కోట్లు కోట్లు ఖర్చుపెడుతున్న పార్టీలు ఏమి ఆశించి ఖర్చుపెడుతున్నారో ఆలోచించి చెప్పండి.
6. సమర్థతకు విలువిద్దాం సమర్థుల్ని ఎన్నుకుందాం అని అన్నారుకదా! సమర్థుడైన నాయకుడు అంటే ఎలా ఉండాలని మీరనుకుంటారు?

### (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఓటు మంచి నాయకులను ఎన్నుకోవటానికి మన చేతిలో ఉన్న ఆయుధం. మంచి నాయకుల్ని ఎన్నుకోవటానికి ప్రజల్ని చైతన్యపరచి ప్రలోభాలకు లొంగవద్దని చెప్పే నినాదాలు తయారుచేయండి.

**తెలుసుకోండి**

### పాలన యోగ్యతలు

'పాలకుడు' అంటే ప్రజలను పరిపాలించేవాడు. కాలాన్నీ, వ్యవస్థలనూ అనుసరించి పాలకుడికి ఎన్నో పేర్లు ఉన్నాయి. పూర్వకాలంలో రాజు, మహారాజు, చక్రవర్తి, ప్రభువు, రాజేంద్రుడు, నరేశుడు, భూపతి అనీ పిలిచిన చరిత్ర కనబడుతుంది. నేటి ప్రజాస్వామ్యకాలంలో ప్రజలే పరిపాలకులు కనుక, స్థాయినిబట్టి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, రాజ్యపాలకుడని ఎన్నో పేర్లు ఉన్నాయి. పేర్లు, హోదాలు ఎన్ని ఉన్నా అందరూ ప్రజాపాలకులే అనేమాట నిర్వివాదం!

'పాలకుడు ఎలా ఉండాలి?' అనే చర్చ వేదకాలంనుంచి కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా ప్రభువు అయినవాడు అందరిపట్ల సమధర్మాన్నీ, సమన్యాయాన్నీ అమలుచేయాలనే విషయంలో ఎవరికీ అభిప్రాయభేదం లేదు. కానీ, పాలకుల గత చరిత్రలను పరిశీలిస్తే సర్వసమానత్వాన్ని స్థాపించినవాళ్ళెవరైనా ఉన్నారా అని ప్రశ్నించుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. ఇలాంటి దుస్థితి దేశానికి గౌరవప్రదం కాదు.

'ప్రజల్లో వినయ సౌశీల్యాలను నింపుతూ, వారిని సదా రక్షిస్తూ, చక్కగా పోషించేవాడే - నిజమైన పాలకుడు' అని కాళిదాస మహాకవి రఘువంశంలో అంటాడు. అన్ని విధాలుగా ప్రజల పోషకుడు, పాలకుడు, రక్షకుడు, శిక్షకుడు అయినవాడు పాలకుడే అయితే, ప్రజల తల్లిదండ్రులు కేవలం జన్మకారకులే అవుతారని, అలాంటి ప్రభుత్వ వ్యవస్థ ఆదర్శప్రాయమన్నది కాళిదాసు భావన.

అనాదిగా సాహిత్యాన్ని అవలోకిస్తే ప్రతి కావ్యంలోని ఉపసంహార వాక్యాల్లో 'ప్రభువులు ప్రజలు చక్కగా పరిపాలింతురు గాక' అనే మాట కనబడుతుంది. అంటే ప్రజాపాలకుడి బాధ్యత ఎంత గురుతరమైనదో గ్రహించవచ్చు.

ప్రజలు ఎలాంటి పాలకుణ్ణి కోరుకుంటారు అనే ప్రశ్నకు సాహిత్యంలో అడుగడుగునా సమాధానాలు కనబడతాయి. భర్తృహరి తన సుభాషిత త్రిశతిలో – 'ఓరాజా! నీవు పాలించే ఈ భూమండలం ఒక ఆవు వంటిది. ప్రజలు లేగదూడల వంటివారు. నీవు ఈ భూగోవు నుంచి అమృతమయమైన పాలను పిండుకోవాలంటే, ఆవు సంతానమైన లేగదూడల్ని చల్లగా కాపాడు. లేగదూడలు బాగుంటేనే ఆవుకు సంతోషం కలుగుతుంది. అప్పుడు ఆ గోవు ఎక్కువగా పాలు ఇస్తుంది' అంటాడు. ఈ మాటల వల్ల ప్రజాభిప్రాయం ఏమిటో తెలిసింది కదా.

ప్రజాపాలనలో అడుగడుగునా నాలుగు పాదాలా ధర్మాన్ని నడిపించి, విశ్వవిఖ్యాతి గాంచిన విక్రమార్క చక్రవర్తి చరిత్ర అందరికీ తెలుసు. ఆయన అనంతరం ఆయన కూర్చొన్న గొప్ప సింహాసనాన్ని అధిష్ఠించాలని ప్రయత్నించాడు భోజరాజు. ఒక శుభముహూర్తంలో ఆ సింహాసనంపైకి ఎక్కబోతుండగా ఆ సింహాసనానికి గల పదహారు మెట్లకు ఇరువైపులా ఉన్న బొమ్మల్లో ఒక్కొక్క బొమ్మ విక్రమార్కుడిలోని సామర్థ్య గుణాలకు సంబంధించిన కథను చెప్పి 'అలాంటి సుగుణాలు నీలో ఉంటేనే ఈ అపూర్వ సింహాసనాన్ని అధిరోహించడానికి అర్హుడవు' అని చెబుతుంది. అలా భోజరాజు ముప్పై రెండు బొమ్మలు చెప్పిన ఆ కథలను విని, వాటిలోని విక్రమార్కుడి సుగుణాలు తనలోనూ ఉన్నాయని నిశ్చయించుకున్న తరువాతే సింహాసనాన్ని అధిరోహించాడట. ఆ సుగుణాల్లో దయ, ధర్మం, నీతి, కారుణ్యం, సత్యశీలం, రుజువర్తనం, దాతృత్వం, ప్రేమ, ఆప్యాయత, శౌర్యం, ప్రజ్ఞ, సౌజన్యం లాంటి గుణాలెన్నో దర్శనమిస్తాయి. ఈ కథ నేటికీ ఆదర్శం. ఇప్పటి ప్రజాక్షేత్రంలో అధికారాన్నీ, పదవులనూ కోరుతున్న ప్రజానాయకులు తమలో ఇలాంటి సుగుణ సంపదలు ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాతే పదవులు చేపట్టాలి.

సుగుణ సంపత్తితో ప్రజారంజకమైన పరిపాలన చేసిన నేతలను ప్రజలు ఎలా ప్రశంసిస్తారో ప్రాచీన కవుల సూక్తుల్లో గ్రహించవచ్చు – 'ఓ రాజా! సూర్యుడు కోట్లకొలదీ చేతులతో (కిరణాలతో) మానవాళిని ఆరోగ్యంగా కాపాడుతుంటే, నీవు ఒక్క చేతితోనే ప్రజలందరికీ సహాయపడుతున్నావు. కనుక నీవు సూర్యుడికంటే గొప్పవాడవు' – అంటాడు ఒక కవి. 'ఓ రాజా! దానాలు చేయడంలో నీతో పోటీపడలేక బలిచక్రవర్తి పాతాళానికి వెళ్ళిపోయాడు. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, స్వర్గంలో ఉన్న కల్పవృక్షం కూడా నీతో సమానంగా అడిగినవి ఇవ్వలేక స్వర్గాన్ని వీడి, కిందకు పడిపోయింది' అంటాడు మరొక కవి.

ఇలా ప్రజాపాలకులకు ప్రజలే పరీక్షకులు. ప్రజల హృదయాలను గెలుచుకొన్నవాడే నిజమైన పాలకుడు. ప్రజల నిరసనను పొందినవాడు పాతకుడిగా మారిపోతాడు. కనుక ప్రజలకు చిత్తశుద్ధిగా సేవ చేయాలో, ప్రజలను ఉదాసీనం చేసి ప్రజాగ్రహానికి గురికావాలో తేల్చుకోవలసింది నాయకులే!

**సూక్తి**

ప్రతిభకు ప్రత్యామ్నాయం అనేదే లేదు.
శ్రమ గిమ అన్నీ అది లేకపోతే వృథాయే

# అనుబంధం

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు, గేయాలు
4. కథలు
5. స్ఫూర్తిదాతలు

## శ్లోకాలు

1 శ్లో॥ ఖాదన్న గచ్ఛే దధ్వానం, నచ హాసేన భాషణమ్ ।
శోకంన కుర్యాన్నష్టస్య, స్వకృతే రపి జల్పనమ్ ॥

భావం : ఏదైనా తింటూ నడచవద్దు. పెద్దగా నవ్వుతూ మాట్లాడవద్దు. కలిగిన నష్టములకై విచారింపకు; చేసిన మంచి పనులను గూర్చి నీవై పొగడుకొనవద్దు.

2 శ్లో॥ విద్వత్త్వం చ నృపత్వం చ, నైవ తుల్యం కదాచన ।
స్వదేశే పూజ్యతే రాజా, విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥

భావం : పాండిత్యము – రాజరికము వీటిని పోల్చుటకు వీలులేదు. రాజు స్వదేశమందే పూజనీయుడు. కానీ, పండితుడు. లోకములో యెక్కడికి వెళ్ళినా పూజింపబడుతాడు.

3 శ్లో॥ మాతాశత్రుః పితావైరీ, యేన బాలో న పాఠితః ।
న గర్భచ్యుతి మాత్రేణ, పుత్రోభవతి పండితః ॥

భావం : బిడ్డలను చదివించని తల్లిదండ్రులు వారికి శత్రువులే, కని పారవేసినంత మాత్రంచేత ఏ పుత్రుడును పండితుడగుట లేదు.

4 శ్లో॥ దుర్జనః పరిహర్తవ్యో, విద్యయాఽలంకృతోఽపిసన్ ।
మణినా భూషితః సర్పః కిమసౌన భయంకరః ॥

భావం : విద్యగలవాడైనను దుర్జనునికి దూరముగా నుండవలెను. పడగమీద మణిగలదైనను పామును చూడ భయమే గదా.

5 శ్లో॥ కోఽతిభారః సమర్థానాం, కిం దూరం వ్యవసాయినామ్ ।
కో విదేశః సవిద్యానాం, కః పరః ప్రియవాదినామ్ ॥

భావం : సమర్థులైన వారికి బరువేది? కృషి చేయువారికి దూరమేమిటి? విద్యగలవారికి విదేశమేది? మాట మంచిగలవారికి పరజనులెవ్వరు?

**6 శ్లో॥ అష్టాదశ పురాణానాం, సారం సారం సముద్ధృతం ।**
**పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనమ్ ॥**

**భావం :** పద్దెనిమిది పురాణముల సారమును పిండగా పిండగా చివరికి తేలినది యేమంటే పరోపకారం చేస్తే పుణ్యము, పరపీడన చేస్తే పాపం చుట్టుకుంటుంది.

**7 శ్లో॥ సత్యం మాతా పితా జ్ఞానం, ధర్మోభ్రాతా దయా సఖా ।**
**శాంతిః పత్నీ క్షమాపుత్రః షడేతే మను బాంధవాః ॥**

**భావం :** సత్యమే తల్లి, జ్ఞానమే తండ్రి, ధర్మమే సోదరుడు. దయయే మిత్రుడు, శాంతమే భార్య, క్షమయే పుత్రుడు. ఈ ఆరుగురూ నా ఆప్తబంధువులు.

**8 శ్లో॥ యస్మిన్దేశే పురే గ్రామే, త్రైవిధ్యే నగరేఽపివా ।**
**యోయత్ర విహితో ధర్మః తం ధర్మం న విచాలయేత్ ॥**

**భావం :** ఏ దేశములో పట్టణములో గ్రామములో ఏది విహితమై వుంటున్న ధర్మమో ఆ ధర్మమును మీరి ఎవ్వరును నడువరాదు.

**9 శ్లో॥ లుబ్ధ మర్థేన గృహ్ణీయాత్, సాధు మంజలి కర్మణా ।**
**మూర్ఖం ఛాందానురోధేన, తత్త్వార్థేన చ పండితమ్ ॥**

**భావం :** లోభిని ధనముతోను, మంచివానిని నమస్కారము చేతను, మూర్ఖుని అతని ఇచ్ఛకు అనుకూలంగా పలకడం చేతను, పండితుని తత్త్వార్థమును చెప్పుట చేతనూ సుముఖులుగా చేసుకోవలెను.

**10 శ్లో॥ క్రోధోమూల మనర్థానాం, క్రోధః సంసార బంధనం ।**
**ధర్మక్షయకరః క్రోధః తస్మాత్ క్రోధం విసర్జయేత్ ॥**

**భావం :** అనర్థములన్నిటికీ కోపమే మూలకారణము. కోపమే సర్వబంధనములకూ హేతువు. అది ధర్మమును నాశనం చేస్తుంది. కనుక నీవు కోపమును ముందుగా విడిచిపెట్టు.

*నేను సత్పురుషుల వలే నడుచుకుంటున్నానా?*
*పశువు వలే ప్రవర్తిస్తున్నానా?*
*అని ప్రతి దినము మనుజుడు తన ప్రవర్తనను పరిశీలించుకోవాలి.*

## పద్యాలు

1. సజ్జనులెప్పుడు సహజసిద్ధంబుగా
అందరకాదర్శ మందనుండు
ఐశ్వర్యమొచ్చినా అహము దర్పములేక
ఉన్నత భావాలనుంచునుండు
విద్యపై యనురక్తి విలువైన చింతన
కలతపడకనుండ కలిగియుండు
మాతాపితరులను మాన్యుల యెడలను
వినయ విధేయతల్వీడకుండు
సర్వజన సర్వకాలీన సమయమందు
సకల గుణసంపదలు కల సజ్జనున్ని
న్యాయ ధర్మ నిరతిగల నాయకుదని
రక్షకుడతడభినవ శ్రీరాముడంద్రు

2. దుర్జన చేష్టల దుష్టసాంగత్యమ్ము
దరికిరానీయకు దైన్యమగును
కష్టసుఖాలను కలిమినిలేమిని
నిబ్బరముగవాని నెదురుకొనుము
పాపకార్యములను, పరనిందచేయక
పరుష సంభాషణ పలుక వలదు
జన్మభూమి తల్లి జగతికంటెను మరి
మింటికంటెను కూడా మిన్నయనుము
పరుల ధనముపై పేరాశపడనివాణ్ని
ఆదరాభిమానమే ధనమనెడి వాణ్ని
ఆపదన ధైర్యమవసరమనెడి వాణ్ని
రక్షకుడతడభినవ శ్రీరాముడంద్రు

3. సద్గ్రంథ పఠనము సజ్జన నేస్తము
అమృత ఫలములని యనగవచ్చు
మంచి ముత్యములాంటి మంచి పుస్తకమైన
క్రొత్త వెలుగునిచ్చి కొరతదీర్చు
ఆత్మవికాసము నంతర్వికాసము
బంగరు బ్రతుకుకు బాట చూపు
నిఖిల లోకాలకు నిరంతర సత్యాన్ని
తెలియుటక్వాకిళ్లు తెరవబడును
మంచిగ్రంథాలు మనిషికి మంచి హితులు
మనిషి జడమయ బ్రతుకుకు మార్గదర్శి
మానసిక వికాసానికి మంచి మందు
పుస్తకపఠనం నిరతము స్ఫూర్తినిచ్చు.

4. మానవ జీవితం మహనీయమైనది
అటుపోటులు యెన్నో నలుముకొనును
అందమైనదనుచు నారాటపడవద్దు
ఎన్నాడో మనహంస మెగిరిపోవు
కొత్త వస్త్రమయిన కొన్ని నాళ్ళకునది
చిరగక తప్పదు జీవియంతె
దశలు నాలుగు దాటి దర్శనమిచ్చిన
చివరి దశకు తాను చేరిపోవు
పండ్లనిచ్చు చెట్టు పగిధి పాటుపడును
నీరునిచ్చు చెలిమివలె దారి కనుము
అన్నమిచ్చు ధరణివలె నాదుకొనుము
మనిషి బ్రతుకు మజలియని మరవవలదు.

5. ఆత్మ విశ్వాసమే యందల మెక్కించు
అధికమయిన యెడ అహమనబడు
అది తరిగినయెడ నాత్మన్యూనత యగు
సమమున నిడుములు సమసిపోవు
అబ్రహాములింకను అధ్యక్షపదవిని
ఆత్మవిశ్వాసాన నందుకొనెను
రాధాకృష్ణన్ మన రాష్ట్రపతి పదవి
ఆత్మవిశ్వాసాన అందుకొనెను
నమ్మకమె పునాదియగును నవ్యతగును
నవ్యతయె యభివృద్ధికి దివ్యమగును
దివ్యమగు జీవితమే మన దిశను మార్చు
దిశను యెరిగినచో దేవదేవుడతడు

6. తన సమస్యలకెల్ల తానె మూలమనియు
మనిషి గ్రహించాలి మనసుపెట్టి
ఈతిబాధలు యన్ని యితరులపైనెట్టి
భ్రమలోన నుంటారు భ్రష్టుపట్టి
ఏ సమస్యకునైన యేదో పరిష్కార
మార్గమునుండని మరువరాదు
సొంత తెలివినిల సుంతప్రక్కకునెట్టి
ప్రక్కదారులవెంట పడగరాదు
ఏ సమస్యలేని మనిషి యిలను లేదు
జీవితమన సమస్య చిక్కులమయము
ఎండమావులవెంటెల్ల యేమిరాదు
దానినుంచి బయటపడే దారివెదకు

7. పరనింద చేయుచు పక్షపాతముచూప
సాధకుడు ముందుకు సాగలేడు
దృష్టిలోపానికి సృష్టికారణ మంచు
తెలివిలేక నతడు తెలుపలేడు
ఆదర్శ పొందకదార్శకు లోనయి
కాలాన్ని వ్యర్థంగ గాలికొదులు
వాస్తవికముగను పరమార్థ చింతన
జీవించువరకును చేయలేడు.
నిలకడుండని మనిషికి నీతిలేదు
నీతిలేనివాడిహమున నిలువలేడు
ఏకత సమత మమతల దృష్టిలేక
తనకు తానుతడబడుచు తన్నుకొనును

8. కాయకష్టములోనె కైలాసముందని
నమ్మిన శ్రమజీవి నష్టపోడు
పగలు రాత్రి యనక పట్టువదలకుండ
చీమలెప్పుడు శ్రమ చేయుచుండు
విరులలో దాగిన పరిమళము గ్రహించి
తేనెటీగలు పుట్టతేనె పెట్టు
కష్టనష్టములెన్ని కలిగినా ఓర్పుతో
చెదలు కఠినశ్రమ చేయుచుండు
మనిషి బద్ధకమున బుద్ధి మందగించు
పూజకంటె మేలు శ్రమని పూజ్యులనిరి
తీర్థమును మించి స్వేదము దివ్యమనిరి
శ్రమను నమ్మితే పనులన్ని సాధ్యమనిరి

9. కులము పేరుతో కుమ్ములాటలు వద్దు
మతముల పేరుతో మనుగడొద్దు
ఊబిలోపల మనమున్నంతకాలము
దేశాభివృద్ధను యాశవలదు
సంకల్పశక్తియు క్షయము కానప్పుడు
అక్షయ పాత్రలవసరమవదు
కర్తవ్యదీక్షతో కార్యోన్ముఖుని జేసి
క్రమశిక్షణ నెరప కలుగు వృద్ధి
దేశసౌభాగ్యమునకయి దీక్షబూను
కులమత రహిత భావము కూర్పబూను
సమసమాజాభివృద్ధికై సాధ్యమైన
ప్రక్కవాడు బాగుండాలి ప్రతినబూను

10. లోభానికి మనిషి లోకువైన యెడల
అక్రమ మార్గాన్ని అనుసరించు
ఫలితంగా పతనమై పదుగురి దృష్టిలో
పలుచనై పోతాడు పరువు పోయి
అనుభవహీనున్కి యధికార దాహము
అధికమైన యెడల నన్నిమరచు
అనుభవసారాన యవసరాలను తీర్చ
తెలివైన వాడని తేల్చుతారు
లోభమహమవినీతికి లోనుగాక
కర్మ పరిధినుపాధిని కలిగియున్న
స్వీయక్రమశిక్షణ కృషియు సేతువైన
స్థిరమయిన తన గమ్యాన్ని చేరవచ్చు.

# పాటలు

## జాతీయ జెండా

ఇదియే జాతీయ జెండా!
జాతికిదియే ప్రాణము మానము ॥ఇదియే॥

ఇదియే స్వరాజ్య ధ్వజము-నదుము ఫరంగీల హాజము
కదనమునకు దీనిబట్టి - కదలు శాంతి ప్రతిన బట్టి ॥ఇదియే॥

దేశ దాస్యము బాపు - దీన దరిద్రత బాపు
దేశ ద్రోహులమాపు - దీన, ప్రతాపము చూపు ॥ఇదియే॥

మతము లన్నిటికి - స-మ్మతము దీని క్రీడ
హితముకూడ శాంతి-యుతముగ పోరాడ ॥ఇదియే॥

హిందువులందెల్లనై - ఇస్లాము మతమందు
పొందగ పచ్చనై, యా-నందమును గూర్చు ॥ఇదియే॥

ధవళమై, యితర మతములకై వెలుగు
అవిరళ భాగ్య భో-గ్యములనీయ గలుగు ॥ఇదియే॥

కోట్ల ధనము జనము - కొట్టి పొట్టన బెట్టు
కాటకములనెట్టు - రాట్నము గలట్టి ॥ఇదియే॥

భారత జాతీయ - వీర రక్త మొడ్చి
చేరి నిర్మించు - స్వరాజ్య సౌధము దాల్చు ॥ఇదియే॥

భారతదేశము, స్వపరి-పాలన గలదని నమ్ము
నిరుపమానమైన కీర్తి - నిండి వెలుగు నిజమ్ము ॥ఇదియే॥

# పాడవోయి భారతీయుడా!

పాడవోయి భారతీయుడా
పాడవోయి భారతీయుడా - ఆడి
పాడవోయి విజయ గీతిక ॥పాడవోయి॥

నేడే స్వాతంత్ర్య దినం
వీరుల త్యాగఫలం
నేడే నవోదయం - నీదే ఆనందం ॥పాడవోయి॥

స్వాతంత్ర్యం వచ్చెననీ సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించిన దానికి సంతృప్తిని పొంది
అదే విజయమనుకుంటే పొరపాటోయి
ఆగవోయి భారతీయుడా - కదలి
సాగవోయి ప్రగతి దారుల
ఆకాశం అందుకొనే ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగ మింకొకవైపు
అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు
అలముకొన్న నీ దేశం ఎటు దిగజారు?
కాంచవోయి నేటి దుస్థితి - ఎది
రించవోయి ఈ పరిస్థితి
పదవీ వ్యామోహాలు కులమత భేదాలు
భాషాద్వేషాలు చెలరేగె నేడు ॥పాడవోయి॥

ప్రతి మనిషి మరియొకని దోచుకునేవాడే
తన సౌఖ్యం తన భాగ్యం చూసుకునేవాడే
స్వార్థమే అనర్థ దాయకం
అది చంపుకొనుటె క్షేమదాయకం... ॥పాడవోయి॥

- శ్రీశ్రీ

# సాటిలేని జాతి

చేయెత్తి జైకొట్టు తెలుగోడా
గతమెంతో ఘనకీర్తి కలవోడా
సాటిలేని జాతి
ఓటమెరుగని కోట
నివురు గప్పి నేడు
నిదుర పోతుండాది
జైకొట్టి మేల్కొలుపు తెలుగోడా!
గతమెంతో ఘనకీర్తి కలవాడా!
వీర రక్తపు ధార
వారపోసిన సీమ
పలనాడు నీదెరా
వెలనాడు నీదెరా
బాలచంద్రుడు చూడ ఎవరోడోయ్
తాండ్రపాపయ కూడ నీవోడూ
నాయకీ నాగమ్మ
మల్లమాంబా మొల్ల
మగువ మాంచాల నీ
తోడబుట్టిన వాళ్ళె
వీనవనితలగన్న తల్లేరా
ధీరమాతల జన్మభూమేరా
గతములో నీ కీర్తి
కతలల్లీ సెప్పారు
వనయేడ దాచావు
వుసిలేక పోయెరా
బ్రతుకే బరువై యుంటి వీనాడు
శతపోరె సాధించు తొలి పేరూ

నాగార్జునుని కొండ
అమరావతీ స్తూప
భావాల పుట్టలో
జీవకళ పొదిగావు
అల్పుడవు కానంచు తెల్పావు
శిల్పి వంటిది దేశదేశాలు
రాజ్యమంటే వీర
భోజ్యమన్నాడు, మన
తిక్కనార్యుని మాట
ధీరులకు బాటరా
పూర్వ పౌరుష మెరిగి బ్రతకాలి
కార్యశూరులు నేడు కావాలోయ్
దేశమంటే వట్టి
మట్టి కాదన్నాడు
మనుషులన్న మాట
మరువబోకన్నాడు
అమరకవి గురజాడ నీవోడూ
ప్రజల కవితను పాడి చూపేడోయ్
రాయలేలిన సీమ
రతనాల సీమరా
దాయగట్టి పరులు
ధార తీస్తుండారు
నోరెత్తి అడగరా దానోడా
వారసుడ నీవెరా, తెలుగోడా
కల్లోల గౌతమీ
వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్రా తల్లీ
పొంగి పారిన చాలు

ధాన్యరాసులె పండు దేశాన
కూడు గుడ్డకు కొదవలేదోయ్
పసిడి పాతర నీది
పరల నోరూరెనోయ్
నీలో వారు దట్టి
నెత్తి చీ యెట్టారు
దేశాన్ని దిగమింగి పోయినారోయ్
మోసాన్ని గుర్తెరిగి కాపాడోయ్
ఉత్తరాది మొదలు
దత్త మండలమంత
తెలంగాణ ప్రాంతములో
చెలిమి గలిగించాలె
కలిసి మెలిసి నేడు పోవాలోయ్
కలిమి బలిమి గూర్చుకోవాలోయ్
ఆరుకోట్ల బలగమాయ్
ఒక్కటై మనముంటే
యిరుగు పొరుగులోన
వూరు పేరుంటాది
తల్లి ఒక్కతె నీకు తెలుగోడా!
సవతి బిడ్డలపోరు మనకేలా!
పెనుగాలి వీచింది
అణగారి పోయింది
నట్ట నడి సంద్రాన
నావ నిలుచుండాది
చుక్కాని బట్టరా తెలుగోడా!
నావ దరి జేర్చరా మొనగాడా!

– వేములపల్లి శ్రీకృష్ణ

# జయము జయము తెలుగుతల్లి

జయము జయము తెలుగుతల్లి
ప్రియతమధాత్రీయ తల్లి ॥జయము॥
అరుణోదయ కిరణోజ్జ్వల
రాగరచిత రంగవల్లి
పసిడి పలుకు - పాలవెల్లి!
లలిత కళా కల్పవల్లీ! ॥జయము॥
కదలినేడు - కదుగును నీ
కాళ్ళను కెరటాల నీళ్ళ
కళ్ళకద్దుకొను - నీ తల
గగనము - ఉల్లాసముతో ॥జయము॥
వంశధార - నాగావళీ
వసంత సౌరభములతో;
ధగ ధగ లాడెడు - నీ నును
పుగ - మల్లెల మాలలుగా
గోదావరి పూదండగ;
గొలుసు - నీ గళమందున
కృష్ణవేణి - కింకిణీక
మణిమేఖల - మార్మ్రోగును;
చెన్నెడును - స్వర్ణముఖీ
పెన్నలు మంజీరములై; ॥జయము॥
నీలో భారత దేశపు
నాలుగు దిక్కులు కలిసెను!
సమన్వయ పవిత్ర నీవు!
సహన నేత్రి నీవు సదా ॥జయము॥

ప్రాజ్య మగధ రాజ్యములో
ఉజ్జయిని గగనములో
నీ విజయ ధ్వజ మగిరెను;
నీ దుందుభి నినదించెను;
జరిపినారు – ఇక్ష్వాకులు
శతసహస్ర హరిదానము
మా జనయిత్రివి నీవే!
మధుర ధరిత్రివి నీవే!
అక్షయ పాత్రవు నీవే!
అమృత చరిత్రవు నీవే! ॥జయము॥
పుట్టినారు – నీ కడుపున
బోధసత్వ మేధావులు
సారస్వత – సమరాంగణ
సార్వభౌమ బిరుదాంకులు
దయావీర దానవీర
ధర్మవీర ధన్యాత్ములు ॥జయము॥
వాదాలకు వారధివై
భేదాలకు స్వస్తి చెప్పి
కొత్త పాతలకు – కూరిమి
కూడలివై – వర్ధిల్లుము
కవితా రస కళ్యాణీ!
గానామృత మయవాణీ!
సస్యశ్యామల గృహిణీ!
సర్వహితాభిలాషిణీ! ॥జయము॥

– నందూరి రామకృష్ణమాచార్య

# నా పల్లె - నా తల్లి

నా పల్లె తల్లి ఎంత చులకనయ్యిందీ....
నన్ను కన్నతల్లి ఎంత చిన్నబోయిందీ...
జన్మనిచ్చిన పల్లె తల్లడిల్లుతుంది తన బిడ్డలేరనీ...
జోలపాడిన తల్లి గోల్లుమంటుంది నను చూస్తలేరనీ...
మంత్రులై గొప్ప మంత్రులై డాక్టర్లై ఇంజనీరులై
కవులై కళాకారులై వీరులై రణధీరులై
శాస్త్రవేత్తలై డాక్టరేటులు పొంది గ్రామసీమను మరిచినారూ...
చదువులెన్నో చదివి పట్టాలెన్నో పొంది ఊరుతల్లి నిడిచినారూ...
నా కన్నతల్లిని మరిచినారూ.... ॥నా పల్లెతల్లి॥

రాజ్యమేలె రాజకీయ నాయకులు పల్లెల్లొ పుట్టి పెరిగారూ
పల్లె ఓట్లేస్తే పొందారూ...
పల్లెపల్లెల్లోన పేద బతుకులు చూడరమ్మంటె రానంటున్నారూ...
రాను తీరిక లేదంటన్నారూ...
పేరుమోసిన పెద్ద డాక్టర్లు ఎందరో గ్రామంలో జన్మనొందారూ...
కాని దేశాన్ని వదిలివెళ్లారూ...
అంటువ్యాధికి మందిలివ్వడానికి వారు రమ్మంటే రానంటున్నారూ...
రాను తీరిక లేదంటున్నారు ॥నా పల్లెతల్లి॥

కీర్తిగాంచిన ఇంజనీరులెందరో గ్రామంలో అవతరించారూ...
నేల అంబాడి మట్టిపిసికారూ...
వాగు వంకల మీద వంతెనెయ్యమంటె రమ్మంటె రానంటున్నారూ...
రాను తీరిక లేదంటున్నారూ...
కవులు కళాకారులూ పల్లెల్లో పుట్టిపెరిగారూ...
పల్లెనిడిచి పట్నమెల్లినారూ...
పల్లె ప్రజలతోటి ఆటపాటలాడ రమ్మంటె రానంటున్నారూ...
రాను తీరికె లేదంటున్నారూ... ॥నా పల్లెతల్లి॥

వీధులు రణధీరులూ ఊరువాడలనూ విడిచినారూ...
అడవిదారుల్లో పయనించినారూ...
ఆకలి కేకల బతుకులాను చూసి ఆయుధాలు ఎత్తినారూ...
పోరాడి నేలమ్మ ఒడిల రాలారూ...
అయ్యో....ఓ....ఓ అయ్యో....
నా కన్నతల్లికీ కడుపుకోత అయ్యిందీ...
మా పల్లెతల్లికి నేడు గుండె పగిలింది...
గూడు నీడాలేక గోసపడుతున్నాదీ...
కూడు గుడ్డాలేక అల్లాడుతున్నది...
కనిపెంచినా కన్నబిడ్డలేరనంటూ కాకమ్మనూ తల్లి రోజు అడుగుతుంటే
పాలిచ్చి పెంచిన పసికూనలేరంటూ... మా పల్లె తల్లీ...
ప్రతి చెట్టు పుట్టనడుగుతుందీ... తన బిడ్డా జాడెక్కడంటూ...
॥నా పల్లెతల్లి॥

ఎలాంటివారికైనా ఎప్పుడోఒకప్పుడు కోపము రాకుండా ఉండదు. కాని, ఉత్తముడైనవారిలో ఆ కోపము కొంచెంసేపు మాత్రమే ఉండి తగ్గిపోతుంది. మధ్యములలో రెండు ఘడియలసేపు ఉంటుంది. అధములలో వచ్చిన కోపము ఒకరోజంతా ఉంటుంది. ఇక బ్రతికి ఉన్నంతవరకూ కోపమును మనసులో పెట్టుకునేవారు పాపిష్ఠులు.

# సంతా...!!

సంతా మా ఊరి సంతా
అమ్మో వారానికోసారి జోరుగా సాగేటి ॥సంతా॥
సట్టు ముప్పై ఊళ్ల పెట్టు జనమంతా
పుట్ట పగిలి చీమలచ్చినట్టొచ్చేరు ॥సంతా॥

సోర సోరోళ్లంతా కాలి దారిలోన
తరిమినట్టు గుంపు పరుగుతో వస్తారు
చేతగానోల్లంతా పాత జీబులోన
కుక్కినట్టు ఎక్కి కూలబడొస్తారు
పెండ్లి కోయినట్టు బండ్లు కట్టుకోని
కాపుదానాపోల్లు ఆపకుండొస్తారు ॥సంతా॥

కాయగూరల తట్ట ఆకుకూరల బుట్ట
అరె తమలపాకుల కట్ట తంబాకు తడిమట్ట
మిరపకాయల ఘాటు ఒట్టిచాపల చోటు
అన్న అల్లం ఎల్లిపాయ ఉప్పుకు అగ్గువ రేటు
ముందరిబాట సాలె బట్టల మూట
ఆరేకు మాలనీ అరిచె బేరం ॥సంతా॥
రామగిరంచుదీ రగితిపేట సంత
సిరిసిల్ల జగిత్యా సిద్ధిపేట సంత ॥సంతా॥

ఎండ తాపం చేత ఎగపోసుకుంటొచ్చి
గోళి సోడను జూసి కాళ్లాగిపోతాయి
పట్టుమాని మూరెడెత్తు గూడాలేని
పోరడు స్పీడుగా గోలిసోడ కొడుతడు
రూపాయికే మంది దూపార్పుకుంటుంటె
బిసలరమ్మే సేటు బిత్తరయిపోతాడు ॥సంతా॥

తాగి పెండ్లాంతోని తగువలాడుతడొకడు
తాగమని పెండ్లాన్ని బతిమిలాడుత డొకడు
చీర బేరం కాడ చిన్న గొడవ జరిగి
అలిగినా పెండ్లాన్ని అడుక్కుంటాడొకడు
సంతలో సంసారమంతా బైటేసుకుని
ఇంటికొయ్యే ముందు ఇద్దరొక్కటైతారు ॥సంతా॥
చిత్రమైన సంత చితుక జనులా సంత
సంసారమూ సంత సాగనివ్వదు సంత ॥సంతా॥

అమ్మ నాయన మీద బెంగపెట్టకొన్న
అత్తింటి కొచ్చినా కొత్త కోడలు పిల్ల
సరుకులా నెపముతో సంతకంటని వొచ్చి
పుట్టినూనోల్లస్తె పట్టుకొని ఏడ్చె
సెలెల్లఉ తమ్ముని క్షేమమడిగినంక
అమ్మను రమ్మనమని జెప్పి రాగాలు పెడ్తదీ ॥సంతా॥

ఎనకటోలె మంది ఎగబాడి కొనకున్న
కుంకుమ వాసనే సంతకెంతందమో
ఎక్క బత్తీ చిమ్ని ఎవ్వరూ కొనకున్న
పూసలా రాజమ్మ కోసుకోనస్తాది
అద్దాల కాటుకా అగ్గువ పౌడర్లు
అరె పడుసు పిల్లల జూసి మెరిసిపోతుంటాయి ॥సంతా॥

కాశి మజిలీ కథలు దాశరథి శతకాలు
వేపూరి కీర్తనలు యోగంటి తత్వాలు
అరవై ఏండ్లా కింద అచ్చు వేయించినా
చిరుతొండ ప్రహ్లాదభక్త రామదాసు
యక్షగానాలన్ని యేడ దొరుకునో గాని
బుక్క బాలయ్యకు బువ్వ బెడుతుంటాయి ॥సంతా॥

# దృష్టిని బట్టి

దృష్టిని బట్టి కనిపిస్తున్నది - సృష్టని విన్నాను
అమ్మో వారానికోసారి జోరుగా సాగేటి ॥దృష్టి॥

సంక నడుమనొక జోలె పట్టి పసిగొంతు మోగుతుంటె
నీవది గేయం అన్నావు - నేనది గాయం అన్నాను - 2 ॥దృష్టి॥

బల ప్రదర్శన కోసం ఒకడు పులుల చంపుతుంటె
నీవది శౌర్యం అన్నావు - నేనది క్రౌర్యం అన్నాను - 2 ॥దృష్టి॥

కళాత్మకంగా సినిమా తప్పుడు విలువలు చెబుతుంటె
నీవది వినోదమన్నావు - నేనది ప్రమాదమన్నాను - 2 ॥దృష్టి॥

అందం కోసం అప్పుజేసి ఒక ఆభరణం కొంటె
నీవది కంకణమన్నావు - నేనది సంకెళ్లన్నాను - 2 ॥దృష్టి॥

నమ్మిన సత్యం నిలిపేందుకు ప్రాణాలను అర్పిస్తే
నీవది మరణం అన్నావు - నేనది జననం అన్నాను. - 2 ॥దృష్టి॥

మనపై మనకు విశ్వాసాన్ని చేకూర్చే ఆదర్శం మనకు అత్యంత ప్రయోజనకరం. మానవ చరిత్ర అంతటినీ పరిశీలిస్తే ఘనకార్యాలను సాధించిన స్త్రీ పురుషుల జీవితాలలో అన్నింటికంటే అధిక సామర్థ్యాన్ని ఇచ్చిన మూలశక్తి వారి ఆత్మవిశ్వాసమే అని తెలుస్తుంది.

# మాతృభూమి

మాతృభూమిని మరవబోకురా
మానవత్వం వీడబోకురా
మనిషి జన్మ విలువ తెలిసియు
మసలుకోరా సోదరా ॥
మట్టిదేహము జూచుకొని
వొట్టొట్టి భ్రమలు పెంచుకుంట
పొట్టకోసం పాడుకర్మల
అట్టహాసం చేయబోకురా ॥
మట్టిలోనే మణులు వున్నవి
మనిషిలోనే మాన్యతున్నది
నిష్టతోడ నీదు మనసును
నిర్మలంబు జేసుకోరా
పుట్టగానే మనుష్యుడెవడు
పునీతుడు కాలేదురా
బుద్ధివికసించిన నరుడే
భాగ్యశాలి సోదరా ॥
సద్గుణంబులు పెంచుకొని
దుర్గణంబులు రూపుమాపర
సత్యమైన దైవస్మరణలో ॥
నిత్యం బుద్ధిని శుద్ధిచేయాలిరా ॥
ఎవరి మనసు నొప్పించబోకురా
ఎదలో ప్రేమను నింపుకోరా
మదియె శాంతి నిలయముకాగా
మసలుకోరా సోదరా
హిందూ ముస్లిం సిక్కు క్రైస్తవ
మతములన్ని ఒక్కటేరా
ద్వేషభావం పెంచుకోకురా
దానవత్వం రూపుమాపరా ॥
మహనీయుల సందేశాలు
మరువబోకురా సోదరా
మంచిమార్గం యెంచుకొని
మహనీయుడవై వర్ధిల్లాలిరా ॥

# భరతభూమి మనదిరా!

చేయిచేయి కలిపి ప్రజాశక్తిని చూపించరా
చైతన్యంతో భారతజాతిని నడిపించరా!
జగతిలోన కీర్తిగన్న
జన్మభూమి మనదిరా!
సిరిసంపదలుప్పొంగే
భరతభూమి మనదిరా ॥చేయి చేయి॥
పొంగిపోరు జీవనదులు
నింగితాకు గిరి శిఖరాలు
పండి వంగినట్టి తరులు
పాడిపంటలెదుగు సిరులు ॥చేయి చేయి॥
వుంటానికి యిల్లులేని
తింటానికి బువ్వలేని
వొంటినిండ గుడ్డలేని
సాటి నీ ప్రజల కొరకు ॥చేయి చేయి॥
ఆకలితో చీకటిలో
అలమటించు అన్నార్తులు
పేదల రక్తం త్రాగెడి
కోటేశుల నెదిరించగ ॥చేయి చేయి॥
మందిని - యావన్మందిని
దోచుకునే - ఆ, మందిని
చిత్తుజేసి కొత్త శక్తి
జాతికి నేడందివ్వగ ॥చేయి చేయి॥
అవినీతిని చీల్చి చెండి
అజ్ఞానం పారదోలి
దరిద్రాన్ని రూపుమాప
దారులు సంగమం చేయగ ॥చేయి చేయి॥
చీకులేని చింతలేని
జాతికి ఏ లోటురాని
సస్యశ్యామల దేశం
సౌఖ్యాలతో వర్ధిల్లగ ॥చేయి చేయి॥
మతాతీత కులాతీత
వర్గరహిత భరతావని
స్వర్గంగా సృష్టించగ
సారథులై నడిపించగ ॥చేయి చేయి॥

# జయగీతి

జయ భారతావనీ! జయ లోక పావనీ,
శాంతి సుఖదాయినీ! జననీ! నమస్తే!
సకల సంవర్ధనీ! నవ్యనందనవనీ!
ఆసేతు శీతనగ హాటకావని జనని!
చత్వారింశత్కోటి – జయ ఘంటికాధ్వనీ,
సాశీతి కోటి భుజ బల మహావాహినీ! ॥జయ॥

హిందూ ముసల్మాను ఈసాయి శిఖ్ జైన్
బౌద్ధ చార్వాక సుత బహుమత కుటుంబినీ!
సంస్కృతాంధ్ర ద్రవిడవంగ హిందీ ఓఢ్ర
మూర్జర మరాఠ కర్ణాట కలభాషిణీ! ॥జయ॥

గంగా మహానదీ గౌతమీ కృష్ణాది
రంగ త్తరంగిణీ! రమామృత స్తనీ!
శాంత్యహింసా సత్య శస్త్రాస్త్ర ధారిణీ!
వీర నారీమణి! విశ్వహిత కారిణీ! ॥జయ॥

వేద వేదాంత విజ్ఞాన ప్రదాయినీ!
బౌద్ధ సిద్ధాంత నిర్వాణ ప్రచారిణీ!
కాళిదాస వ్యాస కావ్యమందాకినీ!
సంగీత సాహిత్య సత్కళా మోహినీ ॥జయ॥

నీకు మువ్వంకులును నిలచి రత్నాకరుడు
వెలనురుగు తరగలను వింజామరలు వీచ
నీ హిమాలయ మకుట నిర్మాణమున దోచు
జీవమణులై సూర్య వళి తారకలు పూచు
నీ మహోన్నతి హిమానీ గోత్ర శిఖరమ్ము
నీ పవిత్రత గంగా నిర్ఝర ప్రవాహమ్ము
నీచేతి సొమ్మెలోరా శిల్ప ఖండమ్ము
నీదు వాక్యము శ్రీ గీతోపదేశమ్ము ॥జయ భారతావనీ॥

## కథలు

# 1. విలువలే విద్యకు శోభ

వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో విద్య కన్నా ముందు విలువలు ముఖ్యమని ప్రగాఢంగా నమ్మిన 'భారతరత్నం', నోబెల్ విజేత సర్ సి.వి.రామన్, వ్యక్తిగత జీవితంలో తను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించి చూపించారాయన. ఓమారు ఆయన రామన్ పరిశోధన సంస్థలో ఉద్యోగానికి అభ్యర్థులను ఆహ్వానించారు. ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్న అభ్యర్థి యథావిధిగా ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కానీ అతని అర్హతలు ఆ ఉద్యోగానికి సరిపోలేదు. వెంటనే సి.వి.రామన్ ఆ అభ్యర్థికి రానూ పోనూ ఖర్చులు, ఇతర ఖర్చులు చెల్లించి వెనక్కు పంపించారు. ఆ డబ్బుతో వెనుదిరిగిన సదరు అభ్యర్థి సాయంత్రం మళ్ళీ సంస్థ ఆవరణలోనే రామన్‌కి కనిపించాడు. ఉదయమే వెళ్ళాల్సిందిగా చెప్పినప్పటికీ, ఆ యువకుడు సాయంత్రానికి అక్కడే కనిపించేసరికి ఆశ్చర్యపోయారు రామన్. 'ఉదయమే నిన్ను వెళ్ళమని చెప్పేశాం కదా! ఇంకా ఇక్కడే ఉన్నావేంటి?' అని ప్రశ్నించారు. వెంటనే ఆ యువకుడు నిర్మలంగా 'ఉదయమే నేను వెళ్ళిపోయాను సర్. కానీ మీ కార్యాలయ సిబ్బంది ఇచ్చిన డబ్బులు లెక్కపెట్టుకునేసరికి, నాకు రావల్సిన దానికన్నా ఎక్కువున్నాయని తెలిసింది. వాటిని తిరిగి ఇచ్చేద్దామని వెనక్కు వచ్చాను' అంటూ ఆ పైకాన్ని సి.వి. రామన్ చేతికిచ్చాడు. ఆ యువకుడి నిజాయితీకి చలించిపోయి 'నిన్ను ఉద్యోగానికి ఎంపిక చేస్తున్నాను. నువ్వు భౌతికశాస్త్రం (ఫిజిక్స్) లో కాస్త వెనకబడి ఉండవచ్చు. అది నేనెలాగైనా నేర్పించగలను. కానీ, నీలో విలువలతో కూడిన వ్యక్తిత్వం ఉంది. అది శిక్షణలో వచ్చేది కాదు. అది చాలు నాకు' అంటూ కరచాలనం చేశారు సర్ సి.వి. రామన్.

*తల్లిదండ్రులు, గురువులను నొప్పించకుండా ప్రియంగా నడుచుకోవాలి. ఈ ముగ్గురూ తృప్తిచెందితే సర్వ తపములు ఫలించినట్లే.*

# 2. అమ్మా! ముందు నువ్వు, తరువాత నేను !

గౌతమబుద్ధుడు తన జన్మల పరంపరలో భాగంగా ఓ మారు హిమాలయ శ్రేణుల సమీపంలో ఓ చిన్నారి ఏనుగుగా జన్మించాడు. విశేషమైన కాంతితో, ధవళవర్ణంతో పొడవాటి దంతాలతో మనోహరంగా సమీపంలోని తామర కొలను తీరంలో విహరించేది ఆ పిల్లఏనుగు. ముచ్చటగా తన వెంట అడుగులో అడుగువేసుకుంటూ నడిచే ఆ గున్నఏనుగును ఎంతో ఆప్యాయంగా చూసుకునేది ఆ తల్లిఏనుగు. ఆ పిల్లఏనుగుకు కొమ్మల అంచున ఉన్న ఆకులను, కమ్మని మామిడిపళ్ళను కోసి తినిపిస్తూ 'ముందు నీవు తిను, తరువాత నేను' అంటూ ముద్దుగా తన తొండంతో బిడ్డకు తినిపించేది. ఆకలి తీరిన వెంటనే చిన్నఏనుగును జలకాల కోసం సమీపంలోని కొలనులోకి దించేది తల్లిఏనుగు. ఎంతో ఆప్యాయంగా తొండంతో స్వచ్ఛమైన నీళ్ళను తీసుకొని, ఆ గున్నఏనుగుపై చల్లుతూ జలకాలాడించేది. ఎక్కడికి వెళ్ళినా వెన్నంటే వచ్చే, బిడ్డను ఎంతో అపురూపంగా, అప్రమత్తంగా చూసుకునేది ఆ తల్లిఏనుగు. వేటగాళ్ళ ప్రమాదాలకు చిక్కకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకునేది. 'నాకన్నా నీవు, నాకు ఎంతో ముఖ్యం' అని ప్రతి విషయంలోనూ తన మాతృప్రేమను ప్రకటించుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకునేది. కాలక్రమంలో ఆ గున్నఏనుగు బలిష్ఠంగా ఎదిగింది; యుక్తవయస్సులోకి అడుగుపెట్టింది. తన కాళ్ళపై తాను నిలబడటం అలవాటు చేసుకుంది. మరోవైపు శక్తులన్నీ ఉడిగి, ఆ తల్లిఏనుగు వయస్సుమళ్ళి నీరసించిపోయింది. కంటిచూపు మందగించింది; దంతాల పదునూ తగ్గిపోయింది. తనకు తానుగా ఆహారం కూడా సమీకరించుకునే సామర్థ్యాన్ని కూడా కోల్పోయింది. ఆ సమయంలో చేతికి అందివచ్చిన పిల్లఏనుగు బాధ్యతనంతా తన నెత్తినవేసుకుంది. పత్రాలూ, పళ్ళూ కోసుకొని తల్లికి తినిపిస్తూ ఉండేది; తల్లి ఎంత వారించినా 'అమ్మా! ముందు నువ్వు తిను, తరువాతే నేను అంటూ ఆప్యాయంగా తన తొండంతో తినిపించేది. తల్లిఏనుగు ఓపిక లేదంటున్నా, బలవంతంగా తామరకొలను వద్దకు తీసుకెళ్ళేది, చక్కగా జలకాలాడించేది తొండంతో నీళ్ళు తీసుకొని తల్లి తనువంతా శుభ్రంచేసి, చెట్టునీడలో కూర్చోబెట్టేది. ఇలా ఒకరోజు తల్లి ఏనుగుకు సపర్యలు చేసి, పళ్ళూ, పత్రాలూ నోటికందించి తోటి మిత్రులతో విహారానికి వెళ్ళింది గున్నఏనుగు.

ఆహ్లాదంగా తోటి స్నేహితులతో విహరిస్తున్న ఆ ఏనుగు, అదే సమయానికి వేటకు వచ్చిన ఓ మహారాజు దృష్టిలో పడింది. అందమైన ఆ ఏనుగుపై మనస్సుపడ్డ మహారాజు అనుకున్నదే తడవు బంధించి తన రాజ్యానికి తరలించాడు. తన రాజప్రాసాదంలో దానికి సకలసౌకర్యాలు కల్పించాడు. శ్రేష్ఠమైన ఆహారం, చక్కని చెరకుగడలు, పండ్లూ, పత్రాలూ, స్వచ్ఛమైన జలాలు దానిముందుంచాడు. కానీ అది ఒక్క ఆకును కూడా నోటబెట్టుకోలేదు; పచ్చి మంచినీరు కూడా ముట్టుకోలేదు. పైగా కంటికి మింటికి రోదించసాగింది. మహారాజుకు ఆశ్చర్యమేసింది. తనకు ఓ ప్రత్యేకమైన గదిని ఏర్పాటుచేశాడు. ఆభరణాలతో అలంకరించాడు.

మధురమైన ఫలాలను నోటి ముందుంచాడు; అయినా పాపం! ఆ ఏనుగు తన విలాపాన్ని మాత్రం ఆపలేదు. రాజు ఎంతో బ్రతిమాలగా అప్పుడు ఆ గజేంద్రుడు "మహారాజా! ఈ ఆభరణాలు, ఆహారాలు, అరుదైన రాజలాంఛనాలు ఇవేమీ నాకక్కరలేదు. అక్కడ అడవిలో నా ఒంటరి, అంధురాలైన తల్లి ఆలనాపాలనా లేక అలమటిస్తూ ఉంటుంది; నేను ఇక్కడ ఆకలితో చనిపోయినా ఫర్వాలేదు; కానీ ఆమెకు ముందు ఏదోఒకటి పెట్టనిదే నాకు తినే అలవాటు లేదు. ఇలా నేను ఒంటరిగా మంచినీళ్ళు కూడా ముట్టుకోలేను" అంటూ కన్నీటిపర్యంతమైంది. అప్పుడు ఆ మహారాజు సంభ్రమాశ్చర్యాలతో 'ఇలాంటి కరుణామృత హృదయాన్ని మూగజీవాల్లోనే కాదు, మానవమాత్రుల్లో కూడా నేను చూడలేదు. నువ్వు సాధారణ జీవివి కాదు. నిన్ను బంధించి ఉంచడం పరమ పాతకం' అంటూ ఆ ఏనుగును అడవిలో వదలిరమ్మని భటులను ఆజ్ఞాపించాడు.

అడవిలో అడుగుపెట్టిన వెంటనే అంధురాలైన తన తల్లివద్దకు పరుగెత్తాడు ఆ గజేంద్రుడు. అన్నిరోజులుగా బిడ్డపై బెంగతో కృంగి కృశించిపోయింది ఆ వృద్ధగజరాజం. తల్లిని చూసిన ఆనందంతో కొలనులోని నీటిని పుక్కిట పట్టి, జలకాలాడించింది. చెట్లపై పచ్చని ఆకులూ, కమ్మని పళ్ళు కోసి 'అమ్మా! ముందు నువ్వు, తరువాతే నేను' అంటూ ఆ తల్లికి తినిపించింది. కన్నబిడ్డ ప్రేమకు పులకించిపోయింది ఆ గజరాజం.

> పర్వతము మీదికి ఒక బండరాయిని ఎక్కించుటకు చాలా ప్రయత్నం అవసరమౌతుంది. కాని దానిని అక్కడినుండి కిందికి తోసివేయడం చాలా సులభం. అట్లే మానవుడు మంచి గుణమును పొందుట చాలా కష్టతరమైనది. కాని చెడును అలవాటు చేసుకోవడం చాలా సులభం.

# 3. రాజభోజనం

మిత్రుడు మస్కును చూడడానికి బయలుదేరాడు అభిరామ్. ఆనందంతో అడవిబాట పట్టాడు. అటుకులు, బొరుగులు ఉన్న మూట, ఒక చిన్న గోపాల విగ్రహం మాత్రం తీసికొని వెళుతున్నాడు. తల్లిదండ్రులు లేరు. నాయనమ్మే పెంచింది. ఇప్పుడు ఆమె సైతం హఠాత్తుగా పరలోకానికి పోయింది. ఇక వెనుకా ముందు ఎవ్వరూ లేరు. ఎటుపోయినా అడిగేవారు లేరు కానీ ముందుగా మస్కును ఒకసారి చూడాలి. ఒక విలాసవంతుడైన రాజు పాలించే రాష్ట్రంలో వాడు ఉంటాడు. రాజుపేరు ధనాదుడు. కానీ మస్కు ఏ రాజభోగమూ చవిచూడలేదు. తనలానే సామాన్య ఆహారం తింటూ, సంతోషంగా ఉంటాడు. అడవిలో కట్టెలు కొట్టి, అమ్మి, బ్రతుకుతున్నాడు.

దారి కనుక్కొంటూ చివరకు ఆ రాజ్యం చేరాడు అభిరామ్. నగర శివార్లలో ఉన్న చిన్న అడవిలోనే మిత్రుడు కనిపించాడు. అప్పటికి సూర్యాస్తమయం కాబోతోంది. దినమంతా ఏమీ కతకలేదు. మిత్రద్వయం సంతోషంగా ముచ్చట్లు చెప్పుకొంటూ ఉంటే, గోపాలునికి సైతం నేడు నైవేద్యం పెట్టలేదని గుర్తుకు వచ్చింది అభిరామ్‌కు.

'అన్నా! ఆకలి వేస్తున్నది' అనగానే మస్కు ఒక పాకలోకి వెళ్ళి, రెండు విస్తళ్ళనిండా పులగం, ఒక కుండడు మేకపాలు తెచ్చాడు. "గోపాలా! నాయనమ్మ లేదుగా! ఇక నా చేతితో తినాలి నీవు!" అన్నాడు అభిరామ్. బాగా పొద్దుపోయాక మస్కు మొక్కజొన్న కండెలు కాల్చి ఇచ్చాడు. ఆపైన కబుర్లే కబుర్లు. "రామా! మాకు తినడానికి తిండి లేదు కానీ మా రాజు భోజన ప్రియుడు. ఆయన డాబాపై కూర్చొని భోజనం చేస్తాడు. ఒకడు ఛత్రం పట్టుకొంటాడు. బంగారు పళ్ళెంనిండా సువాసనలు వెదజల్లే మేలిమి వరి అన్నం. చుట్టూ వెండిపాత్రలలో ఎన్నిరకాల వ్యంజనాలో! చేపలు, మాంసం, లడ్డూలు, పాలకోవా, పాయసం – ఇలా చెప్పనలవి కాదు" అనిచెప్పాడు మస్కు. అభిరామ్ కళ్ళు ఇంతింత చేసుకొని సమస్తం విన్నాడు. "రేపు రాజుగారి భోజనం అందరికీ ప్రదర్శితమవుతుంది. ఏడాదికోసారి ఇలా జరుగుతుంది వెళ్దామా?" మళ్ళీ అన్నాడు మస్కు. జన్మలో రాజవైభవాలు చూడని అభిరామ్ వెళదామన్నాడు. 'ఓ గోపాలా! అవకాశం చిక్కితే నీకు రాజభోజనం నివేదిస్తాను' అని మనస్సులోనే అనుకున్నాడు అభిరామ్.

మరునాడు రాజుగారి భోజనం వేళకు గంట మ్రోగించారు. మిత్రద్వయం ప్రాసాదానికి కొంచెం దూరంలో ఎత్తైన చెట్టు ఎక్కి కూర్చొన్నారు. సేవకులు రాజభోజనం తెచ్చారు. వరిఅన్నం, సువాసన అభిరామ్ ముక్కుపుటాలకు సోకగానే "అన్నా! మస్కూ! ఆ అన్నం పిడికెడు కావాలి రా" అని కేక పెట్టాడు అభిరామ్. అంత దూరంలో ఉన్నా, ఆ కేక రాజు చెవిలో పడింది. "ఎవడివిరా నీవు? నా అన్నం తినే సాహసమా! దిగి రా" అంటూ మేఘంలా గర్జించాడు రాజు. సేవకులు ఆ బాలురను పట్టుకొని, తీసుకొని వచ్చారు. "మహారాజా! ఇతన్ని మన్నించండి. వీడు పల్లెటూరి బైతు. నిన్ననే వచ్చాడు. రాచమర్యాదలు ఎరుగడు" అన్నాడు మస్కు.

అయితే అభిరామ్ మాత్రం మునుపటిలాగానే, "ఇవ్వవయ్యా! ఒక్క పిడికెడు!" అని అరిచాడు రాజు విరగబడి క్రూరంగా నవ్వాడు. "సరే! దొరుకుతుంది. కానీ ఇవాళ కాదు. వేతనం లేకుండా మూడేళ్ళు నావద్ద

పనిచేస్తే తప్పక దొరుకుతుంది" అని అన్నాడు. "దానికేమిలెండి. జీతం గీతం వద్దు, మీ కొలువులో చేరతాను" అని అన్నాడు అభిరామ్.

అభిరామ్ అహర్నిశలూ పనిచేసేవాడు. ఏపనైనా పొందిగ్గా, పూజాకార్యక్రమం లాగా చేసేవాడు. రాత్రి మిత్రుని ఇంటికి తిరిగివచ్చి, నాలుగు మెతుకులు తిని, హాయిగా నిద్రపోయేవాడు. "ఒరేయ్! నీ మిత్రుడు వట్టి వెర్రిబాగులవాడు" అనేవారు, మస్కుతో ఊరిప్రజలు.

చూస్తూ ఉండగానే మూడేళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు అభిరామ్ బాగా పొడుగుగా ఎదిగాడు. మంచి బలిష్ఠంగా తయారయ్యాడు. ఎంత పనినైనా చిటికెలో చేసేవాడు. మనస్సులో లోభమూ లేదు, క్షోభ లేదు. అందరితో కలిసిమెలిసి మెలిగేవాడు. ఒకరోజు రాజుగారి నుండి పిలుపు వచ్చింది. "చూడు! జీతం లేకుండా పనిచేయాలని ఒప్పందం కదా! కానీ నీ కర్తవ్యనిష్ఠ, శ్రమించేతత్త్వం చూసి చాలా ఆనందిస్తున్నాను. నీకు యాభై వరహాలు ఇస్తాను. అయితే, నీకు నా వరి అన్నం ఒక్క పిడికెడు కావాలా, వరహాలు కావాలా?" అని అడిగాడు రాజు. "మహారాజా! మన ఒప్పందమే నిలవాలి. ఒక్క పిడికెడు అన్నమే పెట్టండి" అన్నాడు అభిరామ్.

రాజు ఆశ్చర్యపోయాడు. తేరుకొని, "చూడు! నా భోజన వ్యయం దినానికి వెయ్యికాసులు. నేడు నీకూ భోజనమే దొరుకుతుంది. మంచి దుస్తులతో నిన్ను అలంకరిస్తాం. నా ప్రక్కనే కూర్చుని తిందువుగాని!" అన్నాడు రాజు. ఇరువురూ భోజనానికి కూర్చొన్నారు. అభిరామ్ చేయి నోటిదాకా వెళ్ళనే లేదు. ఇంతలో 'అయ్యా! రెండు ముద్దలు పెట్టండి' అంటున్న ఒక బిచ్చగాని అరుపు వినపడింది. అభిరామ్ కంచం పట్టుకొని గభాలున లేచి, అన్నంతో సహా సమస్త భోజనపదార్థాలనూ బిచ్చగాడి జోలెలో వేశాడు.

రాజుగారి చేయి అలాగే ఆగిపోయింది. నోట మాట రాక, అభిరామ్‌ను తదేకంగా చూశాడు. ఆ ముఖంలో ఎంత సంతృప్తి! మూడు సంవత్సరాల క్రిందట అభిరామ్ ఒక్క పిడికెడు అన్నం యాచించాడు. తాను ఇవ్వలేదు. మూడేళ్ళు జీతం లేకుండా చేసిన పని ఫలితాన్ని పూర్తిగా బిచ్చగానిపాలు చేశాడు. కఠినాత్ముడైన ఆ రాజు కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. అభిరామ్ రెండుచేతులూ పట్టుకొని, "రామూ! నేడు నేను ఓడిపోయాను" అన్నాడు రాజు. అభిరామ్ మందహాసం చేసి, "మహారాజా! 'నీ అవసరాలనూ, నీ స్వార్థాన్నీ విడచి ఏనాడు అన్యుల కోసం నీ ప్రాణాలివ్వడానికి సిద్ధపడతావో, ఆనాడు గోపాలుడు నీకు సర్వం సమకూరుస్తాడు' అని మా నాయనమ్మ చెప్పింది. ప్రాణాలర్పించే అవకాశం దొరకలేదు. కానీ, భోజనమిచ్చి ఒకరి ఆకలి తీర్చగలిగాను. నాకు నిజంగానే సంతృప్తిగా ఉంది. ఒకరి తృప్తి మరొకరి సంతృప్తికి కారణమవుతుందని ఇన్నిరోజులూ తెలియలేదు. నా గోపాలుడే ఈరోజు బిచ్చగానిగా వచ్చి రాజభోజనం తిని ఆనందిస్తున్నాడనే భావం కలుగుతోంది" అని అన్నాడు.

అభిరామ్ కళ్ళు మూసుకున్నాడు. మనఃఫలకంపై మస్కు ముఖం నడయాడింది. 'గోపాలా! వానికి కూడా కొంచెం అన్నం పెట్టు. వాడు తిననిదే నేనెలా తినగలను చెప్పు' అని ప్రార్థించాడు.

# 4. సాహసం చేద్దాం...

అనగనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో అందరూ నిరుపేదలే. ఆ ఊరిలో వాళ్ళకు ఎలాంటి పనీ దొరకటం లేదు. అందుకే ఆ పల్లెప్రజలందరూ ఉపాధికోసం మరో ఊరికి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. కాని పక్కఊరు చేరుకోవాలంటే, పొలిమేరలోని ఎడారిని దాటుకొని వెళ్ళాలి. అక్కడికి వెళితే మంచి పనులు దొరుకుతాయి. పిల్లలతో కలిసి మూడుపూటలా భోజనం చేయవచ్చు. భవిష్యత్తు కూడా ఆశాజనకంగా ఉంటుంది.

జీవితంలో ఏదైనా సాధించాలనుకునేవారు ఆ ఊరికి పోవాల్సిందే అని పెద్దలంతా తమ పిల్లలకు చెప్పారు. దాంతో చాలామంది యువకులు, పిల్లలు ఎడారి దాటి పోవాలనుకున్నారు. అయితే దారిలో మీరు నడచివెళుతున్నప్పుడు అరుదైన రాళ్ళు దొరుకుతాయి; ఆ రాళ్ళను ఏరుకొని ఆ పట్నం తీసుకుపోండి. ఆ రంగురాళ్ళను అపురూపంగా భావించి, ఆ పట్నం ప్రజలు కొనుక్కుంటారని పెద్దలు పిల్లలకు సూచించారు.

ఒక ఉదయం ఆ ఊరికి చెందిన ఇద్దరు అబ్బాయిలు సతీష్, మహేష్‌లు ఆ పట్నానికి బయలుదేరారు. దారిలో ఆకలి తీర్చుకునేందుకు అన్నం, దాహమైతే తాగేందుకు మంచినీళ్ళు తీసుకొని ప్రయాణాన్ని ప్రారంభించారు. తెల్లవారు జామునే సతీష్, మహేష్‌లు నడక ఆరంభించటంతో మొదట్లో ఎడారిగుండా సులువుగానే వారి ప్రయాణం సాగిపోయింది. అప్పటికి ఇసుక కూడా చల్లగానే ఉండటంతో వాళ్ళకు ఏమీ ఇబ్బంది కలగలేదు. సూర్యుడు ఇంకా వేడెక్కలేదు; అందుకే సరదాగా ఆడుతూ పాడుతూ నడుస్తూ ఉన్నారు. కొద్దిసేపటికి సూర్యోదయమైంది; మధ్యాహ్నానికి సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చాడు. ఇసుక వేడెక్కుతోంది. సతీష్, మహేష్ చాలాదూరం నడిచారు. ఎడారి చివరికి వచ్చామనుకున్నారు. వెంట తెచ్చుకున్న అన్నం తినేశారు. నీళ్ళుతాగారు. అయితే నడిచింది, సగం దూరమేనని తెలుసుకునేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. అయినా పట్టుదలతో తిరిగి నడక కొనసాగించారు.

ఇంతలో ఇంట్లో పెద్దలు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. పట్నంలో అమ్మేందుకు రంగురాళ్ళు సేకరించటం మొదలుపెట్టారు. కొంతసేపటికి సంచులు రాళ్ళతో నిండాయి. చాలా బరువెక్కాయి. సతీష్, మహేష్‌లకు అవి చాలా బరువుగా తోచాయి. ఇంతలో మహేష్ అలసిపోయి 'ఇంత బరువు ఎవరు మోస్తారు! మోసింది చాలు!' అనుకొని రాళ్ళు పారేసి తిరిగి పోవాలనుకున్నాడు. కాని సతీష్ మాత్రం 'పెద్దల మాట వినాలి. ఎంత కష్టమైనా వాళ్ళకిచ్చిన మాట ప్రకారం ముందుకే సాగిపోవాలి. ఎడారి దాటి పట్నం చేరుకోవాలి' అని నిశ్చయించుకున్నాడు.

కాని మహేష్ వినలేదు. ముందుకు నడవలేనని, అలసటతో రాళ్ళన్నీ అక్కడే పడేసి మరలాడు. సతీష్ మాత్రం ఓపిగ్గా, ఒంటరిగా పట్నానికి చేరకునేందుకు ముందుగా సాగిపోయాడు. దుర్భరమైన ప్రయాణమైనా

ఎలాంటి భయం లేకుండా, రాళ్ళను మోసుకుంటూ వెళ్ళిపోయాడు. అన్నం, నీళ్లు కూడా అయిపోయాయి. అయినా సతీష్ ఆకలిని, దప్పికను భరించి చాలాసేపు నడిచాడు. ఎట్టకేలకు చేరానుకున్న పట్నానికి చేరకున్నాడు. అది అన్ని ఊళ్ళలాగానే కనిపించింది. నిరుత్సాహపడ్డాడు. కాని అప్పటికే చాలా చీకటైంది. దగ్గర్లో ఉన్న ధర్మసత్రానికి చేరుకున్నాడు సతీష్. చాలా అలసిపోవటంతో అతనికి బాగా నిద్దరపట్టింది. రాత్రంతా అక్కడే బసచేసి ఉదయమే లేచి దగ్గరలోని అంగడికి వెళ్ళాడు.

సంచిలోంచి బరువైన రాళ్ళను తీసి చూపేందుకు సంచిని విప్పాడు. అందులో ఉన్నవి రాళ్ళుకాదని, వజ్రాలని వ్యాపారులు చెప్పారు. సతీష్ ఆశ్చర్యపోయాడు; తాను ఏరుకొని, మోసుకొని వచ్చింది రాళ్ళను కాదని, విలువైన వజ్రాలని తెలిసి ఆనందపడిపోయాడు. వాటిని ఆ పట్నంలోని వ్యాపారులకు అమ్మి క్షణాల్లో సతీష్ కోటీశ్వరుడైపోయాడు.

పిల్లలూ! విద్యార్థి జీవితం కూడా ఆ ఎడారి ప్రయాణం లాంటిదే! పరీక్షలు మండే సూర్యుడిలాంటివి; వేడి ఇసుకరేణువులు; కష్టనష్టాలు, ఆకలిదప్పులు చదువుకు కలిగే ఆటంకాల వంటివి. అయినా విద్యార్థి ఒంటరిగానే పయనించాలి. కష్టపడాలి. నైపుణ్యం, విజ్ఞానం సంపాదించుకోవాలి. సతీష్ ప్రయాణానికి భయపడనట్లు, విద్యార్థి అయినవాడు చదవటానికి భయపడవద్దు. అప్పుడే సతీష్‌కు వజ్రాలు లభించినట్లు, మీకు విజయాలు లభిస్తాయి. మహేష్‌లా చిన్న కష్టానికీ కూడా బాధపడితే, భయపడి వెనక్కి తగ్గితే ఆయనలాగే సాధారణ జీవితాన్నే గడపాల్సి వస్తుంది.

శత్రువులందున్నను సుగుణములను ప్రశంసించవలెను.
గురువులయందున్నను దోషములను ఎత్తిచూపవలెను.

సహనం లేని వ్యక్తి ఎన్నటికి విజయం పొందలేడు.

# 5. పులి... మేక

అనగనగా ఒక అడవి. అందులో ఓ పెద్దపులి ఉండేది. అది ఆడపులి. ఒకరోజు వేటాడుతూ, వేటాడుతూ ఓ మేకలమందపై దాడిచేసింది. పులి ఇలా మేకలపై దాడిచేయటాన్ని దూరంనుంచి ఓ వేటగాడు చూశాడు. వెంటనే తన దగ్గరున్న బాణంతో గురిపెట్టి ఆ పులిని చంపివేశాడు. అప్పుడు ఆ ఆడపులి నిండుచూలాలు. వేటగాడి బాణం తగలగానే చిన్న పులిపిల్లను కని అది కన్నుమూసింది. ఆ పులిపిల్లకు ఎటుపోవాలో తెలియక మేకల మందలోనే కలిసిపోయింది. వాటితోపాటే పెరగసాగింది. మేకపాలనే తాగింది. ఆ పులిపిల్ల కొద్దిగా పెద్దయ్యాక మేకపిల్లల్లాగే గడ్డి తినటం అలవాటు చేసుకుంది. మేకల్లా 'మే, మే' అంటూ అరవసాగింది. కాలక్రమంలో అది పెద్దపులిగా ఎదిగిపోయింది. అప్పుడూ గడ్డి మేస్తూనే ఉంది. 'మే, మే' అంటూనే అరిచేది. ఏదైనా మృగం దాడిచేయటానికి వస్తే మేకల్లా, జింకల్లా భయపడుతూ పారిపోయేది.

ఇలా సాధుజీవిగానే అడవిలో తిరుగుతూ ఆ పెద్దపులి జీవనం కొనసాగిస్తూ ఉంది. ఇంతలో ఒకరోజు మరో భయంకరమైన పెద్దపులి ఒకటి మేకల మందపై దాడిచేసింది. అప్పుడు మేకలా సాధుజీవనం గడుపుతున్న ఆ పులి గడ్డిమేస్తూ, ఆ పెద్దపులికి కనిపించింది. ఈ పెద్దపులి మిగతా మేకలన్నింటినీ వదిలేసి, గడ్డిమేస్తున్న పులిని పట్టుకుంది. అది 'మే, మే' అంటూ మేకలా తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేసింది. కాని ఆ పెద్దపులి ఈ పులిని వదలలేదు. బలవంతంగా దూరంగా ఉన్న నీటిగుంట వద్దకు లాక్కొని వెళ్ళింది. తరువాత పులితో 'ఇదుగో! ఈ నీటిలో నీ ముఖాన్ని చూసుకో! నా ముఖాన్ని చూడు; నీకూ నాలాగానే కుండలాంటి ముఖమే ఉంది. నాలాగే జూలపాలూ ఉన్నాయి; అచ్చం నాలాంటి శరీరమే ఉంది. చూశావా?' అంది ఆ పెద్దపులి. ఆ తరువాత దాని నోట్లో మాంసఖండాన్ని కుక్కింది. మొదట ఆ పులికి ఆ వాసన రుచించలేదు; కక్కేసే ప్రయత్నం చేసింది. కాని కాస్త రుచి మరిగాక తినసాగింది. అప్పుడు ఆ పెద్దపులి ఈ పులితో 'నీవు మేకల మధ్య పెరిగావు. వాటివలే గడ్డి మేశావు. ఎంత తప్పుచేశావు!' అని చెప్పింది. ఆ మాటలు విన్న పులి సిగ్గుపడింది. ఒక్కసారిగా తన అసలు రూపం తెలుసుకొని గట్టిగా గర్జించింది. అప్పటినుంచి పులిలా ప్రవర్తించసాగింది.

గడ్డి మేయటం అంటే సామాన్య మానవుల్లా సాధారణ జీవనం గడపటం. పులి తాను పులి అన్న విషయాన్ని మరచిపోయి, మేకలా 'మే, మే' అని ఎలా అరిచేదో, మనం కూడా ధీరులం; ధైర్యవంతులమన్న విషయాన్ని విస్మరించి ప్రతి చిన్నదానికీ బలహీనుల్లా భయపడుతూ ఉన్నాం. పెద్దపులితో కలసి తన నిజస్వరూపాన్ని తెలుసుకోవటమంటే, గురువు మాటలు విని మనలోని అనంతమైన ఆత్మశక్తిని, ఆత్మవిశ్వాసాన్ని తెలుసుకోవటమే.

# 6. ఆత్మగౌరవానికి ప్రతీక ఆ అమ్మాయి

శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలమది... ఓరోజు మధ్యాహ్నం ఢిల్లీ రాజమార్గంలో తన వాహనశ్రేణి (కాన్వాయ్) తో కారులో వెళుతున్నారు ప్రధాని. ఇంతలో దూరంగా మండుటెండలో ఆటబొమ్మలు అమ్ముకుంటున్న తొమ్మిదేళ్ళ పాపపై ఇందిరాగాంధీ దృష్టి పడింది. కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా ఆ చిన్నారి దూదిబొమ్మలను అమ్ముకుంటున్న తీరు ప్రధాని హృదయాన్ని కదిలించింది. కారును ఆపించి, తన సాయుధులైన అంగరక్షకులతో ఫుట్‌పాత్ దగ్గరకు వెళ్ళి ఆ చిన్నారిని పలకరించారు ప్రధాని. అంతటి మనిషి పిలుస్తున్నా తనను కాదనుకొని ప్రతిస్పందించలేదు ఆ పాప. అంగరక్షకులకు ఆవేశం ముంచుకొచ్చి, ఆ పాపను పట్టుకొని ఈడ్చుకొని వచ్చేందుకు సంసిద్ధమయ్యారు. ఇంతలో ఇందిరాగాంధీ వారిని సున్నితంగా వారించి, తనే ఆ చిన్నారిని పలకరించేందుకు వెళ్ళారు.

"నేను అంతగా పిలుస్తున్నా పలకకుండా వెళ్ళిపోతున్నావేం పాపా!" అంటూ తలపై నిమురుతూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు ప్రధాని.

"అమ్మా! మీరు పెద్దవారుకదా నాతో పనేముంటుందిలే అని అనుకున్నాను!" అంటూ తన బొమ్మలను సర్దుకోసాగింది.

"నువ్వు ఎక్కడ ఉంటావు? మీ నాన్న ఏం చేస్తుంటాడు?" అంటూ ఆరాతీశారు ఇందిరాగాంధీ. "ఓ మురికివాడలో ఉంటున్నాం. జబ్బుతో నాన్న మంచానపడడంతో, ఇంట్లో అమ్మ, అక్కయ్యలు బొమ్మలు చేసి ఇస్తే, నేను ఇలా బజారులో అమ్ముతూ ఉంటానమ్మా! ఇంట్లో అమ్మా, నాన్న, నేను, ఇద్దరు తమ్ముళ్ళూ, ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్లు... తొమ్మిదిమందికి ఈ బొమ్మలనుంచి వచ్చిన ఆదాయమే ఆధారం. రోజంతా అమ్మితే ఇరవై నుంచి ముప్పై రూపాయల వరకు లాభం ఉంటుంది" అంటూ అమ్ముకోవడానికి వెళ్ళిపోసాగింది ఆ చిన్నారి.

ఆ పాప కుటుంబ ఆర్థిక స్థితిగతులు అర్థమై నిట్టూర్చారు ప్రధాని! వెంటనే తన చేతిసంచీలో నుంచి అయిదు వందల రూపాయలు తీసి పాప చేతిలో ఉంచారు ఇందిరాగాంధీ.

ఆ పాప చివాలున తల పైకెత్తి, సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ, "అమ్మా! నేనేం బిచ్చగత్తెను కాను" అంది ఆవేదన, ఆవేశం నిండిన స్వరంతో! ఆ చిన్ని గొంతులో ధ్వనించిన ఆగ్రహానికి భారతదేశ ప్రధానమంత్రి ఖంగుతింది. తన తప్పిదమేంటో తెలిసొచ్చి, ఒక్క క్షణం ఆలోచనలో పడింది. మెరుపులా ఓ ఆలోచన తట్టింది.

"సరే! ఈ బొమ్మలన్నీ ఎంతకు అమ్ముతావు మరి?" అని అడిగారు ఇందిరాగాంధీ. "నూరు రూపాయలు!

కానీ అమ్మా ఇన్ని బొమ్మలు మీరు ఏం చేసుకుంటారు? మీ ఇంట్లో చిన్నపిల్లలున్నారా? నాపై సానుభూతితో అయితే నేను అమ్మను! నాపై దయచూపెట్టాల్సిన అవసరం లేదులే అమ్మా" అంటూ సంశయాన్ని వ్యక్తం చేసిందా చిన్నారి.

ఆ పాప అంత సులువుగా డబ్బులు తీసుకోదని అర్థమైంది ఇందిరాగాంధీకి. "అమ్మా! మాఇంట్లో చిన్నపిల్లలు లేకపోయినా నీలాంటి చిన్నపిల్లల్ని చాలామందిని కలుస్తూంటాను; వారికి ఆడుకోవడానికి ఈ బొమ్మలు బహుమతిగా ఇద్దామనుకుంటున్నాను! సరేనా ఇప్పటికయినా ఈ వందరూపాయలు తీసుకొని బొమ్మలు అమ్ముతావా?" అంటూ వందరూపాయలనోటు ఆ పాపకు ఇచ్చారు ప్రధాని. అప్పుడు సమాధానపడ్డ ఆ అమ్మాయి, తన బొమ్మలన్నీ ఆమెకు ఇచ్చేసి నూరు రూపాయలు తీసుకుంది.

ఆ తొమ్మిదేళ్ళ పాప ప్రదర్శించిన ఆత్మగౌరవాన్ని ప్రధాని తన డైరీలో రాసుకోవడమే కాదు; ఎంతోమంది ప్రముఖులకు ఉదాహరణగా చెప్పేవారు. ఆ చిన్నారి భారతీయ ఆత్మగౌరవానికే ప్రతీక అని కొనియాడేవారు. అయాచితంగా వచ్చిన దాన్ని భారతీయులు స్వీకరించరనీ, ఒకరి దయాదాక్షిణ్యాలపై బతికే అలవాటు భారతీయులకు లేదనీ భారతీయ తత్వాన్ని ఈ ఉదంతం మరోమారు గుర్తుచేస్తుందని ఉదహరించేవారు ఇందిరాగాంధీ.

## 7. చిన్నారి దయాగుణం

ఆ ఆరేళ్ళ బాలుడిది ఎంతో జాలిగుండె. ఇంటిముందు ఎవరు 'అమ్మా! ఆకలి' అరవగానే ఆ బాలుడు వాళ్ళ దగ్గరకు వెళ్ళేవాడు. వాళ్ళకు అన్నం పెట్టమని అల్లరి చేసేవాడు. కొన్నిసార్లు తనే ఏమీ ఆలోచించకుండా ఇంట్లోఉన్న అన్నం తెచ్చి, వారి గిన్నెల్లో వేసేవాడు. ప్రతిరోజు ఆ బాలుడి ఇంటిముందుకు ఎంతోమంది సాధువులు, సన్న్యాసులు, బిచ్చగాళ్ళు వచ్చి అన్నం పెట్టమనో, డబ్బులు ఇవ్వమనో అడుగుతూ ఉండేవారు.

ఆ బాలుడు ఎవరినీ అడగకుండానే అలాంటివారు ఎవ్వరు రాగానే వారికి ఇంటి తలుపులు తెరిచి తన చేతికి ఏది అందితే అది వారికి ఇచ్చేసేవాడు. తన తండ్రికి, అది ఎంత భారమవుతుందో, ఎంత ఖరీదవుతుందో అని కూడా ఆలోచించేవాడే కాదు. చాలా విలువైన, ఖరీదైన వస్తువులు కూడా బీదవాళ్ళకు ఇచ్చేస్తూ ఉ ండేవాడు. ఇదంతా చూసి వాళ్ళ అమ్మ విసిగిపోయింది. కంటికి కనిపించినదల్లా ఇలా ఇచ్చేస్తుంటే ఎలా? అని ఆమె ఓ ఉపాయాన్ని ఆలోచించింది.

బాబును ఇంటి మేడపైన పెడితే మరి! అనుకొని పై అంతస్థులోని గదిలో ఆ అబ్బాయిని ఉంచి బయటకు రాకుండా తాళం వేసింది. ఇక ఇంట్లో వస్తువులేవీ దానం చేయడులే అనుకొని, ధీమాగా కిందకు వచ్చేసింది. కొడుకుకి మంచి పాఠం నేర్పాననుకుంది.

మేడపైన ఒంటరిగా కూర్చొని ఆ బాబు ఆలోచిస్తూ ఉన్నాడు. కొద్దిసేపటికి ఇంటి బయటినుంచి యథావిధిగా బీదవారి అరుపులు ఆ బాబుకి వినిపించాయి. 'అమ్మా! కాస్తంత అన్నం ఉంటే పెట్టమ్మా!' అన్న ఆర్తనాదం ఆ చిన్నారి చెవిన పడింది. పైగదిలో కిటికినుంచి కిందకు చూశాడు. బిచ్చగాళ్ళ గుంపు అది. కాని తను మాత్రం పైగదిలో ఉన్నాడు. ఏం చేయాలో తోచలేదు. గదిలో తినే పదార్థాలు కూడా ఏమీలేవు. విలువైన వస్తువులు కూడా ఏమీ కనిపించలేదు. గదంతా కలయచూశాడు. వెంటనే ఆ బాబుకి ఒక ఆలోచన తట్టింది. ఆ బిచ్చగాళ్ళకు ఏదైనా ఇవ్వాలని అనిపించింది. ఆ గదిలో తాళం వేయని ఓ ట్రంకుపెట్టె కనిపించింది. వెంటనే దాన్ని తెరిచి చూశాడు. అందులో కొన్ని చీరలు, ధోవతులు కనిపించాయి. మరో ఆలోచన ఏమీ చేయకుండా ఆ బాలుడు వాటన్నింటినీ తీసుకొని, ఇంటి బయట శరీరంపై సరైన వస్త్రాలు కూడా లేకుండా బాధపడుతున్న పేదవారికి ఇవ్వాలనుకున్నాడు. అనుకున్నదే తడవు, కిటికీలోంచి ఆ వస్త్రాలను వారికి జారవడిచాడు. దుస్తులు లేక అల్లాడుతున్న ఆ అభాగ్యులు ఆ వస్త్రాలను తీసుకొని, ఆ చిన్నారి ఔదార్యానికి చలించిపోయారు; మనసారా ఆశీర్వదించారు. పసితనం నుంచే ప్రేమ మూర్తిగా వెలిగిన ఆ దయామయుడు మరెవరో కాదు; కాలక్రమంలో మానవులందరి పాలిటి ఆశాజ్యోతిగా వెలిగిన స్వామి వివేకానంద.

## 8. అమ్మమ్మ నేర్పిన అద్భుతపాఠం

**– శ్రీమతి సుధామూర్తి, చైర్మన్,** ఇన్ఫోసిస్ ఫౌండేషన్

ఓ ప్రముఖ సంస్థ 'కార్పొరేట్ సామాజిక బాధ్యత' అన్న అంశంపై ప్రసంగించేందుకు కొన్నేళ్ళ క్రితం నన్ను ఆహ్వానించింది. ఉత్సాహంగా ఉపన్యసించాను; ఉపన్యాసం అయిన తరువాత చాలామంది యువతీ యువకులు ఉత్తేజితులై, పాత వస్త్రాలు, ఇంటిసామగ్రి మా ట్రస్టుకు పంపుతామని బాసచేశారు. వాళ్ళ ప్రతిస్పందన నన్ను ఆనందపరచింది. "ఇవ్వదలచుకున్న వాటన్నింటిని సంచుల్లో పెట్టండి; ఆ సంచుల్ని నా కార్యాలయానికి పంపండి; అవి అవసరమైన వారికి అందేలా చూస్తాను" అని అన్నాను. వారం తిరక్కముందే మా కార్యాలయానికి వందలకొద్దీ సంచులు వచ్చిపడ్డాయి. నా ఉపన్యాసంతో జనాన్ని బ్రహ్మాండంగా ప్రభావితం చేయగలిగానని గర్వపడ్డాను.

ఒక ఆదివారం సంచులు తెరిచాం. వాటిలోని వస్తువులను చూసి, ఆశ్చర్యానికి గురయ్యాం. రకరకాల వస్తువులను సంచులనిండా కుక్కారు. చినిగిన దుస్తులు, ఉతకని చొక్కాలు, కట్టుకుంటే ఒళ్ళంతా కనబడే చీరలు, రంగూ రూపం లేని ఆటవస్తువులు, ఉపయోగపడని దుప్పట్లు, అల్యూమినియం పాత్రలు, పగిలిన క్యాసెట్లు – ఇలాంటివే అన్నీ కుప్పగా పోశారు. వాటిలో పనికొచ్చే చీరలు, చొక్కలు కొన్ని మాత్రమే.

చెత్తకుండీల్లో వెయ్యకుండా, పాత సామానువాడికి అమ్మకుండా, విరాళమంటూ జనం వాటన్నిటినీ నా కార్యాలయానికి పంపారు. నేను కలిసిన యువతీ యువకులు నిజానికి చాలా తెలివిగలవాళ్ళు, పెద్ద

ఉద్యోగస్థులు, హోదా ఉన్నవారు, సంపన్నులు. వీరే ఇలా ప్రవర్తిస్తే – ఇక విద్యాగంధం అబ్బనివారి పరిస్థితి ఎలా ఉంటుంది? చదువులేకపోయినా ఉన్నత భావాలుగలవారు ప్రవర్తించే తీరు ఎలా ఉంటుందో గుర్తుచేసే నా చిన్ననాటి జ్ఞాపకం ఇది...

నా బాల్యమంతా కర్ణాటకలోని మారుమూల పల్లెలోని అమ్మమ్మ, తాతయ్యల ఇంట గడిచిపోయింది. తాతగారు విశ్రాంత ఉపాధ్యాయులు. అమ్మమ్మ ఇంటికే అంకితమైన సాధారణ గృహిణి. ఆ ఊరు దాటి బయటకు వెళ్ళటమే అరుదు. వారు మనఃస్ఫూర్తిగా శ్రమించేవాళ్ళు. ఎవరినుంచీ ఏమీ ఆశించనివాళ్ళు. కొద్దిపాటి సంపదనైనా, ఆనందాన్ని అయినా నలుగురితో పంచుకోవాలని తపనపడేవాళ్ళు. గ్రామంలో మాకు పొలాలుండేవి; పండిన ధాన్యాన్ని పాతర్లలో నిల్వచేసేవాళ్ళు. మాకు ధాన్యపు పాతరలు రెండు ఉండేవి. ఒకటి ఇంటిముందు; మరొకటి ఇంటివెనుక. ఇంటిముందు పాతరలో నాణ్యమైన తెల్లబియ్యం పోసేవాళ్ళు. గింజ పెద్దగా ఉండే తక్కువరకమైన ఎర్రని బియ్యాన్ని వెనుక పాతరలో పోసేవాళ్ళు. భిక్ష కోసం ముస్లిం ఫకీర్లు, హిందూ దాసయ్యలు, మల్లమ్మ జోగినులు, పేదవిద్యార్థులు, అంగవికలురు మా ఇంటికి వచ్చేవాళ్ళు.

అమ్మమ్మవాళ్ళు ఆర్థికంగా అంతగా ఉన్నవాళ్ళేమీ కాదు. తాతయ్య బియ్యం రూపంలో మాత్రమే సహాయం చేసేవారు. అప్పుడు నేను చిన్నపిల్లను; ఇంటిముందు మంచి బియ్యం ఉన్న పాతర ద్వారం క్రిందుగా ఉండేది; పెద్దవాళ్లు లోపలికెళ్ళడం కష్టం; అందువల్ల నా చేతికి ఓ చిన్న బొక్కెన ఇచ్చి లోపలికి పంపేవాళ్ళు; బియ్యాన్ని అందులో నింపి పైకి అందించేదాన్ని. అలా భిక్షకు వచ్చిన వారికి దానం చేసేవారు.

ఇంట్లో వంటకానికి అమ్మమ్మ నన్ను వెనుకనున్న పాతరలో ఉన్న నాసిరకం ఎర్రబియ్యాన్ని తీసుకురమ్మని చెప్పేది. ఇలా చాలాఏళ్ళు గడిచాయి. ఒకసారి అమ్మమ్మను “మంచి బియ్యం పేదవాళ్ళకు పంచి, మనం ఎర్రబియ్యం అన్నం ఎందుకు తినాలి?” అని ప్రశ్నించాను.

అప్పుడు అమ్మమ్మ నవ్వుతూ చెప్పిన మాటల్ని నేనెన్నటికీ మరిచిపోలేను. “పాపా! ఎప్పుడైనా, ఎవరికైనా, ఏమైనా ఇవ్వాలనుకున్నప్పుడు నీకున్న దాంట్లో మంచిదాన్ని ఇవ్వాలి; తక్కువరకం వాటిని ఇవ్వకూడదు. నా అనుభవంలో నేను నేర్చుకున్నది ఇంతే! దేవుడు – ఆలయంలోనో, మసీదులోనో, చర్చిలోనో కూర్చొని ఉండడు. ఆయన అందరిలోనూ ఉన్నాడు. నీకు ఉన్నదాంతో వాళ్ళను సేవిస్తే దేవుణ్ణి సేవించినట్లే!” అంటూ నన్ను అక్కున చేర్చుకుంది అమ్మమ్మ. అలా ఏ విశ్వవిద్యాలయమూ, మేధావి వర్గమూ నేర్పని అద్భుతమైన పాఠం మా అమ్మమ్మ నుంచి నేర్చుకున్నాను.

# ౨. పట్టుదల ఉంటే పట్టిందల్లా బంగారం!

**– శ్రీరామకృష్ణుల నీతికథామార్గంలో వ్యక్తిత్వ వికాసం**

మనలో చాలామంది ఏపనినైనా ముందు ఉత్సాహంగానే ప్రారంభిస్తారు. కానీ అదే ఉత్సాహాన్ని చివరి వరకు కొనసాగించరు. పుట్టినరోజు, నూతన సంవత్సరాది... ఇలా ప్రతి పర్వదినంలో గొప్ప గొప్ప లక్ష్యాలను నిర్దేశించు కుంటారు. కానీ తరువాత ఏదో ఒక సాకు చూపి, కాలక్రమంలో వాటికి స్వస్తి పలుకుతుంటారు. ఇలా మనలో చాలామంది 'ఆరంభశూరులు'గానే మిగిలిపోతారు. ఇలాంటి తాత్కాలిక, ఉద్రేకపూరిత నిర్ణయాల వల్ల మనం జీవితంలో ఏ ఘనకార్యాలనూ సాధించలేం. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ఇలాంటి మందబుద్ధినీ, ఆరంభశూరత్వాన్నీ ఓ చక్కని నీతికథలో సునిశితంగా ఎండగట్టారు. దృఢదీక్షతో కడదాకా కష్టపడిన కర్షకుడికీ, కుంటిసాకుతో పని తప్పించుకొని నిష్ప్రయోజకుడిగా ఉండిపోయిన మరో రైతుకూ ఉన్న భేదాన్ని తేటపరుస్తూ కర్మవ్యాకులత ప్రాధాన్యాన్ని వివరించారు.

ఓ గ్రామంలో ఒకప్పుడు తీవ్రమైన అనావృష్టి సంభవించింది. చాలా దూరంలోని ఏటి నుంచి తన పొలంలోకి నీరు పారడానికి కాలువను తవ్వాలని ఒక రైతు మాత్రం దృఢనిశ్చయుడై ఉన్నాడు. పొలంలోకి ఏటినీరు పారేటంత వరకు, తాను కాలువను తవ్వడం ఆపనంటూ ప్రతిన పూనాడు. కాలువ తవ్వడానికి ఒకానొకరోజు శ్రీకారం చుట్టాడు. పని ప్రారంభించిన కొన్ని గంటల తరువాత, అతడు స్నానం చేసే వేళ అవడంతో అతడి భార్య, కుమార్తెతో నూనె పంపించింది. 'నాన్న! ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ఒంటికి నూనె పట్టించుకొని స్నానం చేయి' అంది కుమార్తె. 'ముందు నువ్వు ఇక్కడనుంచి వెళ్ళిపో! ఇంకా ఎంతో పని చేయాల్సి ఉంది' అంటూ గద్దించాడు ఆ రైతు.

మధ్యాహ్నం వేళ దాటిపోయినా రైతు ఇంకా పొలంలోనే ఉండిపోయాడు. అప్పుడు అతడి భార్య పొలానికి వచ్చి 'నువ్వు స్నానం కూడా చేయలేదు? అన్నం చల్లారిపోతోంది. అన్నీ నువ్వు అతిగా చేస్తావు. మిగిలిన పని రేపు చేసుకోవచ్చులే! పోనీ కనీసం భోజనం అయ్యాకైనా చేసుకో' అంది. ఆ రైతు ఆవేశంతో ఆమెను తిట్టి, పలుగు పార పుచ్చుకొని ఆమెను తరుముతూ 'ఏమిటీ? నీకు ఏమైనా బుద్ధుందా? వర్షాలు బొత్తిగా లేవు. పంటలు ఎండిపోతున్నాయి. పిల్లలు ఏం తింటారు? మీరంతా పస్తుండి చావాల్సి వస్తుంది. ఈరోజు పొలంలోకి నీరు తీసుకురాకుండా నేను స్నానం, భోజనం గురించి ఆలోచించనని శపథం చేశాను' అంటూ ఆమెపై విరుచుకుపడ్డాడు. ఆయన పట్టుదల చూసి భార్య అక్కడనుంచి పరుగెత్తిపోయింది.

రైతు పగలంతా నిర్విరామంగా శ్రమించి, ఎట్టకేలకు సాయంకాలానికి తాను తవ్విన కాలువను ఏటితో కలుపగలిగాడు. తరువాత, ఆ రైతు తాపీగా కూర్చుని మర్మరధ్వనితో నీరు తన పొలంలోకి పారడం సంతృప్తిగా చూడసాగాడు. అతడి మనస్సు శాంతి ఆనందాలతో నిండిపోయింది. అతడు అప్పుడు ఇంటికి

వెళ్ళి భార్యను పిలిచి, 'ఇప్పుడు ఆ నూనె పట్రా! స్నానానికి నీళ్ళు సిద్ధం చేయి' అన్నాడు. తరువాత ప్రశాంతంగా అతడు స్నానం చేసి, తృప్తిగా భోజనం చేసి, హాయిగా నిద్రపోయాడు. ఈ రైతు కనబరచిన దృఢసంకల్పం ప్రతి తీవ్ర కర్మపరాయణత్వానికి ప్రతీక.

అదే గ్రామంలో మరో రైతు ఉన్నాడు. అతడు తన పొలంలోకి నీరు పారడానికి ఒక కాలువ తవ్వుతున్నాడు. అతడి భార్య కూడా పొలానికి వచ్చి ఇలా అంది – "ఇప్పటికే ఆలస్యం అయింది. ఇంటికి రా! అతిగా పనిచేయాల్సిన అగత్యం ఏమీలేదు'. ఆమె మాటలకు అతడు ఏమాత్రం అడ్డుచెప్పకుండా పలుగు, పార పక్కనపెట్టి భార్యతో 'సరే, నువ్వు అంతగా అంటున్నావు కాబట్టి ఇంటికి వస్తున్నాను' అంటూ ఆమెను వెంబడించాడు. ఆ రైతుకు తన పొలానికి నీరు పారించుకోవడం ఎన్నటికీ సాధ్యం కాలేదు. ఇదే సోమరితనానికీ, ఆరంభశూరత్వానికీ నిదర్శనం.

శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ఉద్దేశించి బోధించిన ఈ కథను మనం లౌకికజీవనానికి కూడా అన్వయించుకొని ముందుకు సాగిపోవచ్చు. తీవ్రవ్యాకులత లేకుండా మనిషి ప్రాపంచికంగా కూడా ఏ ఘనవిజయాన్నీ సాధించలేడు. ముఖ్యంగా నేటి తరం పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి సంసిద్ధమై ఉండాలి. పట్టుదల ఉంటే పట్టిందల్లా బంగారమవుతుందని నిరూపించాలి.రాజు అడిగాడు, "ఏమయ్యా! నువ్వు ఏం ధర్మం చేస్తుంటావు?" రైతు పలికాడు "ప్రభూ! నేను చదువుకున్న వాణ్ణికాదు. నాకు ధర్మం అంటే ఏం తెలుస్తుంది. ఎవరైనా జబ్బుపడితే సేవ చేస్తాను. ఎవరైనా యాచిస్తే గుప్పెడు మెతుకులు పెడతాను."

ఆ మాటలు విన్న రాజు "ఇతడే అందరి కన్నా గొప్ప ధర్మాత్ముడు. అసత్యమాడక పోవడం, గోపూజ చేయడం, తీర్థయాత్రలు చేయడం, వ్రతాలు చేయడం, తపస్సు చేయడం అవశ్యమైనధర్మమే. కానీ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, రోగులకు సేవ చేయడం. కష్టంలో ఉన్న వారికి చేయూత నివ్వడం సర్వాధికమైన ధర్మం. ఇతరులకు సహకరించే వారికి దేవదేవుని సహాయం ఎల్లవేళలా ఉంటుంది. పరోపకారాన్ని మించిన పరమ ధర్మంలేదు" అని అన్నాడు.

*పవిత్రత, సహనం, పట్టుదల – విజయాన్ని సాధించడానికి కావలసిన మూడు ఆవశ్యకాలు. వీటన్నిటికి మించి కావలసింది ప్రేమమయ హృదయం*

# 10. సాగరతీరం నేర్పిన జీవనపాఠం

**- శ్రీమతి సుధామూర్తి, చైర్మన్,** ఇన్ఫోసిస్ ఫౌండేషన్

ఓ ఆదివారం నా బాల్యమిత్రుడు తన ఇరవయ్యేళ్ళ కొడుకును వెంటబెట్టుకొని మా ఇంటికి వచ్చాడు. నా మిత్రుణ్ణి చూసి దాదాపు ముప్ఫైఏళ్ళయి ఉంటుంది. కలసి చదువుకున్న రోజులు... వాన నీటిలో ఆటలు... కాగితపు పడవలు - ఇలా ఎన్నో జ్ఞాపకాలు నా మనస్సులో మెదిలాయి. కానీ అతనెందుకో అంత ఉత్సాహంగా కనిపించ లేదు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన తన కొడుకును పరిచయం చేశాడు. ఆ అబ్బాయి కూడా చాలా అనాసక్తిగా వచ్చినట్లనిపించింది.

నేనే చొరవ తీసుకొని యథాలాపంగా ఆ అబ్బాయిని 'చదువైపోయింది కదా! ఏం చేస్తున్నావ'ని అడిగాను. అప్పుడు అతడు 'ఏదైనా ఓ పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరి, తరువాత విదేశాలకు వెళ్దామనుకుంటున్నాను. అక్కడ కొన్నాళ్ళుండి, తిరిగొచ్చి మీలా సొంతంగా ఓ సంస్థ ప్రారంభించాలనుకుంటున్నాను' అన్నాడు.

నేను కాస్త ఆలోచించి, 'బాగుంది! కానీ, సంస్థను ప్రారంభించాలంటే చాలా తంటాలు పడాలి. కష్టనష్టాలు ఎదుర్కోవాలి. ఇంతా చేస్తే లక్ష్యాన్ని సాధిస్తామన్న నమ్మకం లేదు. అప్పుడు క్రుంగిపోకుండా నిలబడగలగాలి' అన్నాను. 'అది సరే! మరి ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నావు' అని అడిగాను.

'ఎక్కడా పనిచేయడం లేదు. ఏదైనా మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరాలని చూస్తున్నా' అన్నాడు. 'మరి! ప్రోగ్రామింగ్‌లో శిక్షణకానీ, అనుభవంకానీ ఉన్నాయా?' అని ప్రశ్నించాను. 'లేదు! కానీ త్వరలో నేర్చుకుంటాను. తక్కువ జీతాలు వచ్చే చిన్న చిన్న ఉద్యోగాలు చేయదలచుకోలేదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగమైతేనే చేద్దామనుకుంటున్నాను' అన్నాడు. నా మిత్రుడు ఎందుకు దిగాలుగా ఉన్నాడో అప్పుడు అర్థమైంది. ఏ ఉద్యోగమూ చేయకుండా పెద్ద పెద్ద కలలు కంటున్న పుత్రరత్నమే అతనికి పెద్ద సమస్యగా మారాడని అర్థం చేసుకున్నాను. అందుకే ఆ యువకుడికి నా మనస్సులో మాట చెప్పాను. ముందు ఏదైనా ఉద్యోగంలో స్థిరపడి, ఆపైన కృషి చేయమన్నాను. కానీ ఆ అబ్బాయి ముఖం చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకు నేను మా సంస్థ కార్యక్రమాల్లో భాగంగా ఒరిస్సాలోని చండీపూర్‌కు వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ సముద్రం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అయిదు కిలోమీటర్ల దూరం వెనక్కి వెళ్ళిపోతుంది. కొన్ని గంటల తరువాత మళ్ళీ ఎగసిపడుతూ ముందుకు వస్తుంది. ఇది చాలా అద్భుతమైన దృశ్యం. అక్కడి మత్స్యకారులకు మాత్రం ఇది ఓ మంచి జీవనోపాధికి ఆసరా! సముద్రం వెనక్కి తగ్గడం ప్రారంభించగానే, ఇసుకలో నుంచి ఎర్రటి పీతలు బయటకు వస్తాయి. చేపలు పట్టేవారు వాటిని బుట్టల్లో వేసుకొని అమ్ముకుంటూ ఉంటారు.

ఓ రోజు ఉదయమే అలా నడుచుకుంటూ వెళుతున్న నాకు, పన్నెండేళ్ళ జావేద్ అనే కుర్రాడు తన తల్లికి వల విసరడంలో సాయపడుతూ, పీతలు పడుతూ కనిపించాడు. అతడు నడిచే తీరు చూస్తే చాలు - ఉత్సాహం పొంగి పొరలుతున్నట్లు తెలిసిపోతోంది. నన్ను చూసి పరుగెత్తుకొని వచ్చి, తాజా పీతలు అమ్మజూపాడు. 'నేను పీతలు తినను. కానీ నీతో మాట్లాడతాన'ని చెప్పి, దూరంగా తీరంలో కూర్చున్నాం.

బక్కపలచగా ఉన్నా, ఆ కుర్రాడి కళ్ళు మాత్రం వజ్రాల్లా మెరిసిపోతున్నాయి. తండ్రి రిక్షా లాగి రోజుకు రూ.50 సంపాయిస్తాడనీ, తల్లి చేపలు పట్టి కుటుంబానికి అదనపు ఆదాయం ఆర్జించి పెడుతుందనీ ఆ అబ్బాయి చెప్పాడు. స్కూల్లో చదువుకుంటూ, తాను ఎప్పుడూ తరగతిలో ప్రథముడిగా వస్తానని ఆనందంగా చెప్పాడు. 'మరి ఇక్కడేం చేస్తున్నావు?' అని అడిగాను. 'ఉదయం సముద్రం వెనక్కి తగ్గినప్పుడు అమ్మతో కలసి పీతలు పడతాను. తరువాత ఇంటికివెళ్ళి స్నానం చేసి తరువాత బడికి వెళతాను. సాయంకాలం తిరిగి వచ్చాక త్వరగా హోమ్‌వర్క్ పూర్తి చేసుకొని, సాయంత్రం సముద్రతీరానికి వచ్చి మళ్ళీ పీతలు పడతాను' అన్నాడు. 'ఇంతచేస్తే నీకేమొస్తుంది జావేద్?' అని అడిగాను. 'ఐదు రూపాయలు వస్తాయి మేడమ్!' అన్నాడు ఆనందంగా. 'అంతేనా జావేద్! దాంతో ఏమొస్తుంది? ఈ పాటి సంపాదన కోసం ఉదయం అయిదింటికే లేస్తావు, మళ్ళీ రాత్రి పదకొండుకు గానీ నిద్రపోవు' అన్నాను.

వెంటనే జావేద్ చిరునవ్వుతో 'ఏమీ లేని దానికన్నా ఐదు రూపాయలు ఎక్కువే కదా మేడమ్! ఐదు రూపాయలతో ఉప్పు కొనుక్కోవచ్చు. మిరపకాయలు కొనుక్కోవచ్చు. పనీపాటా లేకుండా కూర్చుంటే అవి కూడా కొనలేం కదా! వందలు, వేలల్లో డబ్బులు రావుకదా! రూపాయి, రూపాయి కలిస్తేనే, అంత డబ్బయ్యేది. బొట్టు బొట్టు నీరు చేరితేనే సముద్రమవుతుంది కదా మేడమ్!' అన్నాడు.

జావేద్ జవాబుతో అబ్బురపడ్డాను. చేపలు పట్టే ఈ పేదబాలుడు వంటబట్టించుకున్న జీవన పాఠాన్ని, నగరం లోని సాఫ్ట్‌వేర్ యువకుడు ఎందుకు నేర్చుకోలేకపోయాడోనని ఆశ్చర్యపడ్డాను.

ఎవరైతే ఎట్టి ప్రతిఫలాపేక్షయు లేకుండా పరులకు ఉపకారములనే చేస్తూఉంటారో వారే యోగ్యులు, ధన్యులు, పుణ్యమూర్తులు.

# 11. మాతాపితరుల సేవయే ఉజ్జీవనకు మూలము

పూర్వం మిథిలానగరంలో, 'ధర్మవ్యాధుడు' అనే బోయవాడు మాంస విక్రయణం చేస్తూ ఉండేవాడు. మధ్యాహ్నం తన వృత్తిని ముగించుకొని, వృద్ధులైన మాతాపితరులను తన సేవలతో తృప్తిపరచి, పెద్దల ధర్మసంశయాలు తీరుస్తూ ఉండేవాడు.

ఒకనాడు దుకాణంలో కూర్చున్న ధర్మవ్యాధుడు దూరంగా తచ్చాడుతున్న ఒక బ్రహ్మచారిని చూసాడు. వినయంగా లేచి నిలబడి, ఆ బ్రహ్మచారిని తనవద్దకు రమ్మని సంజ్ఞ చేసాడు. "నగరంలోని గృహిణి పంపగా వచ్చిన బ్రహ్మచారీ! నీకు స్వాగతం!" అని నమస్కరించాడు. "ఆ ప్రక్కన గదిలో కూర్చోండి, నేను కొద్దిసేపట్లో వచ్చి మీ సేవ చేసుకుంటాను" అని విస్తుపోతున్న బ్రహ్మచారిని గదిలోకి పంపాడు.

అప్పటికే గడ్డాలు నెఱసిన వృద్ధమునులు ఎందరో అక్కడ ఆసీనులై ఉన్నారు. ఈ బ్రహ్మచారి కూడా వారి వరసలో చివరగ చేరాడు. కొంతసేపటికి వ్యాపారం ముగించి, ఇంటికి వెళ్ళి, తల్లిదండ్రులకు చేయతగిన సపర్యలన్నీ చేసుకున్నాడు. ఆతర్వాత ఋషులవద్దకు వచ్చి సవినయంగా నమస్కరించాడు. "ఆజ్ఞాపించండి, మహర్షులారా! మీ సేవకు సిద్ధం" అని కూర్చున్నాడు. ఋషులు ఒక్కొక్కరుగా అడిగే గంభీర వేదాంతవిషయాలకు అలవోకగా సులభోపాయాలను అందించసాగాడు. చిక్కుముడులు వీడిన ఋషులు సంతృప్తిచెంది అతనిని ఆశీర్వదిస్తూ వెళ్ళసాగారు. చివరికి ఇక ఈ బ్రహ్మచారి ఒక్కడే మిగిలాడు.

"మహానుభావా! నీకు ఏ సేవ చేయమంటావు?" అని వినయంతో ప్రశ్నించాడు. "నా పేరు కౌశికుడు. మాంసం అమ్ముకునే నీకు ఇందరి సందేహాలు తీర్చేజ్ఞానం ఎలా వచ్చిందో నాకాశ్చర్యంగా ఉంది. నాకు ఆ రహస్యం వివరించవూ! అదిసరేగానీ ఆ గృహిణి నన్ను ఇక్కడికి పంపిన విషయం నీకు ఎలా తెలుసు?" అని కుతూహలంగా అడిగాడు కౌశికుడు.

ధర్మవ్యాధుడు నవ్వి "మహానుభావా! చెట్టుక్రింద తపస్సు చేసుకొనే నీమీద పక్షి రెట్టవేసిందని నీవు కోపంతో చూసావు. అది గిలగిలా కొట్టుకుంటూ చనిపోయింది. అది నీ తపఃప్రభావమే అనుకొని కోపంతోపాటు నీలో గర్వం కూడా పెంచుకున్నావు. భిక్షాటనకై ఓ గృహిణి ఇంటిముందు నిలబడ్డప్పుడు ఆ గృహిణి త్వరగానే, నీకు భిక్ష తేవాలని లోపలికి వెళ్ళింది. ఇంతలో భర్త రావటంతో దైవసమానుడైన అతని సేవే ప్రథమమని, కర్తవ్యపాలన ముఖ్యమని, భర్తృసేవలో నిమగ్నమైంది. అది ముగించి వచ్చి నీకు భిక్షవేయబోతోంటే ఆలస్యమైందని ఆమెపై హుంకరించి, అసహనానికి గురయ్యావు. అయితే 'నీ చూపుకి బలి కావటానికి నేను కొంగను కాదు సుమా!' అని ఆవిడ అనేసరికి ఆమె గొప్పతనానికి చకితుడవై ఆమె పాదాలపై పడ్డావు. నీకు సన్మార్గాన్ని చూపే సేవ నాచేత చేయించాలని ఆ తల్లి పంపితే నువ్వు ఇక్కడికి వచ్చావు. అవునా?" అని కాసేపు ఆగాడు ధర్మవ్యాధుడు. కౌశికుడు బిత్తరపోయి అవాక్కయి చూస్తుండిపోయాడు.

"ఓ బ్రహ్మచారీ! కౌశికుడా! వేదం చదివావు, తపస్సు చేసావు. మధూకరం చేస్తున్నావు. గురుశుశ్రూష, వృద్ధులైన తల్లిదండ్రుల సేవ చేసుకోవటం, వినయంతో ఉండడం, పెద్దలను గౌరవించడం అనేవి నీ వృత్తికి ధర్మాలు. కానీ నువ్వు తల్లిదండ్రులపై కోపించి వారిని అనాథలుగ వదలిపోయి గురుకులం చేరావు. గురువు దగ్గర అసహనం కలిగిన తపస్సును ఆరంభించావు. జ్ఞానంలేని చిన్నిపిట్ట రెట్టవేస్తే దాని ప్రాణం తీసి పొంగిపోయావు. అది పక్షిధర్మం అనేది కూడా గుర్తించలేకపోయావు. పతిసేవ పత్నీధర్మం కదా! అలిసి వచ్చిన పతిని సేదతీర్చిన పత్నిని నిష్కారణంగా కోపించావు. నీవు వేరే పనిలేదు. కొంతసేపు వేచిఉంటే పోయేది. ఓరిమి అనేది నీకు అలవడలేదు. పాపం! విద్య నీకు వినయాన్ని ఇవ్వలేదు. విపరీతానికి దారితీసింది. నీ తల్లిదండ్రులను ఈ వార్ధకదశలో నీవు సేవించుకొంటూ ఉండిఉంటే నీ తపఃప్రభావముచేతనే నీకు ఎన్నో విషయాలు గోచరించివుండేవి. నీ దృష్టిలో నేను చేసే మాంస విక్రయణ నీచవృత్తి, కాని నాకది వంశవృత్తి మాత్రమే కాదు. దైవారాధనతో సమానము. ఇది గుర్తించారు కనుకనే నీవు ఇందాక చూసిన ఋషులు నాకూ్కడా వారితో జ్ఞానాన్ని పంచుకొనే భాగ్యాన్ని ప్రసాదించారు. తన పతిసేవా వృత్తిని ఆ ఇల్లాలు దైవారాధనగా భావించింది కనుకనే ఆ తల్లి నీకూ మార్గదర్శనం చేయగలిగింది".

"మహానుభావా! బ్రహ్మచారీ! నేను చెప్పదగినవాడిని కాకపోయినా, నువ్వు కూడా నీ బాధ్యతను మరువక దానిని దైవారాధనగా నెరవేర్చు. అంతకుమించిన తపస్సు వేరొకటి లేదు. నా జ్ఞానానికి కూడా మూలం అదే. నీకు శుభం కలుగుగాక! నాకు నా తల్లిదండ్రులను సేవించుకొనే వేళ అయింది. వెళ్ళిరా! నీ తల్లిదండ్రులను సేవించుకో నీకూ ఎన్నోవిషయాలు తెలుస్తాయి. నీ జన్మ తరిస్తుంది" అంటూ నమస్కరించి పంపాడు.

తమ కార్యములు పరిత్యజించియైనను ఇతరులకు ఉపకారం చేయువారు ఉత్తములు.
తమ కార్యములు చెడకుండా ఇతరుల పనులు చేసేవారు మధ్యములు.
తమ కార్యము నెరవేరుటకై పరుల పనులను పాడుచేయువారు రాక్షసులు.
ఇక ఏ కారణము లేకుండా పరుల పనులను చెడగొట్టువారు పరమ నీచులు.

## స్ఫూర్తి దాతలు

# 1. శంకరాచార్యులు

భారతదేశంలో మొదటి ఐదు శతాబ్దాలు భారతీయ వాఙ్మయానికి, సంస్కృతికి, భారతీయాత్మకు గడ్డురోజులు. దేశంలో హిమాలయాల నుండి కన్యాకుమారి వరకు, తూర్పు సముద్రతీరము నుండి పశ్చిమ సముద్రతీరము వరకు జైన బౌద్ధమతాలు వ్యాపించిన రోజులవి. భారతీయ మతమైన హిందూమతము, ఆ సంస్కృతి, ముఖ్యముగా వారి ఆచార వ్యవహారాలు కేవలం నామమాత్రంగా నిలిచివున్న రోజులవి. యావద్భారతం జైనం క్రిందనో, బౌద్ధం క్రిందనో ఉండి ప్రజలు హిందూమతం పేరు మాత్రమే గుర్తుపెట్టుకొన్న దుర్భర దుష్టకాలమది. సామాన్యుడు నుండి సామ్రాట్టు వరకు, సామాన్య స్త్రీ నుండి సామ్రాజ్ఞి వరకూ జైన, బౌద్ధ సిద్ధాంతాలను అనుసరించిన రోజులవి. మొత్తం భారతాన్ని జైన, బౌద్ధమతాలు రాజ్యం చేసిన రోజులవి.

ఈ పరిస్థితులలో మహాపండితుడుగానే గాక వాఙ్మయ దురంధరుడై, జైన, బౌద్ధాలను ఓడించి భారతీయాత్మను చాటిచెప్పగలిగి హిందూమతాన్ని తిరిగి పునరుద్ధరింపజేయటానికి అవతార పురుషుడైన ఓ మహాపురుషుని ఆవిర్భావ మనివార్యమైనది. అతడే శంకరాచార్యులు.

జైన, బౌద్ధ, చారువాక కాపాలిక మతాలను తన అఖండ పాండితీప్రకర్షతో ఓడించటమేకాక నామమాత్రావశిష్టమైన హిందూమతాన్ని, సంస్కృతినీ తిరిగి పునరుద్ధరించి దేశ ప్రజలందరినీ హిందూమతావలంబకులుగా చేసి హిందూ దేశంలోనే హిందూమతం అంతరించిపోయే స్థితిలో ఉన్నప్పుడు పరమశివుని అవతారముగా జన్మించి, ఈ దేశానికి ఎన్నడూ ఎప్పుడూ చేయని సహాయం చేసినవారు శ్రీ శంకరభగవత్పాదులు.

శ్రీ శంకరులు 8వ శతాబ్దంలో మలబారులోని 'కాలడి' అను ఓ గ్రామంలో సుసంపన్నమైన, శిష్టాచార సంపన్నులయిన ఓ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఈయన జీవించింది 32 సంవత్సరాలే. ఇంత చిన్నవయసులో మహా విపత్తులో చిక్కుకొని ఉన్న దేశాన్ని రక్షించిన మహాపురుషుడు ప్రపంచ చరిత్రలోనే మరొకరు లేరు. ఈయన తన ఐదవ ఏటనే నాలుగు వేదాలను ఉపనిషత్తులను తర్కవ్యాకరణ మీమాంసాది సర్వ విద్యలను, సర్వశాస్త్రాలను, సమస్త కావ్యాలను నేర్చుకున్నాడు. ఈయన తల్లి ఆర్యాంబ ఆంధ్రుల ఆడపడుచు.

ఈయన గురువు గోవింద భగవత్పాదులవారు. కుమారిలభట్టు కూడ ఈయన సమకాలికులే. ఈయన తన ఆరవ ఏటనే సన్యాసము స్వీకరించి దేశంలోని వివిధ ప్రదేశాలలో నున్న జైన బౌద్ధ పండితుల నోడించే నిమిత్తం కొంతమంది శిష్యులు వెంటరాగా దండయాత్రకు బయలుదేరారు. ఆయన తన పదహారు ఏండ్లలోపే మొత్తం భారతదేశాన్ని తిరిగివచ్చి బౌద్ధపండితులనందరిని ఓడించి, ప్రజలను తిరిగి హిందూమతావలంబకులుగా చేశాడు. అంతేకాదు హిందూమతానికాయన చేసిన సేవ మరొకరెవ్వరూ చేయలేరని కూడ చెప్పవచ్చు. ఈ

మహానుభావుడు బౌద్ధులను తాను ఓడించినప్పటికీ రానున్న తరాలలో తిరిగి విజృంభించి హిందూమతాన్ని దెబ్బతీస్తవేమోననే ఉద్దేశ్యముతో, దూరదృష్టితో నాలోచించి ఆయన విజ్ఞానాన్ని, అనుభవాన్ని, విద్యను ఓ నలుగురు శిష్యులకు చెప్పి ఆ నలుగురిని భారతదేశం నలుమూలల నాలుగు పీఠాలకు తన నలుగురు శిష్యులను అధిపతులుగా చేశాడు.

స్వదేశంలోని మతపోటీనేగాక, విదేశాలనుండి వచ్చే పోటీని కూడా ఎదుర్కొనేందుకు ఆయన తన శక్తిని వారికి ధారపోశాడు. అది మైసూరు రాష్ట్రంలోని శృంగేరీ పీఠము, ఒరిస్సాలోని పూరీ పీఠము, పశ్చిమ తీరములోని ద్వారకా పీఠము, హిమాలయములలోని కాశ్మీరు (బదరీ) పీఠము, ఏ కారణముచేతనైనా ఏ ప్రాంతములోనైనా పరమతాలు విజృంభించి హిందూమతాన్ని అణగత్రొక్కే ప్రయత్నంలో ఉన్నప్పుడు ఆ ప్రాంతంలోని మఠాధిపతులు హిందూమతాన్ని రక్షించవలసినదిగా ఆ మఠాధిపతులను ఆజ్ఞాపించాడు.

అంతేకాదు, ఈ మహనీయుడు బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, భగవత్‌గీతకు భాష్యాలు రాసాడు. వీటినే "ప్రస్థానత్రయం" అంటారు. "వివేక చూడామణి" అని మరో ప్రసిద్ధ గ్రంథమున్నది. ఈ మహనీయుడు ఈ ప్రయాణం లోనే కేదారనాథ్‌లో తన 32వ ఏట శివునిలో ఐక్యమైపోయాడు. "మమైవాంశో జీవలోకే జీవభూతస్యనా తపః" అని భగవద్వచనం ఈ జీవిత ప్రపంచంలో లోకంలో జీవుడుగా వున్నది భగవదంశమే. ఆ జీవుడు ఎలాగయినా మరల భగవంతుడినే చేరుకోవాలి. అదే అతని జీవిత గమ్యం. అందుకెల్లప్పుడూ శ్రమించాలి.

ప్రపంచ చరిత్రలోనే ఇంత చిన్న వయస్సులో ఇంత ఘనకార్యములు చేసినవారు మరొకరు లేరేమో? ఈ మహనీయుడు మనందరికీ వందనీయుడేగాక పూజనీయుడు కూడా.

> యుక్తియుక్తముగా చెప్పిన మాటలను బాలును నుంచి కూడా గ్రహించవచ్చు.
> అదే పండితుడు చెప్పినచో విధిగా స్వీకరించవలెను.
> చెడుమాటలు బ్రహ్మ చెప్పినా త్రోసిపుచ్చవలెను.

# 2. స్వామి వివేకానంద

హిందూ సంస్కృతి, హిందూమతమును గురించి యూరప్ దేశవాసులకు తొలిసారిగా చెప్పిన ఘనత స్వామి వివేకానందది. మనము హిందూమతము చాలా పురాతనమయినందని, వేదవిహితమయినదని, మరియు హిందూ మతమునకు ప్రపంచములో మరి ఏ ఇతర మతము సాటిరాదని మానవ పురోభివృద్ధికి, వికాసానికి, ఈ మతమంత ఉన్నతి ప్రత్యేకతకేది సమానముకాదని తెలియజెప్పిన మహానుభావుడీయన.

ఈయన 12-1-1863న పశ్చిమబెంగాల్‌లోని కలకత్తాలో జన్మించారు. బాల్యంలో యీయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు "నరేంద్రనాథ్" యీన తండ్రి విశ్వనాధదత్తు, తల్లి భువనేశ్వరీదేవి. జీవితంలో ఉన్నతాశయములతో జీవించమని చెప్పెడివారు వివేకానందకు.

కాలేజీ చదువులయిన తరువాత శ్రీ నరేంద్రనాథ్, రామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. ఈ కాలంలోనే యీయన తూర్పు, పశ్చిమదేశాల తత్వశాస్త్ర గ్రంథాలను అవగాహన చేసుకున్నాడు. ఈయన శ్రీ పరమహంసను కలుసుకునేముందు బ్రహ్మ సమాజంలో చేరాడు. కానీ ఆయనకందులోను స్థిరమయిన శాంతి లభించలేదు. శ్రీపరమహంసను కలిశాక హిందూతత్వాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని భారతీయ ఆత్మకు ప్రతిబింబమయిన సన్యాసత్వాన్ని స్వీకరించాడు.

1886వ సంవత్సరంలో శ్రీ రామకృష్ణ పరమహంస శివ కైంకర్యం చెందిన పిదప శ్రీ వివేకానందుడు శ్రీ పరమహంస చెప్పినట్లుగా హిందూమతాన్ని గురించి ప్రచారం చేయనారంభించాడు. "చికాగో" లో జరిగిన ప్రపంచమతాల మహాసభకు హిందూమత ప్రతినిధిగా వెళ్ళాడు.

ఆ మహాసభలో ఈయన ఉపన్యాసానికి ఆశ్చర్యపడనివారు లేరు. అన్ని మతాలవారు ఈయన వాగ్ధోరణికి ముగ్ధులైనారు. హిందూమతమంటే యింత గొప్ప మతమని తమ కింతవరకు తెలియనందుకు వారెంతో విచారించారు. అట్టడుగున పడియున్న మన మతాన్ని ప్రపంచ ప్రముఖుల కెరుకపరచిన ఘనత స్వామి వివేకానందుది.

ఈయన యూరప్ దేశాలలో పర్యటించునపుడు ఆ దేశాలలోని అనేకమంది ఈయనకు శిష్యులయినారు.

అంతేకాదు, వారి స్వమతాలను వదిలి మన హిందూమతాన్ని స్వీకరించి హిందూమతావలంబకులుగా కూడా వున్నారు.

శ్రీ వివేకానందుడు ఆ దేశాలలో పర్యటించినపుడు ఓ ఆంగ్ల వనిత హిందూమతం స్వీకరించడమే కాక తన సర్వస్వాన్ని వదిలి ఈయన వెంట భారతదేశానికి వచ్చింది. శ్రీ వివేకానందుడు ఈమెకు "నివేదిత" అని పేరుపెట్టాడు. మతం మానవ సర్వతోముఖ వికాసానికి మాత్రమే ప్రధానమని ఈయన దృఢవిశ్వాసం. ఈ మహామహుడు 5-7-1902న తన 39వ ఏట ఈశ్వర సాన్నిధ్యానికి చేరుకున్నారడు.

ఈయన తదనంతరం తన భావాలు, తన గురువైన రామకృష్ణ పరమహంస భావాలు ఆచరణలో వుండేందుకు భావితరాల ప్రజలు వాటిని తెలుసుకొని అనుసరించేందుకుగాను ప్రపంచంలోని అనేక ప్రదేశాలలో "రామకృష్ణ మిషన్స్" పెట్టాడు. హిందూమతం కోసం, మతోద్ధరణకోసం, తన జీవితాన్ని త్యాగం చేసిన మహాపురుషుల్లో ఈయన ఒకరు.

# 3. ప్రఖ్యాత ఇంజనీరు - డాక్టర్ కె.యల్.రావు

ఆంధ్రజాతి గర్వించదగిన ప్రముఖులు అన్ని రంగాల్లో ఉన్నారు. అలాంటి వారిలో ప్రముఖ ఇంజనీరుగా పేరెన్నికగన్న డాక్టర్ కె.యల్.రావు ఒకరు. వీరి పూర్తిపేరు కానూరి లక్ష్మణరావు. ఈయన బెజవాడ సమీపాన గల కంకిపాడు గ్రామంలో 1902 లో జన్మించారు. వీరి తండ్రి గ్రామ కరణం. చిన్నతనం నుండే రామకృష్ణ పరమహంస, మహాత్మాగాంధీ, వివేకానందుడు మొదలైన మహాపురుషుల జీవితచరిత్రలు చదివి వారిలాగా ఆదర్శంగా జీవించా లనుకొనేవారు. వీరికి చిన్నతనంలోనే తండ్రి చనిపోవటం జరిగింది.

హైస్కూలు చదువు బెజవాడలో జరిగింది. ఈ తరంవారు నమ్మలేనంత చౌకరోజులవి. ఆరోజుల్లో నెలకు ఎనిమిది రూపాయలతో ముప్పూట భోజనం టిఫెనూ పెట్టేవారు. అక్కడ మంచి మార్కులతో యస్.యస్.యల్.సి. పాసయ్యారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో లెక్కల గ్రూపులో సీటు లభించింది. బాగా చదివి ఇంటర్మీడియట్ కూడా డిస్టింక్షన్‌లో పాసయ్యారు.

మెడిసిన్‌లోనూ, గణితశాస్త్రం బి.ఎ. ఆనర్సులోనూ ఇంజనీరింగులోనూ సీటువచ్చింది. తన కోరిక ఇంజనీరు కావాలని, గిండీ ఇంజనీరింగు కళాశాలలో చేరారు. సివిల్ ఇంజనీరింగులో శ్రద్ధ ఎక్కువ. అయినా ఇంజనీరింగులో అన్ని విభాగాలు అధ్యయనం చేశారు. ఇంజనీరు కోర్సు పూర్తిచేశారు.

విశాఖపట్నం జిల్లా బోర్డులో సహాయ ఇంజనీరుగా ఉద్యోగం దొరికింది. సాధారణంగా ఇంజనీర్లకు పైసంపాదన ఉంటుంది. కాంట్రాక్టర్లు తమ లబ్ధికోసం లంచాలిస్తుంటారు. ఒక సందర్భంలో ఒక కాంట్రాక్టరు తన లోపం కప్పిపుచ్చుకోవడం కోసం ఈయనకు లంచం ఎర చూపాడు. రావుగారు మండిపడి ఆ కాంట్రాక్టు రద్దుచేస్తానని హెచ్చరించాడు. అతడు భయపడి పారిపోయాడు బయటికి. అదీ రావుగారి నిజాయితీ. ఈ నిజాయితీ జీవితమే ఆయన ఆఖరివరకు కొనసాగించారు. తన జీవిత చరిత్రలో యిలా వ్రాశారు. "ఎవరైనా లంచం ఇవ్వజూపితే వారిపై అసహ్యభావం కలుగుతుంది. అది పాపకార్యమనీ, అతిహీనమైన పని అనీ నా మనసులో పాతుకొని పోయింది. ఆ భావమే నన్ను ఆ దశలో రక్షించింది. "ఎంత నిజాయితీ! గాంధీజీ వివేకానందుల ప్రభావం ఊరికే పోలేదు.

ఈయన మిత్రుడు డాక్టర్ యం.వి. కృష్ణారావు. వీరిద్దరూ ఆదర్శభావాలు కలవాళ్ళే. ప్రపంచమంతా తిరిగి విజ్ఞానం సంపాదించాలనే కోరిక ఉన్నవారు. ఇద్దరూ బర్మాదేశం వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. కృష్ణారావుగారెందుకో వెళ్ళలేకపోయారు. రావుగారొక్కరే వెళ్ళారు.

రంగూన్‌లో కార్మికసంఘ నాయకుడు నారాయణరావనే తెలుగువాడు. రావుగారు రంగూన్ వచ్చినందుకు నిరుత్సాహపరిచాడు. అయినా ఈయన అధైర్యపడలేదు. స్వశక్తితో నీటిసరఫరా శాఖలో ఉద్యోగం సంపాదించాడు. కొన్నాళ్లకు ఆ ఉద్యోగం వదిలేసి కాంట్రాక్టర్ల కంపెనీలో చేరాడు. మరికొన్నాళ్లకు దాన్ని కూడా వదిలేసి సిలోన్ ఇంజనీరింగ్ కళాశాలలో సహాయ ప్రొఫెసర్‌గా చేరారు. ఆ ఉద్యోగం కూడా వదిలేసి ఇండియాకు తిరిగివచ్చి మెట్టూరు ప్రాజెక్టులో జూనియర్ ఇంజనీరుగా చేరాడు.

గాంధీ అన్నా, కాంగ్రెస్‌పార్టీ అన్నా ఈయనకు చాలా ఇష్టం. అయ్యదేవర కాళేశ్వరరావుగారూ, కొమర్రాజు అచ్చమాంబగారూ మొదలైన బంధువులందరూ కాంగ్రెస్‌లో ఉన్నారు. తాను కూడా చేరాలన్న సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా యిచ్చారు. అధికార్లు అంగీకరించలేదు. గిండీ ఇంజనీరింగు కాలేజీకి బదిలీ చేశారు. లెక్చరర్‌గా చేరాక ఇంజనీరింగ్‌లో రీసెర్చి (పరిశోధన) చేయాలని కోరిక కలిగింది. అది చాలా కష్టమని అందరి భావన. రీసెర్చి కోసం ఇంజనీరింగు ఎం.యస్సీ.లో చేరాడు. గొప్ప న్యూటన్ బయలుదేరాడురా అని మిత్రులు ఎగతాళి చేశారుకూడా.

పరిశోధనా విభాగం (రీసెర్చి) డైరెక్టరు కె.సి.చాకో అనే గొప్ప ఇంజనీరు. లండన్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసిన వ్యక్తి. వీరి సలహా సహకారాలతో సిద్ధాంత వ్యాసం సమర్పించారు రావుగారు. ఆ సిద్ధాంతవ్యాసాన్ని ఇంగ్లాండు పంపారు. అక్కడ ఇంజనీరింగ్ నిపుణులైన ఆండ్రూస్, ఆస్కార్, ఫేజర్, బెట్టో అనేవాళ్లు దాన్ని చదివి ఆశ్చర్యపోయారు. ఇంజనీరింగ్‌లో పరిశోధన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి డిగ్రీపొందిన భారతీయుల్లో రావు ప్రథములు.

**మేధాశక్తికి తొలి విజయం :**

మద్రాసు సెంట్రల్ రైల్వేస్టేసన్ కూవంనది గట్టున వుంది. మద్రాసునగరం ఉత్తరం, దక్షిణ ప్రాంతాలను కలిపే కీలకమైన బ్రిడ్జి యీ నదిపై నిర్మింపబడి ఉంది. సముద్రం ఉప్పు గాలి ప్రభావం వలన బ్రిడ్జి కిందిభాగం కాంక్రీటు పూడిపోయి ఇనుపకమ్మిలు బయటపడ్డాయి. బ్రిడ్జి బలహీనపడిందన్న భావంతో ప్రభుత్వం ఆ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసింది.

ప్రత్యామ్నాయపు ఏర్పాట్లు పరిశీలించవలసిందిగా ఛీఫ్ ఇంజనీరు రావును కోరారు. రావుగారు బ్రిడ్జిని పరిశీలించి పథకం ఆలోచించాడు. అప్పుడప్పుడే కాంక్రీటు విద్యలో ప్రజ్ఞను సంపాదించుకుంటున్న రావుగారు సన్నకంకరతో కాంక్రీటు తయారుచేయించి తుపాకి గొట్టం లాంటి గొట్టాలతో కిలుమును గీకేసిన కమ్మిలపై పిచికారీ చేయించాడు. సిమెంటు బాగా మెత్తుకొనేలా చేశాడు. ఇంకే! బ్రిడ్జీ బాగుపడింది. రాకపోకలు నిర్భయంగా జరిగాయి. రావు కీర్తి దేశమంతా వ్యాపించింది.

ఈ విజయంతో కాంక్రీటు కట్టడాలపైనా ఆ విద్యపైనా శ్రద్ధ పెరిగింది రావుగారికి. ఈ విద్యలో ప్రపంచ ప్రసిద్ధులైన ఫ్రెస్సియెనెట్ అనే ఇంజనీరు ఫ్రాన్సులో వున్నాడు. ఆయన దగ్గర ఈ విద్య చదవాలని రావులో పట్టుదల కలిగింది. అధికారులు అందుకు అనుమతించలేదు. అయినా వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. భార్య వరలక్ష్మితో ఫ్రాన్సు బయలుదేరాడు.

చాలామంది విద్యార్థి భక్తులు బొంబాయి వరకు వచ్చి వీడ్కోలిచ్చారు. ఫ్రాన్సు చేరి ఫ్రెస్సియెనెట్‌ను కలిశారు. తన కోరిక కొంతవరకు నెరవేరింది. 1939 లో ఫ్రాన్సు నుండి లండన్ చేరాడు. నేర్చుకున్న కాంక్రీటు విద్యలో అనుభవం సంపాదించాలని "కాంక్రీటు ఇంజనీరింగు" సంస్థలో చేరాడు. అక్కడ ఛీఫ్ ఇంజనీరు రెనాల్డ్స్. మరొక ఇంజనీరు టర్నరు. అది శిక్షణా కేంద్రంగదా! డబ్బు కట్టి శిక్షణ పొందవలసి వచ్చింది. ఈ డబ్బుకోసమూ, తన కుటుంబ పోషణకోసమూ సాయంకాల సమయాల్లో కాలేజిల్లో లెక్చర్లు ఇచ్చి డబ్బు సంపాదించేవాడు.

మద్రాసులో ప్రతి నెలా జీతం తీసుకుంటూ, పదోన్నతి కలిగే ఉద్యోగంలో ఉండి కూడా ఇండియా వదలి లండను వచ్చాడు రావుగారు. లండన్‌లో సంసారం గడవడానికి చిల్లర ఉద్యోగాలు చేస్తున్నాడు. కాంక్రీటుపై పరిశోధనే తన ధ్యేయం. కష్టాలను లెక్కించదలంచలేదు.

1939 వ సంవత్సరం హిట్లర్ యుద్ధాన్ని ప్రకటించాడు. యుద్ధ వాతావరణంతో నిర్మాణ కార్యక్రమాలు కుంటుబడ్డాయి. బాంబులనుండి రక్షించుకోవడం కోసం నేలను త్రవ్వి షెల్టర్స్ (Shelters) కట్టడం అధికమైంది. ఈ కట్టడాలకు సంబంధించి కాంక్రీటుపై పరిశోధన ఎక్కువైంది.

రావు లెక్కల్లో ఘటికులు. కానీ డిజైన్స్ వేయడంలో అంత మేధావి కాదు. ఇది పెద్ద లోటు అనిపించింది రావుగారికి. లండన్ ప్రక్కనేగల థేమ్స్ నదిపై ప్రత్యేక తరహాలో కట్టబడిన బ్రిడ్జీని ప్రతిరోజూ పరిశీలించి (డిజైన్స్) రూపకల్పన చేయడం నేర్చుకున్నాడు.

ఈ సమయంలో ఈయనకు లండన్ ప్రక్కనేగల ఒక పట్టణంలోని కళాశాలలో సీనియర్ లెక్చరర్ ఉద్యోగం లభించింది. ఈ పట్టణంలో, వీరికి అద్దెకు ఇల్లు చిక్కలేదు. రంగుజాతులవారికి వీళ్ళు ఇల్లు ఇవ్వరు. రావుగారికి మద్రాసు జీవితం గుర్తుకు వచ్చింది. తన మిత్రులైన కొందరు తక్కువ కులస్తులని అగ్రజాతులవారు వారికి ఇల్లు యివ్వడానికి నిరాకరించడం ఆయనకు జ్ఞాపకం వచ్చింది. అక్కడ నల్లవాళ్ళే నల్లవాళ్ళకు ఇల్లు ఇవ్వనప్పుడు ఇక్కడ తెల్లవాళ్ళు రంగుజాతివారికి ఇల్లు ఇవ్వకపోవడంలో ఆశ్చర్యపడవలసినదేదీ లేదనుకున్నాడు. ఈ అద్దెయింటి వేట ఆ దంపతులకు కన్ను తెరిపించింది. కుల, మత, వర్ణ వివక్ష ఎంత చెడ్డదో అప్పుడు బాగా అర్థమైంది. అతికష్టంమీద ఒక చిన్న ఇల్లు అద్దెకు లభించింది. ఈ అనుభవం మనసులో హత్తుకొని వుందేమో, తరువాత తమ సంతానమంతా తమ కులంకాని వారితో వివాహం చేసుకున్నప్పుడు మారు మాట్లాడకుండా ఒప్పుకోవడం జరిగింది. సంతోషమూ కలిగింది.

ఈ కళాశాలలో రావు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నారు. తాను పైన గ్రంథం వ్రాశాడు. ఒక ప్రముఖ కంపెనీ ప్రచురించింది. కంపెనీ ప్రచురించిందంటే అది ఒక ప్రత్యేకత అన్నమట. పుస్తకంపై మంచి రాయల్టీ కూడా వచ్చింది. మద్రాసులో కూడా ఈయన కీర్తి వ్యాపించింది. ఆయనపై మరింత గౌరవం పెరిగింది.

రావు అమెరికా వెళ్లి "సెల్యులార్ కాఫర్ డ్యాం" విషయమై వివరాలు సేకరించాలని మద్రాసు నుండి ఛీఫ్ ఇంజనీరుగారు ఉత్తరం వ్రాశారు.

### "సెల్యులర్ కాఫర్ డ్యాం" అంటే ఏమిటి? :

జల ప్రవాహంతో ఉన్న నదులకు ఆనకట్ట లేదా వంతెన కట్టాలంటే నదిలో ఒకవైపున ముందు నీరు లేకుండా చేసుకోవాలిగదా! కాఫర్ డ్యాంలు కట్టి మధ్యలోనుండి నీరు తీసేసి పునాదులు వేస్తారు. ఒకవైపు పూర్తికాగానే మరోవైపు కాఫర్‌డ్యాం కట్టి నీరు తీసేసి అక్కడ కూడా పునాదులు వేస్తారు. పునాదులపై గోడగానీ, స్తంభాలుగానీ కట్టడం పూర్తిఅయినాక వీటిని తొలగించి వేస్తారు.

యుద్ధం రోజుల్లో అమెరికా వెళ్ళడానికి ఇంగ్లండు ప్రభుత్వం అంగీకరించలేదు. ఎలాగో ఇండియా ప్రభుత్వం జోక్యంతో ఇంగ్లాండువారి అనుమతి సంపాదించి అమెరికా వెళ్లాడు. అమెరికాలోని అన్నిరకాల నిర్మాణాలను నిశితంగా పరిశీలించాడు. అమెరికాలోని కొలరెడో నదిపై కట్టిన డ్యాం ప్రపంచంలోకెల్లా ఎత్తయినది.

ఎక్కువ కాంక్రీటు ఉపయోగించి కట్టిన మరొక డ్యాం గ్రాండ్ లవ్‌లీ డ్యాం. ఈ రెండింటిని రూపకల్పన చేసినవాడు (డిజైనర్) విశ్వవిఖ్యాత ఇంజనీరు జె.యల్. సాలేజ్‌గారు. రావుకు వీరి సలహాలూ, సహకారమూ లభించాయి. అన్ని విషయాలు కూలంకషంగా అధ్యయనం చేసి మంచి రిపోర్టు తయారుచేశారు రావుగారు. దాన్ని మద్రాసు పంపించారు. తాను ఇంగ్లాండు వచ్చేశారు.

**శ్రీరాంపాదసాగర్ ప్రణాళిక :**

గోదావరి నదిపై పోలవరం దగ్గర ప్రాజెక్టు కట్టాలని మద్రాసు ప్రభుత్వం ఆలోచించింది. ప్రభుత్వ చీఫ్ ఇంజనీర్ గోవిందరాజ అయ్యంగారు తెలుగువారు కాదు. గవర్నరు సలహాదారు యస్.పి. రామమూర్తి ముఖ్యమైన ప్రాజెక్టులను పరిశీలించడానికి ఛీఫ్ ఇంజనీరును అమెరికా వెళ్ళమని ప్రభుత్వం కోరింది. ఆయన అమెరికా వెళ్తూ ఇంగ్లండులో ఆగి రావుగారిని తనతో కూడా రమ్మన్నారు. తన కుటుంబ పరిస్థితి అనుకూలించకపోయినా అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని వదలుకోదలంచలేదు రావుగారు. అదే ఆయన ప్రత్యేకత.

రెండవసారి అమెరికా వెళ్ళారు. ఛీఫ్ ఇంజనీరు అయ్యంగారితో కలిసి అనేక ప్రాజెక్టుల రూపకల్పనను (డిజైన్‌లను) అధ్యయనం చేసి రిపోర్టు తయారుచేశారు. అయ్యంగారు ఇండియా వచ్చారు. రావు ఇంగ్లండు వెళ్లిపోయారు.

తరువాత కొన్నిరోజులకు రావుగారికి ఒక ఉత్తరం వచ్చింది. అందులో తాను ఇండియాకు వచ్చి పోలవరం ప్రాజెక్టు పనులు చూడవలసిందనీ త్వరలో మద్రాసు రావలసిందనీ ఉంది. రావుగారు సంతోషంగా బయలుదేరారు. ఏడేళ్ల తరువాత ఇండియాలో కాలుమోపారు. అంటే 1946 లో అన్నమాట.

వచ్చిందే తడవుగా శ్రీరాం పాదసాగర్ డ్యాం డిజైన్ చేసే పని ప్రారంభించారు. ఈ పని ఒక్క సంవత్సరంలోనే ముగించారు. రూపకల్పన ప్రకారము దాన్ని నిర్మిస్తే హైదరాబాద్ రాష్ట్రంలో కొంతభాగం నీటిముంపుకు గురిఅవుతుంది. ఈ కారణంగా ఈ ప్రాజెక్టు ఇచ్చంపల్లి దగ్గర కట్టడం మంచిదని హైదరాబాదు ప్రభుత్వం అన్నది. ఛీఫ్ ఇంజనీరు అయ్యంగారు మాత్రం పోలవరం దగ్గరే కట్టాలన్నారు.

ప్రాథమికమైన పనులు పూర్తిఅయ్యాక ప్రఖ్యాత నిపుణుడు వై.యల్.సాలేజ్‌గారితో సంప్రదించడానికి అమెరికా వెళ్లాడు మళ్లీ రావుగారు. ఇండియాకు సంబంధించిన అనేక ప్రాజెక్టులపై పరిశీలన జరుగుతున్న అమెరికాలోని అంతర్జాతీయ ఇంజనీరింగు కంపెనీలో, సాలేజ్‌గారిని కలిసి డిజైన్ ఖరారు చేసుకొని భారతదేశం తిరిగి వచ్చారు. అయిఏత రాజకీయంగా ఆనాడు వచ్చిన మార్పుల కారణంగా ఆ నిర్మాణం ఆగిపోయింది.

**ఖోస్లా కమిటి - రావుగారి పాత్ర :**

లోయర్ భవానీ, మలంపూరా, ఇంకా మరికొన్ని డ్యాంల 'డిజైన్' చేయవలసిందిగా రావుగారిని ప్రభుత్వం కోరింది. కృష్ణానదిపై పులిచింతల, సిద్ధేశ్వరం నిర్మాణానికి సంబంధించిన పనులను గూడా పర్యవేక్షించమని కోరింది. ఇవి కేవలం ఆంధ్రులకు సంబంధించిన ప్రాజెక్టులు కాబట్టి మద్రాసువాడైన చీఫ్ ఇంజనీరు గోవిందరాజు అయ్యంగారికి నచ్చలేదు. రావును బదిలీ చేయించాలని ప్రయత్నించాడు.

ఈ సమయంలోనే సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమిషన్‌లో డైరెక్టరుగా నియమిస్తూ రావుగారికి ఉత్తర్వులందాయి. వెంటనే ఢిల్లీ వెళ్ళిపోయారు. కేంద్రప్రభుత్వం ఒరిస్సాలోని హీరాకుడ్ ప్రాజెక్టు పర్యవేక్షణ వారికి అప్పజెప్పింది. భారతదేశమంతటా నీటిపారుదల ప్రాజెక్టులూ, జలవిద్యుత్ ప్రాజెక్టులూ పరిశీలించారు. పులిచింతల ప్రాజెక్టు కోసం మొదటినుండి ఆందోళన చేస్తున్న ముక్త్యాలరాజాతోపాటు ఆ ప్రాంతాన్ని సందర్శించి నందికొండ సరియైన స్థలం అని నిర్ణయించారు.

ఈ సమయంలో ప్రాజెక్టుల పరిశీలనకు ఖోస్లా కమిటి, ఆంధ్ర ప్రాంతానికి వచ్చింది. పులిచింత ప్రాజెక్టువల్ల మద్రాసు ప్రాంతానికి ఏరకంగాను లాభం లేదన్న దృష్టితో ఆనాటి ముఖ్యమంత్రి రాజగోపాలచారి సైతం ఈ ప్రాజెక్టుకు అడ్డుచెప్పారు. రావు తన మేధాశక్తితో ఆ ప్రాజెక్టు అన్నివిధాల తగినదని నిరూపించి ఖోస్లా కమిటీచేత అంగీకరింపజేశారు. కాని స్థలం పులిచింతలకు మారుగా నందికొండకు మార్చారు. అదే నాగార్జునసాగర్. ఇవేగాక కాటన్ బ్యారాజు, ప్రకాశం బ్యారాజు, శ్రీశైలం, ఇడుక్కీ, కొయ్నా, భీమా, యున్‌యీ, కోసీ బ్యారాజు, గండక, నర్మదా, బలికుల, భాక్రానంగల్ మొదలయిన అనేక నదీలోయ ప్రాజెక్టుల రూపకల్పనలోనూ, నిర్మాణంలోనూ రావుగారికి ప్రమేయం వుంది.

1954 లో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమిషన్‌కు ఛీఫ్ ఇంజనీరుగా పదోన్నతి పొంది ఆతరువాత 1956 లో ఆ కమీషన్‌లోనే సభ్యుడుగా కూడా అయ్యారు.

**అవార్డులు - రివార్డులు :**

తన కృషికి గుర్తింపుగా 1947-48 లోనూ, 1953-54 లోనూ రావుగారు రాష్ట్రపతి అవార్డు పొందారు.

1951-61 మధ్యలో ఒక అంతర్జాతీయ సదస్సుకు ఉపాధ్యక్షుడయ్యాడు.

1959-60 లో విద్యుశ్చక్తి మరియు నీటిపారుదల కేంద్రమండలికి అధ్యక్షుడయ్యాడు.

1960 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ సైన్స్ బిరుదు ఇచ్చి సత్కరించింది.

తరువాత హైదరాబాదు జవహర్‌లాల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ యిచ్చింది.

ఇన్ని గౌరవాలు పొందినా రావుగారికి రావలసినంత ఖ్యాతి రాలేదు. దానికి కారణాలు అనేకం. ఇతర దేశాల్లో అయితే ఊహించరానంత గౌరవం పొందిఉండేవారు. ఇక్కడ ఉత్తర, దక్షిణ భేదాలూ, ప్రాంతీయ భేదాలూ, కులభేదాలూ ఇవన్నీ ఎవరి ఔన్నత్యానికైనా అడ్డుతగిలేవే.

**రాజకీయ జీవితం :**

ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఉన్న మేధావులూ, శాస్త్రవేత్తలూ, ఇంజనీర్లూ, స్వతంత్రులు, రాజకీయాల్లో వుండాలనుకుంటే వారికి ఆటంకాలుండవు. పార్లమెంటు మెంబర్లుగానూ మంత్రులుగానూ గూడా ఉంటున్నారు. ఇలాంటి మేధావులు రాజకీయాల్లో ఉంటే దేశాభివృద్ధికి దోహదంగా ఉంటుందని ఒక సభలో రావుగారన్నారు. ఆనాటి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెహ్రూగారు ఆ మాట విన్నారు.

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకే పార్లమెంటు ఎన్నికలు రానే వచ్చాయి. అది 1961వ సంవత్సరం.

రాజకీయాలు తెలుసుగాని స్వార్థపూరిత రాజకీయాల్లో అంతవరకూ ప్రవేశం లేదు రావుగారికి. విజయవాడ పార్లమెంటు సీటుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ యిప్పించాడు సంజీవరెడ్డిగారు. రావుగారి బంధువే అయిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ప్రసాదరావుగారు ఈయనకు ప్రత్యర్థి.

కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు క్రమశిక్షణాయుతంగా ప్రచారం చేశారు. అయ్యదేవర కాళేశ్వరరావుగారూ, కొమఱ్ఱాజు అచ్చమాంబగారూ రావుగారి పక్షాన విశేషంగా కృషిచేశారు. మొత్తానికి ఇరవైవేల ఓట్ల మెజార్టీతో రావు గెలిచారు.

పార్లమెంటులో 'ఎస్టిమేషన్ కమిటి మెంబరు'గా నియమింపబడ్డారు. అభివృద్ధి పొందుతున్న దేశాలకు సంబంధించిన బెర్లిన్‌లో ఏర్పాటుచేసిన ఒక అంతర్జాతీయ సమావేశానికి భారతదేశ ప్రతినిధిగా హాజరయ్యారు రావుగారు.

1963 జూలై నెలలో నెహ్రూగారి నుండి నాగార్జునసాగర్‌లో వున్న రావుగారికి ఫోను వచ్చింది. నీటిపారుదల, విద్యుత్ శాఖలకు మంత్రిగా నియమిస్తున్నానని నెహ్రూగారు చెప్పారు. ప్రమాణస్వీకారానికి ఎప్పుడు వస్తావని నెహ్రూగారు అడిగారు. నియోజకవర్గానికి వెళ్ళి నింపాదిగా వస్తానన్నారు రావు. మరొకరయితే ఆ మంత్రిపదవిని ఇంకెవరైనా తన్నుకుపోతారేమోనని మరుక్షణమే పరుగెత్తేవారు. రావుగారికి పదవే ప్రాణం కాదుగదా!

19-7-63వ తేదీ మంత్రిగా ప్రమాణం చేశారు. 1964 లో నెహ్రూగారు చనిపోయి శాస్త్రిగారు ప్రధాని అయినపుడూ, శాస్త్రిగారు మరణించి ఇందిరాగాధి ప్రధానిగా వచ్చినపుడూ కూడా వీరు మంత్రివర్గంలో కొనసాగారు. మంత్రిగా కొనసాగడమే కాదు వీరి శాఖ ఎవరూ మార్చలేదు. అదీ వీరి ప్రాముఖ్యం. తిరిగి 1967 ఎన్నికల్లో రావుగారు విజయవాడ నియోజకవర్గం నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇది వారి మంచితనానికీ, గొప్పతనానికీ, నియోజకవర్గ అభివృద్ధికీ వారు చేసిన కృషికీ తార్కాణం.

కృష్ణా, గోదావరి నదీజలాల పంపకంలో కొన్ని తగాదాలు వచ్చాయి. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఈ విషయంలో వైషమ్యాలు రాసాగాయి. రావుగారు న్యాయం మాట్లాడినా ఆంధ్రేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులూ, నిపుణులూ వీరిని అనుమానంగా చూడసాగారు. ప్రాంతీయ దురభిమానం లేకుండా దేశక్షేమాన్ని మాత్రమే కాంక్షించి నిరంతరం నిష్పాక్షికంగా కృషిచేస్తున్నప్పటికీ నిందలు తప్పలేదు.

ఈ పరిస్థితులలో పదవి కొరకు ప్రాకులాడటం రావుగారికి నచ్చలేదు. తనకు తానే రాజీనామా యిచ్చి ఇంటికి వచ్చారు. "నిరంతర కృషితో కార్యదీక్షతో అలసిపోయారు కాబట్టి ఇక విశ్రాంతి తీసుకోండి" అని సహధర్మచారిణి వరలక్ష్మమ్మ సంతోషంగా పలికింది.

ఈ మహనీయుడు తన 85వ యేట 1986 లో మరణించారు. గతంలో కాటన్ ప్రభువూ, మెకంజీ లాంటి వాళ్ళు సూచించిన విధంగా, గంగా కావేరీ కలపాలన్న రావుగారి వాంఛ నెరవేరకుండానే పోయారు. భౌతికంగా ఆయన లేకపోయినా, జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉన్నంతకాలం ఆయన ప్రజాహృదయాల్లో జీవించే వుంటారు.

# 4. M.S. ఆచారి

అవి ఎమర్జన్సీ రోజులు.

పత్రికల్లో వచ్చే వార్తల మీద వ్యాసాల మీద సర్కారు వారి పెత్తనం ఏమిటో నాకు అర్థమయ్యేది కాదు. తెలుగురాని కలెక్టర్. ఫైళ్ళమీద కొర్రీలు తప్ప మరేదీ రాయరాని రెవిన్యూ అధికారులు తెలుగు వ్యాసాలు చదివి అవి ప్రభుత్వానికి, ముఖ్యంగా ఇందిరాగాంధీకి ఆమె పార్టీకి వ్యతిరేకంగా లేవని గ్రహించి తరువాత అనుమతించడం, అవి పత్రికల్లో రావడం ఒక వైపరీత్యం అని వేరే చెప్పనవసరంలేదు. అప్పటికి నేనింకా లా చదవలేదు. బి.ఎస్సి విద్యార్థిగా వున్నాను. రాజ్యాంగం, పత్రికా స్వాతంత్ర్యం అని విన్నానే గాని, ఎమర్జన్సీలో అవి హరించుకుపోయినపుడు వాటి సంగతి అర్థమయింది. ప్రతి స్వాతంత్ర్య దినోత్సవానికి తీసే విధంగానే జనధర్మ స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచిక కోసం నేనొక వ్యంగ్య వ్యాసం రాసాను. స్వాతంత్ర్యసమరయోగధుడయిన ఒక తాతగారు మనవడికి స్వతంత్రం అని. మనవరాలికి స్వరాజ్యం అని పేరు పెట్టుకుంటాడు. ఇద్దరినీ పంద్రాగస్టు పండుగకు పంపుతాడు. బడికి వెళ్ళి జెండా వందనం చేసి స్వరాజ్యం అయితే ఇంటికి వచ్చింది కాని. స్వతంత్ర్యం ఇంకా రాలేదు. సహజంగా ఆందోళన పడతారు. ఆ రాత్రికూడా రాడు. మరునాడు తెల్లవారుజామున ఇంటికి వచ్చిన మనవడిని చూసి ఏం జరిగిందని అడుగుతారు. తన బళ్లో జెండా ఎగరవేసినా మిఠాయిలు ఇవ్వలేదు కనుక తన మిత్రుడి స్కూలుకు వెళ్ళానని అక్కడ మిఠాయిలు తిని మిత్రుడితో సాయంత్రందాకా ఉండి చీకటి పడిన తరువాత వస్తుంటే సైకిల్‌కు లైట్ లేదని పోలీసులు పట్టుకున్నారని. లంచం ఇవ్వడానికి, చలాను కట్టడానికి డబ్బు లేదు కనుక ఇద్దరు మిత్రులు కాస్సేపు లాకప్‌లో కాలంగడిపిన సంగతి చెప్పాడు. తరువాత ఇంకో ఫ్రెండ్ చలాన్ కట్టి ఈ ఇద్దరిని బయటకు తీసుకువచ్చినాడని, వాడి దగ్గర మిగిలిన డబ్బుతో ఓ సినిమా చూసినారని చెప్తే ఏ సినిమా చూసినావని అడుగుతాడు తాత. దానికి అతను జవాబు 'నాకూ స్వాతంత్ర్యం వచ్చింది'. అది ఆ మధ్య వచ్చిన ఒక సినిమా పేరు. ఆ పేరు ఆధారంగా ఈ వ్యంగ్యం తయారయింది. మానాన్న చదివిన తరువాత ఆ వ్యాసం సెన్సార్‌కోసం కలెక్టర్ ఆఫీసుకు పోయింది. పిఎ టు కలెక్టరో లేక డిఆర్ఓనో చదివినట్టు, కింద పాస్‌డ్ అని రాసినట్టు రబ్బరు సీళ్ళు ఉన్నాయి. 'అరె ఈ వ్యంగ్య రచనకు సెన్సార్ పర్మిషన్ రాదనుకున్నానే అని ఒకసారి అనుకుని, మానాన్న జనధర్మ ప్రత్యేక సంచికలో అచ్చువేశారు. నాన్నగారి మిత్రుడొకాయన వచ్చి, "ఏం శ్రీధర్, అయితే మనకు స్వరాజ్యం వచ్చిందంటావు. కాని స్వతంత్ర్యం ఇంకా రాలేదన్నమాట" అన్నాడు అవునన్నాను.

కొన్నాళ్ళు తరువాత ఎవరో ఈ వ్యాసం గురించి కలెక్టర్‌కు చెప్పినట్టుంది. ఆయన నాన్నకు ఫోన్ చేశారు. సంభాషణ ఇంగ్లీషులో జరిగింది. మీరు ఇటువంటి వ్యాసాలు వేసి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. మీకు తెలుసుకదా ఎమర్జన్సీ సెన్సార్‌షిప్ ఉంది అని. మీ చిన్న పత్రికలో ఇటువంటి విమర్శలు రాస్తే ఎలా చెప్పండి. ఆ రాసింది మీ అబ్బాయే అని విన్నాను. యువరక్తం కదా మీరు చూసుకోవద్దూ.

'మీ సెన్సార్ ఆఫీసుకు పంపినాను, మీరు పాస్ చేసి, వేసి పంపితే వేసుకున్నాం. మీరు పర్మిషన్ ఇవ్వడం ఎందుకు, తరువాత ఈ మాటలెందుకు?' మా నాన్నగారి ప్రశ్న.

దానికి కలెక్టర్ గారు 'ఆచారిగారూ నాకు తెలుగు రాదు. మా ఆఫీసర్లకు వచ్చనకున్నాను. వారికి అందులో పరోక్షంగా ఉన్న విమర్శ అర్థం కాలేదు. ఇప్పుడు అర్థమయింది. మిమ్మల్ని మీ అబ్బాయిని అరెస్టు చేయడం, ఆ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయడం ఎందుకని నా ఆలోచన. దయచేసి ఈ చిక్కులు మాకు పెట్టకండి. మీరే కాస్త మీవాడి కలాన్ని కంట్రోల్ చేయండి. లేకపోతే విషయం అరెస్టుల దాకా వెళ్ళవచ్చు.'

మానాన్న నవ్వి సరే చూద్దాం అని సంభాషణ ముగించారు. మా ప్రెస్ వెనుకనే మా ఇల్లు ఉండేది. లోపలికి వచ్చి మా అమ్మతో 'వీడొకడు (నన్ను చూపుతూ) నాకు సమస్యలు సృష్టిస్తుంటాడు. వీడికి ఇప్పుడే ఇందిరాగాంధీ మీద అంతకోపమెందుకో' అని జరిగిన విషయం చెప్పాడు. మా అమ్మ భయపడి 'ఏదో ఓటి రాసి గొంతుమీదికి తెచ్చుకుంటావెందుకురా' అని నన్ను మందలించింది. నాన్న మళ్ళీ ప్రెస్‌లోకి వెళ్తూ 'అయినా వీడి కలానికి ఘాటెక్కువ. కొంచెం కష్టమే' అన్నారు. తిట్టులోనే మెచ్చుకోలు ఉందని నాకనిపించింది.

మానాన్న ఎం ఎస్ ఆచార్య సంపాదకత్వంలో అవిచ్ఛిన్నంగా 1994 వరకు నడిచిన జనధర్మ వారపత్రిక ఎమర్జన్సీ కథ అది. నాకు ఓనమాలు దిద్దించిన బడి జనధర్మ. నాకు పాఠాలు చెప్పకుండానే చెప్పిన గురువు నాన్న తండ్రిగా దేహము విజ్ఞానము బ్రహ్మోపదేశమిచ్చిన గురువు ఆచార్యుడాయన.

వరంగల్లులో అనేకానేక వార్తాపత్రికలు వచ్చినై, పోయినై, కాకతీయ వార పత్రిక, కాంగ్రెస్ పత్రికలు చాలా కాలం జనంలో నిలబడినా కాలగర్భంలో కలిసిపోక తప్పలేదు. 1958 నవంబర్‌లో ఆంధ్రరాష్ట్ర అవతరణ సంచికగా జనధర్మ జీవనం మొదలైంది. నాన్న కొండంత పట్టుదల, నిరంతర కృషితప్ప దానికి ఉన్న అండదండలేవీ లేవు. జనధర్మకు తెలంగాణా అభివృద్ధే లక్ష్యం, జనం సమస్యలు ప్రాణం. వారి గురించిన ఆలోచనే ఆలంబన. పది రూపాయలో పాతిక రూపాయలో ఇచ్చి వేయించుకునే ప్రకటనలే ఆదరువు. ఆకాలంలో ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు వచ్చినపుడు కేవలం సమస్యల వివరణతో ప్రత్యేక సంచిక తీయాలన్న కొత్త ఆలోచన జనధర్మలోనే రూపు కట్టింది. కొందరికి కోపం తెప్పించినా ఒక ముఖ్య ఘట్టంగా మిగలడమే కాక, ప్రభువుల దృష్టిని సమస్యలమీద ప్రసరింప చేసింది ఆ ప్రయత్నమే. తెలంగాణా సాహిత్యానికి, సాంస్కృతిక వారసత్వానికి సముచిత గౌరవ ప్రాభవాలను కల్పించడానికి జనధర్మ ఒక వేదికైంది. హనుమకొండ నుంచి ఎన్నికయిన ఎంపీ కేంద్రంలో మంత్రి కావడం అంతకు ముందు ముఖ్యమంత్రి కావడం జిల్లా పత్రికకు విశేషమే కనుక పి.వి. నరసింహారావు అభినందన సంచిక వెలువర్చింది జనధర్మ. అంతకు ముందు పి.వి. నరసింహారావు నాన్నతో పాటు కాకతీయ పత్రికలో పనిచేసిన పాత్రికేయ సహచరుడని అందాకా ఎవరికీ తెలియదు. టి.ఎస్.మూర్తి అనే వైద్యుడు ప్రజాభిమానం చూరగొని ఎంఎల్ఎలు ఏం చేస్తే మంచిదో చెప్పింది జనధర్మ. కాళోజీ పేరు తెలియని వారుండరు. కాని ఆయన పేరు తెలియని రోజుల నుంచి ఆయన 'నా గొడవ'కు ప్రేరణ, వేదిక, ప్రచారం ఈ

పత్రికే. కాళోజీ నుంచి నిన్న మొన్న కలంపట్టిన యువ కవిదాకా సాహితీ మిత్రులందరికీ జనధర్మ ఒక ప్రియ నేస్తం, సాహితీ శిఖరాలకు నిచ్చెన. కాళోజీతో పాటు మరో కవి పల్లా రామకోటార్యకి అభినందనలను సంచికలరూపంలో ప్రకటించిన ప్రక్రియకు నాన్న జనధర్మ ద్వారా ఈ ప్రాంతంలో శ్రీకారం చుట్టారు. జనధర్మ వారపత్రిక ఇప్పుడు ఈ ప్రాంత ఆర్థిక సాంఘిక, సాహిత్య సాంస్కృతిక పరిణామ వికాసాల చరిత్రను, ఉద్యమ ఉత్థాన పతనాలను, అభివృద్ధి సాధన యత్నాలను, సమస్యల విశృంఖల విహారాలను కాగితాల నిలబెట్టిన ఒక పరిశోధనా సంపుటి. జనధర్మ సాహిత్య ద్వైమాసిక సంచికలు, స్వాతంత్ర్యోత్తర కాలాన తెలుగు కవిత వంటి ప్రత్యేక సంచికలు ఇక్కడి సాహితీ సరస్వతికి నిలువెత్తు నీరాజనాలు. జనధర్మ పుటలు జనుల హృదయ స్పందనలు, ఆ సంపుటాలు వరంగల్లు జనజీవాల ప్రతిస్పందనలు. జనధర్మతో పాటు 1980లో నాన్న నేను కలిసి ప్రారంభించిన 'వరంగల్‌వాణి' దినపత్రిక దినదినగండాలతో పధ్నాలుగు వసంతాలు బతికింది. జనధర్మను కూడా కొంత దెబ్బ తీసింది. జనధర్మ, ఆచారిగారి గుండె. 1994లో దాంతోపాటు ఆగిపోయింది.

ఇంత చేసిన ఈ ఆచారి ఎవరు? జనధర్మ అయ్యగారని అందరూ ప్రేమతో పిలుచుకున్న ఆ వ్యక్తిత్వం ఏమిటి? ఎస్సాసు అనే కలంపేరుతో పరిశోధనాత్మక వార్తలను గుప్పించినా, నారద వీణ కాలంలో సామాజిక సమస్యలను విశ్లేషించినా, సంపాదకీయాల్లో సమకాలీన విలువలను నిలదీసినా ఆయనకు ఆయనే సాటి అని వరంగల్లులో ఎందుకు తలచుకుంటున్నారు?

1948కు ముందు రజాకార్ల జమానాలో, నిజాం క్రూరమయిన పాలనకు రజాకార్ల దౌర్జన్యాలకు భయపడి వరంగల్లు వదిలిపెట్టి వందలాది కుటుంబాలు ఖాళీచేసిపోతే, ఇక్కడి వీధుల్లో ఒకచేత కందిలీ, మరో చేత లాఠీ పట్టుకుని ఎంతరాత్రయినా సరే ఎవ్వరెదురయినా సరే ఎదుర్కొంటానన్నట్టు తిరిగిన వీరుడు ఎం.ఎస్. ఆచార్య. అప్పుడు తెలుగు మాట్లాడితే నేరం, తెలుగుపత్రిక చేతిలో ఉంటే తప్పు. నిజాం పోలీసులకు తెలుగు రాసేవాడు. చదివేవాడు. ఎక్కడ కనిపించినా బూటుకాలుతో తన్నడం, కేసుల్లో తోయడం అలవాటు. అటువంటి రోజుల్లో తెలుగు పత్రికలకు ఆచార్య ఏజంటు, ఉద్దమానికి ఆయువుపట్టుగా వెలువడే ఆంధ్రపత్రికకు ఆయన విలేకరి. వాడవాడల్లో ఆంధ్రపత్రికను రహస్యంగా పంచి జీవన్మరణమయిన వృత్తిని చేపట్టిన వ్యక్తి. ఉద్యమం ఆయనకు ఉద్యోగమయింది. చివరిదాకా పోరాటమే ఊపిరయింది. ఆచార్య తండ్రిగారు ప్రసన్న రాఘవాచార్య వైద్యుడు. ఆయన దగ్గర వైద్యానికి వచ్చిన అజ్ఞాత స్వాతంత్ర్య యోధుడు విప్లవవీరుడు డివి (దేవులపల్లి వెంకటేశ్వరరావు) జీవితం తనకు స్ఫూర్తి అని తనే చెప్పినవాడు. ఒకరోజు నడివీధిలో ఒక ముస్లిం మరొకరిని వేరే మతం వాడన్న ఏకైక కారణం వల్ల అమానుషంగా కొట్టడం ఆచారిని విలేకరిని చేసింది. అదే ఆయన తొలివార్త. రజాకార్లను వ్యతిరేకించడానికి ప్రతాపరుద్ర దళం నిర్మించిన పోరాటశీలి ఈ యువ జర్నలిస్టు. 1948 నుంచి ఆంధ్రపత్రికలో సాగించిన ఆయన అక్షర సంగ్రామం జనధర్మతో జీవిత రంగంగా మారింది. 1980 దాకా ఆంధ్రపత్రిక విలేకరిగా వరంగల్లులో పేరెన్నిక గన్న వ్యక్తిత్వం ఆయనది. తెనాలిలో వావిలాల గోపాలకృష్ణయ్య స్వాతంత్ర పూర్వ కాలంలో

ఏర్పాటుచేసిన మూడునెలల జర్నలిస్టు శిక్షణ తప్ప ఆయన ప్రత్యేకంగా జర్నలిజం నేర్చుకున్నదీ లేదు. సమాజాన్ని తప్ప వేరు చదువుకున్నదీ లేదు. ఆంధ్రపత్రిక దినపత్రికల కట్టల మధ్య ఉద్యమ సాహిత్యాన్ని నింపి కట్టలు తెంచుకున్న ఉత్సాహాలకు కారకులైనది ఆయన కార్యకుశలత. ఒకవైపు విలేకరి, మరోవైపు ఉద్యమకారుడు, యువ పహిల్వాన్లతో వ్యూహనిర్మాత, తెలుగు పత్రికల ఏజంటు, వెరసి నిజాంమీద పోరాటం, కలంతో కందిలీతో అడుగడుగునా మృత్యువుతో పలకరింపులే. ఓ రోజు పాతబీటుబజారులో సైకిల్ మీంచి కాగితాల సంచీజారి కిందబడింది. అందులోంచి నిషేధపత్రాలు బయటపడితే ఇంకేముంది. ఎవడో నిజాం పోలీసు కంటపడింది. వాడు చావబాదుతూ ఉంటే ఆయన మౌనంగా భరిస్తున్నాడు. అక్కడి వర్తకులంతా ఆపి అతనికేం తెలియదని, పంచేపేపర్లలో ఏదో వస్తే దానికి ఆ పిల్లవాడిని కొట్టడం ఎందుకని చెప్పి బతికించినారు. ఇంకోసారి వర్ధన్నపేట వెళ్లే బస్సు వరంగల్లు ఇంతెజార్ గంజ్ పోలీసుస్టేషన్ ముందు ఆగింది. బస్సులోకి ఆంధ్రపత్రిక కట్టను ఎక్కిస్తుంటే ఒక మిలిటరీ ఆఫీసర్ మోటార్ సైకిల్ ఆచార్యకు తగిలింది. వాడు డొక్కలో మోకాలితో తన్నడం కొట్టడం జరిగిపోతూనే ఉన్నది. మరొక మిత్రుడెవరో ఆయన మీద పూర్తిగా పడిపోయి దెబ్బలన్నీ తిన్నాడు. మరోసారి మృత్యువుతో కరచాలనం దాకా వచ్చిందన్నమాట. అన్ని దెబ్బలు తిన్నతరువాత కూడా తన కాగితాలు, కరపత్రాలు ఉన్నాయో లేవో చూసుకుని బస్సు మీదికి అన్నీ ఎక్కించినారో లేదో చూసుకున్న ఆయన దీక్ష గురించి ఏ మాటలు చెప్పగలవు? ఇంకోసారి నాన్న దోస్త్ ముస్త్యాల శంకరరావు రజాకార్లకు దొరికిపోతే విడిపించడానికి నాన్న పడిన పాట్లు ఎవరికి తెలుసు? ఎవరో ఆచారివల్లనే శంకరరావు బతికి పోయిండంటే రజాకార్లకు నచ్చలేదు. ఆచారినే ఖతం చేస్తమని వారు తిరుగుతున్నారని తెలిసింది. అప్పుడు నాన్న పోనని ఎంత చెప్పినా వినకుండా స్నేహితులంతా వరంగల్లునుంచి బలవంతంగా తరలించారు. తెలంగాణా రజాకార్ల నుంచి విముక్తం అయిన తరువాత సెప్టెంబర్ 22న నాన్న మళ్ళీ సొంతనేలమీద కాలు పెట్టినారు.

ఎన్‌కౌంటర్ల బూటకాన్ని మొదటరాసిన విలేకరి నాన్న. ఆనాటి తెలంగాణా సాయుధపోరాట కాలంలో కమ్యూనిస్టులు అజ్ఞాతంగా సాగిస్తున్న ఉద్యమాన్ని అణచి వేయడానిక పోలీసుదళాలు అడవుల్లో మకాం వేసి చెట్లు కొట్టే అమాయకులు పన్నెండుమందిని అన్యాయంగా కాల్చి చంపిన వార్తను ఆచార్య పంపినందుకు కలెక్టర్ అరెస్టుచేయించినారు. అది పైకి చెప్పని నిర్బంధం. చట్టానికి చెప్పని అరెస్టు.

ఆ మధ్య నూలు సరఫరా మీద కంట్రోల్ ఉండేది. నూలు పెట్టెలకు పర్మిట్లు ఇవ్వడానికి విరాళాలు వసూలు చేసే కుంభకోణం గురించి పరిశోధించి, వెనుక ఉన్న నేతల వివరాలు ఇచ్చినందుకు ఈ పరిశోదనాత్మక విలేకరి ఒక దశాబ్దం పైగా వేధింపులకు గురి కావలసి వచ్చింది.

నాకింకా గుర్తు పొద్దున్నే నాలుగింటికి సైకిల్‌మీద పేపరు కట్టలు వేసుకుని ఇంటింటికీ పంచితేనే ఇంటికి ఆరోజుకు భోజనం. ఉప్పు, పప్పుతో సహా ఒక రోజుకు సరిపడే సరుకులు కొనుక్కుంటే తప్ప ఇంట్లో పొయ్యి లేచేదికాదు. నాన్న రావాలి. వచ్చి డబ్బు ఇస్తే ఆ రోజు వెచ్చాలు, వంటలు. 25మంది సభ్యులకు తిండి,

తమ్ములు చదివినా, చెల్లెలు పెళ్ళయినా, కొడుకులు బడికి పోయినా ఆ పైసలతోనే. ఒక్కోసారి కడుపునొప్పి వస్తే సైకిల్ దిగి ఆ వాడలో ఏదో ఒక అరుగుమీద ఒరిగి కడుపు పట్టుకుని బాధపడి తరువాత లేచి మిగిలిన పేపర్లు పంచి ఇంటికి వచ్చేవాడట మానాన్న.

ఎన్ని చేదు అనుభవాలు, ఎన్ని పోరాటాలు... ఈ మధ్యలో కుటుంబం సంగతి పట్టించుకున్నదెవరు? ఇల్లుగడిచేదెట్లా అని ఆలోచించిందెవరు? ఈ నేపథ్యంలో జనధర్మపత్రిక ఆరంభమయింది. ఒక స్వతంత్ర్య సమరయోధుడి ఇంటిలో దశాబ్దంన్నరపాటు జనధర్మ, వరంగల్ వాణి పత్రికలు నడిచినాయి. తనకు, పత్రికకు సొంత గూడు లేక పోయినా సమిష్టి కుటుంబాన్ని తమ్ములను అన్న కొడుకులను అందరినీ నడుపుకుంటూ జీవితంలో కూడా పోరాడిన యోధుడు ఆయన. చివరకు పత్రిక ఉన్న ఇంటిని ఖాళీ చేయవలసి వచ్చింది. మనసు వికలమై పత్రిక అమ్ముకున్నారు. అక్షరాలతో ముడిపడిన ఆయన జీవితం అక్షరం లేకుండా గడపడం కష్టమైందో ఏమో, చెదిరిన అక్షరం వలెనే ఆయన గుండెకూడా చెదిరింది. తను నమ్మిన ఏడుకొండల వేంకటేశుని చరణౌశరణం ప్రపద్యే అంటూ జీవనపోరాటానికి తుది శ్వాస విడిచిన ఎం.ఎస్.ఆచార్య ఒక పోరాటం మూర్తీభవించిన స్ఫూర్తి. ఒక పాఠశాల. నాన్న లేకపోవడం అనేది జరిగేనా?

(ఒక కొడుకు మాడభూషి శ్రీధర్ కావాలన్నా, ఒక తమ్ముడు పద్మభూషణుడు కావాలన్నా ఒక తండ్రి ఒక అన్న ఎంత సంకుల సమరం సాగించాలో చెప్పే ఈ జీవిత కథ కన్నీళ్ళతో నాన్నకే అంకితం...)

నువ్వు నిరుపేదవని అనుకోవద్దు. ధనం నిజమైన శక్తి కాదు. మంచితనం, పవిత్రతలే నిజమైన శక్తులు.

– స్వామి వివేకానంద

# 5. బాలగంగాధర తిలక్

భారత స్వాతంత్ర్య సముపార్జన కోసం జీవితాలను త్యాగం చేసిన అగ్రశ్రేణి మహానాయకులకు మహానాయకుడు లోకమాన్య బాలగంగాధర తిలక్. స్వాతంత్ర్యము నా జన్మహక్కు" అని గాంధీకి పూర్వమే ఎలుగెత్తిచాటిన సుప్రసిద్ధ దేశభక్తుడు. మహారాష్ట్రలో మరాఠా బ్రాహ్మణ వంశంలో 1853లో పుట్టి 1919లో పరమపదించిన ఈయన మనకు, భావిభారత ప్రజలకు మార్గదర్శకుడే కాక పూజనీయుడు కూడా. భగత్‌సింగ్ మొదలగు విప్లవ వీరులతో కలసి మహారాష్ట్ర, బెంగాల్, పంజాబు మొదలగు రాష్ట్రాలలో స్వాతంత్ర్య సముపార్జన కోసం ప్రజలను మేల్కొలిపిన వైతాళికుడీయన. ఈయన యెంత దేశభక్తుడో అంతటి హిందూ మతాభిమాని.

బ్రిటీషు జాతీయగీతాన్ని కాదని "వందేమాతరం" అన్న భారత జాతీయ గేయాన్ని మన సభలలో ఆచరణలో పెట్టిన దేశాభిమాని ఈయన. అంతేకాదు, భారతీయ ప్రజలను స్వాతంత్రోద్యమంలో పాల్గొన చేయుటకు దేశంలో జరుగుతున్న విషయాలను యెప్పటికప్పుడు ప్రజలలో తెలియచేయుటకు "కేసరి" అనే ఒక పత్రికను స్థాపించాడు.

బ్రిటీషు ప్రభుత్వం ఈయన దేశభక్తికి, ఈయన "కేసరి" పత్రికలో వ్రాస్తున్న అనేక విషయాలకు హడలిపోయి ఈయనను అనేకసార్లు జైలుకు పంపారు. అయినప్పటికీ ఈయనలో దేశాభిమానము నానాటికి వృద్ధి చెందినదేగాని తరగలేదు. ఇంక ఇలాకాదని పూనాలో జరిగిన ఓ హత్యకేసులో - వాస్తవానికి ఈయనకు సంబంధము లేక పోయినప్పటికీ - ఈయన కూడా ఆ హత్యకు కారకుడేనని, ఇంకా కొంతమంది దేశభక్తులను కలిపి ఒకేసారి ఆరు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. ఎలాగయినా ఈయనను దేశభక్తి నుండి మరల్చాలని బ్రిటీషువారు యెన్నో ఆశలు చూపారు.

శ్రీ తిలక్ ఉత్తమ దేశభక్తుడేగాక అత్యుత్తమ ప్రజాసేవకుడు. మహారాష్ట్రలో 1898లో వచ్చిన ఘోరమయిన ప్లేగు వ్యాధికి వేలసంఖ్యలో ప్రజలు చనిపోతూ వూళ్ళు వదలి పోతూ వుంటే వాళ్ళకు శారీరకంగా, మానసికంగా యెంతో ఆత్మీయతతో సేవ చేశాడు.

ఈయన పూనాలో ప్రసిద్ధి చెందిన న్యాయవాది కూడ. 1879లో ఈయన న్యాయవాద వృత్తి స్వీకరించి "న్యాయవాది" అన్న పదానికి నిజమయిన న్యాయమును చేకూర్చిన వకీలీయన, ఆకారణంగా స్వాతంత్ర్య యోధులనేక మందిని జైలులో పెడుతుంటే వారి తరపున ఉచితంగా వాదించడమేకాక ఆర్థికంగా అనేక మందికి సహాయపడ్డాడు.

కాంగ్రెసులో ఈయన ఇమడలేక పోయాడు. కారణం, మానవసహజమయిన సంకుచిత, స్వార్థ స్వభావం లేనివాడై నందున అవే ప్రదానంగా పెట్టుకొనివున్న కొంతమంది పద్ధతులు నచ్చక 1907 సూరత్ కాంగ్రెసు మహాసభ నుండి వైదొలగాడు. అయితే వెంటనే "అనిబీసెంటు" తో కలిసి హోమ్‌రూల్ స్థాపించాడు. ఈ మహాపురుషుడు 31-7-1919న తన 66వ యేట పరమపదించాడు.

పరమపదించే ముందు షిరిడీ సాయిబాబా మహిమలు తెలిసి ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయక షిరిడీ వెళ్ళి సాయిబాబాను కలసి మనదేశ స్వాతంత్ర్యము ఎప్పుడు వస్తుందని అడగడానికి వచ్చానన్నాడు. అప్పుడు సాయిబాబా నీవు, నేను చూడము ముందు నీ గుండెను జాగ్రత్తగా చూచుకోమన్నాడు. ఆ సంవత్సరమే జరిగిన సత్యాగ్రహంలో పాల్గొన్న తిలక్‌గారు ఆంగ్ల పోలీసులు తిలక్ గుండెలమీద లాఠీలు పెట్టి కొట్టడంతో ఆయన కోలుకోలేని జబ్బుపడి స్వర్గస్థుడైనాడు.

శ్రీమద్భగవద్గీతకు ఈయన వ్రాసిన భాష్యం పరమ ప్రామాణికం. గణేష్ ఉత్సవాలు ఈయన ప్రవేశపెట్టినవే.

## ౬. పద్మజా నాయుడు

సరోజినీ నాయుడు కుమార్తె పద్మజా నాయుడు. ఆమె సాంఘిక చారిత్రక శాస్త్రాలనూ, సాహిత్యాన్నీ ఇంట్లోనే చదువుకున్నారు. జాతీయోద్యమపు ఉద్రిక్త వాతావరణంలో పెరిగిన పద్మజ చిన్నతనంలోనే గాంధీ బోధనలతో ప్రభావితులయ్యారు. భారత జాతీయ కాంగ్రెసు హైదరాబాదు శాఖ స్థాపకులలో పద్మజ ఒకరు.

ఆమె జాతీయోద్యమ రాజకీయాలపట్ల తన అంకితభావాన్ని, సాంఘిక సేవలో తనకున్న ఆసక్తితో జతచేసి రెండు రంగాలలోనూ కృషిచేశారు. 1941వ సంవత్సరంలో గాంధీ జయంతి రోజున నిజాం విధించిన నిషేధాలను ధిక్కరించి జాతీయపతాకాన్ని ఎగురవేసి అరెస్టయ్యారు. 1942 లో ప్లేగు నివారణ, సహాయసంఘాన్ని స్థాపించి ఈ శతాబ్ది మొదటిభాగంలో జంటనగరాల మీద విరుచుకుపడిన ప్లేగు వ్యాధిమీద యుద్ధం చేశారు. 1947వ సంవత్సరంలో అక్కిరాజుపల్లి అనే గ్రామంలో రజాకార్లు దాడిచేసి అనేకమంది స్త్రీలమీద లైంగిక అత్యాచారాలు జరిపారు. గాంధీ వాటిని పత్రికలలో చదివి చలించిపోయి, ఆ సంఘటన ప్రాంతానికి వెళ్ళి జరిగిన వాస్తవాలనూ, వివరాలను సేకరించి రిపోర్టు రాసి పంపమని పద్మజను కోరాదు. ఆమె ఆ గ్రామం వెళ్ళి చెప్పటానికి సందేహిస్తున్న స్త్రీలతో "నేను కూడా మీవంటి స్త్రీనే. మీ బాధను అర్థం చేసుకోగలుగుతానని" వాళ్ళకు ధైర్యమిచ్చి ఆ రిపోర్టు తయారుచేసి గాంధీజీకి పంపారు.

ఆమె సాంఘిక సేవాసదస్సు హైదరాబాదు శాఖను కూడా ప్రారంభించారు. ఆమె కొంతకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యులుగా ఉన్నారు. 1950 నుంచి 52 వరకూ ప్రొవెన్షియల్ పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. నెహ్రూ మెమోరియల్ మ్యూజియంకూ, గ్రంథాలయానికీ అధ్యక్షురాలిగా, జవహర్‌లాల్ స్మారకనిధికి ఉపాధ్యాయులుగా ఉండేవారు. 1956వ సంవత్సరం నుండీ 1967 వరకూ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌నుండి మొదటి మహిళా గవర్నరు పద్మజా నాయుడే 1962వ సంవత్సరంలో ఆమెను 'పద్మవిభూషణ్' బిరుదుతో భారత ప్రభుత్వం గౌరవించింది. ధైర్యసాహసాలూ, అంకితభావమూ మూర్తీభవించిన పద్మజ చివరివరకూ సేవాకార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో మరణించారు.

# 7. ఆచంట రుక్మిణి

దేశాభిమానంతో జాతీయోద్యమంలో పనిచేయటమే కాకుండా, రాజకీయాలంటే ఆసక్తి, పరిపాలనా రంగంలో ప్రావీణ్యం ఉండి దేశాభివృద్ధి కోసం కృషిచేసిన వ్యక్తి రుక్మిణి. ఉగ్గెళ్ళ చూడమ్మ, శ్రీనివాసరావులు ఈమె తల్లిదండ్రులు. చిన్నతనంలోనే వివాహం చేయాలని తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలకు రుక్మిణి అంగీకరించలేదు. చదువుకోవాలనే కోరికతో ఆమె ఎగ్మూరు ప్రెసిడెన్సీ ట్రైనింగు స్కూలులో చేరారు. మద్రాసులోని సంగీత విద్వాంసులలో ప్రముఖురాలైన వీణ ధనమ్మగారి దగ్గర వీణ నేర్చుకున్నారు. మెట్రిక్ పరీక్ష పాసయిన తర్వాత పెద్దలను ఎదిరించి డాక్టర్ ఆచంట లక్ష్మీపతిని ఆమె వివాహం చేసుకున్నారు.

1911 లో ఆమె భారతీయ మహిళా మండలి మద్రాసు శాఖకు కార్యదర్శిగా ఉంటూ ఆ మహిళా మండలిని అనేక కార్యక్రమాలతో చైతన్యవంతం చేశారు. సభలు, ప్రదర్శనలు వంటి కార్యక్రమాలే కాకుండా మహిళా మండలి తరపున స్వదేశీ దుకాణాన్ని ప్రారంభించి స్వదేశీ ఉద్యమానికి ఊతంగా నిలబడ్డారు. జాతీయోద్యమంలో పనిచేస్తూనే రుక్మిణి బి.ఏ. పాసయ్యారు.

1926 లో పారిస్‌లో జరిగిన "ఇంటర్‌నేషనల్ సఫ్రేజ్ అలయన్స్ కాంగ్రెస్" పదవ సభకు భారతదేశ ప్రతినిధిగా వెళ్ళారు. అప్పటినుంచీ ఆమె స్వతంత్రోద్యమంతోపాటు పరిపాలనా రంగంలో కూడా చొరవ తీసుకుని పనిచేశారు. చంగల్పట్టు జిల్లాబోర్డు సభ్యురాలిగా, మద్రాసు విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యురాలిగా, మద్రాసు కార్పొరేషన్‌లో ఎగ్మూరు డివిజన్‌కు ప్రతినిధిగా, వర్క్స్ సబ్‌కమిటీ అధ్యక్షురాలిగా రకరకాల విభాగాలలో పరిపాలనా అనుభవాన్ని సంపాదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని సంవత్సరంపాటు నెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. గాంధీ-ఇర్విన్ ఒప్పందం సమయంలో విడుదలయ్యారు. వ్యక్తి సత్యాగ్రహ సమయంలో మళ్ళీ ఒక సంవత్సరం నెల్లూరు జైలులో గడిపారు. ఉప్పు సత్యాగ్రహంతో మొదలుపెట్టి క్విట్ ఇండియా ఉద్యమం వరకూ ఆమె ఒక కాలుజైలు, ఒక కాలు ఇల్లు అన్నట్లుగా స్వాతంత్రోద్యమంలో భాగమయ్యారు. ఇంకొకవైపు మద్రాసు ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా, కంపోజిట్ మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా, మద్రాసు లెజిస్లేటివ్ అసెంబ్లీకి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు.

భారతీయ మహిళా ఉద్యమంలో కూడా ఆచంట రుక్మిణి తన శక్తిని ఉపయోగించి పనిచేశారు. మహిళా ఉద్యమంలో మార్గరెట్ కజిన్స్, ముత్తులక్ష్మీరెడ్డి మొదలైనవారితో సన్నిహితంగా పనిచేశారు. అఖిల భారత మహిళా కాన్ఫరెన్సుకు మొదటి కార్యదర్శి రుక్మిణి. లాహోరులో జరిగిన మహిళా సభకు అధ్యక్షురాలిగా ఉన్నారు. 1946వ సంవత్సరంలో ఏర్పడిన టంగుటూరు ప్రకాశం గారి మంత్రివర్గంలో ఆరోగ్యశాఖకు మంత్రిగా ఉన్నారు. గుంటూరులో వైద్యకళాశాల స్థాపించాలని పట్టుబట్టి కృషిచేసిన వ్యక్తి రుక్మిణి. మద్రాసులో ఉన్న ఇండియన్ మెడికల్ స్కూలును కళాశాల స్థాయికి తీసుకువచ్చినది కూడా రుక్మిణినే. దేశీయ వైద్యం పట్ల ఆమెకు ఆసక్తి ఎక్కువ. ఆ వైద్యాన్ని అభివృద్ధి చేయటానికి ఆమె ఎన్నో ప్రయత్నాలు చేశారు.

ఇన్ని పనులలో, ఉద్యమాలలో తీరికలేని జీవితం గడుపుతున్నా, ఆమె సంగీతంలో తనకున్న అభిరుచిని పోగొట్టుకోలేదు. వీణావాదనను విడిచిపెట్టలేదు. విదేశాలకు వెళ్ళినపుడు అక్కడ వీణ వాయించి భారతీయ సంగీతాన్ని పరిచయం చేసేవారు.

# 8. చిట్యాల ఐలమ్మ

"నా మొగనిదేం లేదు. నా కొడుకులదేం లేదు. నాదెపేరు నిల్సింది. యేడపోయిన ఎప్పటికి వొత్తనే ఉంటరు సంగపోల్లు. అందరు జెప్పుకుంటరట. అయిలమ్మలాగ జెయ్యాల అని".

తెలంగాణా రైతాంగ పోరాటంలో కీలక ఘట్టాన్ని ప్రారంభించిన స్త్రీగా ఐలమ్మపేరు చరిత్రలో నిల్చిపోయింది. పాలకుర్తి గ్రామంలో చాకలి కులానికి చెందిన ఐలమ్మ భూమికోసం ఆ ఊరిలో చేసిన పోరాటం తెలంగాణా రైతాంగానికి ఎంతో ఉత్తేజాన్నిచ్చింది. ఆ పోరాటంలో ఐలమ్మ ఎన్నో కష్టాలనూ నిర్బంధాలనూ సహించి నిలబడ్డారు. కమ్యూనిస్టుపార్టీకి, ఆపార్టీ నడిపిన విప్లవ పోరాటాలకూ సహాయపడ్డారు. కమ్యూనిస్టు కార్యకర్తలు నెలల తరబడి పాలకుర్తిలో ఉండి ఐలమ్మ చేసిన భూపోరాటంలో పాల్గొన్నారు.

పంట వేసుకుని కాపాడుకుని, దానిని దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న ఐలమ్మ ఇంటికి భూస్వాములు నిప్పు పెట్టారు. ధాన్యం, పెసలు, నువ్వులు తీసుకుని పోయారు. ఆమె పిల్లలను కొట్టి కూతురిమీద అత్యాచారం చేశారు. ఇంత జరిగినా ఐలమ్మ ఆ భూమి వదలలేదు. "దొరోడు ఏం పీకుతడో జూస్త" అనే సాహసం ఐలమ్మది. దొరలు పాడుచేసిన భూమిని మళ్ళీ బాగుచేసి విత్తనాలు చల్లారు. నాట్లు వేసే సమయంలో భూస్వామి గుండాలు వొచ్చి ఆపేశారు. అపుడు ఐలమ్మ హైదరాబాదులో ఉన్న దొర దగ్గరకు వచ్చీ, కోర్టులకు తిరిగీ తన భూమిమీద హక్కు సాధించుకుని వచ్చి, మళ్ళీ పంట వేశారు.

బాగా పండి కోతకొచ్చిన వరిచేనును మళ్ళీ దొర గూండాలు వచ్చి నాశనం చేసి పంట కోసకుపోయారు. అప్పుడు సంఘం పెద్ద పోరాటం చేసింది. నిజాం పోలీసులూ గూండాలూ ఐలమ్మ భర్తనూ, కొడుకులనూ చిత్రహింసలు పెట్టారు. ఆయనను అరెస్టుచేసి జనగాం జైల్లో పెట్టి ఆసనంలో కారంపోసి, మూత్రం తాగించి విపరీతంగా కొట్టారు. ఐలమ్మ సద్ది కట్టుకొని హైద్రాబాద్ వచ్చి రావి నారాయణరెడ్డిని కలుసుకుని, పెద్దవాళ్ళందరికీ ఈ విషయం చెప్పి, పేపర్లలో ఈ వార్త ప్రముఖంగా వచ్చేలా చేశారు. అధికారులకు పిటీషన్లు పెట్టారు. కమ్యూనిస్టు కార్యకర్తలను పోలీసుస్టేషన్ దగ్గరకు తీసుకెళ్ళి ఆ హింసల గురించి ప్రశ్నించేలా చేశారు. చివరకు బెయిల్‌మీద భర్తను విడుదల చేయించుకుని వెళ్ళారు. అంత పట్టుదల ఐలమ్మది.

ఇంత చేసిన తర్వాత ఐలమ్మ మీద కూడా నిర్బంధం పెరిగింది. దానిని ఎదుర్కొంటూ పోలీసులను తప్పించుకునేందుకు వూరూరా తిరుగుతూ, కమ్యూనిస్టుపార్టీ సమావేశాలకు హాజరవుతూ, కార్యకర్తలకు సహాయపడుతూ, పోరాటంలో పూర్తిగా మునిగిపోయారు. జనగాం సభకు, నల్గొండ సభకూ హాజరై ఆ సభలలో జరిగిన హింసాకాండను తట్టుకుని నిలబడ్డారు. సంఘం కార్యకర్తలెంతమంది వచ్చినా అన్నం ఒండిపెట్టేవారు.

# ౨. జమాలున్నిసా బాజి

నిజామాబాద్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో తొమ్మిదిమంది సంతానంలో ఒకరిగా పుట్టిన జమాలున్నిసా బడికి వెళ్ళి చదువుకోలేదు. ఐతే ఇంట్లోనే చదువుకుని ఐదేళ్ళ వయసులోనే ఖురాన్ చదవటం నేర్చుకున్నారు. ఇరవై ఏళ్ళ వయసులో ఒక సంప్రదాయ కుటుంబానికి కోడలుగా వెళ్ళారు. 1945వ సంవత్సరంలో బి.ఎ.తో సమానమైన మున్షీఫజిల్ పరీక్ష పాసయ్యారు. "నిగార్" అనే పత్రికవల్ల ప్రభావితురాలైన జమాలున్నిసా విప్లవకారులైన స్నేహితులను తన ఇంటికి ఆహ్వానించేవారు. మక్దుం మొహియుద్దీన్, హస్‌రత్ మొహాని. జాకిర్ హుస్సేన్, రజీ అబ్దల్ గఫార్ వంటి కవులు, రచయితలు, ఆమె ఇంటికి తరచు వచ్చేవారు. మక్దుం రాసిన "అంధేర" అన్న కవిత చదివి ఆ ప్రేరణతో, స్వతంత్రోద్యమంలో చురుకుగా పనిచేయసాగారు.

1945వ సంవత్సరంలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయిత సంఘ సభలకు బాజి పర్దా లేకుండా వెళ్ళి పాల్గొన్నారు. 1946వ సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా చేరి రాజకీయోద్యమంలో పాల్గొనటంతో కొత్త జీవితం ప్రారంభించారు. ప్రమీలాబాయితో కలిసి 1946వ సంవత్సరంలో రైతు మహాసభలను, దాని తర్వాత విద్యార్థి మహాసభలను ఏర్పాటుచేసే ప్రయత్నంలో భాగమయ్యారు. 1946వ సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీమీద నిషేధం విధించటంతో, ఎంతోమంది కామ్రేడ్లు అరెస్టయ్యారు. తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నల్ల జండాలతో ప్రదర్శన జరపమని జిన్నా పిలుపు యిచ్చినపుడు బాజి కుటుంబం అందులో పాల్గొనడానికి నిరాకరించి నల్లజండా బదులుగా ఎర్రజండా పట్టుకున్నారు. బాజి ఇల్లు ఆయుధాలను దాచిపెట్టటానికి ఉపయోగపడింది. పోరాటంలో పోలీసులనుండి తప్పించుకున్న వారినీ, జబ్బుపడిన వారినీ బాజీ దగ్గరకు పంపేవారు. వారికి ఆశ్రయమిచ్చిన ఇంట్లో బాజీ అవసరమైన పనులన్నీ నిర్వహించేవారు. ఆమె తెలుగు టైపు చేయటం నేర్చుకున్నారు. పార్టీకి నిధులు వసూలు చేసేవారు.

1949వ సంవత్సరంలో భర్తను కోల్పోయిన బాజీ పూర్తికాలం పనిచేసే కార్యకర్తగా పార్టీపనిలో మునిగిపోయారు. పార్టీలో మహిళలను సమీకరించే ప్రయత్నాలు చురుకుగా చేశారు. పోలీస్ యాక్షన్ తర్వాత, ఆమె కుటుంబంమీద విప్లవకారులకు ఆయుధాలు సరఫరా చేస్తుందనే అనుమానం రావడంతో, ఆమె అజ్ఞాతవాసానికి వెళ్ళారు. పోలీసులు ఆమె ఇంటిమీద దాడిచేసి, ఏమీ దొరకకపోవటంతో, ఆమె సోదరులనూ, చెల్లెలినీ అరెస్టు చేశారు. వాళ్ళు రజాకార్లకు వ్యతిరేకంగా 'సాయం' అనే పత్రిక తీసుకొచ్చేవారు. రజాకార్లను విమర్శిస్తున్నందుకుగాను బాజీకీ, 'మజ్లిస్ ఇత్తెహదుల్ ముస్లిమీన్' నాయకులనుంచి అపాయం జరుగుతుందనే భయం ఉండేది. సాయుధ పోరాట విరమణ చేసిన సందర్భంలో, కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన అభిప్రాయభేదాల గురించి చర్చించటానికి ఎ.కె. గోపాలన్, జ్యోతిబసు, ముజఫర్ అహమద్‌లతో కూడిన ప్రతినిధి వర్గం బాజీ ఇంటికి వచ్చింది. బాజీ కుటుంబమే వారుండటానికి కావలసిన వసతిని ఏర్పాటుచేసింది.

ధైర్యంతో, అంకితభావంతో, ఇప్పటికీ తను నమ్మిన విలువల కోసం నిలబడి, సంప్రదాయాన్నీ, సాంఘిక అడ్డంకులనూ దాటి, స్త్రీలను రాజకీయాలలోకి తీసుకురావటానికి ప్రయత్నిస్తున్న బాజీ ఆదర్శప్రాయంగా నిలుస్తారు.

# ౧౦. మాతృమూర్తి థెరిస్సా

యుగోస్లోవియాదేశంలో 'స్కోప్జీ' అనే గ్రామం. ఆ గ్రామంలో ఒక చిన్న ప్రభుత్వ పాఠశాల. బాలబాలికలు కేరింతలతో తమ తమ తరగతులలో ప్రవేశించారు. ఒక తరగతిలో ఉపాధ్యాయిని ప్రవేశించింది. తరగతి నిశ్శబ్దం అయింది. ఆమె హాజరు వేస్తూంది. ఆశ్చర్యం! ప్రతిరోజూ అందరికన్నా ముందు బడికి హాజరు అయ్యే ఒక అమ్మాయి ఆరోజు ఇంకా బడికి రాలేదు. టీచరు హాజరు వేయడం పూర్తిచేసింది. పాఠం ప్రారంభించేప్పుడు గది ద్వారంవద్ద చప్పుడయింది. ఒక అమ్మాయి వినమ్రంగా ద్వారం వద్ద నిలిచి, టీచరు అనుమతికి వేచివుంది. టీచరు అటుచూచి, ఆ అమ్మాయిని లోపలికి రమ్మని సైగచేసింది. అమ్మాయి లోపలికి రాగానే "ఎందుకు ఆలస్యం అయింది?" అని అడిగింది టీచరు. ఆ అమ్మాయి మెల్లగా 'టీచర్! నేను మామూలుగానే బడికి వస్తూ ఉన్నాను. మార్గమధ్యంలో ఒక ముసలాయన జ్వరంతో బాధపడుతూ కనిపించాడు. ఆయనను గురించి ఆ త్రోవలో వచ్చే పోయేవాళ్ళు ఎవ్వరూ పట్టించుకోలేదు. ఆయన ఆస్పత్రికి పోయే స్థితిలో లేడు. ఆయన బాధ చూసి నాకు జాలి కలిగింది. ఆయనకు సాయంచేసి, ఆస్పత్రిలో చేర్చి వస్తున్నా. ఆలస్యానికి క్షమించండి టీచర్' అంది.

ఈ మాటలు విన్న ఉపాధ్యాయినికి ఆనందంతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ అమ్మయిని అక్కున చేర్చి, దీవించింది. 'ఆగ్నస్! నువ్వు చాలా మంచిపని చేశావమ్మా. మానవసేవే మాధవసేవ. నీవు చేసిన పనికి నిన్ను అభినందిస్తున్నాను' అంది. ఆ అమ్మాయి ఆనందంతో మెల్లగా తన స్థానానికి కదిలింది. తరగతిలోని మిగతా విద్యార్థులు ఆమెను అభినందనలతో ముంచెత్తారు. చూశారా పాఠశాలలో చదివే 12 సంవత్సరాల బాలిక ఎలా మానవసేవకు నడుం కట్టిందో!' 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అంటారుగదా మరి! ఇంతకూ ఈ చిన్నారి బాలిక ఎవరనుకొన్నారు? ఆమె – ముద్దుల 'ఆగ్నస్'.

స్కోప్జీ గ్రామంలో ఒక మధ్యతరగతి రైతుకుటుంబంలో 1910వ సంవత్సరం ఆగష్టు 27వ తేదీన ఆగ్నస్ జన్మించింది. తల్లిదండ్రులు ధనవంతులు కారు. కానీ, మంచి గుణవంతులు. అందువల్లనే వాళ్ళనుండి దయ, ప్రేమ, వినయం, స్నేహం వంటి సుగుణాలను ఆగ్నస్ పుణికిపుచ్చుకొంది.

చిన్నప్పట్నుంచి దైవభక్తి గలది. దీనజనులకు సాయపడాలనే ఆమె తపన. అందుకై క్రైస్తవ మిషనరీగా ప్రజాసేవ చెయ్యాలని ఉవ్విళ్ళూరేది.

ఆరోజుల్లో యుగోస్లోవియాకు చెందిన మతప్రచారకులు బెంగాల్ ప్రాంతంలో ఉండేవాళ్ళు. వాళ్ళద్వారా భారతదేశ ఔన్నత్యాన్ని గురించి విన్నది. భారతదేశ సౌందర్యం చూడాలని తలచింది. మిషనరీగా మారడం ఎలాగా?

ఆగ్నస్ తన 18వ ఏట 1928 లో ఐర్లాండ్‌లోని 'లోరెటో కాన్వెంటు' అనే మఠంలో చేరి శిక్షణ పొందింది. 1929 వ సంవత్సరంలో డార్జిలింగ్ ప్రాంతంలో ప్రత్యేకంగా మఠకన్య శిక్షణకై వచ్చింది. ఇలా హిమాలయాల ప్రశాంత వాతావరణంలో ఆమె మఠకన్య దీక్షను కొనసాగించింది. క్రమంగా హిమాలయాల్లా ఉన్నతంగా ఎదిగింది. ఆ శిక్షణ కఠిన నియమాలతో కూడివుంటుంది. ఐనా ఆమె చలించలేదు. ఆమె దీక్ష అలాంటిది. 1931 సంవత్సరంలో మఠకన్యగా దీక్ష తీసుకుంది. 1937 సంవత్సరంలో 'ఆగ్నస్' మదర్ థెరిస్సాగా మారింది.

1937 సంవత్సరంలో మదర్‌థెరిస్సా కలకత్తాలోని లోరెటో కాన్వెంటు అనే బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరి, క్రమంగా ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయిని అయింది. తన ఆదర్శాలకు, క్రమశిక్షణకు తగినట్లు ఆ పాఠశాలను తీర్చిదిద్దింది. ఆమె సేవాభావాన్ని చూచి 'డాటర్స్ ఆఫ్ సెయింట్ ఆన్' అనే స్వచ్ఛంద సేవా సంస్థను ఆమెకు అప్పగించారు.

మానవుల మధ్య ధనవంతులు - పేదవాళ్ళు అనే భావానికి అద్దంపట్టేవి మన నగర జీవితాలు. నగరాల్లో ఒకప్రక్క అతి విలాసంగా, లెక్కలేనంత ధనంతో తులతూగేవాళ్ళూ - మరొకప్రక్క కటిక పేదరికంతో తినడానికి తిండి, కట్టుకోడానికి గుడ్డ, ఉండడానికి ఇల్లు లేక బాధపడేవాళ్లూ ఉంటుంటారు. అలాంటి దీనజనుల బాధలు కరుణామయి అయిన మదర్ థెరిస్సా మనసును కలచివేశాయి. వాళ్ళను ఆదుకోవాలని ఆమె తపన. అందుకే నిశ్చయించింది. కాన్వెంటును వదిలి కేవలం ఆర్తులకు సాయంచేయాలనే తన ఆలోచనను పై అధికారులకు తెలిపింది. వాళ్ళు అందుకు అనుమతించారు గూడా.

పేదలు పలురోగాలతో, అనారోగ్యంతో బాధపడుతుంటారు. రోగులకు సేవ చెయ్యాలంటే వైద్యం తెలియాలి. అందుకే ఆమె పాట్నా వెళ్ళి నర్సు శిక్షణ పొందింది. చూడండి, ఆమె సేవాదృష్టి! దీనజనులకు సేవచేసి - చేయూత నివ్వడానికి ఆమె ఎంత శ్రమించిందో! ఆమె 'పరులసేవే పరమధర్మం' అని నమ్మింది.

కలకత్తా మహానగరంలో 'మోతీజీల్' ఒక ప్రాంతం. అక్కడ పేదలు అధికంగా ఉంటారు. అపరిశుభ్రత, అనారోగ్యం, దారిద్ర్యం వంటి అవలక్షణాలన్నీ అక్కడే ఉంటాయి. అటువంటి ప్రాంతంలో ఆమె ఒక చిన్న పాఠశాల స్థాపించింది. అప్పుడు ఆమెవద్ద వున్నా డబ్బు ఎంతో తెలుసా? ఐదు రూపాయలు మాత్రమే!

ఆ పాఠశాలకు వచ్చేవాళ్ళకు చదువుతోపాటు ఆరోగ్యం గురించి, పరిశుభ్రతను గురించి కూడా చెప్పేది. ఆరోగ్యమే మహాభాగ్యం గదా! ఖాళీలేని సమయంలో ఆమె ఆ పరిసరాల్లో పూరిగుడిసెల్లో, గోడల నీడల్లో, చెట్లకింద కాపురాలుంటున్న వాళ్ళదగ్గరకు వెళ్ళేది. ప్రేమగా, అనురాగంతో మాట్లాడేది. వాళ్ళను ఓదార్చేది. అనేక విషయాలు తెలియజెప్పేది. ఆమె వాళ్ళకు దైవం.

మదర్ తనకు ఒక సొంత ఆశ్రయం కావాలని కోరింది. గోమ్స్ అనే మంచి మనిషి ఒక గదిని ఆమెకు ఉచితంగా ఇచ్చాడు. ఆ గదే ఆమె కార్యక్రమాల నిర్వహణకు తొలి ఆశ్రయం. ఆమెతోపాటు చారుమా, సుభాషిణీదాస్ అనే మరో ఇద్దరు సేవికలు చేరారు. చిన్నచిన్న నీటిబొట్లు కలిసి సముద్రం ఏర్పడినట్లు – తర్వాత తర్వాత ఇదే విశ్వవిఖ్యాత సంస్థగా రూపొందింది.

మదర్ థెరిస్సా తన సేవాకార్యక్రమాలు సక్రమంగా జరగడానికి 'మిషనరీస్ ఆఫ్ ఛారిటీ' అనే సంస్థను స్థాపించింది. దానికి కొన్ని నియమ, నిబంధనలు ఏర్పరచింది. ఆమె అడుగుజాడల్లో నడుస్తూ అనాథలకు, అభాగ్యులకు సేవచేయడానికి స్వచ్ఛందంగా ఎంతోమంది ముందుకు వచ్చారు. వాళ్లకు ఆమె మంచి శిక్షణ ఇచ్చేది. ఆ తర్ఫీదు తర్వాత వాళ్ళు గూడా చక్కగా సేవా కార్యక్రమాలు నిర్వర్తించేవాళ్లు.

అప్పుడు బెంగాల్ ముఖ్యమంత్రి డా. బి.సి.రాయ్. ఈయన ఎంత గొప్పవాడో తెలుసా. సామాన్యంగా ముఖ్యమంత్రికి ఊపిరి పీల్చుకునే అవకాశంకూడా ఉండదు. అలాంటిది, ఆయన నిత్యం రోగులకు ఉచితసేవ చేసేవాడు. మనసుంటే మార్గముంటుంది అలాంటి సేవాతత్పరుడు మదర్ చేస్తున్న సేవలను గుర్తించి సాయం చేశాడు. అంతేగాదు; ఆనాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దృష్టికికూడా తెచ్చాడు. డా.బి.సి.రాయ్‌గారి వలన ఆమె చేస్తున్న కార్యక్రమాలకు ఎంతో ఊపు వచ్చింది. వాటిని దేశం గుర్తించింది.

మనందరం మనుషులమే. ఐతే మనలో మానవత్వం ఎంతమందిలో ఉంటుంది? మానవ సహజమైన కరుణ, ప్రేమ ఎందరిలో మనం చూడగలం? నిత్యం మనచుట్టూ ఎంతోమంది అనేక బాధలకు, కష్టాలకు లోనవుతుంటారు. మనం చూస్తూనే ఉంటాం. తగిన తోడ్పాటు, సాయం చేద్దామని ఎంతమంది తలుస్తారు? తలచినవాళ్ళల్లో ఎంతమంది ఆచరిస్తారు?

ఒకరోజు మదర్ కలకత్తా రోడ్డువెంట వెళ్తూ ఒక దృశ్యం చూసింది. ఒక పండుముసలి. ముసలితనానికి తోడు అనారోగ్యం. ఆయనకు ఎవరూ లేరు. చావలేక బ్రతకలేక కొట్టుకొంటున్నాడు. ఆయనకు దాపులోనే ఒక ఆస్పత్రి ఉంది. ఐనా అతని బాధను గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఐతే కరుణామయి అయిన మదర్ ఆ దృశ్యాన్ని చూసి కంటతడిపెట్టింది. తోటి మనుషుల తీరుకు నిర్వేదం చెందింది. వెంటనే ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లకు ఆ వృద్ధుడి బాధను గురించి చెప్పింది. ఐతే ప్రాణంపోసే వైద్యు లేమన్నారో తెలుసా? – 'ముసలి వగ్గు ఎలాగూ చనిపోతాడు; ఆయన్ని ఎవరూ బ్రతికించలేరు. ఆస్పత్రిలో చేర్చుకోవడం ఎందుకూ?' అని.

కాని మదర్ మందులు తెచ్చి, అతనికి ఇవ్వాలని ప్రయత్నించింది. అంతలోనే అతని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది. ఈ సంఘటన ఆమెను కలిచివేసింది. 'జాతస్య మరణం ధ్రువం'. ఐనా ఇలా

దిక్కులేని చావు చావడమా! ఇంతమంది మనుష్యులమధ్య, మరొక మనిషి దిక్కులేని చావు చావడం ఎంత బాధాకరం? కనీసం ప్రశాంతంగా చనిపోతే బాగుంటుందిగదా? 'ఈ మనుషులు ఇంత నిర్దయులా?' అని ఆమె దుఃఖించింది. దుఃఖించి తన బాధ్యత తీరిందని ఊరుకోలేదు. 'నిర్మల్ హృదయ్' అనే ఆశ్రమాన్ని స్థాపించింది. ఇప్పటికీ దిక్కూమొక్కూ లేని ముసలివాళ్ళు అక్కడకు చేరుతుంటారు. అక్కడి సేవకులు ఆ ముసలివాళ్ళకు ప్రేమ, అనురాగం పంచుతారు. ఒకవేళ చావు వచ్చినా వాళ్ళు సేవికల సేవలో ప్రశాంతంగా మరణిస్తారు. ఈ ఆశ్రమంలో చేరి, ఆరోగ్యం పొంది, తిరిగి మామూలు జీవితం గడిపేవారూ ఉన్నారు.

మరొకరోజు దిక్కులేని ఒక చిన్నపాప ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లింది. ఏడ్చే ఓపికలేక ఎక్కిళ్ళు పెడుతూవుంది. అటుగా వెళ్ళే జనం ఎవరూ ఆ పసిపాపను గురించి పట్టించుకోవడమే లేదు. ఔరా మానవత్వం! మదర్ థెరిస్సా ఆ పాపను చూచింది. ఆమె వద్దకు పరుగుపెట్టింది. ఆ పాపను అక్కున చేర్చింది. కన్నీళ్లు తుడిచింది. ఆహారం ఇచ్చింది. ఆశ్రమానికి తెచ్చింది. ఇలాంటి అనాథశిశువులు ఎందరో! వీళ్ళు ఎందుకు అనాథలుగా మారుతున్నారు? వీళ్ళపట్ల సభ్యసమాజం ఎలా ప్రవర్తిస్తుంది? ఇలా సవాలక్ష ప్రశ్నలు ఆమెను వేధించాయి. వెంటనే ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. ఒక 'శిశుసదన్' ను నెలకొల్పింది. దిక్కులేని భావిభారత పౌరులకు అది సర్వస్వం. ఇప్పటికీ ఈ శివుసదన్‌లో చేరి, చక్కగా చదువుసంధ్యలు నేర్చి, మంచి మనుషులుగా పెరిగినవాళ్ళూ, ఉద్యోగాలు, వృత్తులు చేస్తూ మంచి జీవితం గడిపేవాళ్ళూ ఎందరో ఉన్నారు. ఆమె అందించిన ఆ అభయహస్తం ఎందరికో జీవనజ్యోతి అయింది.

ఇప్పుడు మదర్ సేవాకార్యక్రమాలను గురించి పలు ప్రాంతాలకు తెలిసింది. ఇతర ప్రాంతాలవాళ్ళూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఆమెను ఆహ్వానించసాగారు. స్విట్జర్లాండ్ రాయబారి మదర్ సేవాకార్యక్రమాలకు ముగ్ధుడయి, ఢిల్లీలో ఒక బాలభవనాన్ని ఏర్పాటు చెయ్యవలసిందనీ, దానికి కావలసిన ధనం తన దేశంనుండి ఇప్పిస్తాననీ చెప్పాడు. ఢిల్లీలోని ఆ బాలభవనాన్ని నాటి మన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు.

మానవుల్ని పట్టి పీడిస్తున్న భయంకరమైన వ్యాధి కుష్ఠు. దీన్ని గురించి మనకు అనేక అపోహలున్నాయి. మన జాతిపితసైతం కుష్ఠువ్యాధి పీడితులకి సేవచేశాడు. అందరూ కుష్టు సోకినవాళ్ళను వెలివేసేవాళ్ళు. బంధువులు కూడా దగ్గరకు రానిచ్చేవాళ్ళు కారు. తగిన చికిత్స దొరికేది కాదు. కుష్ఠు సోకినవాళ్ళ బాధలు వర్ణనాతీతం. ఇలాంటివాళ్ళ బాధలు ఆమె కళ్ళారా చూసింది. చెవులారా విన్నది. తీవ్రంగా ఆలోచించింది. దాతలను యాచించింది. కుష్ఠువ్యాధిగ్రస్తులకు చికిత్స, సేవ చేయడానికి ఒక ఆశ్రమం నెలకొల్పింది. ఐతే ఆ దగ్గరలోవున్నవాళ్ళు ఆ ఆశ్రమాన్ని పెట్టనివ్వలేదు. వాళ్ళకు కుష్టు సోకుతుందని భయం. చూడండి, వాళ్ళకై వాళ్ళు ఏమీ సాయం చేయకపోగా, సాయం చేసేవాళ్ళను కూడా చీదరించుకుంటారు. 'అమ్మ పెట్టదు, అడుక్కోనివ్వదు' అంటే ఇదేనేమో! ఆమె దృఢమైన నిర్ణయం మారదు. ఊరికి దూరంగా ఉండే ప్రదేశంలో 'శాంతి నగరం' స్థాపించింది. ఇదే కుష్టురోగుల పునరావాస కేంద్రం. అక్కడ కుష్టురోగులు 'తాము సంఘ

బహిష్కృతులము' అని తలపరు. వాళ్ళకు సర్వ సదుపాయాలున్నాయి. చికిత్స ఉంది. వృత్తివిద్యలు నేర్పుతారు. తర్వాత వాళ్ళు తమకాళ్లపై తామే నిలబడగలుగుతారు. చక్కని చెట్లు, పూలమొక్కలతో మంచి వాతావరణముంది. ఇది ఇప్పుడు ఒక ఆరోగ్యకరమైన, ఆనందదాయకమైన శాంతినగరంగా ఉందంటే ఆశ్చర్యం లేదు.

ఇలాంటి కార్యక్రమాలకు కావలసిన ధనం, వస్తువులు ఆమెకు ఎలా లభిస్తున్నాయి? అదే విచిత్రం. ఎంతమందో గుప్తంగా ఆ సంస్థలకు దానం చేస్తుంటారు. దేశ, విదేశాలనుండి అనేకులు తమ వంతుగా ధనం, వస్తువులు మదర్‌కు పంపుతారు. ఆమెమీద వాళ్ళకు అంత విశ్వాసం. ఆమెకు పంపితే ఆ ధనం సద్వినియోగం అవుతుందన్న దృఢ విశ్వాసం.

ఆమె కార్యక్రమాలు భారతదేశానికే పరిమితం కాలేదు. అవి విశ్వవ్యాపితాలు. ప్రపంచంలోని పలుదేశాలలో అవి వ్యాపించాయి. 'మదర్ థెరిస్సా సహకారుల అంతర్జాతీయ సంఘం' ఏర్పడింది. దీనిద్వారా పలుదేశాలకు ఈ సేవాకార్యక్రమాలు చేరుతున్నాయి. అభివృద్ధి చెందిన అమెరికా, ఫ్రాన్సు, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సైతం మదర్ సేవాసంస్థలు పనిచేస్తున్నాయి అంటే ఆశ్చర్యంగా లేదూ!

మదర్ థెరిస్సా నిరాడంబరంగా ఉంటుంది. ఆమె చెప్పేది తక్కువ. చేసేది ఎక్కువ. 'తక్కువగా మాట్లాడు, ఎక్కువగా పనిచెయ్యి' అనే సూక్తిలో ఆమెకు నమ్మకం. ఆమె సందేశం కూడా అదే. ఆమె ప్రతి మనిషిలోను దైవాన్ని చూడగలుగుతుంది. ఆమెకు ఎల్లలు, కుల మత జాతుల పట్టింపులు లేవు. ఆమె ఆశ్రయంలో, ఆశ్రమాల్లో అందరికీ ప్రవేశముంది. ఆమెది విశ్వకుటుంబం.

ఆమె ప్రతిదినమూ తెల్లవారుఝామున గం.4-30 ని.లకు నిద్రలేస్తుంది. కొద్దిసేపు ఒంటరిగా ప్రార్థన చేస్తుంది. ఉదయం 6-45 కు సామూహిక ప్రార్థనకు వెళ్తుంది. ప్రార్థనలో పాల్గొనేవారు కొద్దిగా ఫలహారం తీసుకొని, ఎవరి పనులు వాళ్ళే చేసుకుంటారు. ఉదయం 7-50 కి తిరిగి అంతా కలిసి ప్రార్థన చేస్తారు. తర్వాత ఎవరికి నిర్దేశించిన పనికి వాళ్ళు వెళ్తారు. మధ్యాహ్నం 12 గంటలవరకు అంతా సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైవుంటారు. మదర్ కూడా ఆ కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

మధ్యాహ్నం భోజనం - అదికూడా మామూలు ఆకుకూర, రొట్టె. సాయంకాలం వరకూ తిరిగి సేవాకార్యక్రమాలు. సాయంత్రం 6-30 కి మతసంబంధమైన చర్చలు సాగిస్తారు. రాత్రి భోజనం తర్వాత తిరిగి ప్రార్థనలు. మదర్ మాత్రం రాత్రి పొద్దుపోయేవరకూ తన పనుల్లో లీనమై ఉంటుంది. అన్ని సంస్థలను, అన్ని సేవాకార్యక్రమాలనూ నిర్వహించడం ఏమంత చిన్నపని కాదు. ఆమె నిరుపేదల పాలిటి కల్పవల్లి; కన్నతల్లి. 'మదర్' అనే పేరు ఆమెకు సార్థకం అయింది.

విశ్వమాత - మదర్ థెరిస్సా స్థాపించిన సంస్థ మన రాజధాని నగరం హైదరాబాదులో కూడా ఉంది. ఆమె 1978వ సంవత్సరం హైదరాబాదు నగరం దర్శించింది. అప్పుడు దాత రెబెలోగారు ఒక పెద్ద

భవనాన్ని ఆమెకు కానుకగా ఇచ్చారు. నదులు నీళ్ళను, చెట్లు పండ్లను, ఆవులు పాలను ఇతరులకొరకే ఇస్తాయికదా! దాతల దానాలు సైతం పరులకే! మదర్ ఆ భవనాన్ని ఒక సేవాశ్రమంగా తీర్చిదిద్దింది. అది రోగులకు చికిత్సాకేంద్రంగా, అనాథ శిశువుల ఆశ్రమంగా, వృద్ధుల సంక్షేమ గృహంగా పలు కార్యక్రమాలకు నెలవై యుంది. ప్రార్థించే పెదవులకన్నా సేవించే చేతులు మిన్న అనేది ముమ్మాటికీ నిజం.

కన్నబిడ్డలు సైతం కన్నెత్తి చూడని వృద్ధులకు ఆశ్రయం ఇస్తూ ఆదరిస్తూన్న 'నిర్మల్ హృదయ్' మనకు ఇప్పుడూ హైదరాబాద్‌లో కనిపిస్తుంది. మఱ్ఱివిత్తనం చిన్నదే. దాన్లోనుంచి వచ్చిన చెట్టు ఎంతపెద్దది? ఆ వృక్షం ఎన్ని పక్షులకు ఆశ్రయం ఇస్తుంది. ఎందరికి నీడనిచ్చి సేద తీరుస్తుంది? అలానే ఐదు రూపాయలతో ప్రారంభమైన సేవాసంస్థ ప్రపంచ దేశాలన్నిటా వ్యాపించి, కొన్ని కోట్లమందికి ప్రేమ, ఆదరణ, ఆరోగ్యం అందించడం ఎంత విచిత్రమైంది?

మదర్ పుట్టింది యుగోస్లోవియాలో, ఐనా పెరిగింది భారతదేశంలో. అందుకే ఆమెకు భారతదేశపు పౌరసత్వం ఇచ్చి, భారతదేశపు మంచి పుత్రికగా గుర్తించారు. ఆమె గుర్తింపులకోసం, గౌరవాలకోసం, కీర్తికోసం ఏపనీ చేయలేదు. ఆమెకు స్వార్థం లేనేలేదు. ఐనా ఆమె సేవలను గుర్తించి ప్రపంచం ఆమెను వేనోళ్ల పొగిడింది. ఎన్నో డిగ్రీలు, బహుమతులు, గుర్తింపులు ఇచ్చింది. అవన్నీ లెక్కలేనన్ని. ఆమె చేసే సేవతో పోలిస్తే అవన్నీ చిన్నవే. కొంతమంది డిగ్రీలవల్ల, బిరుదులవల్ల రాణిస్తారు. కాని మదర్ వల్ల ఆ డిగ్రీలు, బిరుదులే రాణించాయి.

1962వ సంవత్సరంలో మన ప్రభుత్వం ఆమెకు 'పద్మశ్రీ' బిరుదునిచ్చి సత్కరించింది.

1980 జనవరిలో మనదేశంలోని అత్యున్నతమైన 'భారతరత్న' బిరుదు ఆమెకు ఇవ్వడం జరిగింది. 1971 లో పోప్ జాన్‌పాల్‌గారు 'శాంతి బహుమానం' ఇచ్చారు. 1972 లో నాటి మన ప్రధాని ఇందిరాగాంధీగారి చేతుల మీదుగా 'నెహ్రూ అవార్డు' అందుకొన్నది. గౌరవ డాక్టరేట్ బిరుదుల్ని శాంతినికేతన్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలు ఆమెకు సమర్పించాయి.

1979వ సంవత్సరములో ప్రపంచంలో అత్యుత్తమమైన 'నోబెల్ శాంతిబహుమతి' ఆమెకు కానుకగా ఇచ్చారు. 'భారత సుపుత్రి' అనే బిరుదు ఆమెకు లభించింది. అలా ఆమె భారతదేశానికి కూడా వన్నె తెచ్చింది.

ఇలా - ఇలా ఎన్నెన్నో గౌరవాలు, గుర్తింపులు. అన్నిటికన్నా విలువైన గుర్తింపు ఆమె దీనజనుల గుండెల్లో పొందింది. ఆయా సంస్థలు ఆమెను గౌరవిస్తూ బిరుదులిస్తూ, ధనసహాయం కూడా చేస్తూవచ్చాయి. ఆ సర్వసంపదల్నీ ఆమె ఆ సేవాసంస్థలకే అంకితం చేసింది. ఆమెకు ఏం ఆస్తివుంది, దీనజనుల కృతజ్ఞత తప్ప? ఆమెకు ఏం కోరిక వుంది? 'సర్వేజనా, సుఖినో భవంతు' అని గాక?

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మదర్ థెరిస్సా లాంటి మహావ్యక్తులు చాల కొద్దిమందే ఉంటారు. ఐతే వాళ్లు ఆకాశంనుంచి ఊడిపడలేదు. ప్రత్యేకజన్మలు ఎత్తలేదు. మనందరి మాదిరిగా మామూలుగా మానవులుగా జన్మించినవాళ్ళే. ఐతే వాళ్ళు ఎలా గొప్పవాళ్లు కాగలిగారు? వాళ్ల జీవితాల్ని నిశితంగా, జాగ్రత్తగా పరిశీలించండి. మహాత్ముల్ని చేసిన మహత్తు ఏదో గుర్తించండి.

ఏముందీ? సత్యసంధత, నిష్కల్మషత, నిస్వార్థత, నిర్భీతి, ప్రేమ, కరుణ, ఏకాగ్రత, దీక్ష, దృఢనిశ్చయం, ఆదర్శాల ఆచరణ, విరామం లేని కృషి, శ్రమ, మానవత్వం ఇలాంటి కొన్ని లక్షణాలే.

మనిషి జన్మకు సార్థక్యం ఏమిటి? "పరోపకారార్థం ఇదం శరీరం" అనికదా అంటారు! పుట్టుకతో ఎవరూ మహనీయులు కారు. అహర్నిశలు నిస్వార్థంగా శ్రమిస్తేనే మానవులు మహనీయులు కాగలిగేది. కృషితో నాస్తి దుర్భిక్షమ్! కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు! అనే వాక్యం నిజమే!

మదర్‌ను గురించి సంక్షిప్తంగా తెలిసికొన్న మీకు ఏం అనిపిస్తుంది? ఆమె మనకు ఆదర్శం అనిపిస్తుంది. ఆమె అడుగుజాడల్లో మనం నడవాలి అనిపిస్తుంది. మహాకవి గురజాడ ఏమన్నారు? 'సొంతలాభం కొంతమానుక పొరుగువాడికి తోడుపడవోయ్' అన్నారు. ఆ మాటలు గుర్తుంచుకొని ఆ ఆదర్శాలను ఆచరిద్దాం. మదర్ థెరిస్సా వారసులుగా నిలుద్దాం. వ్యధలు బాధలు లేని సమాజాన్ని స్థాపిద్దాం. మనకున్న పరిధిలో మనం కూడా తోటివారికి తోడుపడవచ్చు. 'పరోపకారార్థమే ఈ శరీరం' అన్న సూక్తిని ఆచరిద్దాం. మరి మనం ఎలా ఇతరులకు సాయపడగలమో ఆలోచించండి. ఎవరెవరికి ఎటువంటి సేవలు మనం అందించగలమో పరిశీలించండి. ఇప్పటినుంచే మంచి పనులు చేద్దాం. దీనికి దీక్ష పూనుదాం.

నిలువెల్ల స్వార్థం నిండిన వ్యక్తే ఈ లోకంలో ఎక్కువ దుఃఖాన్ని అనుభవించేది.
పరమానందాన్ని పొందేది స్వార్థం లేశమైనా లేని వ్యక్తి.